సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 290

బుధవారం 3-7-2024

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగు పడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి.'



వింబుల్డన్‌లో సంచలనం

డిఫెండింగ్ చాంప్ ఒండ్రుసొవాకు తొలి రౌండ్లోనే షాకిచ్చిన బొజెస్ మనెరో -12లో



రికార్డులు.. చివరికి నష్టాలు

బ్యాంకులు, ఫైనాన్స్ షేర్లలో లాభాల స్వీకరణ.. ఆరంభ లాభాలు ఆవిరి -13లో



రికార్డుల్లో చేర్చండి

తన ప్రసంగంలోని కొన్ని వ్యాఖ్యలను స్పీకర్ ఓం బిర్లా రికార్డుల నుంచి తొలగించడంపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ అభ్యంతరం తెలిపారు.

వివరాలు 6లో ▸



ఈవీఎంలను నమ్మబోం

యూపీలోని మొత్తం 80 పార్లమెంట్ నియోజకవర్గాల్లోనూ గెలిచినా సరే ఈవీఎంలను నమ్మబోనని అఖిలేశ్ యాదవ్ అన్నారు.

వివరాలు 6లో ▸



పరీక్షకు కొద్దిగంటల ముందే..

నీట్–పీజీ పరీక్ష పత్రాన్ని ఇకపై భద్రతా కారణాల రీత్యా పరీక్షకు కొద్ది గంటల ముందు ఖరారు చేయనున్నారు.

వివరాలు 6లో ▸



ప్రచండకు ఉద్వాసనే లక్ష్యంగా..

నేపాల్ ప్రధాని పుష్ప కమల్ దహాల్ 'ప్రచండ' ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు నేపాలీ కాంగ్రెస్, సీపీఎన్–యూఎంఎల్ చేతులు కలిపాయి.

వివరాలు 6లో ▸

బడులు తెరిచారు.. బరువు మోపారు..

వందనమేదీ?

ఓ ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అంతమందికీ 'తల్లికి వందనం' అమలు చేస్తామని టీడీపీ-జనసేన హామీ



- రాష్ట్రంలో ప్రతి బిడ్డకూ ఏటా రూ.15 వేలు ఇస్తామని ఉమ్మడి మేనిఫెస్టోలో వాగ్దానం
- 'సూపర్ సిక్స్'లో ప్రముఖంగా ప్రచారం చేసిన కూటమి పార్టీలు
- రాష్ట్రంలో కోటి మందికి పైగా పిల్లలు..
- బడికి వెళ్లే విద్యార్థులు, బడి ఈడు పిల్లలందరికీ ఇవ్వాల్సిందే
- 'తల్లికి వందనం' కోసం ఏటా రూ.15 వేల కోట్లు అవసరం
- స్కూళ్లు తెరిచి నెల కావస్తున్నా ఇంతవరకూ మార్గదర్శకాలే లేవు
- ఫీజులు, చదువుల ఖర్చుల కోసం తల్లిదండ్రుల తిప్పలు
- ఈ ఏడాదికి ఇక ఇంతే.. లబ్ధిదారులను తగ్గించే మార్గాలపై కూటమి సర్కారు కన్ను
- గతంలో రైతులకు రుణమాఫీ హామీ మాదిరిగానే కోతల ఎత్తుగడ
- ఏటా జూన్‌లోనే 'అమ్మ ఒడి' అందించిన వైఎస్ జగన్ సర్కారు
- 42.62 లక్షల మంది తల్లుల ఖాతాల్లో సగటున ఏటా రూ.6,400 కోట్లు జమ
- నాలుగేళ్లలో అమ్మ ఒడి కింద రూ.26,067.28 కోట్ల సాయం
- ఒకటి నుంచి ఇంటర్ వరకు విద్యార్థులకు మేలు చేసిన గత ప్రభుత్వం

2 లో

వెంటనే పిల్లలందరికీ ఇవ్వాలి..



నాకు ఇద్దరు పిల్లలు. ఒక పాప ఆరో తరగతి, మరో అమ్మాయి ఐదో తరగతి చదువుతున్నారు. తల్లికి వందనం పథకం ద్వారా ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికీ డబ్బులిస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు హామీ ఇచ్చారు. కానీ ఇంతవరకు డబ్బులు రాలేదు. గత ప్రభుత్వంలో స్కూళ్లు తెరవగానే మా ఖాతాలో డబ్బులు జమ చేసేవారు.

– పదముత్తం లక్ష్మి, ఏరూరు, చిల్లకూరు మండలం, తిరుపతి జిల్లా

సత్సంగ్‌లో మృత్యుకేళి

తొక్కిసలాటలో 116 మంది భక్తుల దుర్మరణం

- మృతుల్లో 108 మంది మహిళలు, ఏడుగురు చిన్నారులు
- యూపీలోని హత్రాస్ జిల్లా ఫూల్‌రాయ్ గ్రామంలో దుర్ఘటన
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ
- బాధిత కుటుంబాలకు, క్షతగాత్రులకు పరిహారం ప్రకటించిన పీఎంఓ, యూపీ ప్రభుత్వం

6 లో



యూపీలోని హత్రాస్ జిల్లాలో ఆస్పత్రి ఆవరణలో మృతదేహాల వద్ద విలపిస్తున్న బంధువులు



తొక్కిసలాటలో మరణించిన కొడుకుని ఒళ్లో పెట్టుకుని రోదిస్తున్న తల్లి

ఉత్తరప్రదేశ్ రాష్ట్రం హత్రాస్ జిల్లా ఫూల్‌రాయ్ గ్రామంలో మాటలకు అందని తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఆధ్యాత్మిక కార్యక్రమంలో తొక్కిసలాట జరిగి 116 మంది భక్తులు మృత్యువాత పడ్డారు. వీరిలో 108 మంది మహిళలు, ఏడుగురు చిన్నారులు ఉన్నారు. సత్సంగ్ ముగిశాక బయటకు వచ్చే క్రమంలో ఒకరిపై ఒకరు పడిపోవడంతో ఊపిరాడక ప్రాణాలు కోల్పోయారు. దేశంలో ఇటీవలి కాలంలో జరిగిన ఘోరమైన సంఘటన ఇదే కావడం గమనార్హం. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. తొక్కిసలాటలో ఏకంగా 116 మంది మరణించడం పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తదితరులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు, క్షతగాత్రులకు ప్రధాన మంత్రి కార్యాలయం, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం పరిహారం ప్రకటించాయి.



త్వరలో కొత్త ఇసుక విధానం

3 లో

- అవినీతి, అక్రమాలకు తావులేకుండా నూతన విధానం
- నిత్యావసరాల ధరల నియంత్రణకు చర్యలు తీసుకోండి
- రోడ్ల మరమ్మతులు చేపట్టండి
- ఇసుక, రోడ్లు, నిత్యావసర వస్తువుల ధరల సమీక్షల్లో సీఎం చంద్రబాబు

చంద్రబాబును సీబీఐ, ఈడీ ఎందుకు అరెస్టు చేయలేదు?

ఎన్డీఏలో చేరగానే టీడీపీ అధినేత సుద్ధపురుషుడు అయ్యాడా?

విశ్వసనీయతలేని, అవినీతిపరులైన నేతలను మోదీ కలుపుకొన్నారు

- రెండు ఊతకర్రల సాయంతో సభలోకి ప్రధాని వస్తున్నారు
- ఎగ్జిట్ పోల్ ప్రచారంతో స్టాక్ మార్కెట్‌ను ప్రభావితం చేశారు
- ఫలితాల రోజు మదుపరులు రూ. 31 లక్షల కోట్లు నష్టపోయారు
- కానీ టీడీపీ అగ్రనేత భార్య కంపెనీ మాత్రం రూ. 521 కోట్లు లాభపడింది
- ఇదెలా సాధ్యమైందో విచారించే దమ్ము ప్రభుత్వానికి ఉందా?
- లోక్‌సభలో టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ ఘాటు వ్యాఖ్యలు

3 లో



"అవినీతిపరులంతా కూటమి కట్టారని ఇండియా కూటమిపై ప్రధాని మోదీ పదేపదే ఆరోపణలు చేశారు. మరి చంద్రబాబు, అజిత్ పవార్, ప్రఫుల్లపటేల్‌ల విషయంలో జరిగిందేమిటి? వీరిపై కేసులింకా పెండింగ్‌లోనే ఉన్నాయి. చంద్రబాబును సీబీఐ, ఈడీ ఎందుకు అరెస్ట్ చేయలేదు? బీజేపీ పంచన చేరగానే సుద్ధపురుషులు అయ్యారా? విశ్వసనీయత లేని, అవినీతిపరులైన నేతల అండతో మోదీ ప్రభుత్వాన్ని నడుపుతున్నారు.

– లోక్‌సభలో టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ

పిల్ల చేష్టలు!

సానుభూతి కోసం సభలో వెక్కిళ్లు

రాహుల్‌పై ప్రధాని వాగ్బాణాలు.. ఆయనకు దేవుడే సద్బుద్ధి ఇవ్వాలి



- పచ్చి అబద్ధాలు చెప్పారని ఆరోపణ
- కఠిన చర్యలకు స్పీకర్‌కు విజ్ఞప్తి
- సుస్థిర పాలనకే ప్రజల పట్టం
- కాంగ్రెస్ ఫక్తు 'పరాన్నజీవి పార్టీ'
- భాగస్వాముల పుణ్యాన 99 సీట్లు
- అయినా గెలిచినట్టు అహంకారం
- లోక్‌సభలో తూర్పారబట్టిన ప్రధాని

న్యూఢిల్లీ: విపక్ష నేత రాహుల్‌గాంధీపై ప్రధాని మోదీ మంగళవారం లోక్‌సభలో తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆయన ఆద్యంతం సానుభూతి కోసమే పాకులాడారంటూ ఆక్షేపించారు. ''నిండు సభలో రాహుల్ పిల్ల చేష్టలకు పాల్పడ్డారు. పచ్చి అబద్ధాలతో సభను తప్పుదోవ పట్టించారు'' అని అన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై లోక్‌సభలో 2 రోజుల పాటు జరిగిన చర్చకు మోదీ మంగళవారం బదులిచ్చారు. 2 గంటలకు పైగా చేసిన ప్రసంగంలో విపక్ష నేతను అంశాలవారీగా ఏకిపారేశారు. కేంద్రం ఉసిగొల్పినందుకే తనపై క్రిమినల్ కేసులు పెట్టారన్న రాహుల్ అభియోగాలపై వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ''తనను అలా కొట్టారు, ఇలా కొట్టారంటూ రాహుల్ నిండు సభలో ఏడుపు లంకించుకున్నారు. సానుభూతి కోసం కొత్త డ్రామాకు తెర తీశారు. వెక్కిళ్లు పెట్టి రోదించారు'' అంటూ ఎద్దేవా చేశారు. ''రాహుల్‌ది చిన్న పిల్లాడి బుద్ధి. పలు మార్లు ఎంపీగా ఎన్నికైనా పిల్ల చేష్టలు పోలేదు. ఏ విషయాన్నీ సరిగా విడమర్చి చెప్పే సామర్థ్యం లేదు. వ్యవహార జ్ఞానమూ శూన్యం. దీనికి తోడు

మిగతా 13వ పేజీలో ▸

ఇదండీ వరస



ఆయనన్నది మరీ అంత పాత బాబుని కాదయ్యా!

రాష్ట్రంలో రాక్షస పాలన

ప్రత్యర్థులపై పెచ్చుమీరిన టీడీపీ కార్యకర్తల దాడులు

టీడీపీకి ఓటేయలేదనే కక్షతో దౌర్జన్యాలు

- కత్తులు, గొడ్డళ్లతో హత్యాయత్నాలు
- ఎక్కడికక్కడ ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తుల ధ్వంసం
- ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు ఎంపీపీ ఇల్లు ధ్వంసం
- టీడీపీ బెదిరింపులతో యువకుడి ఆత్మహత్య
- పలాస మునిసిపల్ చైర్మన్‌పై దౌర్జన్యకాండ

10 లో



కంభంపాడులో ఎంపీపీ నాగలక్ష్మి ఇంటిని పొక్లెయిన్‌తో ధ్వంసం చేస్తున్న టీడీపీ కార్యకర్తలు



నంద్యాల జిల్లా ఒండుట్ల సమీపంలో టీడీపీ నేతల దాడిలో తీవ్రంగా గాయపడిన రవీంద్రారెడ్డి



గన్నవరం ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం పలికిన వైఎస్సార్‌సీపీ శ్రేణులకు అభివాదం చేస్తున్న మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

2 లో

ఒక్క రోజే రూ.5,000 కోట్ల అప్పు

- జూలైలో రూ.9,000 కోట్ల రుణ భారం
- మూడు నెలల్లో మొత్తం రూ.17 వేల కోట్ల అప్పులు
- ఆర్‌బీఐకి సమాచారం ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం
- ఇప్పటికే గత నెలలో రూ.2,000 కోట్లు అప్పు
- అప్పుల మోతపై కిక్కురుమనని ఎల్లో మీడియా
- చంద్రబాబు చెబుతున్న సంపద సృష్టి ఇలాగేనా?
- విస్మయం వ్యక్తం చేస్తున్న ఆర్థిక నిపుణులు

14 లో



క్లుప్తంగా...

రేపు నెల్లూరుకు వైఎస్ జగన్
సెంట్రల్ జైల్లో ఉన్న పిన్నెల్లితో ములాఖత్

సాక్షి,అమరావతి/సాక్షి ప్రతినిధి, నెల్లూరు: మాజీ సీఎం వైఎస్ జగన్ గురువారం నెల్లూరుకు రానున్నట్లు మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఉదయం 9.40గంటలకు హెలికాప్టర్‌లో తాడేపల్లి నుంచి బయలుదేరి 10.30 గంటలకు నెల్లూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లోని హెలిప్యాడ్‌కు చేరుకుంటారని చెప్పారు. అక్కడ నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి నెల్లూరు సెంట్రల్ జైల్ చేరుకుని మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని కలిసిన అనంతరం మధ్యాహ్నం 12గంటలకు తిరిగి పోలీస్ పరేడ్ గ్రౌండ్‌కు చేరుకుని హెలికాప్టర్‌లో తాడేపల్లి వెళతారని పేర్కొన్నారు.

మాజీ మంత్రి వేణుకు ఫోన్‌లో జగన్ పరామర్శ

రామచంద్రపురం: మాతృవియోగంతో బాధపడుతున్న మాజీ మంత్రి చెల్లుబోయిన వేణును వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మంగళవారం ఫోన్‌లో పరామర్శించారు. వేణు తల్లి సుభద్రమ్మ అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆయనకు జగన్ ఫోన్ చేసి పరామర్శించి, సంతాపం తెలిపారు. వేణును, ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. కాగా, సుభద్రమ్మ అంత్యక్రియలు మంగళవారం రాజమహేంద్రవరంలోని కోటిలింగాల రేవులో నిర్వహించారు. రామచంద్రపురం నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున అభిమానులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు తరలివెళ్లి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

ఇంటెలిజెన్స్ చీఫ్‌గా మహేశ్ చంద్ర లడ్హా

సాక్షి, అమరావతి: రాష్ట్ర నిఘా విభాగం అధిపతిగా మహేశ్ చంద్ర లడ్హా నియమితులయ్యారు. ఈయన 1998 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి. నాలుగేళ్లుగా డెప్యూటేషన్ మీద కేంద్ర సర్వీసుల్లో ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తిపై కేంద్ర హోమ్ శాఖ ఆయన్ను ఇటీవలే రాష్ట్ర సర్వీసులకు తిరిగి పంపింది. ఈ నేపథ్యంలో మహేశ్ చంద్ర లడ్హాను రాష్ట్ర ప్రభుత్వం ఇంటెలిజెన్స్ విభాగం అదనపు డీజీగా నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

■ తెలంగాణ

ఏపీ ఆధీనంలోని భవనాలు స్వాధీనం
అధికారులకు మంత్రి కోమటిరెడ్డి ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర విభజన అనంతరం ఉమ్మడి రాజధానిగా పదేళ్లపాటు కొనసాగిన హైదరాబాద్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధీనంలో ఉన్న రోడ్లు, భవనాల శాఖకు చెందిన భవనాలను తిరిగి స్వాధీనం చేసుకోవటానికి ఏర్పాట్లు చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులను ఆదేశించారు. ఉమ్మడి అంశాలపై చర్చించేందుకు ఈనెల 6న రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు భేటీ అవుతున్న నేపథ్యంలో మంత్రి ఆదేశాలకు ప్రాధాన్యం ఏర్పడింది. ఈ మేరకు కోమటిరెడ్డి మంగళవారం అధికారులతో సమీక్షించారు.

గన్నవరం ఎయిర్‌పోర్ట్‌లో వైఎస్ జగన్‌కు ఘన స్వాగతం

రోడ్డు మార్గంలో తాడేపల్లికి పయనం

సాక్షి,అమరావతి/విమానాశ్రయం (గన్నవరం): బెంగళూరు పర్యటన ముగించుకుని మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లికి చేరుకున్నారు. బెంగళూరు నుంచి ప్రత్యేక విమానంలో సతీమణి వైఎస్ భారతీరెడ్డితో కలిసి ఆయన మంగళవారం మధ్యాహ్నం 2.50గంటలకు ఇక్కడికి చేరుకున్నారు. విమానాశ్రయంలో జగన్‌కు ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, లేళ్ల అప్పిరెడ్డి, మొండితోక అరుణ్ కుమార్, మాజీ మంత్రులు పేర్ని నాని, మేరుగు నాగార్జున, వెలంపల్లి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, సింహాద్రి రమేష్ బాబు, కైలే అనిల్‌కుమార్, దూలం నాగేశ్వరరావు, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తలు దేవినేని అవినాశ్, షేక్ ఆసిఫ్, అంబటి మురళీకృష్ణ, ఏపీ ఫైబర్‌నెట్ మాజీ చైర్మన్ పి.గౌతమ్‌రెడ్డి తదితరులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జై జగన్.. నినాదాలతో ఎయిర్‌పోర్ట్ ప్రాంతమంతా మార్మోగింది. వీరందరిని వైఎస్ జగన్ ఆప్యాయంగా పలకరించారు. అనంతరం రోడ్డు మార్గం ద్వారా తాడేపల్లి బయలుదేరి వెళ్లారు.


వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు అభివాదం చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

బడులు తెరిచారు.. బరువు మోపారు..
వందనమేదీ?

సాక్షి, అమరావతి: 'ఒక ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికీ తల్లికి వందనం పథకం అమలు చేస్తాం. ఒక్కరుంటే రూ.15 వేలు ఇస్తాం. ఇద్దరుంటే రూ.30 వేలు.. ముగ్గురుంటే రూ.45 వేలు నేరుగా ఖాతాల్లోనే జమ చేస్తాం. ఇంకా పిల్లలను కనండి.. పథకాలు అందుకోండి..' అంటూ ఎన్నికల ప్రచార సభల్లో ప్రతిచోటా చాటింపు వేసిన సీఎం చంద్రబాబు ఒకపక్క పాఠశాలలు పునఃప్రారంభమై నెల కావస్తున్నా ఆ ఊసే పట్టించుకోకపోవడంపై తల్లిదండ్రుల్లో ఆందోళన రేగుతోంది. మంత్రి నారా లోకేశ్‌తోపాటు ఎన్‌డీఏ కూటమిలోని ముఖ్య నాయకులంతా ప్రజలకు బహిరంగంగా ఈ ఇచ్చిన హామీపై నోరు మెదపడం లేదు. రాష్ట్రంలో బడికి వెళ్లే విద్యార్థులు, బడి ఈడు పిల్లలు దాదాపు కోటి మందికి పైగా ఉన్నట్లు అంచనా. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగా వీరందరికీ 'తల్లికి వందనం' పథకాన్ని అమలు చేయాలంటే ఏటా సుమారు రూ.15 వేల కోట్లు అవసరం. కూటమి పార్టీలు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఈ కోటి మంది పిల్లలకు 'తల్లికి వందనం' ఇవ్వాలి. ఇప్పటివరకు ఈ పథకంపై ఎలాంటి మార్గదర్శకాలు విడుదల చేయకపోగా ఈ హామీని ఎగ్గొట్టేందుకు ఎత్తుగడలు వేయడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ఏడాదంతా కాలయాపన చేసి లబ్ధిదారులను తగ్గించేందుకు పావులు కదుపుతున్నట్లు స్పష్టమవుతోంది. ఏరుదాటాక తెప్ప తగలేయడంలో నిపుణుడైన చంద్రబాబు 2014 ఎన్నికల్లో రైతు రుణమాఫీ హామీని నెరవేర్చకుండా కోటయ్య కమిటీ పేరుతో కోతలు విధించిన వైనాన్ని రాష్ట్ర ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు.

జూన్‌లోనే జమకు గత సర్కారు ఏర్పాట్లు..

పిల్లలను బడికి పంపే తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బంది పడకూడదన్న సంకల్పంతో 2019 జూన్‌లో జగనన్న అమ్మఒడి పథకాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. స్కూళ్లు తెరిచిన వెంటనే జూన్‌లోనే అంతకుముందు సంవత్సరం హాజరును బట్టి రూ.15 వేలు చొప్పున అందిస్తూ రూ.వెయ్యి టాయిలెట్ మెయింటెనెన్స్ ఫండ్‌కి, మరో రూ.వెయ్యి స్కూల్ నిర్వహణ నిధికి జమ చేసింది. ఒకటి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులకు అమ్మ ఒడి అందించి చదువులకు భరోసా కల్పించింది. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్.. ఇలా ఎక్కడ చదువుతున్నా సరే పథకాన్ని నూరు శాతం పారదర్శకతతో అమలు చేసింది. 2022–23కి సంబంధించి గతేడాది జూన్ 28వ తేదీన 42,61,965 మంది తల్లుల ఖాతాల్లో రూ.6,392.94 కోట్లను వైఎస్ జగన్ ప్రభుత్వం జమ చేసింది. ఐదో విడత అమ్మఒడి కింద ఈ ఏడాది జూన్‌లో నిధులు జమ చేసేందుకు ఏర్పాట్లు చేసినా కొత్త ప్రభుత్వం రావడంతో సాయం నిలిచిపోయింది. జూలై వచ్చినా తల్లికి వందనంపై కూటమి సర్కారు స్పందించకపోవడంతో తల్లిదండ్రులు ఆర్థిక భారాన్ని తలచుకుని ఆందోళన చెందుతున్నారు.

ఖర్చులు తడిసిమోపెడు..

పాఠశాలలు తెరవటమే ఆలస్యం.. పిల్లల ఫీజులు, ఇతర ఖర్చుల కోసం ఇబ్బంది పడకుండా 'అమ్మ ఒడి' పథకం నాలుగేళ్ల పాటు తల్లిదండ్రులకు నిశ్చింత కల్పించింది. పిల్లలను ఏ పాఠశాలలో చదివిస్తున్నా సరే వంద శాతం పారదర్శకతతో గత ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేసింది. విద్యార్థులను క్రమం తప్పకుండా బడికి రప్పించడమే లక్ష్యంగా తల్లులు బాధ్యత తీసుకునేలా ప్రోత్సహించింది. ఏటా రూ.6,400 కోట్లు చొప్పున నాలుగేళ్లలో రూ.26 వేల కోట్లకుపైగా అమ్మ ఒడి ద్వారా అందించడం పిల్లల చదువుల పట్ల మాజీ సీఎం వైఎస్ జగన్ చిత్తశుద్ధికి నిదర్శనం. భావి పౌరుల భవితవ్యానికి భరోసా కల్పిస్తూ వెలుగులు పంచిన ఈ పథకంపై ఇప్పుడు చీకట్లు అలుముకుంటున్నాయి. ఈ పథకం పేరు మార్చేసి ''తల్లికి వందనం'' అంటూ ఉమ్మడి మేనిఫెస్టో సూపర్ సిక్స్ హామీ కింద ప్రకటించిన కూటమి సర్కారు స్కూలుకి వెళ్లే విద్యార్థులతో పాటు ప్రతి బిడ్డకూ ఏటా రూ.15 వేలు చొప్పున అందిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చింది. ఒక్కో ఇంట్లో నలుగురు ఐదుగురు పిల్లలున్న కుటుంబాలు తమకు రూ.60 వేల నుంచి రూ.75 వేల వరకు లబ్ధి చేకూరుతుందని ఆశపడ్డారు. ఇప్పటికే పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో 'తల్లికి వందనం'పై ఇంతవరకూ కొత్త సర్కారు నోరు మెదపకపోవడంతో ప్రైవేట్ స్కూళ్లలో చదివిస్తున్న తల్లిదండ్రులు ఫీజులు కట్టలేక, పుస్తకాల ఖర్చులు తడిసిమోపెడు కావడంతో తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు.

గత ప్రభుత్వంలో అమ్మ ఒడితో ప్రయోజనం ఇలా...

సంవత్సరం	లబ్ధిదారులు	నగదు రూ.కోట్లలో
2019-20	42,33,098	6,349.6
2020-21	44,48,865	6,673.4
2021-22	42,62,419	6,393.6
2022-23	42,61,965	6,392.9
మొత్తం		25,809.5

(నోట్: సాంకేతిక కారణాలతో జూన్‌లో అర్హత సాధించని వారికి జూలై, డిసెంబర్‌లో మరోసారి నిధులు జమ చేశారు. ఇలా నాలుగేళ్లల్లో రూ.257.78 కోట్లు అందించారు)

కాలయాపన.. కోతలు

2014 ఎన్నికల సమయంలో రైతులకు రుణమాఫీ అమలు చేస్తామని చంద్రబాబు ప్రకటించారు. తీరా అధికారంలోకి వచ్చాక అనేక కొర్రీలు వేసి లబ్ధి పొందే రైతులను భారీగా తగ్గించేసి అరకొరగా విదిలించారు. ఇప్పుడు తల్లికి వందనంపైనా ఇలాగే ముందుకెళ్లాలని కూటమి ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తోంది. ఒక్కో బిడ్డకు రూ.15 వేలు చొప్పున ఒక ఇంట్లో ఎంత మంది ఉంటే అంతమందికీ పథకం వర్తింప చేస్తామని ఇచ్చిన హామీ ప్రభుత్వ పెద్దల్లో కూటమి సర్కారులో గుబులు రేపుతోంది. ఏటా రూ.15 వేల కోట్ల నిధులు అవసరం కావడం ఇందుకు కారణం. దీంతో వలంటీర్లను గౌరవ వేతనం రెట్టింపు చేసి మరీ కొనసాగిస్తామన్న హామీని గాలికి వదిలేసినట్లే... 'తల్లికి వందనం' కూడా లబ్ధిదారుల ఎంపిక పేరుతో ఈ ఏడాది కాలయాపన చేసి అనంతరం రకరకాల నిబంధనలతో కోతలు విధించే అవకాశం ఉన్నట్లు భావిస్తున్నారు. టీడీపీ హయాంలో రైతుల రుణమాఫీపైనా ఇదే విధానం అనుసరించడం ఈ వాదనకు బలం చేకూరుస్తోంది. అదే జరిగితే తమ పిల్లల చదువులు నాశనమవుతాయని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

డ్రాప్ అవుట్స్‌కు అడ్డుకట్ట..

బడి ఈడు పిల్లలంతా తప్పనిసరిగా పాఠశాలల్లో ఉండేలా, నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా వైఎస్ జగన్ ప్రభుత్వం సంస్కరణలు చేపట్టి విద్యారంగాన్ని బలోపేతం చేసింది. పాఠశాలల్లో డ్రాప్ అవుట్స్‌ను గణనీయంగా తగ్గించాలనే సదుద్దేశంతో అమ్మఒడి పథకానికి విద్యార్థి హాజరును ప్రామాణికంగా తీసుకుంది. పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపి కనీసం 75 శాతం హాజరు ఉండేలా తల్లులు బాధ్యత తీసుకునేలా ప్రోత్సహించింది. 2019–20, 2020–21 విద్యా సంవత్సరాల్లో మాత్రం కోవిడ్ కారణంగా విద్యార్థులకు 75 శాతం హాజరు నుంచి మినహాయింపునిచ్చారు.

జీఈఆర్...

2018లో ప్రాథమిక విద్యలో జీఈఆర్ (గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో) జాతీయ సగటు 99.21 శాతం కాగా ఆంధ్రప్రదేశ్ 84.48 శాతానికే పరిమితమైంది. నాడు దేశవ్యాప్తంగా 29 రాష్ట్రాలలో అట్టడుగు స్థానం ఏపీదే కావడం గమనార్హం. అనంతరం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యారంగంలో తెచ్చిన సంస్కరణలతో నాలుగేళ్లలో జీఈఆర్ వంద శాతానికి పెరిగింది. జీఈఆర్ శాతాన్ని మరింత మెరుగుపర్చేందుకు 10–12వ తరగతుల్లో ఉత్తీర్ణత సాధించని వారు తిరిగి తరగతులకు హాజరయ్యేలా అవకాశం కల్పించడమే కాకుండా వారికి కూడా అమ్మఒడిని గత సర్కారు అందించింది. పేద కుటుంబాలకు చెందిన పిల్లలు చదువుకునేలా ఈ నిర్ణయం నూరు శాతం ఉపయోగపడింది.

మాట ప్రకారం డబ్బులివ్వాలి



గత ప్రభుత్వంలో అమ్మఒడి పథకం కింద ఏటా సకాలంలో నగదు నా ఖాతాలో జమ చేశారు. పిల్లల చదువుల కోసం అది ఎంతో ఉపయోగపడేది. కూటమి పార్టీలు ప్రతి విద్యార్థికీ రూ.15 వేలు చొప్పున డబ్బులు ఇస్తామని హామీ ఇచ్చాయి. బడులు ఇప్పటికే తెరిచినా కొత్త ప్రభుత్వం ఇంత వరకు ఏమీ చెప్పడం లేదు. చేసేదేమీ లేక రూ.15 వేలు అప్పు చేసి పిల్లలకు అవసరమైనవి కొన్నాం. మాట ప్రకారం పిల్లల చదువులకు డబ్బులు ఇవ్వాలి.
– పద్మ, విద్యార్థి తల్లి, పుత్తూరు, తిరుపతి జిల్లా

పాత వాటికి పేర్లు మార్చారే కానీ



పిల్లలు స్కూళ్లకు వెళుతున్నా ఏ పథకం అందలేదు. పాత పథకాలకు పేర్లు మార్చారే కానీ లబ్ధిదారులకు ఇంతవరకు ఏ పథకం ద్వారా డబ్బులు ఇవ్వకపోవడం దారుణం. ఇలాగే ఉంటే మా పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకమే. కొత్త ప్రభుత్వం స్పందించి వెంటనే పథకాలు అందేలా చూడాలి.
– సి.జానకి, జిల్లావాండ్లపల్లె, చిన్నమండెం మండలం, అన్నమయ్య జిల్లా

ఎప్పుడూ ఇలా ఆలస్యం కాలేదు



నా కుమార్తె లిఖిత జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. ఇంతవరకూ మాకు అమ్మ ఒడి డబ్బులు పడలేదు. గతంలో ఎప్పుడూ ఇలా ఆలస్యం కాలేదు. అసలు డబ్బులు పడతాయో లేదో కూడా తెలియడం లేదు. ఎవరిని అడిగినా మాకు తెలియదంటున్నారు. పిల్లల చదువుల కోసం అప్పు చేయాల్సి వస్తోంది.
– మరడాన జ్యోతి, రామభద్రపురం, విజయనగరం జిల్లా

బడులు మొదలైనా ఆ ఊసే లేదు



గతంలో స్కూళ్లు తెరవగానే అమ్మ ఒడి అందేది. పిల్లల చదువులకు ఎంతో ఉపయోగపడేవి. ఈసారి బడులు ప్రారంభమైనా ఇంతవరకూ ఆ ఊసే లేదు. అసలు డబ్బులు ఇస్తారో లేదో కూడా ఈ ప్రభుత్వంలో స్పష్టత లేదు. గతంలో ఉన్న లబ్ధిదారులందరికీ అమ్మఒడి ఇవ్వాలి.
– రమణమ్మ, అంకేపల్లి, మర్రిపూడి, ప్రకాశం జిల్లా

పిల్లలను ఆదుకోండయ్యా..!



పాఠశాలలు తెరిచి రెండు వారాలు గడుస్తున్నా ఇంతవరకు ప్రభుత్వం నుంచి ఏ పథకం అందలేదు. మా పిల్లలను ఆదుకుని పథకాలు వర్తింపచేసేలా ప్రభుత్వం చొరవ చూపాలి.
– పి.రామలక్ష్మమ్మ, మల్లూరు, చిన్నమండెం మండలం, అన్నమయ్య జిల్లా

అప్పుడే పింఛన్ల తొలగింపు

పలు గ్రామాల్లో పదులసంఖ్యలో పింఛన్ల ఎత్తివేత

- పంపిణీ చేయకుండా అడ్డుకున్న టీడీపీ నేతలు
- ఏలూరు జిల్లా కొత్తగూడెంలో 41 మందికి.. గుంటూరు జిల్లా గరికపాడులో 11మంది వికలాంగులకు.. నెల్లూరు జిల్లా రావులకొల్లులో ఇద్దరికి కోత
- పల్నాడు జిల్లాలో 3 గ్రామాల్లో పింఛన్లు నిలిపివేత
- శ్రీకాకుళం జిల్లా గోరింటలో పింఛన్ అందక 19 మంది నిరసన


ఏలూరు జిల్లా కొత్తగూడెం సచివాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న పెన్షనర్లు


శ్రీకాకుళం జిల్లా గోరింట సచివాలయం వద్ద పడిగాపులు కాస్తున్న పింఛన్‌దారులు

సాక్షి నెట్‌వర్క్: అనుకున్నంతా అయింది. నెలకే మొదలైంది. ఐదేళ్లుగా కులం, మతం, పార్టీలతో సంబంధం లేకుండా పింఛన్ అందుకున్న లబ్ధిదారులకు ఇక్కట్లు మొదలయ్యాయి. కూటమి నాయకులు వారికి చుక్కలు చూపిస్తున్నారు. పలు గ్రామాల్లో పింఛన్లను నిలిపేశారు. పలువురి పింఛన్లు తొలగించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత మొదటి విడత పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలోనే అడుగడుగునా తమ నైజం బయటపెట్టుకున్నారు. పలు గ్రామాల్లో పింఛన్ల పంపిణీని టీడీపీ నాయకులు తమ కనుసన్నల్లో నడిపించారు. ఎన్నికల్లో తమకు ఓటు వేయలేదనే కారణంతో పలు గ్రామాల్లో కొందరికి పింఛన్లు అందకుండా చేశారు. వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేశారనే ఆక్రోశాన్ని వెళ్లగక్కారు. ఇళ్లపై టీడీపీ జెండా ఐదేళ్లు ఎగిరితేనే పింఛన్ ఇస్తామని బాహాటంగానే చెబుతున్నారు. ఒక లబ్ధిదారుడికి పింఛన్ ఆపేశారని ఫోన్ చేసిన టీడీపీ కార్యకర్తతో ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అనుచితంగా మాట్లాడారు. తొక్కగాడివి.. మొనగాడిననుకుంటున్నావా.. అంటూ విరుచుకుపడ్డారు. దెందులూరు మండలంలో పింఛన్లు రాలేదని నిరసన తెలుపుతున్న వారిని ఫొటోలు తీస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై టీడీపీ కార్యకర్తలు దాడిచేశారు. దీంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్త శరీరంపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు.

41 మందికి ఆగిన పింఛన్

ఏలూరు జిల్లా దెందులూరు మండలం కొత్తగూడెం గ్రామంలో 41 మంది లబ్ధిదారులకు పింఛన్ ఇవ్వలేదు. వారు మంగళవారం గ్రామ సచివాలయం వద్దకు వచ్చి తమ పింఛన్ ఎందుకు ఇవ్వలేదని కార్యదర్శిని ప్రశ్నించారు. అనంతరం గ్రామ సచివాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. నిరసన తెలుపుతున్న వీరిని సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త తీడా శ్రీనుపై ఇద్దరు టీడీపీ కార్యకర్తలు దాడిచేశారు. దీంతో మనస్తాపం చెందిన తీడా శ్రీను వెంటనే అక్కడినుంచి వెళ్లి పెట్రోల్ తీసుకొచ్చాడు. టీడీపీ కార్యకర్తలు తనపై దాడిచేసినచోటే పెట్రోలు పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు వెంటనే అతడిని అడ్డుకున్నారు. సర్పంచ్ పరసా లక్ష్మీసుజాత, వైఎస్సార్‌సీపీ నేత పరసా కనకరాజు సూచన మేరకు వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉదయభాస్కర్ తదితరులు శ్రీనును ద్విచక్ర వాహనంపై భీమడోలు వైద్యశాలకు తీసుకువెళ్లారు. వైద్యులు శ్రీనుకు ప్రాథమిక వైద్యసేవలు అందించారు. 41 మందికి పెన్షన్లు ఎందుకు నిలిపేశారని పరసా కనకరాజు, కోటిపల్లి సత్తిరాజు, ఉదయభాస్కర్, వర్రె సత్తిబాబు, రాజు ప్రశ్నించారు. వెంటనే గ్రామానికి చెందిన 41 మంది పెన్షనర్లకు నగదు అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరికి, ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావుకు తెలియజేస్తామని, కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. ఈ విషయమై దెందులూరు ఎంపీడీవో వి.శ్రీలతను వివరణ కోరగా.. ఫిర్యాదులు రావడంతో పెన్షన్లు నిలిపేసినట్లు చెప్పారు. వాటిని పరిశీలించి విచారించిన తర్వాత చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వికలాంగులపై కక్ష

గుంటూరు జిల్లా గరికపాడులో ఈనెల 1వ తేదీన 11 మంది వికలాంగుల పింఛన్లను టీడీపీ నాయకులు నిలిపేశారు. వీరు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులని, దొంగ సర్టిఫికెట్‌లతో పింఛన్ తీసుకుంటున్నారని అధికారులకు పోస్టుద్వారా ఫిర్యాదు చేశారు. వారికి పింఛన్ పంపిణీ నిలిపేయాలని డిమాండ్ చేశారు. దీంతో 11 మంది వికలాంగులకు అధికారులు పింఛన్ పంపిణీ నిలిపేశారు. ఈ విషయమై ఎంపీడీఓ రామకృష్ణ మాట్లాడుతూ 11 మంది నకిలీ సర్టిఫికెట్లతో ఫించన్ తీసుకుంటున్నారని వెంటనే వారికి నిలిపివేయాలని గ్రామ టీడీపీ నేతలు నోటీసు ఇవ్వడంతో ప్రస్తుతానికి నిలిపేసినట్లు చెప్పారు.

జాగ్రత్తగా ఉండు..
సొంత పార్టీ కార్యకర్తకు ఎమ్మెల్యే కూన హెచ్చరిక

శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస టీడీపీ ఎమ్మెల్యే కూన రవికుమార్ సొంత పార్టీ కార్యకర్తపైనే విరుచుకుపడ్డారు. ఆ ఆడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ఆమదాలవలస మండలం పీరుసాహెబ్‌పేటకు చెందిన ఊట రాజారావుకు పింఛన్ ఆపేశారంటూ.. పొందూరు మండలం పిల్లలవలసకు చెందిన టీడీపీ కార్యకర్త గురుగుబెల్లి భాస్కరరావు మంగళవారం ఎమ్మెల్యేకి ఫోన్ చేశారు. రాజారావు వైఎస్సార్‌సీపీకి చెందినవారని పెన్షన్ నిలుపుదల చేశారని, ఆయన మన టీడీపీ వ్యక్తేనని చెప్పారు. ఆయనకు పెన్షన్ ఇవ్వాలని కోరారు. ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్య మాటలు ముదిరి నువ్వెంత అంటే నువ్వెంత అనుకుంటూ ఫోన్‌లో వాదించుకున్నారు. పార్టీ గెలుపునకు వేల రూపాయలు ఖర్చుచేశానని, ఇప్పుడు తమ చుట్టాలకు పెన్షన్ తీసివేయడం సమంజసం కాదని భాస్కరరావు చెబుతుండగానే.. 'డొంక తిరుగుడు మాటలు మాట్లాడకు, తొక్కగాడివి, మొనగాడివి అనుకుంటున్నావా? మర్యాద ఇచ్చి మాట్లాడు. మర్యాద ఇస్తున్నాను జాగ్రత్తగా ఉండు. గివ్ రెస్పెక్ట్ అండ్ టేక్ రెస్పెక్ట్..' అంటూ ఎమ్మెల్యే కూన విరుచుకుపడ్డారు. కూన రవికుమార్ మాటలు విన్న భాస్కరరావు 'ఆ పెన్షన్ డబ్బులు మూడువేలు కూడా మీరే తీసుకోండి. మేం కష్టపడి పనిచేశాం. తప్పుగా మాట్లాడలేదు. ఇడియట్ అని మీరు తిడితే సహించేదిలేదు..' అంటూ తిరిగి సమాధానం చెప్పాడు.

ఐదేళ్లు టీడీపీ జెండా ఉండాలని బెదిరింపు

పల్నాడు జిల్లా అల్లూరివారిపాలెం, వమిడిపాడు, దొండపాడు గ్రామాల్లో పలువురికి పింఛన్ల పంపిణీ నిలిపేశారు. అల్లూరివారిపాలెంలో 20 మందికిపైగా లబ్ధిదారులకు మంగళవారం సాయంత్రం వరకు పింఛన్లు పంపిణీ చేయలేదు. సోమవారం గ్రామంలో పింఛన్ ఇచ్చేందుకు వచ్చిన సచివాలయ సిబ్బంది వద్దకు లబ్ధిదారులు వెళ్లారు. పింఛన్ కావాలంటే గ్రామంలోని టీడీపీ నాయకులను కలవాలని సచివాలయ సిబ్బంది వారికి చెప్పారు. దీంతో పలువురు లబ్ధిదారులు టీడీపీ నాయకుల ఇళ్ల వద్దకు వెళ్లి తమకు పింఛన్ వచ్చేలా చూడాలని కోరారు. టీడీపీలో చేరి ఇంటిపై జెండా పెడితేనే పింఛన్ ఇస్తామని టీడీపీ నేతలు చెప్పారు. ఐదేళ్లు జెండా ఇంటి మీద ఉండాలని స్పష్టం చేశారు. దీనికి లబ్ధిదారులు విముఖత చూపడంతో వారికి పింఛన్ పంపిణీ చేయలేదు. వమిడిపాడులో పింఛన్ల పంపిణీని జనసేన నాయకులు అడ్డుకున్నారు. సోమవారం కూటమి సానుభూతిపరులకు మాత్రమే పింఛన్ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపారంటూ పలువురికి పింఛన్ పంపిణీ చేయకుండా జనసేన నాయకులు అడ్డుకుని హంగామా సృష్టించారు. గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడటంతో పోలీసు బందోబస్తుతో మంగళవారం పెన్షన్లు పంపిణీ చేశారు. దొండపాడులోను పింఛన్ల పంపిణీని ఇదే విధంగా అడ్డుకున్నారు. పలు గ్రామాల్లో సోమవారం టీడీపీ సానుభూతిపరులకే పింఛన్లు పంపిణీ చేశారు. జాబితాలో ఉన్న అందరికీ పింఛన్ ఇవ్వాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో మంగళవారం మిగిలిన పింఛన్లు పంపిణీ చేశారు.

పింఛన్ అందలేదని నిరసన

శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం గోరింట సచివాలయం పరిధిలో తమకు పింఛన్లు ఇవ్వలేదని 19 మంది మంగళవారం నిరసన తెలిపారు. సచివాలయం వద్ద సాయంత్రం వరకు కార్యదర్శి కోసం వేచి చూశారు. సాయంత్రం సచివాలయం కార్యదర్శి నాగరాజు వచ్చి 13 మందికి పింఛన్లు ఇచ్చారు. ఇంకా ఆరుగురికి ఇవ్వాల్సి ఉంది. పింఛన్‌దారుల తరఫున సర్పంచ్ భర్త తమ్మినైన మురళీకృష్ణకు చెప్పి ఆఫీసు పనిమీద మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లానని కార్యదర్శి చెప్పారు. సాయంత్రం 13 మందికి పింఛన్లు ఇచ్చానని, మిగిలిన వారిలో అర్హులందరికీ ఇస్తానని తెలిపారు.

ఎంపీడీవో లాగిన్ ద్వారా ఇద్దరి పింఛన్ల తొలగింపు

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలిగిరి మండలం రావులకొల్లులో కలవకూరి రామ్మూర్తి, చిగురుపాటి బోడియ్య పింఛన్లు తొలగించారు. రామ్మూర్తికి ఐదేళ్లుగా వృద్ధాప్య పింఛన్, బోడియ్యకు నాలుగేళ్లుగా చర్మకార్మిక పింఛన్ వస్తున్నాయి. స్థానిక టీడీపీ నాయకులు కొద్దిరోజులుగా ఇక నుంచి వారికి పింఛన్ రాదని గ్రామంలో ప్రచారం చేశారు. ఆ విధంగానే ఈ నెల 1వ తేదీ వారికి పింఛన్ నగదు అందలేదు. దీంతో రామ్మూర్తి, బోడియ్య మంగళవారం పోలంపాడులోని గ్రామ సచివాలయానికి, కలిగిరిలోని ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లారు. ఎంపీడీవో లాగిన్ ద్వారా పింఛన్లను తొలగించారని తెలియడంతో నిర్ఘాంతపోయారు. తమ పింఛన్‌ను అన్యాయంగా నిలిపేశారని కన్నీటి పర్యంతమయ్యారు. టీడీపీ నాయకులు ఉద్దేశ పూర్వకంగానే అధికారుల ద్వారా తమ పింఛన్లు తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో పలు పంచాయతీల్లో కొందరికి పింఛన్ నిలిపేయాలని స్థానిక నాయకులు సచివాలయ సిబ్బందికి సూచించినట్లు తెలిసింది.

గత నెలలో పింఛన్ అందింది



గత నెలలో పింఛన్ నగదు బ్యాంకులో జమ అయింది. ఈ నెలలో పింఛన్ కోసం సోమవారం అంతా ఎదురుచూశాను. మంగళవారం కూడా రాకపోవడంతో మా ఊళ్లో సచివాలయానికి వెళ్తే ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లమన్నారు. అక్కడికెళ్తే ఎంపీడీవో లాగిన్ ద్వారా పింఛన్ తొలగించారని చెప్పారు. టీడీపీ నాయకులు అన్యాయంగా పింఛన్ తొలగించారు. – కలవకూరి రామ్మూర్తి

దళితులకు చేసే న్యాయం ఇదేనా?



దళితుడినైన నాకు కులవృత్తి అయిన చర్మకార్మిక పింఛన్ వస్తోంది. మా కుమార్తె చనిపోవడంతో ఆమె ఇద్దరు పిల్లలకు కూడా మేమే ఆధారం. నాలుగేళ్లుగా వస్తున్న పింఛన్ తొలగించారు. అధికారంలోకి వచ్చిన నెలలోనే దళితులకు టీడీపీ ప్రభుత్వం చేస్తున్న న్యాయం ఇదేనా? నాకు పింఛన్ అందించి న్యాయం చేయాలి. – చిగురుపాటి బోడియ్య

క్లుప్తంగా...

వలంటీర్ వ్యవస్థను కొనసాగించాలి: డీవైఎఫ్ఐ

సాక్షి, అమరావతి: ప్రజలకు అందుబాటులో ఉండి వారి సంక్షేమానికి పనిచేస్తున్న వలంటీర్లను కొనసాగించాలని, రాజీనామా చేసిన వలంటీర్లను సైతం విధుల్లోకి తీసుకోవాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.రాము, జి.రామన్న మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో వలంటీర్ల కృషి కీలకమని తెలిపారు. రాష్ట్రంలో నిరుద్యోగం విలయతాండవం చేస్తోందని, ఇప్పుడు ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థను రద్దు చేస్తే మరింత దయనీయంగా మారుతుందన్నారు.

ఆమోదయోగ్యమైన రీతిలో విద్యాసంస్కరణలు

ఎస్టీయూ సంఘ నేతలతో మంత్రి లోకేశ్



సాక్షి, అమరావతి: విద్యార్థుల భవిష్యత్తే ధ్యేయంగా ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దశలవారీగా కృషిచేస్తామని మానవవనరుల అభివృద్ధిశాఖ మంత్రి లోకేశ్ చెప్పారు. ఆయన మంగళవారం ఉండవల్లిలో తనను కలిసిన రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నేతలు, మాజీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డితో విద్యారంగ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకునే నిర్ణయం లక్షలాదిమంది విద్యార్థుల భవిష్యత్‌తో ముడిపడి ఉందన్నారు. ఉపాధ్యాయ సంఘాలు, విద్యావేత్తలు, అధికారులు, విద్యారంగ నిపుణులందరికీ ఆమోదయోగ్యమైన సంస్కరణలు అమలు చేస్తామని చెప్పారు. ఉపాధ్యాయ వాణి మాసపత్రికను మంత్రి విడుదల చేశారు.

డీఎస్సీ పోస్టులు ఎందుకు తక్కువ?: లోకేశ్
డీఎస్సీకి సంబంధించి పలు జిల్లాల్లో పోస్టులు తక్కువగా ఉన్నాయంటూ అభ్యర్థులు తన దృష్టికి తెచ్చారని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. దీనిపై అధికారులు మాట్లాడుతూ.. ప్రకాశం జిల్లాలో ఉపాధ్యాయుల పదోన్నతులపై కొంతమంది కోర్టును ఆశ్రయించారని.. దీనివల్ల పోస్టులు తగ్గాయన్నారు. సిలబస్ విషయంలో సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారంపైనా మంత్రి ఆరా తీశారు. దీనిపైన అధికారులు స్పందిస్తూ.. ఫిబ్రవరి టెట్ సిలబస్‌నే ఇప్పుడూ ఉంచామని, ఇందులో ఎలాంటి మార్పులు చేయలేదన్నారు. టెట్, మెగా డీఎస్సీ నిర్వహణపై పాఠశాల విద్య ఉన్నతాధికారులతో మంగళవారం నారా లోకేశ్ సమీక్ష నిర్వహించారు.

'గిరిజన ప్రాంతాల్లో వైరల్ జ్వరాలు అరికట్టండి'

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వర్షాల కారణంగా గిరిజన ప్రాంతాల్లో వైరల్ జ్వరాలు, మలేరియా, డెంగీ, డయేరియా వంటి అంటువ్యాధులు విస్తరిస్తున్నాయని, వాటిని అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయమై వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో మంగళవారం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబును కలిసి శంకర్ నాయక్ వినతిపత్రం సమర్పించారు.

అధికారుల కుర్చీల్లో.. టీడీపీ కార్యకర్తలు

- టీడీపీ ఎమ్మెల్యే జయసూర్య సాక్షిగా అధికారులకు అవమానం



ఎమ్మెల్యే మాట్లాడుతున్న సమయంలో వేదికపై ఓ మూలన నిల్చున్న అధికారులు

పాములపాడు: అధికార దర్పంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు చెలరేగిపోతున్నారు. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులను అడుగడుగునా అవమానిస్తున్నారు. మంగళవారం నంద్యాల జిల్లాలో జరిగిన ఓ సమావేశంలో టీడీపీ కార్యకర్తలు అధికారుల కుర్చీల్లో దర్జాగా కూర్చొని.. వారిని మూలకు నెట్టేశారు. మంగళవారం నంద్యాల జిల్లా పాములపాడు ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య సమీక్ష నిర్వహించారు. కానీ ఇది పూర్తిగా టీడీపీ కార్యకర్తల సమావేశంగా మారిపోయింది. తమ కుర్చీలను కూడా టీడీపీ నేతలే ఆక్రమించడంతో కొందరు అధికారులు, ఉద్యోగులు బయటకు వెళ్లిపోగా.. దళిత సామాజికవర్గానికి చెందిన వైద్యాధికారి డాక్టర్ నాగలక్ష్మీదేవి, గిరిజన సామాజికవర్గానికి చెందిన ఎంఈవో బాలాజీనాయక్, బీసీ సామాజికవర్గానికి చెందిన ఈవోపీఆర్డీ శ్రీనివాసులు అదే వేదికపై ఓ మూలన నిలబడాల్సి వచ్చింది.

రిజిస్ట్రేషన్ సేవల్ని సులభతరం చేయాలి

మంత్రి అనగాని

సాక్షి, అమరావతి: రిజిస్ట్రేషన్ సేవలను ప్రజలకు అవసరమైన రీతిలో సులభంగా అందించేందుకు చర్యలు తీసుకోవాలని స్టాంపులు–రిజిస్ట్రేషన్లు, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. వెలగపూడి సచివాలయంలో మంగళవారం రిజిస్ట్రేషన్ల శాఖపై ఆయన ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ల శాఖను సమూలంగా ప్రక్షాళన చేయాల్సి ఉందని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా సేవలు కొనసాగాలన్నారు.

ఆ ఇల్లు కూల్చేయండి

తిరువూరు ఎమ్మెల్యే అరాచకం.. ఎ.కొండూరు ఎంపీపీ ఇల్లు ధ్వంసం

- కలిసి కంభంపాడులో హంగామా
- పొక్లెయిన్‌తో ఇల్లు ధ్వంసం చేసిన ఎమ్మెల్యే అనుచరులు
- పోలీసు, రెవెన్యూ అధికారుల ప్రేక్షకపాత్ర
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన వైఎస్సార్‌సీపీ నేత
- తిరిగి ఎంపీపీకే నోటీసు ఇచ్చిన అధికారులు



ఎంపీపీ భవనం కూల్చివేతకు అనుచరులతో కలిసి వచ్చిన తిరువూరు ఎమ్మెల్యే శ్రీనివాసరావు

తిరువూరు: తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మంగళవారం ఎన్టీఆర్ జిల్లా కంభంపాడులో అరాచకం సృష్టించారు. ఎన్నికల సమయంలో జరిగిన ఓ సంఘటనను దృష్టిలో పెట్టుకొని వైఎస్సార్‌సీపీకి చెందిన ఎ.కొండూరు ఎంపీపీపై కక్ష సాధింపు చర్యలకు దిగారు. జేసీబీతో ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి ఇంటిని ధ్వంసం చేయించి, కంభంపాడులో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు సృష్టించారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారు.

ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సమయంలో విజయవాడ లోక్‌సభ నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి కేశినేని చిన్ని కంభంపాడు పోలింగ్ కేంద్రంలోకి తన అనుచరులతో కలిసి అక్రమంగా ప్రవేశించబోయారు. అనుచరులతో కలిసి వెళ్లడాన్ని ఎంపీపీ నాగలక్ష్మి వర్గీయులు అడ్డుకున్నారు. దీంతో టీడీపీ నేతలు ఎంపీపీపై కక్షకట్టారు. తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మంగళవారం ఉదయమే మందీ మార్బలంతో కంభంపాడు వచ్చారు. ఎంపీపీ నిర్మిస్తున్న భవనం ఆక్రమిత స్థలంలో ఉందంటూ అధికారులపై వత్తిడి తెచ్చారు. దానిని కూల్చివేయాలంటూ అధికారులకు హుకుం జారీ చేశారు. ఎమ్మెల్యే ఆదేశాలతో ఎటువంటి నోటీసులు ఇవ్వకుండానే విజయవాడ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీసు అధికారులు, రెవెన్యూ సిబ్బంది కంభంపాడు చేరుకున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భవనం కూల్చివేతకు చేసిన హంగామా స్థానికుల్ని భయాందోళనలకు గురిచేసింది. ఎమ్మెల్యే వర్గీయులే పొక్లయిన్‌ను తీసుకొచ్చి పోలీసులు, రెవెన్యూ అధికారుల సమక్షంలోనే ఎంపీపీ భవనాన్ని పాక్షికంగా ధ్వంసం చేశారు. అయినా పోలీసులు, రెవెన్యూ అధికారులు కూడా ప్రేక్షకపాత్రే వహించారు. నిబంధనలకు విరుద్ధంగా భవనాన్ని కూల్చివేస్తున్నారని ఎంపీపీ ఫిర్యాదు చేసినా ఉన్నతాధికారులు స్పందించలేదు. తిరువూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు సంఘటన స్థలానికి చేరుకుని ఎమ్మెల్యే చర్యలను ఖండించారు. ఇటువంటి అసాంఘిక చర్యలను సహించబోమని, అధికారులు నిబంధనల మేరకు వ్యవహరించాలన్నారు. ఇంతవరకు తిరువూరు నియోజకవర్గంలో ఇటువంటి కక్షసాధింపు చర్యల్లేవని తెలిపారు. ఎమ్మెల్యే శ్రీనివాసరావు బహిరంగంగా దౌర్జన్యపూరితంగా వ్యవహించారని స్వామిదాసు ఆరోపించారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని స్వామిదాసు ఏ కొండూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఎంపీపీకే నోటీసు

పట్టపగలు నడిరోడ్డుపై అరాచకం సృష్టించిన వారిపై చర్యలు తీసుకోని అధికారులు ఎంపీపీకే తిరిగి నోటీసు ఇవ్వడం గమనార్హం. భవనానికి వెనుక వైపు స్థలాన్ని ఆక్రమించారంటూ ఎంపీపీ నాగలక్ష్మికి కంభంపాడు పంచాయతీ కార్యదర్శి నోటీసు ఇచ్చారు. భవనానికి వెనుకవైపు స్థలం ఆక్రమించారని, దారి వదల్లేదని వచ్చిన ఫిర్యాదు మేరకు వెంటనే భవన నిర్మాణం నిలిపివేయాలని, స్థలానికి సంబంధించిన ధృవపత్రాలను పంచాయతీ కార్యాలయంలో వారం రోజుల్లోగా సమర్పించాలని ఆ నోటీసులో పేర్కొన్నారు.

చంద్రబాబును సీబీఐ, ఈడీ ఎందుకు అరెస్టు చేయలేదు?

లోక్‌సభలో టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ ఘాటు వ్యాఖ్యలు

సాక్షి, న్యూఢిల్లీ: విశ్వసనీయత లేని, అవినీతిపరులైన నేతల అండతో ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని నడుపుతున్నారని తృణముల్ కాంగ్రెస్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ విమర్శించారు. అవినీతిపరులైన నేతలు ఎన్డీఏలో చేరగానే సుద్ధపురుషులు అయ్యారా అంటూ నిలదీశారు. కేంద్రంలో ప్రస్తుతం అస్థిరమైన ప్రభుత్వం పాలన చేస్తుంటే ఇంకోవైపు అత్యంత పటిష్టమైన ప్రతిపక్షం ఉందని అన్నారు. మంగళవారం లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో కల్యాణ్ బెనర్జీ మాట్లాడారు. ఈ సందర్భంగా టీడీపీ, జేడీయూల ప్రస్తావన తెచ్చారు. గతంలో స్థిరమైన ప్రభుత్వంతో నిబ్బరంగా కనిపించిన ప్రధాని మోదీ ప్రస్తుతం టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జేడీయూ అధినేత నితీశ్‌కుమార్ అనే ఊతకర్రల సాయంతో సభలోకి వస్తున్నారు అని ఎద్దేవా చేశారు. ఆ రెండు కర్రలు పట్టుకునే దేశవిదేశాల్లో మోదీ తిరుగుతున్నారని చెప్పారు. గతంలోలాగా ప్రధాని మోదీలో ఆత్మస్థయిర్యం కనిపించడం లేదు అని అన్నారు. ఇదే సమయంలో ప్రతిపక్ష రాజకీయ నేతలపై సీబీఐ, ఈడీ దాడులను ప్రస్తావించిన బెనర్జీ, ఎన్డీఏ పక్షాల నేతలపై కేసుల అంశాన్ని తూర్పారపట్టారు. అవినీతిపరులంతా కూటమి కట్టారని ఇండియా కూటమిపై గతంలో మోదీ పదేపదే ఆరోపణలు చేశారని, మరి చంద్రబాబు, అజిత్ పవార్, ప్రఫుల్లపటేల్‌ల విషయంలో జరిగిందేమిటీ అని ప్రశ్నించారు. వీరిపై కేసులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. సీబీఐ, ఈడీలు చంద్రబాబును అరెస్ట్ చేస్తాయా అని నిలదీశారు. టీడీపీ అధినేతను ఎందుకు సీబీఐ, ఈడీ అరెస్ట్ చేయలేదు అని ప్రశ్నించారు. బీజేపీ పంచన చేరగానే వాషింగ్ మెషీన్‌లో వేసిన మాదిరి వారంతా సుద్ధపురుషులు అయ్యారంటూ ఎద్దేవా చేశారు. అవినీతిపరులైన నేతలను కలుపుకొని ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిన అగత్యం మోదీ ప్రభుత్వానికి ఏర్పడిందని దుయ్యబట్టారు.

ఆ కంపెనీకి లాభాలు ఎలా వచ్చాయి..

ఎన్నికల సర్వేల అంశాలపై కల్యాణ్ బెనర్జీ మాట్లాడుతూ.. బీజేపీ కూటమి 400 సీట్లు దాటుతుందంటూ ఎగ్జిట్ పోల్ సర్వేల ద్వారా ప్రచారం చేసి, స్టాక్‌మార్కెట్‌లో షేర్లు కొనాలని ప్రోత్సహించారని విమర్శించారు. ఫలితాల రోజున ఒకవైపు స్టాక్‌మార్కెట్ పడిపోయి రూ. 31 లక్షల కోట్లు మదుపరుల సంపద ఆవిరైపోతే, టీడీపీ అగ్రనేత భార్యకు చెందిన కంపెనీ మాత్రం రూ. 521 కోట్లు ఆ ఒక్కరోజులోనే ఆర్జించింది వెల్లడించారు. ఇదెలా సాధ్యమైందని ప్రశ్నించారు. దీనిపై విచారణ జరిపే దమ్ము ప్రభుత్వానికి ఉందా? అని నిలదీశారు. మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఐదేళ్ల పాటు కొనసాగదని ఆయన జోస్యం చెప్పారు. మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికల అనంతరం ఎన్డీఏ ప్రభుత్వం కూలిపోతుందని చెప్పారు. సార్వత్రిక ఎన్నికలు నిష్పక్షపాతంగా జరగలేదని, ఎన్నికల అధికారులు బీజేపీకి అనుకూలంగా పనిచేశారని విమర్శించారు.

టీడీపీ అరాచకాలపై కోర్టులకు వెళ్తాం

- అధికారమదంతో ఇష్టానుసారం దాడులు చేస్తారా?
- తిరువూరులో ఎంపీపీ ఇంటిని కూల్చి కొలికపూడి అరాచకం
- రాష్ట్రంలో ఇన్ని ఘోరాలు జరుగుతున్నా సీఎం చంద్రబాబు మౌనం
- వైఎస్సార్‌సీపీ మాజీ ఎంపీ నందిగం సురేష్ ఆగ్రహం
- చంద్రబాబు నేతృత్వంలో బుల్డోజర్ల పాలన: మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్



మాట్లాడుతున్న అనిల్‌కుమార్, నందిగం సురేశ్

సాక్షి, అమరావతి: అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుంచే రాష్ట్రంలో టీడీపీ చేస్తున్న అరాచకాలపై కోర్టులకు వెళ్తామని వైఎస్సార్‌సీపీ మాజీ ఎంపీ నందిగం సురేష్ చెప్పారు. అధికార మదంతో ఇష్టానుసారం వ్యవహరిస్తే ప్రజల్లో తిరుగుబాటు వస్తుందని ఆయన హెచ్చరించారు. రాష్ట్రంలో ఇన్ని దారుణాలు జరుగుతున్నా సీఎం చంద్రబాబు మౌనంగా ఉన్నారని, ప్రజలకిచ్చిన హామీలు మరిచి ప్రతిపక్షాలపై కక్ష తీర్చుకునే పనిలో నిమగ్నమయ్యారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌తో కలిసి నందిగం సురేష్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్నికల ఫలితాలు వచ్చినప్పటి నుంచి జూన్ 12న చంద్రబాబు ప్రమాణస్వీకారం చేసే వరకు టీడీపీ నేతలు చేసిన అరాచకాలు కోకొల్లలు అని నందిగం సురేష్ మండిపడ్డారు. టీడీపీ నేతలు పాల్పడుతున్న అల్లర్లు, దాడులు చిన్నాచితకవి కాదన్నారు. కొట్టి చంపడం, ప్రభుత్వ, ప్రయివేటు ఆస్తులను ధ్వంసం చేయడం దారుణమన్నారు. గత ఐదేళ్లు వైఎస్ జగన్ పరిపాలన చేశారని, ఎక్కడైనా ఇలాంటి ఘటనలు జరిగాయా? అని ప్రశ్నించారు. ప్రజలు అధికారం ఇచ్చింది ప్రతిపక్షాలపై కక్ష తీర్చుకోవడానికా? ప్రజలకు మేలు చేయడానికా? అని సీఎం చంద్రబాబును ప్రశ్నించారు. 'ప్రస్తుతం ఎక్కడ ఎలాంటి ఘటనలు జరిగినా క్షణాల్లో సోషల్ మీడియాలో వచ్చేస్తోంది. కానీ, అవేమీ టీడీపీ నేతలకు కనపడటంలేదు. ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో ఎమ్మెల్యే కొలికపూడి అరాచకాలు చేస్తున్నారు. భారీ ర్యాలీగా వెళ్లి పోలీసులు వారిస్తున్నా వినకుండా ఎంపీపీ ఇంటిని కూల్చేశారు. భవన నిర్మాణంలో తప్పు ఉంటే అధికారులు నోటీసులు ఇచ్చి తగిన చర్యలు తీసుకుంటారు. తగుదునమ్మా.. అని ఎమ్మెల్యే ర్యాలీగా వెళ్లి ఇల్లు కూల్చేసే స్థితికి చేరుతున్నారంటే మనం ఎటు పోతున్నామో అర్థం చేసుకోవాలి. ఒక మంత్రి భార్య కూడా పోలీసులపై దురుసుగా ప్రవర్తించిన తీరును ప్రజలంతా గమనించారు. వేమూరు నియోజకవర్గంలో దివంగత సీఎం వైఎస్సార్ విగ్రహాన్ని తగలబెట్టారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేసే పరిస్థితి లేదు కాబట్టి గొడవలు చేసి భయపెట్టాలని, ప్రజల దృష్టిని మరల్చాలని చూస్తున్నారు.' అని నందిగం సురేష్ అన్నారు. పెన్షన్ రూ.7వేలు అని చెప్పి చాలాచోట్ల రూ.6,500 ఇచ్చారన్నారు. పెన్షన్ తీసుకున్నవాళ్లు ఏ విధంగా మాట్లాడుకున్నారో సోషల్ మీడియాలో వచ్చిన క్లిప్పింగ్‌లను నందిగం సురేష్ మీడియాకు చూపించారు. వీటిన్నింటిని గుర్తించి సీఎం చంద్రబాబుకు చేతనైతే అరాచకాలకు పాల్పడుతున్న ఎమ్మెల్యేలను పిలిచి హెచ్చరించాలి. రెడ్‌బుక్‌లో రాసుకున్న విధంగా ఎవరినైనా బాధపెడతామంటే కుదరదని, చట్టాలు ఉన్నాయని గుర్తుచేశారు. ఎవరైతే అధికారం ఉందని ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారో వారిపైనా ప్రయివేటు కేసులు వేస్తామని సురేష్ చెప్పారు.

'కొలికపూడి' మనిషిలా ప్రవర్తించలేదు

మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్

చంద్రబాబు నేతృత్వంలో బుల్డోజర్ల ప్రభుత్వం నడుస్తోందని మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ మండిపడ్డారు. తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ ఒక మనిషిలాగా ప్రవర్తించలేదని, కార్లలో భారీ ర్యాలీగా వెళ్లి పోలీసులు ఆపుతున్నా ఇళ్లను బుల్డోజర్లు పెట్టి కూల్చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. 'చంద్రబాబు రాష్ట్రాన్ని అరాచక శక్తులపరం చేశారు. మభ్యపెట్టి హామీలిచ్చి అధికారంలోకి వచ్చి ప్రజలను భయపెడుతున్నారు. అధికార మదంతో ఒక ఎంపీపీ ఇంటిని ఎమ్మెల్యే కొలికపూడి కూలగొట్టడం దారుణం. మా ప్రభుత్వం మళ్లీ వచ్చి ఉంటే ఈ సమయానికి అమ్మ ఒడి అందేది. అమ్మ ఒడి, నిరుద్యోగభృతి గురించి ఇప్పుడు చంద్రబాబు ఎక్కడా మాట్లాడటం లేదు. సామాజిక పెన్షన్లు ఇచ్చిన తీరు ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా ఉంది. ప్రొటోకాల్ పాటించలేదు.' అని అనిల్‌కుమార్ అన్నారు.

సీఎంను కలిసిన బెల్జియం బృందం



వాండెర్ హాసెల్ట్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న సీఎం

సాక్షి, అమరావతి: బెల్జియం దేశానికి చెందిన వాణిజ్య, పరిశ్రమల ప్రతినిధుల బృందం మంగళవారం సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిసింది. భారత్‌లో బెల్జియం రాయబారి దిదీర్ వాండెర్ హాసెల్ట్ నేతృత్వంలోని ఈ బృందం పలు అంశాలపై సీఎంతో చర్చించింది. ఏపీలో వ్యాపార వర్గాలకు అనుకూలంగా ఉండే వాతావరణాన్ని సృష్టించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని సీఎం చెప్పారు. ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న వ్యాపారవేత్తలను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. బెల్జియం బృందంతో సమావేశం వివరాలను చంద్రబాబు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

జైళ్లలో డి అడిక్షన్ సెంటర్లు

రాష్ట్ర హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత




ఆరిలోవ (విశాఖ తూర్పు): మత్తు పదార్థాలకు అలవాటుపడి ఖైదు అనుభవిస్తున్నవారి కోసం జైళ్లలో డి అడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. విశాఖ కేంద్ర కారాగారాన్ని ఆమె మంగళవారం సందర్శించారు. ఆమెకు జైలు అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం జైలు సూపరింటెండెంట్ ఎస్.కిశోర్‌కుమార్, అదనపు సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వరావు, ఇతర అధికారులతో కలిసి ఆమె జైలు లోపల పర్యవేక్షించారు. ఖైదీలు ఉండే బేరెక్‌లను పరిశీలించారు. అనంతరం జైలు బయట ప్రధాన ద్వారం వద్ద మీడియాతో మాట్లాడారు. జైలు గంజాయి ముద్దాయిలతో నిండిపోయిందన్నారు. వారిలో మంచి మార్పు తీసుకురావడానికి జైళ్లలో 20 నుంచి 30 పడకలతో కూడిన డి అడిక్షన్ సెంటర్లు ఏర్పాటుపై దృష్టి పెడతామని చెప్పారు. అసలైన గంజాయి సరఫరా చేయించిన వారిని వదిలేసి అమాయక గిరిజనులను పోలీసులు పట్టుకుని జైళ్లలో పెట్టారన్నారు. గంజాయి ముద్దాయిలకు బెయిల్ మంజూరులో ఆటంకంగా నిలిచిన షూరిటీ గురించి లీగల్‌గా పరిశీలించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో చర్చిస్తానన్నారు. జైలు సిబ్బంది సమస్యలు కూడా పరిష్కరిస్తామని ఆమె హామీ ఇచ్చారు. జోనల్ ట్రాన్స్‌ఫర్లకు బదులుగా రాష్ట్ర వ్యాప్తంగా బదిలీలు జరిగేటట్లు చర్యలు చేపడతామన్నారు. ఖైదీలకు గత ఐదు సంవత్సరాలుగా ఒక్కసారి కూడా క్షమాభిక్ష ఇవ్వలేదని తెలిపారు. ఈ ఏడాది ఖైదీలకు క్షమాభిక్ష కల్పిస్తామన్నారు. ఖైదీల ఆరోగ్యంపై మరింత దృష్టిపెడతామని, ఆరోగ్యశ్రీ సక్రమంగా వర్తించే విధంగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఆస్తులను తాకట్టుపెట్టిన వారిపైన, ప్రభుత్వ భూములు ఆక్రమించినవారిపైన దర్యాప్తు జరిపిస్తామని తెలిపారు.

త్వరలో కొత్త ఇసుక విధానం

ఇసుక, రోడ్లు, నిత్యావసర వస్తువుల ధరల సమీక్షల్లో సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి: నూతన ఇసుక విధానాన్ని రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఇందుకోసం సమగ్ర సమాచారం, ఆలోచనలతో రావాలని సూచించారు. అక్రమాలు, అవినీతికి అవకాశం లేకుండా, ప్రజలకు ఇబ్బందులు కలిగించని కొత్త ఇసుక విధానాన్ని తీసుకువస్తామన్నారు. నూతన ఇసుక విధానం, దెబ్బతిన్న రోడ్లు, నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణపై ఆయన మంగళవారం సచివాలయంలో ఆయా శాఖల మంత్రులు, అధికారులతో విడివిడిగా సమీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిర్మాణ రంగానికి అత్యవసరమైన ఇసుకను అందుబాటులోకి తేవడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్రంలో నిర్మాణాలకు ఇసుక కొరత లేకుండా చూడాలన్నారు. ప్రస్తుతం స్టాక్ పాయింట్లలో అందుబాటులో ఉన్న ఇసుకను సరఫరా చేసేందుకు ఉన్న వెసులుబాటును చూడాలని సూచించారు. గత ప్రభుత్వ విధానాల వల్ల ప్రజలు అనేక సమస్యల్లో ఉన్నారని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. దీనికి అవసరమైన రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని ఆదేశించారు. సమస్యల తీవ్రతను బట్టి తక్షణం ఎలాంటి చర్యలు తీసుకోవాలి? దీర్ఘకాలికంగా ఎటువంటి ప్రణాళికలు అమలు చేయాలి అనే వాటిపై నిర్దిష్టమైన విధానంలో ముందుకెళ్లాలని సూచించారు.



దెబ్బతిన్న రోడ్లను బాగు చేయాలి..

రోడ్లపై నిర్వహించిన సమీక్షలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ దెబ్బతిన్న రోడ్లను పూర్తి స్థాయిలో బాగు చేయడంతోపాటు రహదారులపై గుంతలు పూడ్చడం, మరమ్మతులపై దృష్టిపెట్టాలన్నారు. ఎన్ని కిలోమీటర్ల మేర రోడ్లు దెబ్బతిన్నాయో నివేదికలు సిద్ధం చేయాలన్నారు. రోడ్ల మరమ్మతులకు సంబంధించి సాంకేతికంగా అందుబాటులోకి వచ్చిన కొత్త విధానాలపై అధ్యయనం చేయాలని సూచించారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్నా వెంటనే మరమ్మతులు చేయాల్సిన రోడ్లపై ప్రణాళికను రూపొందించాలని కోరారు. నిత్యావసర వస్తువుల ధరల భారం తగ్గించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బియ్యం, కందిపప్పు, టమాటా, ఉల్లి ధరల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై సూచనలు చేశారు. ధరల నియంత్రణకు ఏ చర్యలు తీసుకోవాలనేదానిపై ప్రణాళికతో రావాలని ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 122 రైతు బజార్‌లు ఉన్నాయని అధికారులు చెప్పగా.. వాటి నిర్వహణ సరిగా లేక.. వాటి ఏర్పాటు వెనుక ఉన్న ఉద్దేశం నెరవేరడం లేదన్నారు. ఈ సమీక్షల్లో మంత్రులు కొల్లు రవీంద్ర, బీసీ జనార్దన్‌రెడ్డి, అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్, ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై మండల, జెడ్పీ భేటీల్లో చర్చించాలి

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ ఆదేశాలు

సాక్షి, అమరావతి: వర్షాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాల్లో తాగునీటి కాలుష్యం, దోమల వ్యాప్తి ద్వారా వచ్చే వ్యాధులను నియంత్రించడానికి పంచాయతీల ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్లు, జెడ్పీ సీఈవోలు, డీపీవోలను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కె.కన్నబాబు ఆదేశించారు. పంచాయతీల వారీగా ప్రజారోగ్య పరిస్థితులపై రోజువారీ సమీక్షించాలని, గ్రామంలో జ్వరం, వాంతులు, విరోచనాలు, ఇతర అంటు వ్యాధులు సోకిన కుటుంబాల వివరాలను ఏఎన్ఎం ద్వారా సేకరించాలని సూచించారు. ఆయా కుటుంబాలకు అంటువ్యాధులు సోకడానికిగల కారణాలు సమీక్షిస్తూ పారిశుధ్య, తాగునీటి పరంగా నివారణ చర్యలు చేపట్టాలని నిర్దేశించారు. గ్రామంలో తీవ్ర జ్వరాలు, ఇతర సీజనల్ వ్యాధులు ప్రబలితే వెంటనే వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. మండల, జిల్లా పరిషత్ సమావేశాల్లో గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి అంశాలను ప్రత్యేక అజెండాగా చేర్చి సమగ్రంగా చర్చించాలని, తరువాత అందుకనుగుణంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

రెండు ఎమ్మెల్సీ స్థానాలకు 'కూటమి' నామినేషన్లు

- దాఖలు చేసిన సి.రామచంద్రయ్య, హరి ప్రసాద్

సాక్షి, అమరావతి: శాసనమండలిలో ఖాళీ అయిన 2 ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థులుగా కూటమి తరఫున హరిప్రసాద్, సి. రామచంద్రయ్య మంగళవారం నామినేషన్లు దాఖలు చేశారు. హరిప్రసాద్ జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ రాజకీయ కార్యదర్శిగా వ్యవహరిస్తుండగా, సి.రామచంద్రయ్య ఎన్నికలకు ముందు వైఎస్సార్‌సీపీని వీడి టీడీపీలో చేరారు. ఇతర పార్టీల నుంచి నామినేషన్లు దాఖలు చేయకపోవడంతో వీరి ఎన్నిక ఏకగ్రీవం కానుంది. హరిప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చిన పవన్‌కు రుణపడి ఉంటానని తెలిపారు. సి. రామచంద్రయ్య మాట్లాడుతూ చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానని చెప్పారు.

హెపటైటిస్ కేసులపై వైద్యశాఖ అధ్యయనం

- గుంటూరు, కర్నూలు, విశాఖల్లో అధ్యయనం చేస్తున్న ప్రివెంటివ్ మెడిసిన్ విభాగం
- గత నెలలో 337 కేసులు నమోదు

సాక్షి, అమరావతి: అత్యంత ప్రమాదకరమైన హెపటైటిస్ చాపకింద నీరులా విస్తరిస్తోంది. పలు జిల్లాల్లో అత్యధికంగా కేసులు నమోదవుతున్నాయి. దీనికి కారణాలను వైద్య శాఖ అన్వేషిస్తోంది. దీన్లో భాగంగా హెపటైటిస్–సి కేసులు ఎక్కువగా బయటపడుతున్న కర్నూలు, బి కేసులున్న విశాఖపట్నం, గుంటూరు జిల్లాల్లో ప్రభుత్వ వైద్య కళాశాలల్లోని ప్రివెంటివ్ మెడిసిన్ విభాగాలను దీనిపై అధ్యయనం చేయాలని డీఎంఈ ఆదేశించారు. ప్రత్యేకించి ఈ ప్రాంతాల్లో కేసులు ఎందుకు వస్తున్నాయో తెలుసుకోవడంలో భాగంగా ఆస్పత్రులకు వచ్చే పాజిటివ్ రోగులు చుట్టుపక్కల ఎక్కడ నివసిస్తున్నారు? వారి జీవన విధానాలు, ఇతర అంశాలపై అధ్యయనం చేయాలని సూచించారు. ఈ క్రమంలో ఇప్పటికే విశాఖపట్నం కేజీహెచ్‌లో నమోదైన కేసుల డేటా ఆధారంగా అధ్యయనం చేశారు. గుంటూరు వైద్య కళాశాలలో అధ్యయనం చేపట్టడానికి ప్రొటోకాల్ సిద్ధం చేయగా, కర్నూలులో ఇంకా ప్రారంభించాల్సి ఉంది. సాధారణంగా శృంగారం, రక్తమార్పిడి, సిరంజ్‌లు, టూత్‌బ్రష్, రేజర్ల వినియోగంలో సురక్షిత పద్ధతులు పాటించకపోవడంతో హెపటైటిస్–బి ఒకరి నుంచి ఒకరికి వ్యాపిస్తుంది. కాగా, వైద్యశాఖ అంచనాల ప్రకారం రాష్ట్రంలో 2.3 శాతం జనాభా హెపటైటిస్–బి, 0.3 శాతం హెపటైటిస్–సితో బాధపడుతున్నారు.

వారం రోజుల్లో 337 కేసులు

ఈ వ్యాధికి రాష్ట్రంలోని 31 ప్రభుత్వ బోధనాస్పత్రులు, సెకండరీ కేర్ ఆస్పత్రుల్లో ఉచిత స్క్రీనింగ్ వైద్యసేవలు అందిస్తున్నారు. గత నెల 17 నుంచి 23వ తేదీ మధ్య ఈ సెంటర్‌లలో 337 హెపటైటిస్–బి,సి కేసులు బయటపడ్డాయి. హెపటైటిస్–బి కేసులు అత్యధికంగా కర్నూలులో 49, విశాఖలో 40, గుంటూరు, తిరుపతిల్లో ఒక్కోచోట 29 చొప్పున నమోదయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా నమోదైన 68 సి కేసుల్లో 25 శాతం అంటే 17 కేసులు కర్నూలు జీజీహెచ్‌లో బయటపడ్డాయి. వ్యాధి నియంత్రణా చర్యల్లో భాగంగా హెపటైటిస్–బి నుంచి రక్షణ కల్పించేలా టీకా పంపిణీని గత ప్రభుత్వంలోనే ప్రారంభించారు.

గ్రామీణ పాలనా వ్యవస్థను చక్కదిద్దుతాం

డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్



కాకినాడ సిటీ: స్థానిక సంస్థలను ఆర్థికంగా బలోపేతం చేసి, గ్రామీణ పాలనా వ్యవస్థను చక్కదిద్దుతామని ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, పర్యావరణం, అడవులు, శాస్త్ర, సాంకేతిక శాఖల మంత్రి పవన్‌కళ్యాణ్ స్పష్టం చేశారు. తన పరిధిలోని శాఖలకు సంబంధించి కాకినాడ జిల్లా అధికారులతో కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన సమీక్షించారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా జనావాసాల్లో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. రాజమహేంద్రవరంలోని విజ్ఞాన కేంద్రాన్ని త్వరలో ప్రారంభించడానికి సిద్ధం చేయాలని కోరారు. ఆదికవి నన్నయ వర్సిటీ పరిధిలోని కళాశాలల్లో పర్యావరణ మార్పుల దుష్ప్రభావాలు, నివారణపై పరిశోధనకు ప్రోత్సహించాలని సూచించారు.

పోలీసు యంత్రాంగానికి అభినందన ..

కేసు నమోదు చేసిన 72 గంటల్లోనే రాష్ట్ర పోలీసులు సమస్య పరిష్కరించి తమ సమర్థత చాటుకున్నారని పవన్‌కళ్యాణ్ పోలీసులను అభినందించారు. పవన్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. గత నెలలో తాను మంగళగిరి వెళ్తుండగా భీమవరానికి చెందిన ఓ బాలిక 9 నెలలుగా కనిపించడం లేదంటూ తనకు తల్లి చెప్పుకుందన్నారు. ఈ విషయాన్ని ఒక కేస్ స్టడీగా తీసుకుని దర్యాప్తు చేయాలని మాచర్ల, విజయవాడలోని పోలీసు అధికారులకు సూచించానని చెప్పారు. పోలీసులు ప్రత్యేక బృందాలతో తనిఖీ చేయగా.. జమ్మూ కశ్మీర్‌లో ఆ బాలికను గుర్తించారన్నారు. డీజీపీ, ఇతర పోలీస్ అధికార యంత్రాంగాన్ని అభినందిస్తున్నట్లు తెలిపారు.



సాధారణమైన నిత్యకృత్యాల్లో కూడా ఏకాగ్రత ఎప్పుడూ అవసరమే. మనం ఏ పని చేస్తున్నా, దాన్ని విజయవంతం చెయ్యాలంటే మనసు కేంద్రీకరించకుండా అది సాధ్యపడదు. అందుకే బుద్ధుడు ఏకాగ్రతను ఉత్తములకుండే లక్షణాల్లో ఒకటిగా పేర్కొన్నాడు.
– బుద్ధదాస భిక్కు (బౌద్ధ ధర్మం)

సాక్షి

బుధవారం, 3 జూలై 2024

అంతా సిద్ధమేనా?

భారత న్యాయశాస్త్ర చరిత్రలో మొన్న జూలై 1న ఒక కొత్త అధ్యాయం మొదలైంది. బ్రిటీషు కాలం నాటి నేర చట్టాల స్థానంలో మూడు కొత్త చట్టాలను మోదీ సారథ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం అమలులోకి తెచ్చింది. భారత శిక్షాస్మృతి– 1860, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్– 1973, భారతీయ సాక్ష్యాల చట్టం – 1872... ఈ మూడింటి బదులు 'భారతీయ న్యాయ సంహిత', 'భారతీయ నాగరిక్ సురక్షా సంహిత', 'భారతీయ సాక్ష్య అధినియమ్'లు సోమవారం నుంచి ఆచరణలోకి వచ్చాయి. అయితే, న్యాయకోవిదుల మొదలు సాధారణ కక్షిదారుల వరకు ఈ కొత్త చట్టాలపై భిన్న స్వరాలు వినిపిస్తున్నారు. నేరన్యాయవ్యవస్థను ఆధునికీకరించడంలో ఈ కొత్త చట్టాలు గణనీయమైన ముందడుగు అని కొందరు ప్రశంసిస్తుంటే, మరికొందరు పాతవాటికి పైపై మెరుగులు దిద్ది, అమానుషంగా మార్చారని విమర్శిస్తున్నారు. పోలీస్‌స్టేషన్ల నుంచి కోర్టుల దాకా అన్నిటా పనితీరును మార్చేసి, సామాన్యులపై పెను ప్రభావం చూపే ఈ శాసనాలపైనే ఇప్పుడు దేశమంతటా చర్చ సాగుతోంది.

కొత్త నేర చట్టాల వ్యవహారం సహజంగానే అధికార బీజేపీకీ, ప్రతిపక్ష కాంగ్రెస్‌కూ మధ్య మాటల యుద్ధానికి దారి తీసింది. వలసవాద పాలన తాలూకు అవశేషాలను వదిలించుకొనే ఈ ప్రయత్నం దేశపురోగతికీ, స్థితిస్థాపకతకూ ప్రతీక అన్నది బీజేపీ మాట. కాంగ్రెస్ మాత్రం గడచిన ప్రభుత్వ హయాంలో పార్లమెంట్‌లో ఏకంగా 146 మంది ప్రతిపక్ష సభ్యులు సస్పెండైన వేళ, కేవలం మూజువాణీ ఓటుతో బలవంతాన ఈ చట్టాలకు ఆమోదముద్ర వేశారనీ, పార్లమెంటరీ వ్యవస్థలో ఈ రకమైన 'బుల్‌డోజర్ న్యాయాన్ని' తమ ప్రతిపక్ష కూటమి సహించబోదనీ పేర్కొంది. శతాబ్ద కాలానికి ముందెప్పుడో బ్రిటీషు హయాంలో చేసిన చట్టాలు శిక్షల మీద ప్రధానంగా దృష్టి పెడుతుంటే, ఈ కొత్త చట్టాలు మటుకు అందరికీ న్యాయం, హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యమిస్తాయనేది అధికార పక్షం కథనం. కానీ, ఆ మాటలతో ప్రతిపక్షాలే కాదు... చివరకు పలువురు న్యాయశాస్త్ర నిపుణులు సైతం విభేదిస్తుండడం గమనార్హం. ఇంకా చెప్పాలంటే, సరికొత్త శాసనాలు దుర్వినియోగమయ్యే ప్రమాదం ఎంతైనా ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిజానికి, మారుతున్న సమాజ పరిస్థితులు, అవసరాలకు తగ్గట్టుగా పాతకాలపు చట్టాలను మార్చాలన్న ఆలోచన మంచిదే. ప్రస్తుతం విచారణలోని ఖైదీలు లెక్కకు మిక్కిలిగా జైళ్ళలో మగ్గిపోతున్నారు. అసంఖ్యాకంగా బాధితులు న్యాయం కోసం ఏళ్ళ తరబడి నిరీక్షిస్తున్నారు. లక్షల కొద్దీ కేసులు కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో నేర న్యాయవ్యవస్థలో సంస్కరణలు అత్యవసరం. అయితే, అందుకు గడచిన మోదీ సర్కార్ హడావిడిగా అనుసరించిన పద్ధతి, తగిన చర్చకు తావివ్వకుండా పార్లమెంట్‌లో చూపిన ఆధిపత్యం, చేసిన మంచి సూచనల్నీ – చెప్పిన అభ్యంతరాలను సైతం పట్టించుకోని తెంపరితనంతోనే అసలు చిక్కంతా! అసలు 2020 జూలైలోనే కేంద్ర హోమ్ శాఖ ఏర్పాటు చేసిన నిపుణుల సంఘం వైవాహిక అత్యాచారం మొదలు కారుణ్య మరణాన్ని చట్టబద్ధం చేయడం, రాజద్రోహ నేరంపై పునస్సమీక్ష లాంటి అనేక అంశాలపై పౌరులకు వివరమైన ప్రశ్నావళిని జారీ చేసింది. అయితే, కరోనా కాలంలోనే సంప్రతింపుల ప్రక్రియలో అధిక భాగం జరిగింది. అడిగిన, ఆశించిన భారీ మార్పులేమీ లేకుండానే కొత్త చట్టాలు వచ్చేశాయి.

ఎఫ్ఐఆర్ నమోదుకు ముందు ఏకంగా 14 రోజుల పాటు పోలీసు అధికారి ప్రాథమిక దర్యాప్తు చేయవచ్చనడం, పోలీసు కస్టడీ కాలవ్యవధిని 15 రోజుల నుంచి అనేక వారాలు పెంచేయడం, చేతులకు బేడీలు సహా కొన్ని అంశాల్లో పోలీసులకు అపరిమిత అధికారాలు కట్టబెట్టడం లాంటివి ఇప్పటికే వివాదాస్పదమయ్యాయి. అలాగని కొత్త చట్టాల్లో ఏ మంచీ లేదనలేం. కొన్ని ముందడుగులు పడ్డాయి. కొన్ని రకాల నేరాల్లో శిక్షకు ప్రత్యామ్నాయంగా సామాజిక సేవ చేయడాన్ని ప్రవేశపెట్టారు. అలాగే, వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా విచారణలకూ వీలు కల్పించారు. త్వరితగతిన విచారణలు పూర్తయ్యేలా నిర్ణీత కాలవ్యవధులను నిర్ణయించడం మరో మంచి ప్రయత్నం. అయితే, చట్టాలకు అన్ని ప్రాంతాలకు అర్థమయ్యే ఇంగ్లీష్ పేర్లు పెట్టనే లేదు. ప్రాంతీయ భాషల్లో అనువాదం పూర్తి కానేలేదు. రాష్ట్రాలు స్థానికంగా అవసరమైన మార్పులు చేసుకోవచ్చంటున్నా, చిక్కులున్నాయి.

ఏమైనా, కొత్త చట్టాల అమలు సైతం సవాలే. దశాబ్దాలుగా అలవాటైపోయిన సెక్షన్లు, చట్టాలను ఒక్కసారిగా మార్చేయడం ఇతర సమస్యలు తెచ్చింది. ఏ నేరానికి ఏ సెక్షన్ ఎంతమేరకు వర్తిస్తుందో ఇప్పటికిప్పుడు చటుక్కున అర్థం కాని పరిస్థితి. పోలీసు, న్యాయ వ్యవస్థలు కొత్త పద్ధతులకు ఏ మేరకు సుశిక్షితమైనదీ చెప్పలేం. అన్నీ అర్థమై, అలవాటయ్యే వరకు చట్టాల అమలు సంస్థలు, జడ్జీలు, లాయర్ల నుంచి కక్షిదారుల వరకు అందరికీ గందరగోళమే. అలాగే జూలై 1కి ముందు కేసులను పాత చట్టాలతో, ఆ తరువాతి కేసులను కొత్త చట్టాలతో విచారించాల్సి ఉంటుంది. ఇప్పటికీ లక్షల కొద్దీ పాత కేసులు పెండింగ్‌లో ఉన్నందున చాలాకాలం రెండు రకాల చట్టాలనూ అనుసరించాల్సి వస్తుంది. ఇది మరో పెద్ద చిక్కు. అలాగే, ఏ చట్టాలైనా వ్యక్తిగత స్వేచ్ఛ, పౌరహక్కులకు అండగా నిలిస్తేనే వాటికి విలువ. కొత్త చట్టాలపై ఆ విషయంలోనూ అనేక అనుమానాలున్నాయి. కాబట్టి వీటిపై పార్లమెంట్‌లోనే కాదు... పౌర సమాజంలోనూ విస్తృత చర్చ జరగనివ్వాలి. ఆ స్వరాలకు పాలకులు చెవి ఒగ్గాలి. లోపాలను సరిచేయాలి. వ్యవస్థలో సంస్కరణ ఒక్కరోజులో, ఒక్కసారిగా జరిగేది కాదని గుర్తించి, మార్పులు చేర్పులతో సాగాలి. అందుకిది మొదటి అడుగు అవ్వాలి.

పరిశోధనల్లో చైనాతో పోటీ పడగలమా?

విశ్లేషణ



దినేశ్ సి. శర్మ

అంతర్జాతీయంగా ప్రతిష్ఠాత్మక జర్నల్స్ అయిన 'నేచర్', 'ఎకనమిస్ట్'లు శాస్త్రరంగంలో చైనా అత్యంత శక్తిమంతంగా ఎదుగుతోందని ప్రకటించాయి. సైన్స్, టెక్నాలజీ రంగాల్లో మూడో అతిపెద్ద శక్తిగా భారత్ కొనసాగిన విషయం తెలిసిందే. అణు, అంతరిక్ష, వ్యాక్సిన్ అభివృద్ధి రంగాల్లో భారత్ రాణించిందన్నదీ వాస్తవమే. కానీ చైనా పలు కీలక రంగాల్లో భారత్‌తోపాటు అమెరికా, యూరప్‌లను సైతం అధిగమించింది. అంతరిక్ష రంగంలో చైనా మన కన్నా కనీసం పదేళ్లు ముందుంది. 2003లో తొలి మానవ సహిత అంతరిక్ష యాత్ర జరపడమే కాదు, సొంతంగా అంతరిక్ష కేంద్రాన్ని నిర్మిస్తోంది. ప్రపంచ టాప్–10 జాబితాలో భారతీయ పరిశోధన సంస్థలు లేవన్నది గమనార్హం. నిద్రాణంగా ఉన్న భారత్‌కు చైనా పురోగతి ఓ మేలుకొలుపు కావాలి.

ఉన్నత విద్యా రంగంలో భారత్ గతంలో ఎన్నడూ లేని స్థాయి సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. వైద్యం, పరిశోధన రంగాల్లో ప్రవేశానికి నిర్వహిస్తున్న పరీక్షల పద్ధతి, ప్రామాణికత రెండూ లీకేజీల పుణ్యమా అని ప్రశ్నార్థకంగా మారాయి. నీట్‌తోపాటు భారతీయ విశ్వవిద్యాలయాల్లో, జాతీయ పరిశోధన సంస్థల్లో రీసెర్చ్ ఫెలోషిప్ కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశ్న పత్రం కూడా లీక్ అయ్యింది. పరిశోధన రంగంలో ప్రాథమిక స్థాయిలో చేరే విద్యార్థుల కోసం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్, ఐఐటీల వంటి సంస్థలు కూడా నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్‌పై ఆధారపడుతూంటాయి. పీహెచ్‌డీల్లో ప్రవేశానికి ఈ పరీక్షలో అర్హత సాధించడం తప్పనిసరి. బోధన వృత్తుల్లో స్థిరపడే వారికి కూడా. ఈ పరీక్షలను విశ్వసనీయతతో, సకాలంలో నిర్వహించడం భారతదేశ ఉన్నత విద్య, పరిశోధన రంగాలపై ప్రత్యక్షంగా ప్రభావం చూపుతుందన్నది ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఒకపక్క ఈ అనూహ్య పరిస్థితిని ఎదుర్కొంటుండగా, ఇంకోపక్క అంతర్జాతీయ స్థాయిలో పరిశోధన రంగంలో వేగంగా మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఈ మార్పుల్లో చైనా కంటే భారత్ బాగా వెనుకబడిపోతూండటం గమనార్హం.



పరిశోధన పత్రాల్లో టాప్

ప్రపంచంలో ఒక దేశపు శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాల సత్తాను నిర్ధారించేది ఉన్నత విద్య, పరిశోధన రంగాల కోసం ఏర్పాటు చేసిన మౌలిక సదుపాయాల విస్తృతి ఎంత? అన్నది. ఎంత ఉత్పత్తి అవుతోంది? నాణ్యత ఏమిటి? అన్నది నిర్ధారించేందుకు చాలా మార్గాలున్నాయి. పరిశోధన వ్యాసాల ప్రచురణ, సాధించిన పేటెంట్లు, నోబెల్ వంటి అంతర్జాతీయ అవార్డులు, పారిశ్రామిక రంగానికి బదిలీ అయిన టెక్నాలజీలు, పరిశోధనల ద్వారా సమాజానికి ఒనగూరిన లబ్ధి... ఇలా చాలా మార్గాలున్నాయి. పరిశోధన పత్రాల ప్రచురణే ప్రధాన అంశంగా ఏటా రీసెర్చ్ రంగంలో అగ్రస్థానంలో ఉన్న వారి జాబితాను 'నేచర్' జర్నల్ ప్రచురిస్తుంటుంది. ఈ జాబితాలో అత్యున్నత స్థాయి పరిశోధన ఫలితాల ఆధారంగా 500 సంస్థలు ఉంటాయి. ఏటా జనవరి 1 నుంచి డిసెంబరు 31 మధ్య పరిణామాలను పరిగణనలోకి తీసుకుంటారు. మొత్తం 145 అంతర్జాతీయ జర్నళ్లలో ప్రచురితమైన పరిశోధన పత్రాలను పరిశీలించి, ఒక స్వతంత్ర శాస్త్రవేత్తల బృందం ఈ జాబితాను సిద్ధం చేస్తుంది.

నేచర్ ప్రచురించిన తాజా జాబితాలో దేశాల పరిశోధన సామర్థ్యాల ఆధారంగా అమెరికా, జర్మనీ, యూకే, జపాన్, ఫ్రాన్స్, కెనడా, దక్షిణ కొరియాలను కూడా అధిగమించి చైనా అగ్రస్థానంలోకి చేరింది. భారత్ తొమ్మిదో స్థానంలో ఉంటూ... టాప్ 10 దేశాల్లో ఒకటిగా ఉన్నామన్న సంతృప్తి మాత్రమే మనకు మిగిల్చింది. భారత్ వంతు గత ఏడాది చైనా వంతు కంటే ఎక్కువ కావడం కూడా గమనార్హం. అయితే సంస్థల స్థాయిలో పరిశోధన పత్రాలను పరిశీలిస్తే నిరాశే మిగులుతుంది. అంతర్జాతీయంగా టాప్ పది పరిశోధన సంస్థల్లో ఏడు చైనావి కావడం... హార్వర్డ్ (రెండో స్థానం), మ్యాక్స్ ప్లాంక్ సొసైటీ (మూడో స్థానం), ఫ్రెంచ్ నేషనల్ సెంటర్ ఫర్ సైంటిఫిక్ రీసెర్చ్ (ఏడో స్థానం) మాత్రమే టాప్ 10లోని ఇతర సంస్థలు కావడం గమనార్హం. మసాచూసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీలు సైతం 14, 15 స్థానాల్లో నిలిచాయి. చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అగ్రస్థానంలో ఉంది.

టాప్–10లో లేము!

టాప్ సంస్థల్లో భారతీయ పరిశోధన సంస్థలు చాలా దిగువన ఉన్నాయి. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ 174వ స్థానంలో ఉంటే, ఐఐటీ–బాంబే 247లో ఉంది. కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ 275లో, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ 283వ స్థానంలోనూ ఉన్నాయి. హోమీ భాభా నేషనల్ ఇన్‌స్టిట్యూట్(296), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్–కోల్‌కతా (321), ఐఐటీ–గౌహతి (355), ఇండియన్ అసోసియేషన్ ఫర్ కల్టివేషన్ ఆఫ్ సైన్స్(363), ఐసర్–భోపాల్(379), ఐఐటీ–కాన్పూర్(405), ఐఐటీ–మద్రాస్(407), ఐఐటీ–ఢిల్లీ (428), ఐసర్–పుణె (439), జవహర్‌లాల్ నెహ్రూ సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ సైంటిఫిక్ రీసెర్చ్(450), అకాడమీ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇన్నొవేటివ్ రీసెర్చ్(487) ర్యాంకింగ్ కూడా దిగువలోనే ఉండటం గమనార్హం.

ర్యాంకింగ్‌ల మాట ఇలా ఉంటే, పరిశోధనలు చేస్తున్న రంగాల విషయం చూద్దాం. భౌతిక, రసాయన, భూ, పర్యావరణ రంగాల్లో చైనా అగ్రస్థానంలో ఉండగా... అమెరికా, యూరప్ రెండూ జీవ, వైద్య శాస్త్రాల్లో ముందంజలో ఉన్నాయి. అప్లైడ్ సైన్సెస్ రంగంలోనూ చైనా నుంచే అత్యధిక పరిశోధన పత్రాలు ప్రచురితమవుతుండటం విశేషం.

చైనా కొన్ని భారీ సైన్స్ ప్రాజెక్టుల్లో పెట్టుబడులు కూడా పెట్టింది. ప్రపంచంలోనే అతిపెద్ద ఫిల్డ్–అపెర్చర్ రేడియో టెలిస్కోపు అలాంటిదే. కృష్ణ పదార్థం ఉనికిని గుర్తించేందుకు చేపట్టిన భారీ భూగర్భ పరిశోధన ఇంకోటి. అలాగే క్వాంటమ్ కంప్యూటింగ్ రంగంలోనూ పలు చైనా సంస్థల్లో ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయి. అంతరిక్ష రంగం విషయానికి వస్తే... చైనా మన దేశం కంటే కనీసం పదేళ్లు ముందుందని చెప్పాలి. 2003లో తొలి మానవ సహిత అంతరిక్ష యాత్ర జరపడమే కాదు, సొంతంగా అంతరిక్ష కేంద్రాన్ని నిర్మిస్తోంది. ఇటీవలే జాబిల్లి నుంచి రాతి నమూనాలను విజయవంతంగా వెనక్కు తెచ్చిన రోబోటిక్ మిషన్ చేపట్టింది.

మన స్పందన ఎలా ఉండాలి?

శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన రంగాల్లో చైనా పురోగతికి మనం ఎలా స్పందించాలి? పదేళ్లుగా అధికారంలో ఉన్న ప్రభుత్వం చేస్తున్నట్లే వీటిని తిరస్కరించడం సులువైన పని అవుతుంది. జాబితా తయారీలో పలు లోటుపాట్లు ఉన్నాయని చెప్పవచ్చు. అయితే ఇది వాస్తవ పరిస్థితిని మార్చదు. ఇంకో పద్ధతి కూడా ఉంది. ఈ జాబితాను ఉన్నది ఉన్నట్టుగా అంగీకరించడం. టాప్ దేశాల జాబితాలో భారత్ కూడా ఉంది కాబట్టి, దాని ఆధారంగా మరింత ముందుకు వెళ్లేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేయాలి. చైనా ఈ ఘనతలన్నీ సాధించేందుకు ఏం చేసింది? ఎక్కడ తప్పటడుగులు వేసిందన్నది నిజాయితీగా పరిశీలించి గుణపాఠాలు నేర్చుకోవాలి. 'నైన్ లీగ్' లేదా 'ప్రాజెక్ట్ 211'లో భాగంగా దేశవ్యాప్తంగా యూనివర్సిటీలు, ప్రపంచస్థాయి పరిశోధన శాలలను అభివృద్ధి చేసేందుకు చైనా భారీగా నిధులు ఖర్చు పెడుతోంది. ఐసర్ వంటి సంస్థల అభివృద్ధికి భారత్ చేసిన ప్రయత్నంతో ఎన్నో లాభాలు వచ్చినా ఈ విషయంలో చేయాల్సింది ఇంకా మిగిలే ఉంది. పరిశోధన పత్రాల ప్రచురణకు చైనా నగదు బహుమతులను ప్రకటించి తప్పు చేసిందని చెప్పాలి. దీనివల్ల అనైతిక పద్ధతులు పెరిగిపోయాయి. భారత్ ఇలాంటి పని చేయకుండా ఉండటం అవసరం.

భారత్‌లో శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన రంగాల్లో పురోగతిని అడ్డుకుంటున్న కొన్ని సాధారణ విషయాల్లో జీడీపీలో కొంత శాతాన్ని ఈ రంగాలకు కేటాయించకపోవడం కూడా ఉంది. నిధుల పంపిణీ పద్ధతులు, కొత్త పరిశోధన సంస్థల ఏర్పాటు, విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలకు ప్రోత్సాహం వంటివి స్తంభించిపోయి ఉన్నాయి. నేషనల్ సైన్స్ అకాడమీలు, ప్రిన్సిపల్ సైంటిఫిక్ అడ్వైజర్ కార్యాలయం, టెక్నాలజీ ఫోర్‌కాస్టింగ్ ఏజెన్సీ వంటివి కూడా ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న సెల్ఫీ పాయింట్ల వద్ద విజయోత్సవాలను నిర్వహించడంలో బిజీగా ఉండిపోయాయి. నిద్రాణంగా ఉన్న ఇలాంటి వారందరికీ చైనా పురోగతి ఓ మేలుకొలుపు కావాలి.

వ్యాసకర్త సైన్స్ అంశాల వ్యాఖ్యాత
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ద్వేషిస్తున్నారా?



హిందువు నా శత్రువు కాదు. హిందువుల్లోని ఛాందసులను ఎదుర్కొనే నైతిక అధికారం నాకు ఎప్పుడు వస్తుందంటే, ముందు నా సమాజంలోని ఛాందసులకు వ్యతిరేకంగా నేను నిలబడినప్పుడు. నిజంగా వంద కోట్ల మంది హిందువులు ఇరవై కోట్ల మంది ముస్లింలను అణిచివేస్తున్న దేశం ఇండియా అని మీరు గట్టిగా నమ్ముతున్నారంటే, మీరు హిందూ ద్వేషి.

– ఖాలిద్ బేగ్, యూట్యూబర్

మాట్లాడినట్టు వినిపించండి!



ఎంపీల ఆంగ్ల ప్రసంగాల ఒరిజినల్ ఆడియోను మ్యూట్ చేస్తూ, వాటిని హిందీలోకి అనువదించి సంసద్ టీవీ ప్రసారం చేస్తోందని గమనించాను. ఈ కొత్త పద్ధతి సమస్యాత్మకం. అది ఎంపీల గొంతును అణిచివేస్తుంది. ఎన్నికైన సభ్యులు తాము ఎంచుకున్న భాషల్లో వినిపించే హక్కును నిరాకరిస్తుంది. ఇది నిరంకుశత్వం.

– సుప్రియా సూలే, ఎన్సీపీ ఎంపీ

అమెరికా రాజు



ఒకవేళ ట్రంప్ (మళ్లీ అమెరికా అధ్యక్షుడిగా) గెలిస్తే, ఆయన్ని మీరు 'కింగ్ ట్రంప్ 1' అని పిలవొచ్చు. ఆయనకు అది నచ్చుతుంది.

– స్టీఫెన్ కింగ్, రచయిత

అన్నది వేరు!



ఇది అసాధారణమే కావొచ్చు గానీ, నేను రాహుల్ గాంధీ వైపు నిలబడక తప్పడం లేదు. ఆయన హిందూయిజం మీద దాడి చేయలేదు. యావత్ హిందూయిజానికి కేవలం బీజేపీ, ఆరెస్సెస్, నరేంద్ర మోదీలే ప్రతినిధులు కారు... కాలేరు అన్నారు.

– తవ్లీన్ సింగ్, కాలమిస్ట్



మనవి కావు!

జీవిత పాఠాలు: ఇతరుల వైఫల్యాలు మీ విజయాలు కాదు... అలాగే ఇతరుల విజయాలు మీ వైఫల్యాలు కూడా కాదు.

– శేఖర్ కపూర్, దర్శకుడు

నిర్వహణను పునస్సమీక్షించాలి

వైద్య విద్యను అభ్యసించాలని లక్షలాదిమంది విద్యార్థులు దేశవ్యాప్తంగా రాసిన 'నీట్' పరీక్ష నిర్వహణలో అనేక అవకతవకలు జరగడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర వేదనలో మునిగిపోయారు. అసలు దేశం మొత్తానికీ ఒకే ప్రవేశపరీక్ష పెట్టడమనే విధానమే తప్పని ఈ సందర్భంగా విమర్శలు వస్తున్నాయి.

మొదటిసారిగా 2010లో భారతీయ వైద్య మండలి 'నీట్' పరీక్షకు ప్రకటన విడుదల చేసింది. కానీ ఈ పరీక్ష నిర్వహణ సరికాదని న్యాయస్థానం అడ్డుకుంది. దీంతో భారతీయ వైద్య మండలి చట్టం– 1956లో మార్పులు చేసి, 'సెక్షన్ 10 ఈ' ద్వారా 'నీట్' పరీక్ష నిర్వహించటానికి వైద్య మండలికి సర్వ హక్కులు కల్పించింది నాటి ఎన్డీఏ ప్రభుత్వం. తత్ఫలితంగా 2016 నుండి పరీక్షను నిర్వహిస్తూ వస్తున్నారు. 2016లో ఈ మార్పును వ్యతిరేకిస్తూ వేసిన కేసును కొట్టి వేయటమే కాక, రాష్ట్ర ప్రభుత్వాలు నీట్‌కు ప్రత్యామ్నాయంగా తాము పరీక్షలు నిర్వహిస్తామంటే కుదరదు అన్నది న్యాయస్థానం. 2020లో మైనారిటీ సంస్థల గోడు కూడా వినకుండా కోర్టు నీట్ నిర్వహణను గట్టిగా సమర్థించింది.


నీట్ పరీక్ష నిర్వహణ వల్ల లాభాలు లేకపోలేదు. అప్పటి దాకా రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రైవేటు విశ్వ విద్యాలయాలు తమ సొంత ప్రవేశ పరీక్షల ద్వారా విద్యార్థులకు వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తూ వచ్చాయి. అనేక పరీక్షలు రాయలేక విదార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యలకు కూడా పాల్పడిన సందర్భాలు ఉన్నాయి. దేశవ్యాప్తంగా ఒకే పరీక్ష వల్ల ఈ ఒత్తిడి తగ్గింది. కాని పొరపాటున ఈ పరీక్ష రాయలేక పోతే విద్యార్థి ఒక విద్యా సంవత్సరం అంతా నష్ట పోవలసిందే. అదే విధంగా విద్యార్థికి ఇష్టమైన కాలేజీలలో ప్రవేశం పొందలేక పోవచ్చు. రెండు మూడు పరీక్షలుంటే, తనకిష్టమైన కాలేజీలో చేరే అవకాశం ఉండేది. అందుకే ఇటువంటి దేశ వ్యాప్త ఏక పరీక్షలపై విస్తృత స్థాయిలో మేధామథనం జరగాలని అంటున్నారు. ఒకే ఒక్క పరీక్ష ద్వారా విద్యార్థి యోగ్యుడా కాదా అనేది నిర్ణయించటం సరైనదేనా? వందల కోట్ల జనాభా ఉన్న భారత దేశం లాంటి దేశంలో ఇంతకన్నా మార్గం లేదని వాదించే వారున్నారు. కోర్టులు, ప్రభుత్వాలు సైతం అర్హత కలవారిని ఎంపిక చెయ్యటానికి 'నీట్' పరీక్ష ఉత్తమ పద్ధతి అని అనుకుంటున్నాయి.

నిజానికి నీట్ పరీక్ష నిర్వహణ వల్ల గ్రామీణ ప్రాంత విద్యార్థులు బాగా నష్ట పోతున్నారు. ఇంగ్లీషు మీడియంలో చదివిన విద్యార్థులదే నీట్‌లో పైచేయిగా ఉంటోంది. సీట్లు పొందడంలో వీరి శాతం 85.12 శాతం నుండి 95.01 శాతానికి పెరగగా, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వారి సంఖ్య 1.2 శాతం నుండి 0.6 శాతానికి పడిపోయింది. పేద, దిగువ మధ్యతరగతి వర్గాలవారు 47.42 శాతం నుండి 41.05 శాతానికి పడిపోగా, గ్రామీణ ప్రాంత విద్యార్థులు 61.4 శాతం నుండి 50.8 శాతానికి పడిపోయారు.

ఇన్ని లోపాలు, నష్టాలను దృష్టిలో పెట్టుకొని... మరొక్క సారి నీట్ పరీక్ష నిర్వహణ సబబేనా అన్న అంశంపై విస్తృత స్థాయిలో చర్చించాల్సిన అవసరం ఎంతైనా వుంది.

– ఈదర శ్రీనివాసరెడ్డి,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్

తస్సాదియ్యా... మన రోశయ్య!



రేపు రోశయ్య జయంతి

విషయ పరిజ్ఞానం, లెక్కలు, తేదీలు, చమత్కారం, సమయ స్ఫూర్తి, ముక్కుసూటిగా ప్రవాహ వేగంతో మాట్లాడే లక్షణం, స్పష్టమైన ఉచ్చారణ, గంభీరమైన కంఠస్వరం వంటి లక్షణాలు మాజీ ముఖ్యమంత్రి, గవర్నర్ కొణిజేటి రోశయ్యకు ఓ ప్రత్యేకతను సంతరించిపెట్టాయి. శాసన సభలోనూ, బయటా ఆయన మాట్లాడిన ప్రతిమాటా ఒక చెణుకే.

ఓసారి రోశయ్య అల్లుడు ఒక విందులో తన మిత్రులతో ఎంజాయ్ చేస్తూ టీవీ ఛానెళ్లకు చిక్కారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండడంతో టీడీపీ సభ్యుల ఆనందానికి అవధుల్లేవు. సభలో ఆ విషయాన్ని ప్రస్తావిస్తూ మూకుమ్మడిగా ఉత్సాహంతో రెచ్చిపోయారు. చివరగా రోశయ్య తాపీగా నిలబడ్డారు. 'అధ్యక్షా... ఎన్టీ రామారావు గారికీ, నాకూ దేవుడు మంచి అల్లుళ్ళనివ్వలేదు. ఏంచేస్తాం అధ్యక్షా' అనేసి ఠక్కున కూర్చున్నారు. పాపం... తెలుగు తమ్ముళ్లు నవ్వలేరు, నవ్వకుండా ఉండలేరు. ఇక చంద్రబాబు పరిస్థితి సరే సరి! మిగతా సభ్యుల నవ్వులతో ఆనాటి సభ వెల్లివిరిసింది.

మరోసారి సభలో చంద్రబాబు ఆరోపణలపై ప్రతిస్పందిస్తూ ... 'అధ్యక్షా... స్వర్గీయ ఎన్టీ రామారావు గారిని నేను డ్రామా కంపెనీవాడు అనలేదు. ముందు ఆయన డ్రామాలు వేశాడు. తరవాత సినిమాల్లోకి వెళ్లి ప్రముఖ నటుడయ్యాడు అన్నానంతే. మీరు (చంద్రబాబును ఉద్దేశించి) ఒకప్పుడు ఆయన్ను గౌరవించారు. మధ్యలో పోయింది. తర్వాత మళ్ళీ వచ్చింది... సరే, నన్ను తెలివితేటలు గలవాణ్ణని అన్నారు. నేను తెలివితేటలు గలవాణ్ణయితే ఇలా ఉంటానా? ఒంటరిగా ఉన్నప్పుడెప్పుడో అదను చూసి రాజశేఖర రెడ్డిని ఒక్కపోటు పొడిచి ఆ సీట్లో కూర్చునేవాడిని...' అన్నారు. అంతే... చంద్రబాబు, ఆ పార్టీ సభ్యులు కిక్కురుమంటే ఒట్టు.

వైఎస్ రాజశేఖర్ రెడ్డికి ఇష్టమైన ఓ చెణుకు గురించి ఉండవల్లి అరుణ్ కుమార్ ఇలా చెప్పారు: ''రోశయ్య ఓసారి రాజమండ్రిలో ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టినప్పుడు చంద్రబాబు ప్రభుత్వం ఓవర్ డ్రాఫ్టులకు వెళ్లడంపై మాట్లాడుతూ, ఇది రాష్ట్రానికి మంచిది కాదు–అప్పుల ఊబిలోకి పోతాం అన్నారు... సరే వీలే కర్లు తర్వాత ఆయన మాటల్ని మరో ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఫైనాన్స్ మినిస్టర్ (యనమల రామృష్ణుడు)తో అని, దీనికేమంటారు? అని అడిగారు. అందుకాయన మేమేమైనా తప్పు చేస్తున్నామా, ఫెసిలిటీ ఉంది, వాడుకుంటున్నాం. దాని కెందుకింత గొడవ? అన్నారు. ఈ సంగతి ఇంకో ప్రెస్ కాన్ఫరెన్సులో రోశయ్యతో చెప్పి, దీనిపై మీరేమంటారు? అని అడిగారు. దీనికి రోశయ్య 'చూడు నాయనా... ప్రతి ఊరికీ శ్మశానం ఫెసిలిటీ ఉంటుంది. ఉంది కదాని వాడుకోం కదా, జీవుడు పోయిన తర్వాతే అక్కడికి పట్టుకెళ్ళేది' అని జవాబిచ్చారు.

చెణుకులు విసరడమే కాదు అణకువలోనూ, అందరితో కలివిడిగా ఉండడంలోనూ ఆయన పెట్టింది పేరు. ముఖ్యమంత్రి పదవినుంచి వైదొలగుతూ తన పేషీలో సెక్రెటరీ, పీ.ఏ, ఇతర ఉద్యోగులందరి సీట్ల దగ్గరకూ వెళ్లి 'నా టెర్మ్ అయిపోయింది. కృతజ్ఞతలు. నా వల్ల ఏమైనా ఇబ్బందిపడి ఉంటే ఏమీ అనుకోకండి' అని వినమ్రంగా చెప్పారు రోశయ్య.

శాసన మండలి సభ్యునిగా ఎన్టీఆర్‌ను ఉక్కిరిబిక్కిరి చేసి, మండలి రద్దు చెయ్యాలని నిర్ణయం తీసుకునేలా చేశాడని నాటి విశ్లేషకులు అంటుంటారు. రోశయ్య ఏ పదవి చేపట్టినా ఉద్యోగంలా భావించారు. అసంతృప్తిగా పని చేయడం ఆయనకు ఇష్టం ఉండేది కాదు. అవినీతి మచ్చ లేని నిలువెత్తు నిజాయితీ ఆయన. ప్రత్యర్థులు సైతం ఒప్పుకునే సత్యమిది. రాజకీయాల్లో ఆయన స్థానం ఎప్పటికీ భర్తీ చేయలేనిది.

– తిరుమలగిరి సురేందర్,
ప్రెస్ అకాడమీ మాజీ ఛైర్మన్

నిరుపమాన దీక్షాశక్తి

భారతీయ సంస్కృతిని, దేశభక్తిని, జాతీయ భావాన్ని ప్రతి ఎదలో ప్రతిధ్వనించేట్లు, ప్రతి నిత్యం స్మరించేట్లు ప్రచారం చేసి యావత్ జాతినంతా మేల్కొలిపిన మహనీయుడు స్వామి వివేకానందుడు. ఆయన గొప్ప ఉపన్యాసకుడు. ఆయన్ని ఆ రోజులలో 'లైట్నింగ్ ఆరేటర్' అని పిలిచేవారు. 1893 సెప్టెంబర్‌లో అమెరికాలోని చికాగోలో జరిగిన మహాసభల్లో ఆయన చేసిన ప్రసంగం ఈ రోజుకూ ప్రపంచ దేశాలంతటా ప్రతిధ్వనిస్తూనే ఉంది. నాలుగు సంవత్సరాల పాటు అమెరికా, ఐరోపా ఖండాలలో పర్యటించి, అద్భుతంగా ఉపన్యాసాలు ఇచ్చి, వేదాంత కేంద్రాలు నెలకొల్పి, అనేకులను శిష్యులుగా స్వీకరించి 1897లో స్వదేశానికి తిరిగి వచ్చి 'రామకృష్ణ మిషన్' స్థాపించారు.



వివేకానందుని ప్రసంగాలు యుగయుగాలకు స్ఫూర్తిదాయకం. ఆయన ఓ ప్రచార కర్త కాదు, ఓ మతం. ప్రతి మనిషి ఆత్మలో దైవత్వాన్ని చూడడం ఆ మత సూత్రం. పేదవాడి సేవే భగవంతుని సేవ అని చాటి చెప్పిన యుగకర్త. భారతదేశం మళ్లీ తన ప్రాచీన ఔన్నత్యాన్ని పొందాలని ఆశించిన వారిలో ముఖ్యుడాయన. 1863 జనవరి 12న కలకత్తాలో జన్మించిన వివేకానందుని తొలినామం నరేంద్రుడు. ఎన్నో ఆధ్యాత్మిక అనుభవాలను కలిగిన ఆయన చివరికి అత్యున్నతమైన అద్వైత స్థితి కూడా పొందారు. దక్షిణేశ్వరంలోని రామకృష్ణ పరమహంసతో పరిచయమేర్పడిన అనతి కాలంలోనే నరేంద్రుడు ఆయనకు ముఖ్య శిష్యులయ్యారు. ఆయన మనోహర గాన మాధుర్యం రామకృష్ణుని ఆనందసాగరంలో ముంచెత్తేది. 1886లో పరమహంస నిర్యాణం అనంతరం నరేంద్రుడు పరివ్రాజకునిగా యావత్ భారత పర్యటన చేశారు. వివేకానందనామం స్వీకరించారు. దేశ సముద్ధరణకు, భారతజాతి పునరుజ్జీవనానికి అహర్నిశలు తపించారు.

'బలమే జీవనం బలహీనతే మరణం' అనే వివేకానంద ప్రవచనం జగద్విఖ్యాతం. 'దేశంలో వస్తున్న ప్రతి ప్రాణికీ ఆహారం పెట్టి రక్షించటమే పరమధర్మం. ఇదే నా మతం. తద్భిన్నమంతా ఆదర్శమే, కృత్రిమ ధర్మమే. నిరుపేదయైన సోదర భారతీయునీ, నా ఇష్టదేవతలనూ అర్చించటానికి ఎన్ని జన్మలైనా ఎత్తగలను, ఎన్ని బాధలైనా ఓరుస్తాను' అని ప్రకటించారాయన.

1902 జూలై 4న తన 39వ ఏట బేలూరు మఠంలో ఆయన తనువు చాలించారు. అన్నదాన, విద్యాదాన, జ్ఞానదానాల రూపంలో ప్రజాసేవ చేస్తూ యావద్భారతంలోనే కాకుండా ప్రపంచమంతటా ప్రఖ్యాతి వహించిన శ్రీ రామకృష్ణ మఠసేవా సంఘాలను స్థాపించిన ఘనత వివేకానందుడికే దక్కుతుంది. గొప్ప దేశభక్తుడు. ఆయన యువతరాన్ని ప్రేరేపించిన మహాశక్తి. మానవునిలో లోపాలు వివరిస్తూ 'మనం పని చేయం, చేసే వారిని చేయనీయం, వారిని విమర్శించి తప్పులెంచి అవహేళన చేస్తాం. మానవ జాతి పతనానికి ముఖ్యమైనదీ లక్షణమే' అన్నారు. దైవ విశ్వాసం కంటె మానవ విశ్వాసం ముఖ్యమనీ... దేశ ప్రజలందరికీ ఆత్మవిశ్వాసం, క్రియా శూరత్వం అవసరం తనకు స్పష్టంగా కనిపిస్తున్నదనీ చెప్పారు.

– నందిరాజు రాధాకృష్ణ; సీనియర్ జర్నలిస్ట్ । 98481 28215

(రేపు స్వామి వివేకానంద వర్ధంతి)

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం; ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు; జ్యేష్ఠ మాసం; **తిథి:** బ.ద్వాదశి ఉ.7.07 వరకు, తదుపరి త్రయోదశి; **నక్షత్రం:** రోహిణి తె.4.28 వరకు (తెల్లవారితే గురువారం); తదుపరి మృగశిర; **వర్జ్యం:** రా.8.51 నుండి 9.24 వరకు; **దుర్ముహూర్తం:** ఉ.11.38 నుండి 12.31 వరకు; **అమృత ఘడియలు:** రా.1.32 నుండి 3.36 వరకు; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు; **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు; **సూర్యోదయం:** 5.33; **సూర్యాస్తమయం:** 6.34

క్లుప్తంగా...

ఏకేయూ, ఆదికవి నన్నయ్య వీసీల రాజీనామా




మారెడ్డి అంజిరెడ్డి, ఆచార్య పద్మరాజు

ఒంగోలు/రాజానగరం: ఒంగోలులోని ఆంధ్ర కేసరి యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్, ప్రొఫెసర్ మారెడ్డి అంజిరెడ్డి, తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు తమ పదవులకు రాజీనామా చేశారు. జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీలో పర్యావరణ విభాగం ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ప్రొఫెసర్ మారెడ్డి అంజిరెడ్డి 2023 ఫిబ్రవరి 9న ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్‌గా బాధ్యతలు చేపట్టారు. అనతికాలంలోనే యూనివర్సిటీని పూర్తిస్థాయిలో అభివృద్ధి బాట పట్టించారు. అలాగే 2022 మే 13న ఆచార్య పద్మరాజు 'నన్నయ' వీసీగా బాధ్యతలు స్వీకరించారు. వీరికి ఇంకా ఆ పదవుల్లో కొనసాగే అవకాశం ఉంది. అయితే, రాష్ట్రంలో మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో వారు తమ పదవులకు రాజీనామా చేశారు. రాజీనామాలను కులపతి, రాష్ట్ర గవర్నర్‌కు పంపించామని, ఆమోదం రావాల్సి ఉందని మంగళవారం 'సాక్షి'కి తెలిపారు.

సచివాలయ ఉద్యోగి సస్పెన్షన్, క్రిమినల్ కేసు



మురళీమోహన్

ప్రొద్దుటూరు: వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు మునిసిపాలిటీ పరిధిలోని 7వ వార్డు సచివాలయం అమెనిటీస్ సెక్రటరీ మురళీ మోహన్‌ను సస్పెండ్ చేసి, క్రిమినల్ కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు మునిసిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి తెలిపారు. ఈ నెల 1న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి సంబంధించి రూ.4 లక్షల ప్రభుత్వ సొమ్మును సొంత అవసరాల కోసం మురళీమోహన్ వాడుకున్నట్లు రఘునాథరెడ్డి చెప్పారు. లబ్ధిదారులకు సోమవారమే పింఛన్ అందించామని తెలిపారు. పింఛన్లు ఇచ్చేందుకు వెళుతుండగా డబ్బును ఎవరో చోరీ చేశారని పోలీసులకు రఘునాథరెడ్డి తప్పుడు సమాచారం అందించగా విచారణలో వాస్తవాలు తేల్చారు.

పింఛన్.. ఏడిపించెన్



ఉప్పాడ సచివాలయం వద్ద ఎదురుచూపులు

కొమ్మాది(విశాఖ): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తెల్లవారుజామునే ఇంటి వద్ద పింఛన్లు అందుకున్న అవ్వాతాతలు కూటమి ప్రభుత్వంలో ఉదయం 11 గంటలు అయినా పింఛన్లు అందక తీవ్ర అవస్థలు పడ్డ ఘటన విశాఖ నగరంలో మంగళవారం జరిగింది. విశాఖ కార్పొరేషన్ పరిధిలోని 4వ డివిజన్‌లో మొదటి రోజు పింఛన్ల పంపిణీ పూర్తి చేయలేదు. దీంతో రెండో రోజు మంగళవారం పింఛన్ల కోసం కొందరు లబ్ధిదారులు సచివాలయాలను ఆశ్రయించారు. చేపలుప్పాడ సచివాలయం ఉదయం 11 గంటల వరకు తెరవకపోవడంతో లబ్ధిదారులు ఎండలో పడిగాపులు పడ్డారు. మాకేంటి ఈ ఖర్మ అంటూ కన్నీరు పెట్టుకున్నారు. కాపులుప్పాడలో అయితే 11 గంటల వరకు సచివాలయం తెరవలేదు. ఆ తర్వాత లబ్ధిదారులను సచివాలయం వద్దకు రప్పించి పింఛన్లు అందజేశారు. పింఛన్ల పంపిణీ తీరుపై లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వెల్ఫేర్ అసిస్టెంట్ చేతివాటం

రూ.7 లక్షల పింఛన్ సొమ్ము స్వాహా



పింఛన్ అందక చెట్ల కింద అవస్థలు

శెట్టూరు: అనంతపురం జిల్లా శెట్టూరు మండల కేంద్రంలోని గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ మల్లికార్జున ఎన్టీఆర్ భరోసా పెన్షన్ సొమ్ము స్వాహా చేశారు. సచివాలయ పరిధిలో 623 మందికి ప్రభుత్వం పింఛన్ సొమ్ము మంజూరు చేయగా మల్లికార్జున ఈ నెల 30న సచివాలయంలో ఉన్న 10 మంది సిబ్బందికి పింఛన్ల నగదును ఒక్కొక్కరికి రూ.2 లక్షలు, రూ.4 లక్షల చొప్పున ఇచ్చి..లబ్ధిదారుల జాబితా అందజేశాడు. ఈ సొమ్ము పంపిణీ చేసిన తర్వాత మిగిలిన నగదు ఇస్తానని సిబ్బందితో నమ్మబలికాడు. మల్లికార్జున మాత్రం తాను ఇవ్వాల్సిన 60 మంది లబ్ధిదారులకు నగదు అందజేయలేదు. సగం మందితో వేలిముద్ర వేయించి గంట తర్వాత ఇస్తానని, సాయంత్రం ఇస్తానని చెప్పుకొంటూ వచ్చాడు. ఇతర సచివాలయ సిబ్బందికి ఇవ్వాల్సిన పెన్షన్ సొమ్ము రూ.3,70,000 ఇవ్వకుండా చేతులెత్తేశాడు. ఇలా 100 మందికి సంబంధించిన రూ.7 లక్షల దాకా నగదు స్వాహా చేశాడు. నగదు అందని పెన్షన్‌దారులు మంగళవారం సచివాలయం వద్దకు వచ్చారు. మధ్యాహ్నం వరకు వేచి ఉన్నా మల్లికార్జున రాకపోవడంతో ఎంపీడీవో నరసింహమూర్తికి ఫిర్యాదు చేశారు. తోటి సచివాలయ సిబ్బంది 8 మందితో పాటు సర్పంచ్ కుమార్ కూడా ఎంపీడీవోకు ఫిర్యాదు చేయడంతో ఆయన గ్రామంలోని లబ్ధిదారుల వద్దకు వెళ్లి విచారణ చేశారు. పింఛన్లు ఇవ్వకపోతే మల్లికార్జునపై చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో చెప్పారు.

కూటమి కక్ష.. ఎగుమతిదారులకు శిక్ష

గోడౌన్ల సీజ్‌తో బియ్యం ఎగుమతులపై నీలినీడలు

- కాకినాడ పోర్టు ప్రతిష్టకూ దెబ్బ
- సీజ్ చేసిన బియ్యంలో బాయిల్డ్ రైస్, నూకలు
- రాష్ట్రంలో పీడీఎస్‌కు వినియోగించని బాయిల్డ్ రైస్
- నూకలు ఉన్నా పీడీఎస్ బియ్యమేనా?
- మంత్రి నాదెండ్లకు వీటిపై అవగాహన లేదా?
- ప్రభుత్వ చర్యలను నిరసిస్తున్న ఎగుమతిదారులు, చాంబర్ ఆఫ్ కామర్స్
- కాకినాడ నుంచి వెళ్లిపోయేందుకు ఎగుమతిదారుల యత్నాలు
- కాండ్లా, పరదీప్ ఓడ రేవులపై దృష్టి



కాకినాడ పోర్టులో లారీ నుంచి బియ్యాన్ని బార్జిలోకి ఎక్కిస్తున్న దృశ్యం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: బియ్యం ఎగుమతిదారులపై చంద్రబాబు కూటమి ప్రభుత్వం కక్ష కట్టింది. పీడీఎస్ బియ్యాన్ని ఎగుమతి చేస్తున్నారన్న పేరుతో మొత్తం ఎగుమతులనే దెబ్బతీసే చర్యలకు దిగింది. ఈ ప్రభావం బియ్యం ఎగుమతిలో దేశంలోనే మొదటి స్థానంలో ఉన్న కాకినాడ పోర్టుపైనా పడింది. ఈ పోర్టుకు విదేశాల్లో ఉన్న విశ్వసనీయతను దెబ్బ తీస్తోంది. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాందెడ్ల మనోహర్ రెండు రోజులు కాకినాడలోనే తిష్ట వేసి గోడౌన్‌లపై దాడులు, పీడీఎస్ బియ్యం సీజ్ అంటూ ఎగుమతిదారులను భయపెట్టి, వారిలో ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని ఎగుమతిదారులు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు అంటున్నారు. బియ్యం ఎగుమతులపై మంత్రికి అవగాహన లేనందువల్లే వాటిని దెబ్బతీస్తున్నారని వ్యాఖ్యానిస్తున్నారు. గొడౌన్లపై దాడుల కారణంగా పోర్టులో ఎగుమతులపై నీలినీడలు కమ్ముకొన్నాయని చెబుతున్నారు.

వాస్తవానికి మార్కెట్లో బియ్యం ధరలు పెరిగిపోతుండటంతో ముడి బియ్యం ఎగుమతులను కేంద్ర ప్రభుత్వం రెండేళ్ళ క్రితమే నిషేధించింది. ఎగుమతులను కఠినతరం చేసింది. అయితే ప్రత్యేక అనుమతులతో ప్రభుత్వ పర్యవేక్షణలో దక్షిణాఫ్రికా, ఫిలిప్పీన్స్, సోమాలియా వంటి ఆఫ్రికా దేశాలకు మాత్రమే బియ్యం ఎగుమతి చేస్తున్నారు. సింగపూర్ కేంద్రంగా పనిచేసే ఓలం ఆగ్రోతో పాటు అంతర్జాతీయంగా మంచి పేరున్న లూయిస్ డ్రూఫిస్ వంటి దాదాపు 150 కంపెనీలు ది రైస్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ సభ్యత్వంతో కాకినాడ పోర్టు నుంచి విదేశాలకు బియ్యం ఎగుమతి చేస్తున్నాయి. విశాఖ, కృష్ణపట్నం రేవుల కంటే కాకినాడ రేవులో నిర్వహణపరంగా ఉన్న వెసులుబాటుతో 80 శాతం ఎగుమతులు ఇక్కడి నుంచే జరుగుతున్నాయి. గత ఐదేళ్లలో ఒక్క కాకినాడ నుంచే 1,47,55,837 మెట్రిక్ టన్నుల బియ్యం ఎగుమతి అయింది. ఈ స్థాయిలో మరే పోర్టు నుంచి ఎగుమతి జరగలేదు. ఇంతటి ప్రాధాన్యత ఉన్న ఈ పోర్టు భవితవ్యాన్ని ప్రశ్నార్థకంలో పడేసే పరిస్థితి కల్పించవద్దని ఎగుమతిదారులు కోరుతున్నారు. 2014–19 మధ్య టీడీపీ హయాంలో ఎగుమతులపై లేని ప్రతిబంధకాలు ఇప్పుడే ఎందుకు ఎదురవుతున్నాయని ప్రశ్నిస్తున్నారు.

అంతా పథకం ప్రకారమే..

సార్వత్రిక ఎన్నికలకు ముందు నుంచి ఒక పథకం ప్రకారం కాకినాడ పోర్టు, ఇక్కడి బియ్యం లావాదేవీలు, తరతరాలుగా రైస్ మిల్లింగ్ రంగంలో ఉన్న కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి కుటుంబం లక్ష్యంగా టీడీపీ, జనసేన నేతలు తీవ్ర విమర్శలు చేస్తూ వచ్చారు. ద్వారంపూడి కుటుంబం బియ్యం ఎగుమతులను శాసిస్తోందంటూ రాజకీయ లబ్ధి కోసం ఆరోపణలకు దిగారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కాకినాడ పోర్టుపై కక్ష సాధింపు చర్యలకు దిగి, కోట్లు పెట్టుబడులు పెట్టిన ఎగుమతిదారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కాకినాడ వచ్చి యాంకరేజ్ పోర్టు, డీప్‌వాటర్ పోర్టులలోని పలు గోడౌన్లను రెండు రోజులు తనిఖీ చేశారు. తొలి రోజు 7,615 మెట్రిక్ టన్నులు, రెండో రోజు అశోక గోడౌన్‌లో 2,800 మెట్రిక్ టన్నులు, హెచ్ఐఎస్ గోదాముల్లో 2,500 మెట్రిక్ టన్నులు బియ్యం, స్టాక్ రిజిస్టర్లను సీజ్ చేశామని మంత్రి నాదెండ్ల ప్రకటించారు. సింగపూర్‌కు చెందిన ఓలం, విశ్వప్రియ తదితర కంపెనీల గోడౌన్లలో సీజ్ చేసిన బియ్యంలో బాయిల్డ్ రైస్, బ్రోకెన్ రైస్ (నూకలు) ఉండటం గమనార్హం. ఇవన్నీ పీడీఎస్ బియ్యం అనే అనుమానంతో సీజ్ చేశారు. కానీ రాష్ట్రంలో ఎక్కడా బాయిల్డ్, నూకలను పీడీఎస్‌కు వినియోగించరు. అటువంటప్పుడు సీజ్ చేసిన బియ్యం పీడీఎస్ అని ఎలా నిర్ధారిస్తారని ఎగుమతిదారులు ప్రశ్నిస్తున్నారు. మార్కెట్‌లో బియ్యం ధరకంటే నూకల ధర తక్కువ. అటువంటప్పుడు పీడీఎస్ బియ్యం నూకలుగా మార్చి ఎగుమతి చేయాల్సిన అవసరం ఎందుకు వస్తుందని, బియ్యంలో నూకలు ఉంటే అవి పీడీఎస్ అని ఎలా అంటున్నారని ఎగుమతిదారులు నిలదీస్తున్నారు.

కాకినాడ నుంచి తరలిపోనున్న ఎగుమతిదారులు!

కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులతో ఎక్స్‌పోర్టర్లు ఇక్కడి రేవు ద్వారా ఎగుమతులకు స్వస్తి పలికేందుకు సిద్ధమవుతున్నారు. కాకినాడ రేవును వదిలి కాండ్లా, పరదీప్ ఓడ రేవుల నుంచి ఎగుమతులకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇదే జరిగితే పోర్టుపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడ్డ 10 వేల మంది ఉపాధి కోల్పోయే పరిస్థితి ఉంది. ఈ విషయమై కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిని వివరణ కోరగా బియ్యం ఎగుమతులతో తనకు ఎటువంటి సంబంధం లేదని చెప్పారు. అయితే ఇక్కడి ఎగుమతిదారులను ఇబ్బందులకు గురి చేసేలా దాడులకు పాల్పడి ఈ ప్రాంత రేవు ప్రతిష్టను దెబ్బ తీయడం ప్రభుత్వానికి మంచిది కాదని హితవు పలికారు.



గోదాములో బియ్యం నిల్వలు తనిఖీ చేస్తున్న మంత్రి నాందెడ్ల మనోహర్ (ఫైల్)

ఆక్రమణ నుంచి 'అమరా'కు విముక్తి

పెదకాకానిలో సత్రాన్ని స్వాధీనం చేసుకున్న దేవదాయ శాఖ

- 18 ఏళ్లుగా ఆక్రమణదారులతో న్యాయపోరాటం
- 20 సెంట్ల భూమి విలువ రూ.3 కోట్లు
- ఆలయానికి అనుకూలంగా హైకోర్టు తీర్పు
- శిథిలావస్థలో ఉన్న సత్రం కూల్చివేత

పెదకాకాని: దేవదాయ శాఖ 17ఏళ్ల పాటు చేసిన న్యాయపోరాటం ఎట్టకేలకు ఫలించింది. సుమారు రూ.3 కోట్ల విలువైన 20 సెంట్ల స్థలాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గుంటూరు జిల్లా అమరా వారి సత్రం పెదకాకాని శివాలయం దేవస్థానానిదే అని హైకోర్టు తీర్పు వెలువరించడంతో ఆలయ అధికారులు మంగళవారం దానిని స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి ఆలయ ఉప కమిషనర్ దాసర శ్రీరామ వరప్రసాదరావు తెలిపిన వివరాల ప్రకారం.. 1942లో గుంటూరుకు చెందిన అమరా వెంకటేశ్వర్లు, మువ్వల వెంకట సుబ్బారావులు గుంటూరు జిల్లా పెదకాకాని శివాలయం ఎదురుగా ఉన్న 20 సెంట్లు భూమిని కొనుగోలు చేశారు. ఆ భూమిలో భక్తుల సౌకర్యార్థం సత్రం నిర్మించారు. వారి అనుమతితో 1968లో దేవదాయ శాఖ ఆధీనంలోకి తీసుకుని కొంతకాలం గడిచిన తరువాత సత్రం యజమానుల నుంచి కంట్రిబ్యూషన్ వసూలుచేశారు. సత్రం నిర్వాహకులు ఆ సత్రంలో పనులకు యంద్రప్రగడ సీతారామయ్య, వెంకటరత్నం (భార్యభర్తలను)లను నియమించి వారికి నిర్వహణ బాధ్యతలను అప్పగించారు. 2006లో అప్పటి ఆలయ ఈఓ బీహెచ్ వీరారెడ్డిని ఆ సత్రానికి సింగిల్ ట్రస్టీగా దేవదాయ శాఖ అధికారులు నియమించారు. ఆ తర్వాత కొంతకాలానికి సత్రంలో ఉంటున్న యంద్రప్రగడ సీతారామయ్య సత్రం తనదేనంటూ భార్య వెంకటరత్నంకు వీలునామా రాయడం.. వెంకటరత్నం తన కుమారుల్లో ఒకరైన సాంబశివరావుకు రిజిస్ట్రేషన్ చేశారు. ఆ తర్వాత 2005లో సత్రాన్ని ఖాళీ చేయాలని ఆలయ అధికారులు కోరడంతో అందులో ఉంటున్న యంద్రప్రగడ కుటుంబం సత్రం తమదేనంటూ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది.



పెదకాకాని శివాలయం ఎదురుగా ఆక్రమణలో ఉన్న సత్రాన్ని కూల్చి వేస్తున్న అధికారులు

సత్రం పూర్తి హక్కులు శివాలయానికి..

జిల్లా న్యాయస్థానం నుంచి ఈ కేసు వ్యవహారం 2008లో ట్రిబ్యునల్‌కు చేరడంతో 2011లో సత్రం ఆలయానికి చెందినదేనని తీర్పు వచ్చింది. అప్పటికే సత్రంలో పని కల్పిస్తే సత్రాన్ని స్వాధీనం చేసుకున్నారని భావించిన సత్రం యజమానులు అమరా వెంకటేశ్వర్లు, మువ్వల వెంకటసుబ్బారావు కుటుంబ సభ్యులు 2008లో ఆ సత్రం పూర్తి హక్కులు శివాలయానికి కల్పిస్తూ రిజిస్ట్రేషన్ చేశారు. సత్రాన్ని స్వాధీనం చేసుకోవడంలో కొందరు అధికారుల ఉదాశీన వైఖరితో ఆక్రమణదారులు హైకోర్టును ఆశ్రయించారు. అప్పటి గ్రామపెద్ద ఆలపాటి రామస్వామి కూడా అమరా వారి సత్రం ఆలయానికి చెందినదేనంటూ హైకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో.. గత నెల 21న అమరా వారి సత్రం సంపూర్ణ హక్కులు పెదకాకాని శివాలయానికి చెందినవేనని హైకోర్టు తీర్పు ఇచ్చింది. దీంతో సత్రంలో ఉంటున్న యంద్రప్రగడ వెంకటరత్నంకు పదిరోజుల పాటు ఆలయ శివ సదనంలో ఒక రూంలో ఉండేందుకు అనుమతించి మంగళవారం సత్రాన్ని ఖాళీ చేయించారు. అనంతరం శిథిలావస్థకు చేరిన సత్రాన్ని కూల్చివేశారు. ఈ భూమి శివాలయానికి చెందినదని.. ఎవరైనా ఆక్రమిస్తే చట్టపరంగా శిక్షార్హులని ఆలయ ఉప కమిషనర్ దాసర శ్రీరామ వరప్రసాదరావు హెచ్చరించారు.

శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు

తిరుమల/చంద్రగిరి(తిరుపతి జిల్లా): తిరుమల శ్రీవారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, భారత్ మహిళా క్రికెటర్ స్మృతి మంధాన మంగళవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు పలుకగా, టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. కాగా, తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.



తిరుమల ఆలయం వెలుపల సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్‌నాథ్



తిరుమల ఆలయం వెలుపల సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా



తిరుమల ఆలయం వెలుపల ఇండియన్ మహిళా క్రికెటర్ స్మృతి మంధాన

ఆర్మీ అధికారికి కన్నీటి వీడ్కోలు

- ప్రకాశం జిల్లా కాలువపల్లెకు తరలివచ్చి జోహార్లు పలికిన సమీప గ్రామాల ప్రజలు
- నివాళులర్పించిన ఆర్మీ అధికారులు, ప్రజాప్రతినిధులు



రామకృష్ణారెడ్డి భౌతికకాయానికి నివాళులు

రాచర్ల: లద్దాఖ్‌లో భారత్–చైనా సరిహద్దు సమీపంలోని షియోక్ నదిలో జరిగిన దుర్ఘటనలో మృతి చెందిన జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్(జేసీవో) ముత్తుముల రామకృష్ణారెడ్డి(47)కి ప్రజలు అశ్రు నివాళులర్పించారు. ఆయన పార్థివదేహాన్ని సోమవారం రాత్రి ప్రకాశం జిల్లా రాచర్ల మండలంలోని కాలువపల్లె గ్రామానికి ఆర్మీ అధికారులు, సైనికులు తీసుకువచ్చారు. మంగళవారం రామకృష్ణారెడ్డిని కడసారి చూసి వీడ్కోలు పలికేందుకు గ్రామస్తులతో పాటు సమీప గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు భారీగా ఆయన నివాసం వద్దకు తరలివచ్చారు. ఆయన భార్య ఉమాదేవితో పాటు కుటుంబసభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. మంగళవారం ఉదయం రామకృష్ణారెడ్డి భౌతికకాయానికి లెఫ్టినెంట్ కల్నల్ సందీప్ యాదవ్, కెప్టెన్ దీపక్ సింగ్, నాయక్ సుబేదార్‌లు శేఘరామ్, రంగనాయకులు, నాయక్ బి.నరేంద్ర, సిపాయి సాయి ప్రశాంత్ పూలమాలలు వేసి నివాళులర్పించి సెల్యూట్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, జిల్లా సైనిక వెల్ఫేర్ సంక్షేమాధికారి ఎం.రజనీకుమారి, మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, డీఎస్పీ ఎమ్.బాలసుందర్‌రావు, తహసీల్దార్ బి.వెంకటేశ్వరరావు, గిద్దలూరు రూరల్ సీఐ దాసరి ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ భారతి తదితరులు అంతిమ యాత్రలో పాల్గొన్నారు. అనంతరం సైనిక లాంఛనాలతో ఘనంగా అంత్యక్రియలు నిర్వహించారు.

ఆరు నెలల్లో ఉద్యోగ విరమణ

ముత్తుముల రామకృష్ణారెడ్డి 17 సంవత్సరాల క్రితం ఆర్మీలో సైనికునిగా చేరి అంచలంచెలుగా జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్ స్థాయికి ఎదిగారు. రామకృష్ణారెడ్డి మరో ఆరు నెలల్లో ఉద్యోగ విరమణ చేయనున్నారు. కానీ ఇంతలోనే తమను వదిలివెళ్లిపోయారంటూ కుటుంబసభ్యులు కన్నీటిపర్యాంతమయ్యారు. రామకృష్ణారెడ్డికి భార్య, ఇద్దరు కుమారులున్నారు.

సినిమా ఘటనలతో ఆరోపణలా?

- ఆధారాలు లేకుండా పెద్దిరెడ్డి కుటుంబంపై విమర్శలు సరికాదు
- పవన్ కళ్యాణ్ రుజువు చేస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా
- లేకపోతే ఆయన ప్రజలకు క్షమాపణ చెప్పాలి
- అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గడికోట శ్రీకాంత్‌రెడ్డి



రాయచోటి: ఒక సినిమాలో సంఘటనల ఆధారంగా ఎర్రచందనం అక్రమ రవాణాలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబం పాత్ర ఉందని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆరోపించడంపై అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గడికోట శ్రీకాంత్‌రెడ్డి మండిపడ్డారు. ఆధారాలు లేకుండా విమర్శలు చేయడం సరికాదని.. అధికారంలో ఉంది మీరే కాబట్టి వాటిని నిరూపించాలన్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అజాతశత్రువు అని.. అందుకే ఇటీవల ఎన్నికల్లో ఆయన, ఆయన సోదరుడు ద్వారకానాథ్ రెడ్డి ఎమ్మెల్యేలుగా, కుమారుడు మిథున్ రెడ్డి ఎంపీగా గెలుపొందారన్నారు. మంగళవారం అన్నమయ్య జిల్లా రాయచోటిలో శ్రీకాంత్ రెడ్డి ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. పెద్దిరెడ్డి కుటుంబం 45 ఏళ్ల రాజకీయ చరిత్ర కలిగిందన్నారు. తిరుపతి సమీపంలో వకుళమాత గుడిని, సొంత మండలంలో కేరళలో అయ్యప్ప స్వామి ఆలయం తర్వాత అంత పవిత్రత కలిగిన ఆలయాన్ని సొంత నిధులతో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నిర్మించారన్నారు. ఇలా ఎన్నో ఆలయాలు, ఈద్గాల నిర్మాణాలకు సొంత డబ్బులను ఖర్చు చేశారని తెలిపారు. ఆరు రాష్ట్రాలతోపాటు విదేశాల్లో కూడా పెద్దిరెడ్డి కుటుంబానికి వ్యాపార సంబంధాలు ఉన్నాయన్నారు. అలాంటి కుటుంబంపై ఆధారాలు చూపకుండా ఎర్రచందనం అక్రమ రవాణాలో పాత్ర ఉందంటూ అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు. ఐదేళ్లు పవన్ కళ్యాణ్ అధికారంలో ఉంటారని.. ఆయన దగ్గరకు వచ్చిన ఎర్రచందనం ఫైల్‌పై విచారణ జరిపించి ఆధారాలను బయటపెట్టాలని కోరారు.

బురదజల్లడం సరికాదు..

పవన్ కళ్యాణ్ రాజకీయంగా బురదజల్లే ఆరోపణలు చేయడం మంచిది కాదని శ్రీకాంత్ రెడ్డి హితవు పలికారు. అటవీశాఖ మంత్రిగా ఎర్రచందనం అక్రమ రవాణా విషయంలో ఆయన కఠిన చర్యలు తీసుకోవడంలో తప్పు లేదన్నారు. ఇందులో ఎంతటి వ్యక్తులున్నా వదలొద్దని కోరారు. ఇందుకోసం ప్రత్యేక చట్టం తెచ్చి తప్పు చేసిన వారిని ఉరితీయాలన్నారు. ఎంపీ మిథున్ రెడ్డి, తాను అనేక పర్యాయాలు టాస్క్‌ఫోర్స్ అధికారులతో సమీక్షించి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసే ప్రయత్నాలు చేశామన్నారు. పవన్ కూడా నిజాయితీ అధికారి ఆధ్వర్యంలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసి అత్యంత విలువైన సంపద తరలిపోకుండా చూడాలని కోరారు. అలాగే ఎర్రచందనం అక్రమ రవాణాలో పవన్ తన ఆరోపణలను ఆధారాలతో నిరూపిస్తే రాజకీయాల నుంచి శాశ్వతంగా వైదొలుగుతానని ఎంపీ మిథున్ రెడ్డి చేసిన సవాల్‌ను ఆయన స్వీకరించాలన్నారు. అనేక చెక్‌పోస్టులను దాటి ఎర్రచందనం నేపాల్‌కు ఎలా చేరిందో విచారణలో తేల్చాలన్నారు. పవన్ తన ఆరోపణలను రుజువు చేస్తే తాను కూడా రాజకీయాల నుంచి శాశ్వతంగా వైదొలుగుతానని సవాల్ విసిరారు. రుజువు చేయలేకపోతే ఆయన.. మిథున్‌రెడ్డి తరపున రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

తిరుపతిలో షాడో ఎమ్మెల్యే!

- అధికారిక కార్యక్రమాల్లో ఎమ్మెల్యే అన్న కుమారుడు
- తిరుపతి కార్పొరేషన్ అధికారులతో ఆయన సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్న కుమారుడు ఆరణి శివకుమార్

సాక్షి టాస్క్‌ఫోర్స్: తిరుపతి నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఒకరైతే... అన్నీ తానై వ్యవహరిస్తున్న షాడో ఎమ్మెల్యే మరొకరు. ఈ షాడో ఎమ్మెల్యే తీరుపై కూటమి నేతలే విస్మయం వ్యక్తంచేస్తున్నారు. తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్న కుమారుడు ఆరణి శివకుమార్‌కు ఎలాంటి హోదా లేకపోయినా అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటూ షాడో ఎమ్మెల్యేగా చలామణి అవుతున్నారు. ఆయన సోమవారం తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఐఏఎస్ అధికారి అయిన కమిషనర్ అదితి సింగ్‌తో కలిసి విభాగాధిపతులతో సమీక్ష నిర్వహించారు. ఈ విషయం మంగళవారం వెలుగుచూసింది. ఎమ్మెల్యే అన్న కుమారుడు అధికారికంగా సమీక్ష నిర్వహించడం ఏమిటని మున్సిపల్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. అదే విధంగా స్విమ్స్‌లో నిర్వహించిన డాక్టర్స్ డే వేడుకల్లో కూడా ఆరణి శివకుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించడం తీవ్ర దుమారాన్ని లేపింది. ఆయా కార్యక్రమాల్లో అన్నీ తానే అన్నట్లుగా శివకుమార్ వ్యవహరించిన తీరు చర్చనీయాంశంగా మారింది. ఆయనతోపాటు మరో నలుగురు వ్యక్తులు సైతం తాము ఎమ్మెల్యేకు సమీప బంధువులం.. అంటూ ప్రభుత్వ కార్యాలయాల్లో హల్‌చల్ చేస్తుండటం కలకలం రేపుతోంది. ఎన్నడూ లేనివిధంగా తిరుపతిలో వింత సంస్కృతిని చూస్తున్నామని అధికారులు, కమ్యూనిస్టు పార్టీల నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు.

టీడీపీకి ఓటేయలేదని వేధించడంతో యువకుడి ఆత్మహత్య



కేశవులు (ఫైల్)

గుడుపల్లి: టీడీపీ నేతల వేధింపులు తాళలేక చిత్తూరు జిల్లా గుడుపల్లె మండలం అయ్యావార్లగొల్లపల్లెలో కేశవులు (26) అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అయ్యావార్లగొల్లపల్లెలో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం పింఛన్లు పంపిణీ చేశారు. వీధిలో పింఛను ఇస్తున్న స్థలానికి లబ్ధిదారు ప్రమీల అనే మహిళను పింఛన్ తీసుకునే నిమిత్తం ఆమె కుమారుడు, మరోవ్యక్తి కేశవులు తీసుకెళ్లారు. అక్కడున్న టీడీపీ నాయకులు కేశవుల్ని చూసి 'నీకు ఇక్కడేం పని. నువ్వు మా పార్టీకి ఓటేయలేదు' అంటూ వాగ్వాదానికి దిగారు. 'ప్రభుత్వం మాది. నీ అంతు చూస్తాం' అని కేశవుల్ని భయపెట్టారు. దీంతో భయాందోళనకు గురైన కేశవులు పొలం వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి పడిపోయాడు. స్థానికులు గమనించి కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. కేశవులు పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం తమిళనాడు క్రిష్ణగిరిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. విషం మోతాదు ఎక్కువై శరీరం సహకరించకపోవడంతో మంగళవారం ఉదయం కేశవులు మృతి చెందాడు. కాగా.. కడుపు నొప్పి భరించలేక కేశవులు పురుగుల మందు తాగి మృతి చెందాడని అతని అన్న కార్తీక గుడుపల్లె పోలీసులకు మంగళవారం మధ్యాహ్నం ఫిర్యాదు చేశారు. టీడీపీ నాయకులకు భయపడి ఇలా ఫిర్యాదు చేశాడని స్థానికులు చెబుతున్నారు.

మన్యంలో ట్రైనీ కలెక్టర్ల బృందం పర్యటన



మోదకొండమ్మతల్లి ఆలయం వద్ద ట్రైనీ ఐఏఎస్‌లతో డీఆర్వో పద్మావతి,ఆలయ కమిటీ ప్రతినిధులు

సాక్షి,పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): ఐఏఎస్ 2023 బ్యాచ్‌కు చెందిన ఆరుగురితో కూడిన ట్రైనీ కలెక్టర్ల బృందం మంగళవారం ఏజెన్సీలో పర్యటించింది. ట్రైనీ కలెక్టర్లు సీహెచ్.కల్యాణి (కర్నూలు), దామెర హిమవంశీ(చిత్తూరు), పవార్ స్వప్నిల్ జగన్నాథ్ (గుంటూరు), బొల్లిపల్లి వినూత్న (అనంతపురం), హెచ్.ఎస్.భావన (కాకినాడ), సుభమ్ నొక్‌హ్వాల్ (ఎన్టీఆర్ జిల్లా) పాడేరు వచ్చారు. వీరికి డీఆర్వో పద్మావతి స్వాగతం పలికారు. వీరిలో సీహెచ్ కల్యాణి, బొల్లిపల్లి వినూత్న, హెచ్.ఎస్.భావన స్థానిక మోదకొండమ్మ తల్లి ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి శాలువాలు కప్పి ఆలయ కమిటీ ప్రతినిధులు కిల్లు కోటిబాబునాయుడు, కూడా సురేష్‌కుమార్, తమర్ప ప్రసాదనాయుడు, రమణ,రాంబాబు ఘనంగా సత్కరించారు.

ఎవరీ భోలే బాబా?

వందకుపైగా అమాయకుల ఉసురు తీసిన ఆధ్యాత్మిక ప్రవచనం కార్యక్రమం నిర్వహించిన భోలే బాబా అసలు పేరు సౌరభ్ కుమార్. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఎటాహ్ జిల్లాలోని బహదూర్ గ్రామంలో జన్మించారు. వయసు 50 ఏళ్ల పైమాటే. ఉత్తరప్రదేశ్ పోలీసు శాఖలో ఇంటెలిజెన్స్ బ్యూరోలో 18 ఏళ్లపాటు పని చేసిన సౌరభ్ కుమార్ మనసు మార్చుకొని స్వచ్ఛందంగా పదవీ విరమణ చేశారు. ఖాకీ దుస్తులు వదిలేసి శ్వేతవస్త్రాలు ధరించారు. ఆధ్యాత్మిక మార్గంలో అడుగుపెట్టారు. సకర్ విశ్వ హరి భోలే బాబాగా అవతరించారు. తెల్లరంగు సూటు, టై ధరించి ప్రవచనాలు చెబుతుంటారు. ప్రజలకు శాంతిమార్గం, నీతిమార్గం బోధిస్తుంటారు. ఆయన నిర్వహించే 'నారాయణ్ సకర్ హరి సత్సంగ్'లు మంగళవారమే జరుగుతుంటాయి. బాబా పక్కన ఆయన భార్య కూడా తరచుగా దర్శనమిస్తుంటారు. బాబాకు యూపీతోపాటు ఇతర రాష్ట్రాల్లో లక్షల సంఖ్యలో భక్తులున్నారు. వీరిలో ఎక్కువమంది వెనుకబడిన తరగతులకు చెందిన వారే. పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు కూడా బాబా భక్తులే. ఉత్తరప్రదేశ్‌పాటు ఢిల్లీ, హరియాణా, ఉత్తరాఖండ్, రాజస్తాన్, మధ్యప్రదేశ్ దాకా బాబా పేరు ప్రఖ్యాతులు విస్తరించాయి.



బాబా కరోనా వైరస్ ఉధృతి సమయంలో వివాదంలో చిక్కుకున్నారు. 2022 మే నెలలో సత్సంగ్ నిర్వహించేందుకు స్థానిక అధికారుల నుంచి అనుమతి కోరారు. కేవలం 50 మంది వస్తారని చెప్పారు. కానీ, 50 వేల మందికిపైగా హాజరయ్యారు. ఈ సంఘటన అప్పట్లో సంచలనాత్మకంగా మారింది. అందరి దృష్టి బాబాపై పడింది. మీడియాకు, ప్రచారానికి దూరంగా ఉండడం బాబా ప్రత్యేకత. తన వ్యక్తిగత సమాచారం బయటకు వెళ్లించడానికి ఇష్టపడరు. సోషల్ మీడియాకు కూడా దూరంగా ఉంటారు. సోషల్ మీడియాలో ఆయనకు అధికారికంగా ఖాతాలు లేవు. భక్తులే బాబా పేరిట సొంతంగా ఖాతాలు తెరిచి నిర్వహిస్తున్నారు. ఫేస్‌బుక్‌లో ఆయన పేరిట ఉన్న ఖాతాలకు 3 లక్షల మందికి పైగా ఫాలోవర్స్ ఉన్నారు. - సాక్షి, నేషనల్ డెస్క్

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము దిగ్భ్రాంతి

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్ జిల్లాలో జరిగిన తొక్కిసలాట ఘటనపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఉదంతం తన హృదయాన్ని కలచివేసిందని పేర్కొంది. పెద్ద సంఖ్యలో మహిళలు, చిన్నారులు మృతిచెందడం పట్ల ఆవేదన చెందుతున్నట్లు చెప్పారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ వాద్రా, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, తదితరులు సంతాపం ప్రకటించారు.





ఘటనకు ముందు ఆధ్యాత్మిక కార్యక్రమానికి హాజరైన భక్తులు ● తొక్కిసలాట అనంతరం బస్సులో బాధితుల మృతదేహాలు ● ఆప్తులను కోల్పోయి రోదిస్తున్న మహిళ

సత్సంగ్‌లో మృత్యుకేళి

తొక్కిసలాటలో 116 మంది భక్తుల దుర్మరణం

హత్రాస్: అప్పటిదాకా భోలే బాబా ప్రవచనాలు, భక్తుల కీర్తనలు, ఆధ్యాత్మిక శోభతో కళకళలాడిన సత్సంగ్ నిమిషాల వ్యవధిలోనే శోక సముద్రంగా మారిపోయింది. ప్రవచనాలు వినేందుకు వచ్చిన బాబా భక్తులు విగతజీవులయ్యారు. సత్సంగ్ ముగిసిన తర్వాత ఇళ్లకు వెళ్లే తొందరలో జనమంతా టెంట్ నుంచి ఒక్కసారిగా బయటకు రావడంతో తొక్కిసలాట జరిగింది. ఒకరిపై ఒకరు పడిపోయారు. ఊపిరాడక 116 మంది కన్నుమూశారు. మృతుల్లో 108 మంది మహిళలు, ఏడుగురు చిన్నారులు ఉన్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం హత్రాస్ జిల్లా ఫూల్‌రాయ్ గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. దేశంలో ఇటీవలి కాలంలో జరిగిన ఘోరమైన సంఘటన ఇదే కావడం గమనార్హం. పలువురు క్షతగాత్రులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. 89 మంది ఘటనా స్థలంలోనే కన్నుమూశారు. మరికొందరు ఆసుపత్రికి తరలిస్తుండగా మరణించారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

అసలేం జరిగింది?

ఉత్తరప్రదేశ్‌తోపాటు వివిధ రాష్ట్రాల్లో లక్షల సంఖ్యలో భక్తులున్న సాకార్ విశ్వ హరి భోలే బాబా ఫూల్‌రాయ్ గ్రామంలో సత్సంగ్ నిర్వహించేందుకు స్థానిక సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ నుంచి అనుమతి తీసుకున్నారు. మంగళవారం మధ్యాహ్నం భక్తులకు గంటన్నరకు పైగా ఆధ్యాత్మిక బోధ చేశారు. టెంట్ లోపల నిర్వాహకులే ఏర్పాట్లు చేసుకున్నారు. టెంట్ బయట స్థానిక పోలీసులు భద్రత కల్పించారు. సత్సంగ్ పూర్తయిన తర్వాత వీరంతా ఒకేసారి బయటకు వచ్చేందుకు ప్రయత్నించడంతో తొక్కిసలాట జరిగింది. అయితే కార్యక్రమం పూర్తయ్యాక తన వాహనం వద్దకు తిరిగి వెళ్తున్న బాబా ఆశీస్సులు తీసుకొనేందుకు, ఆయన అడుగులు వేసిన చోట పవిత్రమైన మట్టిని సేకరించేందుకు భక్తులు ఎగబడడంతో తొక్కిసలాట జరిగిందని సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ రవీంద్ర కుమార్ వెల్లడించారు. సత్సంగ్ జరిగిన ప్రాంతం బురదమయంగా ఉండడంతో భక్తులు జారిపడ్డారని, దాంతో తొక్కిసలాట జరిగిందని నిర్వాహకులు చెబుతున్నారు. సరైన ఏర్పాట్లు చేయలేదని, అందుకే ఈ దుర్ఘటన చోటుచేసుకుందని భక్తులు ఆరోపించారు.

దర్యాప్తు బృందం ఏర్పాటు

తొక్కిసలాట సమాచారం అందుకున్న వెంటనే అధికారులు రంగంలోకి దిగారు. క్షతగాత్రులను, మృతదేహాలను వాహనాల్లో హత్రాస్ మెడికల్ సెంటర్‌తోపాటు సమీపంలోని ఎటాహ్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో విసిరేసినట్లుగా పడి ఉన్న శవాలు, వాటి చుట్టూ కూర్చొని రోదిస్తున్న కుటుంబ సభ్యుల హృదయ విదారక దృశ్యాలు కలచివేశాయి. పెద్ద సంఖ్యలో క్షతగాత్రులు ఉన్నారని, వారికి చికిత్స అందించడం లేదని స్థానికులు మండిపడ్డారు. ఆసుపత్రిలో ఒకే ఒక్క డాక్టర్ ఉన్నారని, ఆక్సిజన్ సదుపాయం లేదని ఆరోపించారు. ఫూల్‌రాయ్ తొక్కిసలాటపై సమగ్ర దర్యాప్తు జరపాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఆదేశించింది. ఇందుకోసం ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది. 24 గంటల్లోగా నివేదిక ఇవ్వాలని పేర్కొంది. సత్సంగ్ నిర్వాహకులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. సత్సంగ్‌కు 80 వేల మంది హాజరవుతారన్న అంచనాతో నిర్వాహకులు అనుమతి తీసుకున్నారని యూపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చెప్పారు. కానీ, అంతకంటే ఎక్కువ మంది హాజరయ్యారని తెలిపారు. భోలే బాబా పరారీలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

సంతాపం తెలిపిన ప్రధాని మోదీ

హత్రాస్ తొక్కిసలాటపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మంగళవారం లోక్‌సభలో ఆయన ఈ అంశంపై మాట్లాడారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున ప్రధానమంత్రి కార్యాలయం పరిహారం ప్రకటించింది. యూపీ సర్కారు కూడా అంతే మొత్తం పరిహారం ఇస్తుందని సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రకటించారు.

కాల్వలో ఒకరిపై ఒకరు పడిపోయారు

ప్రత్యక్ష సాక్షుల కథనం

హత్రాస్: తొక్కిసలాట ఘటన వివరాలను కొందరు ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారు. '' సత్సంగ్ అయిపోగానే అందరూ ఒక్కసారిగా ప్రాంగణం నుంచి బయటికి బయల్దేరారు. ప్రాంగణం బయట రోడ్డు ఎత్తులో నిర్మించారు. దాని కింద మురికి కాల్వ ఉంది. దూసుకొచ్చిన జనం అందులో పడ్డారు. ఒకరిపై మరొకరు పడుతూనే ఉన్నారు. కింద ఉన్న వాళ్లు కూరుకుపోయి కన్నుమూశారు'' అని శకుంతల అనే ప్రత్యక్ష సాక్షి చెప్పారు. '' సత్సంగ్‌ను రోడ్డు చివర నిలబడి ఉన్న వాళ్లను ప్రాంగణంలో కిక్కిరిసిన జనం తోసేశారు. దీంతో కొనకు ఉన్న వాళ్లు కాల్వలో పడిపోయారు. అలా అప్పటికప్పుడు ఒక పాతిక మంది ప్రాణాలుకోల్పోయారు' అని మరో ప్రత్యక్ష సాక్షి ఆ భయానక ఘటనను గుర్తుచేసుకున్నారు. సత్సంగ్ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యుడు మహేశ్ చంద్ర సైతం కార్యక్రమం నిర్వహణ విధానాన్ని తప్పుబట్టారు. '' సరైన నిర్వహణ లేకే ఈ దారుణం జరిగింది. బురదలో పడ్డ వాళ్లను జనం పరుగెడుతూ తొక్కుకుంటూ వెళ్లారు. వాళ్లను ఎవరూ అదుపుచేయలేకపోయారు. దీంతో పడిపోయిన వాళ్ల ప్రాణాలు కోల్పోయారు'' అని ఆయన అన్నారు.

గతంలోనూ...

- 2005 జనవరి 25న మహారాష్ట్రలోని సతారా జిల్లాలో మంధరాదేవి ఆలయ వేడుకల్లో తొక్కిసలాట జరిగింది. **340** మందికిపైగా భక్తులు విగతజీవులయ్యారు.
- 2008 సెప్టెంబర్ 30న రాజస్తాన్‌లోని జోధ్‌పూర్ సిటీలో చాముండాదేవి ఆలయ ఉత్సవాలకు జనం భారీగా తరలివచ్చారు. తొక్కిసలాట జరగడంతో **250** మంది మరణించారు. 60 మందికిపైగా గాయపడ్డారు.
- 2008 ఆగస్టు 3న హిమాచల్‌ప్రదేశ్‌లోని బిలాస్‌పూర్ జిల్లాలో నైనాదేవి ఆలయంలో మత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తొక్కిసలాట చోటుచేసుకుంది. **162** మంది భక్తుల ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి.
- 2013 అక్టోబర్ 13న మధ్యప్రదేశ్‌లోని రతన్‌గఢ్ ఆలయంలో నవరాత్రి వేడుకల సందర్భంగా తొక్కిసలాట జరిగింది. **115** మంది మృతిచెందారు.
- 2011 జనవరి 14న కేరళలోని ఇడుక్కి జిల్లాలో శబరిమల ఆలయం సమీపంలో తొక్కిసలాటలో **104** మంది అయ్యప్ప భక్తులు కన్నుమూశారు.
- 2010 మార్చి 4న ఉత్తరప్రదేశ్‌లోని ప్రతాప్‌గఢ్ జిల్లాలో రామ్‌జానకి ఆలయంలో తొక్కిసలాటలో **63** మంది మృతిచెందారు.
- 2003 ఆగస్టు 27న మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాలో కుంభమేళాలో తొక్కిసలాటలో **39** మంది మరణించారు. 140 మంది గాయపడ్డారు.

అన్ని సీట్లు గెల్చినా ఈవీఎంలను అనుమానిస్తాం

లోక్‌సభలో అఖిలేశ్ యాదవ్ వ్యాఖ్య

న్యూఢిల్లీ: ఈవీఎంలపై తనకు విశ్వాసం లేదని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ పునరుద్ఘాటించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా మంగళవారం లోక్‌సభలో అఖిలేశ్ మాట్లాడారు. '' గతంలోనూ ఈవీఎంలను నమ్మలేదు. ఇప్పుడూ నమ్మను. ఉత్తరప్రదేశ్‌లోని మొత్తం 80 పార్లమెంట్ నియోజకవర్గాల్లోనూ ఎస్పీ గెలిచినాసరే ఈవీఎంలను నమ్మబోను. ఈవీఎంలపై విశ్వసనీయత అంశం ఎల్లప్పుడూ వివాదాస్పదమే. ఈవీఎంల విషయంలో ఎస్పీ వైఖరి మారదు' అని వ్యాఖ్యానించారు. ''తాజా లోక్‌సభ ఎన్నికలు దేశంలో మతతత్వ రాజకీయాలకు చరమగీతం పాడాయి. ఈ ఎన్నికల్లో 'ఇండియా' కూటమి నైతిక విజయం సాధించింది. బీజేపీ ప్రభుత్వం ఎప్పుడు కూలుతుందో ఎవరికీ లేదు. 'ఇండియా' కూటమి అధికారంలోకి వస్తే ఈవీఎంల విధానానికి స్వస్తి పలుకుతుంది'' అని అఖిలేశ్ అన్నారు.

ధన్‌ఖడ్ వర్సెస్ ఖర్గే

న్యూఢిల్లీ: రాజ్యసభ మరోసారి చైర్మన్ ధన్‌ఖడ్, విపక్ష నేత మల్లికార్జున ఖర్గే సంవాదానికి వేదికైంది. మంగళవారం కాంగ్రెస్ సభ్యుడు ప్రమోద్ తివారీ మాట్లాడుతుండగా నిరాధార ఆరోపణలు చేయొద్దంటూ ధన్‌ఖడ్ వారించగా వాటన్నింటికీ రుజువులున్నాయంటూ మరో సభ్యుడు జైరాం రమేశ్ జోక్యం చేసుకున్నారు. దాంతో, ''మీ సీనియర్ నాయకుడు (ఖర్గే) సభలోనే ఉన్నా మీరు కల్పించుకుంటున్నారు. ఖర్గే స్థానంలో మీరు విపక్ష నేత అయితే మేలేమో. ఎందుకంటే మీరెంతో తెలివైన వారు. మహా ప్రతిభావంతులు. పైగా ఇప్పటికే అనధికారికంగా సభలో ఖర్గే బాధ్యతలను మీరే నిర్వహిస్తూ వస్తున్నారు'' అంటూ చురకలు వేశారు. దాంతో జైరాంకు మద్దతుగా ఖర్గే కల్పించుకున్నారు. ''మీరు వర్ణ వ్యవస్థను తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. జైరాంను అత్యంత తెలివైనవాడని, నేనంత తెలివైన వాడిని కానని అనడంలో మీ ఉద్దేశం అదే కదా!'' అంటూ చైర్మన్ వ్యాఖ్యలపై అభ్యంతరం వెలిబుచ్చారు. దాంతో ధన్‌ఖడ్ తీవ్ర అసహనానికి లోనయ్యారు. తన వ్యాఖ్యలను ఖర్గే పూర్తిగా వక్రీకరిస్తున్నారని ఆగ్రహం వెలిబుచ్చారు.

లోక్‌సభ నిరవధిక వాయిదా

న్యూఢిల్లీ: 18వ లోక్‌సభ తొలి సమావేశాలు ముగిశాయి. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై జరిగిన రెండు రోజుల చర్చకు మంగళవారం ప్రధాని బదులిచ్చాక సభ నిరవధికంగా వాయిదా పడింది. స్పీకర్ ఓం బిర్లా ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశాల్లో ఏడు రోజులు 34 గంటల పాటు చర్చలు జరిగాయి. 103 శాతం ఉత్పాదకత నమోదైందని ఆయన తెలిపారు. జూన్ 24న మొదలైన పార్లమెంటు సమావేశాలు షెడ్యూల్ ప్రకారం బుధవారం దాకా జరగాల్సి ఉంది.

ప్రచండ ఉద్వాసనే లక్ష్యంగా.. కొత్త కూటమి

కఠ్మాండు: నేపాల్‌లో అనూహ్య రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. ప్రధానమంత్రి పుష్ప కమల్ దహల్ 'ప్రచండ 'ప్రభుత్వాన్ని గద్దె దించి 'జాతీయ ఏకాభిప్రాయ ప్రభుత్వం 'ఏర్పాటే లక్ష్యంగా బద్ధ విరోధులైన రెండు పెద్ద పార్టీలు చేతులు కలిపాయి. నేపాలీ కాంగ్రెస్(ఎన్సీ) అధ్యక్షుడు షేర్ బహదూర్ దేవ్‌బా, కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ నేపాల్-యూనిఫైడ్ లెనినిస్ట్(సీపీఎన్-యూఎంఎల్) చైర్మన్, మాజీ ప్రధాని కేపీ శర్మ ఓలి కొత్త కూటమి ఏర్పాటుపై సోమవారం రాత్రి సంతకాలు చేశారు. మొత్తం 275 మంది సభ్యుల నేపాల్ పార్లమెంట్‌లో ఎన్సీకి అత్యధికంగా 89 సీట్లు, సీపీఎన్-యూఎంఎల్‌కు 78 సీట్లు ఉన్నాయి. రెండు పార్టీలు ఏకమైతే వీటి బలం 167కు చేరుకుంటుంది. ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన మెజారిటీ 138 సీట్లే.



ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ప్రధాని మోదీని పూలదండతో సత్కరిస్తున్న కుమార స్వామి. చిత్రంలో రాజ్‌నాథ్, శివరాజ్ సింగ్ తదితరులు

రాహుల్‌లా ప్రవర్తించొద్దు!

- ఎన్డీయే సమావేశంలో ప్రధాని మోదీ సూచన
- చాయ్‌వాలా ప్రధాని కావడం విపక్షాలకు ఇష్టం లేదని వ్యాఖ్య

న్యూఢిల్లీ: ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సోమవారం సభలో అనుచితంగా మాట్లాడారని, ఆయనలాగా ఎవరూ ప్రవర్తించకూడదని, మాట్లాడకూడదని బీజేపీ ఎంపీలకు ప్రధాని మోదీ సూచించారు. మంగళవారం ఎన్డీయే పక్షాల ఎంపీల సమావేశంలో ప్రధాని మోదీ మాట్లాడారు. పార్టీ ఎంపీలకు దిశానిర్దేశం చేశారు. పార్లమెంటరీ నిబంధనలు, విధివిధానాలను ప్రతి ఒక్కరూ తూ.చా. తప్పకుండా పాటించాలని, సభలో సత్ప్రవర్తన కలిగి ఉండాలని తెలిపారు. సభలో అనుసరించాల్సిన ఉత్తమ విధానాల గురించి సీనియర్ ఎంపీల నుంచి నేర్చుకోవాలని కొత్తగా ఎన్నికైన ఎంపీలకు సూచించారు. కాంగ్రెస్సేతర నాయకుడు, అందులోనూ ఒక సాధారణ చాయ్‌వాలా మూడోసారి ప్రధానమంత్రి కావడాన్ని ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయని అన్నారు. పార్లమెంట్‌లో ప్రస్తావించాల్సిన అంశాలపై విస్తృతంగా అధ్యయనం చేయాలని, సభకు తప్పనిసరిగా హాజరు కావాలని, నియోజకవర్గాలకు సంబంధించిన అంశాలను ప్రభావవంతంగా ప్రస్తావించాలని పేర్కొన్నారు. ఏదైనా అంశంపై మీడియాతో మాట్లాడాలనుకుంటే తొలుత దానిపై అధ్యయనం చేయాలని చెప్పారు. నియోజకవర్గాలతో ఎప్పటికప్పుడు అనుసంధానమై ఉండాలని, మనకు మద్దతు ఇచ్చిన ఓటర్లకు కృతజ్ఞతలు చెప్పడం మన బాధ్యత అని వివరించారు. పార్లమెంట్ సభ్యులుగా దేశ సేవకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఢిల్లీలోని ప్రధానమంత్రి మ్యూజియాన్ని ఎంపీలందరూ సందర్శించాలని, భారత ప్రధానమంత్రుల జీవిత ప్రస్థానం గురించి అక్కడ తెలుసుకోవాలని సూచించారు.

రాజ్యసభలోనూ నీట్ రగడ

న్యూఢిల్లీ: నీట్-యూజీ ప్రశ్నపత్రం లీకేజీ ఉదంతం రాజ్యసభను కుదిపేసింది. పేపర్ లీక్‌తో లక్షలాది యువత భవిష్యత్తును నాశనం చేసిందని, రేయింబవళ్లు కష్టపడి చదివిన విద్యార్థుల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసిందని విపక్షాలు ఆందోళన వ్యక్తంచేశాయి. '' దేశంలో రెండు ఐపీఎల్‌లు జరుగుతున్నాయి. ఒకటి ఇండియన్ ప్రీమియర్ లీగ్, మరొకటి ఇండియన్ పేపర్ లీక్. ఒక ఐపీఎల్ బాల్, బ్యాట్‌తో ఆడితే ఇంకో ఐపీఎల్ యువత భవిష్యత్తుతో ఆడుకుంటోంది. నీట్-యూజీ పరీక్ష చేపట్టిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) అంటే ఇకపై నో ట్రస్ట్ ఎనీమోర్(ఎన్‌టీఏ)గా పలకాలి' అని ఆప్ సభ్యుడు రాఘవ్ చద్దా అన్నారు. ప్రతిష్టాత్మక పరీక్షల పేపర్ లీకేజీల అంశాన్ని సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరిపించాలని ఇంకొందరు సభ్యులు డిమాండ్‌చేశారు. '' తీవ్ర వివాదాస్పదమైన నీట్ పరీక్షను కేంద్రం ఇకనైనా రద్దుచేస్తుందా లేదా? '' అని కాంగ్రెస్ నేత దిగ్విజయ్‌సింగ్ సూటిగా ప్రశ్నించారు. ఎన్‌టీఏ చైర్మన్‌కు గతంలో మధ్యప్రదేశ్‌లో వ్యాపమ్ స్కామ్‌తో సంబంధం ఉందని దిగ్విజయ్ ఆరోపించారు. '' నీట్, నెట్ లీకేజీల్లో కోచింగ్ సెంటర్లదే ప్రధాన పాత్ర. అయినా వాటిపై ఎలాంటి చర్యలు చేపట్టలేదు'' అని ఎస్పీ నేత రాంగోపాల్ యాదవ్ ఆవేదన వ్యక్తంచేశారు. '' ఎన్‌టీఏ డైరెక్టర్ జనరల్ సుబోధ్ సింగ్‌ను తక్షణం డిస్మిస్ చేయకుండా రెండునెలల శాఖాపర దర్యాప్తు తర్వాత చర్యలు తీసుకుంటామని కేంద్రం చెప్పడంలో ఆంతర్యమేంటి?' అని ఎస్పీ నేత రాంజీలాల్ సుమన్ అనుమానం వ్యక్తంచేశారు.



లోక్‌సభలో విపక్ష సభ్యునికి మంచినీళ్లు అందిస్తున్న మోదీ

విపక్ష సభ్యులకు 'నీళ్లు తాగించిన' మోదీ!

న్యూఢిల్లీ: రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చకు బదులిస్తూ మంగళవారం లోక్‌సభలో ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రసంగంలో పలు పదనిసలు చోటుచేసుకున్నాయి. ఆయన ప్రసంగించినంతసేపూ విపక్ష సభ్యులంతా నిరసన తెలుపుతూనే ఉన్నారు. ఈ క్రమంలో పలువురు కాంగ్రెస్ సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చి నిలబడి మోదీకి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలకు దిగారు. వారిలో ఒకరికి ప్రధాని మంచినీళ్లు తెప్పించి మరీ స్వయంగా అందించారు. సదరు సభ్యుడు కాసేపు తటపటాయించి చివరికి వద్దంటూ నిరాకరించారు. అంతలో పక్కనే నినాదాలు చేస్తున్న మరో సభ్యుడు ఆ గ్లాస్ అందుకుని తాగారు! అనంతరం మోదీ మాట్లాడుతూ ''ఈ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు విపక్షంలో కూర్చోమ్మని, వాదించేందుకు ఏమీ లేకపోతే పార్లమెంటులో అరుపులు కేకలకు దిగండని తీర్పు ఇచ్చారు!'' అంటూ చురకలు వేశారు.

విపక్షాల తీరు గర్హనీయం

లోక్‌సభ తీర్మానం

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగిస్తుండగా విపక్షాలు పదేపదే అడ్డుకోవడాన్ని లోక్‌సభ తీవ్రంగా తప్పుబట్టింది. పార్లమెంటరీ సంప్రదాయాలన్నింటినీ అవి పూర్తిగా తుంగలో తొక్కాయని నిరసిస్తూ తీర్మానం చేసింది. ప్రధాని ప్రసంగం అనంతరం రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఈ మేరకు తీర్మానం ప్రవేశపెట్టారు. ''ప్రధాని మాట్లాడుతుండగా విపక్షాల ప్రవర్తించిన తీరు అత్యంత గర్హనీయం. దాన్ని సభ తీవ్రంగా ఖండించాలని ప్రతిపాదిస్తున్నా'' అని పేర్కొన్నారు. విపక్ష సభ్యుల ప్రవర్తనను స్పీకర్ ఓం బిర్లా కూడా తీవ్రంగా దుయ్యబట్టారు. వారి తీరు పార్లమెంటరీ సంప్రదాయాలకు అనుగుణంగా లేదన్నారు. ''సభ్యులందరికీ కావాల్సిన సమయమిచ్చా. విపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ ప్రసంగానికి గంటన్నరకు పైగా కేటాయించాను. అయినా విపక్షాల నుంచి ఇలాంటి దారుణ ప్రవర్తనా?'' అంటూ తీవ్రంగా తప్పుబట్టారు. తీర్మానాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్ షా బలపరిచారు. అనంతరం సభ మూజువాణీ ఓటుతో తీర్మానాన్ని ఆమోదించింది. ప్రధాని మాట్లాడేందుకు నుంచోగానే మణిపూర్ అంశంపై మాట్లాడే అవకాశమివ్వాలంటూ విపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. వారిలో ఒకరికి ఇప్పటికే ఆ అంశంపై మాట్లాడే అవకాశమిచ్చానని స్పీకర్ గుర్తు చేశారు. దాంతో కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగొయ్, ఇద్దరు మణిపూర్ ఎంపీలు వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలకు దిగారు. పలువురు కాంగ్రెస్ ఎంపీలు వారికి జత కలిశారు. తృణమూల్ కాంగ్రెస్ సభ్యులు నుంచుని వారికి మద్దతు తెలిపారు. సభ్యులను వెల్‌లోకి పంపుతున్నారంటూ రాహుల్‌ను స్పీకర్ తీవ్రంగా మందలించారు.

నీట్‌పై చర్చకు అవకాశమివ్వండి

ప్రధాని మోదీకి రాహుల్ గాంధీ లేఖ

న్యూఢిల్లీ: నీట్ అంశంపై బుధవారం లోక్‌సభలో చర్చకు అవకాశం కల్పించాలని ప్రధాని మోదీని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కోరారు. జూన్ 28న, జూలై ఒకటో తేదీన నీట్‌పై చర్చను చేపట్టాలంటూ ప్రతిపక్షం చేసిన వినతిని స్పీకర్ తిరస్కరించారని గుర్తు చేశారు. ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని లోక్‌సభ స్పీకర్ ప్రతిపక్షానికి హామీ ఇచ్చారని కూడా రాహుల్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం మోదీకి రాహుల్ లేఖ రాశారు. అయితే లోక్‌సభ మంగళవారమే నిరవధికంగా వాయిదా పడటం తెలిసిందే.

ఇంజనీర్ రషీద్‌కు 2 గంటల పెరోల్

న్యూఢిల్లీ: ఉగ్రవాదానికి నిధుల సమీకరణ కేసులో అరెస్టయి 2019 నుంచి తిహార్ జైలులో గడుపుతున్న బారాముల్లా స్వతంత్ర్య ఎంపీ షేక్ అబ్దుల్ రషీద్ అలియాస్ ఇంజనీర్ రషీద్‌కు ఎట్టకేలకు ఢిల్లీ కోర్టు పెరోల్ మంజూరుచేసింది. కోర్టు ఉత్తర్వుల మేరకు జూలై ఐదో తేదీన ఆయన జైలు నుంచి విడుదలై రెండు గంటల్లోపు ఎంపీగా ప్రమాణంచేసి మళ్లీ తిహార్ జైల్లోకి వెళ్లనున్నారు. ఇటీవల పార్లమెంట్ ఎన్నికల్లో కశ్మీర్‌లోని నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఫరూక్ అబ్దుల్లాను రషీద్ భారీ మెజారిటీతో ఓడించిన విషయం తెల్సిందే.

నీట్-పీజీ పరీక్షకు కొద్ది గంటల ముందే పేపరు ఖరారు

న్యూఢిల్లీ: నేషనల్ ఎలిజిబిలిటీ-కమ్-ఎంట్రన్స్ టెస్ట్- పోస్ట్ గ్రాడ్యుయేట్ (నీట్-పీజీ) పరీక్ష పత్రాన్ని ఇకపై భద్రతా కారణాల రీత్యా పరీక్షకు కొద్ది గంటల ముందు ఖరారు చేయనున్నారు. జూన్ 23వ తేదీన జరగాల్సిన ఈ పరీక్షను నీట్-యూజీ పేపర్ లీకేజీ ఆరోపణల నేపథ్యంలో వాయిదా వేయడం తెల్సిందే. తాజా తేదీలను వచ్చే వారంలో ప్రకటించాలని, ఆగస్టులో పరీక్ష ఉంటుందని అధికార వర్గాలు తెలిపాయి.

వార్‌హెడ్‌తో క్షిపణి పరీక్ష: ఉ.కొరియా

సియోల్: అతిపెద్ద వార్‌హెడ్‌ను మోసుకెళ్లె గలిగిన వ్యూహాత్మక బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించినట్లు ఉత్తర కొరియా ప్రకటించుకుంది. సోమవారం పరీక్షించిన హ్వాసంగ్‌ఫొ-11 డీఏ-4.5 రకం క్షిపణికి నాలుగున్నర టన్నుల బరువున్న వార్‌హెడ్‌ను అమర్చినట్లు ఆ దేశ వార్తా సంస్థ మంగళవారం తెలిపింది. ఈ క్షిపణి గరిష్టంగా 500 కిలోమీటర్లు, కనిష్టంగా 90 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను కచ్చితత్వంతో ఛేదించగలదని కూడా వెల్లడించింది. అయితే, ఉత్తర కొరియా సోమవారం ప్రయోగించిన రెండు క్షిపణుల్లో ఒకటి ఆ దేశ రాజధాని ప్యాంగ్యాంగ్ సమీపంలోని నిర్జన ప్రాంతంలో కుప్పకూలినట్లు దక్షిణ కొరియా సైన్యం మంగళవారం తెలిపింది.

నా వ్యాఖ్యలను మళ్లీ రికార్డుల్లో చేర్చండి

స్పీకర్ ఓం బిర్లాకు రాహుల్ గాంధీ లేఖ

న్యూఢిల్లీ: లోక్‌సభలో సోమవారం తాను చేసిన ప్రసంగంలో కొన్ని వ్యాఖ్యలను స్పీకర్ ఓం బిర్లా సంబంధిత రికార్డుల నుంచి తొలగించడం పట్ల కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అభ్యంతరం వ్యక్తం చేశారు. స్పీకర్ చర్య పార్లమెంటరీ ప్రజాస్వామ్య విలువలకు వ్యతిరేకమని పేర్కొన్నారు. తన వ్యాఖ్యలను మళ్లీ రికార్డుల్లో చేర్చాలని కోరారు. ఈ మేరకు మంగళవారం స్పీకర్ ఓం బిర్లాకు రాహుల్ లేఖ రాశారు. బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ చేసిన ప్రసంగాన్ని లేఖలో ప్రస్తావించారు. అనురాగ్ ఠాకూర్ అనుచితమైన ఆరోపణలు చేశారని, అయినప్పటికీ ఆ ప్రసంగంలో కేవలం ఒక్క పదాన్నే తొలగించారని ఆక్షేపించారు. దీని వెనుక మర్మం ఏమిటని ప్రశ్నించారు. ఎంపిక చేసిన వ్యక్తులు చేసే వ్యాఖ్యలను ఉద్దేశపూర్వకంగా విస్మరించడం తగదని పేర్కొన్నారు. లోక్‌సభ వ్యవహారాల ప్రక్రియ, నిర్వహణ నిబంధనల్లోని 380 నిబంధన ప్రకారం కొన్ని రకాల పదాలను మాత్రమే రికార్డుల నుంచి తొలగించాల్సి ఉంటుందని రాహుల్ గుర్తుచేశారు. సభలో సోమవారం తాను చేసిన వ్యాఖ్యలు ఈ నిబంధన కిందకు రావని తేల్చి చెప్పారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
బుధవారం । 3 । జూలై । 2024



ధార్వాడ జిల్లాలో ముంగారు వర్షాలకు విత్తనాలు వేయడంతో పొలాలు పచ్చగా మారాయి. ధార్వాడ శివార్లలో అమ్మినబావిలో కనువిందు దృశ్యం

న్యూస్‌రీల్

హాళకట్టి జయంతి వేడుకలు



వచనకారుడు హాళకట్టికి నివాళులు

తుమకూరు: వచన కవితా పితామహునిగా ప్రసిద్ధి చెందిన ఫ.గు. హాళకట్టి జీవిత చరిత్రను నేటి విద్యార్థులతోపాటు యువతకు తెలియజేయాల్సిన అవసరం ఉంది. పాఠశాలల్లో వచన సాహిత్య సంరక్షణ దినాన్ని నిర్వహించాలని తుమకూరు జిల్లా కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు కే.ఎస్.సిద్దలింగప్ప అన్నారు. కన్నడ భవనంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో వచన పితామహుడు ఫకీరప్ప గురువప్ప హాళకట్టి జయంతి, వచన సాహిత్య సంరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. వచన సాహిత్యానికి ఆయన చేసిన సేవలు అపారమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు పాల్గొన్నారు.

రైతు రుణాలను మాఫీ చేయాలి

మైసూరు: రైతులు సాగు చేసిన పంటలకు కనీస మద్దతు ధరను కల్పించాలి, రుణాలను పూర్తిగా మాఫీ చేయాలి అని, దీనిపై పార్లమెంటులో ప్రైవేటు బిల్లు పెట్టాలని ఎంపీలను కోరతామని రైతు సంఘాల అధ్యక్షుడు కురుబూరు శాంతకుమార్ చెప్పారు. మంగళవారం మైసూరు నగరంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఢిల్లీలో చుట్టుపక్కల రాష్ట్రాలకు చెందిన రైతులు సమస్యలపై పోరాటం చేస్తున్నారన్నారు, మనం కూడా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేయడానికి సిద్ధంగా ఉండాలని అన్నారు.

బ్రాండెడ్ పేరిట నకిలీ దుస్తుల విక్రయం



సీజ్ చేసిన దుస్తులు

బనశంకరి: నగరంలో పేరుపొందిన బ్రాండెడ్ దుస్తులను కొనుగోలు చేసేవారు అవి అసలైనవా, నకిలీవా అని ఒకసారి చెక్ చేసుకోవడం మంచిది. ఎందుకంటే కొందరు ఘరానా వ్యాపారులు నకిలీ బ్రాండెడ్ దుస్తులను అసలైనవిగా అమ్మేస్తున్నారు. రాజరాజేశ్వరినగర నరసింహరాజు అనే వ్యాపారికి చెందిన దుకాణంలో పోలీసులు సోదాలు చేసి రూ.1.38 కోట్ల విలువచేసే నకిలీ దుస్తులను స్వాధీనం చేసుకున్నారు. పూమా, నైకి, అడిడాస్‌తో పాటు పలు కంపెనీల పేర్లతో నకిలీ దుస్తులు తయారుచేసి ప్రజలకు విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి చేశారు. జీన్స్ ప్యాంట్, టీషర్టులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

బస్సులో రూ. 67 లక్షల నగల చోరీ


బనశంకరి: కేఎస్ ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న సమయంలో రూ.67.75 లక్షల విలువచేసే ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ఈ ఘటనపై మంగళూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలు.. ఓ మహిళ మంగళూరులో బ్యాంకు లాకర్‌లో పెట్టిన బంగారు, వజ్రాభరణాలను తీసుకుని గత నెల 19వ తేదీన బెంగళూరుకు కేఎస్ ఆర్టీసీ ఐరావత బస్సులో బయలుదేరింది. హ్యాండ్ బ్యాగులో నగలను ఉంచింది. హాసన్ వద్ద హ్యాండ్‌బ్యాగ్‌ను పరిశీలించగా అందులో ఆభరణాలు కనబడలేదు. హాసన్ వరకు తన పక్కన కూర్చుని ప్రయాణిస్తున్న మహిళ చోరీ చేసినట్లు అనుమానం ఉందని బాధితురాలు తెలిపింది. మంగళూరుకు వెళ్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

బెంగళూరు పాలికె ఎన్నికలు ఎప్పుడో?

బృహత్ బెంగళూరు మహానగర పాలికెలో ప్రజాప్రతినిధుల పాలన 2020 సెప్టెంబరుతో పూర్తయింది. కానీ ఇప్పటివరకు మళ్లీ ప్రజాప్రతినిధుల పరిపాలన వచ్చింది లేదు. మేయర్ లేరు, కార్పొరేటర్లు లేరు, వివిధ స్థాయీ కమిటీలచే ప్రజా సమస్యల పర్యవేక్షణ అసలే లేదు. ఎన్నికలు జరపవచ్చని ఉన్నత న్యాయస్థానాలు ఆదేశాలిచ్చినా చలనం లేదు.



బీబీఎంపీ ప్రధాన కార్యాలయం



పర్యవేక్షణ లేక నగరమంతా సమస్యలు

- 4 ఏళ్ల నుంచి మేయర్, కార్పొరేటర్లు లేరు
- వార్డుల్లో ఎక్కడి సమస్యలు అక్కడే
- బీబీఎంపీ ఎన్నికలకు అన్ని పార్టీల నిరాసక్తత

బనశంకరి: దేశంలో సిలికాన్ సిటీగా పేరుగాంచిన బెంగళూరులో సుమారు నాలుగేళ్ల స్థానిక పరిపాలన లేదంటే అతిశయోక్తి కాదు. నగర పాలికెకు ఎన్నికలు జరపకపోవడంతో వార్డులు సమస్యలతో నిండిపోయాయని ఆరోపణలున్నాయి. 2020లో కోవిడ్ నెపంతో ఎన్నికలను వాయిదావేశారు. తరువాత ఏర్పడిన బీజేపీ ప్రభుత్వం కొన్ని ప్రయత్నాలు చేసింది. నగర వార్డులను 198 నుంచి 249 పెంచి, మళ్లీ 225కు తగ్గించారు. రెండుసార్లు వార్డుల పునర్విభజన, రిజర్వేషన్లు చేపట్టినప్పటికీ ఎన్నికలు మాత్రం జరగలేదు. గత ఏడాది కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత మంత్రి రామలింగారెడ్డి అధ్యక్షతన ఒక కమిటీని ఏర్పరిచారు. ఈ కమిటీ గత ఏడాది 2023 డిసెంబరులోగా ఎన్నికలు నిర్వహిస్తామని హామీ ఇచ్చినప్పటికీ అదేమీ జరగలేదు. ఈలోగా లోక్‌సభ ఎన్నికలు వచ్చాయి. బెంగళూరు పరిధిలో కాంగ్రెస్‌కు ఒక్క ఎంపీ సీటు దక్కలేదు.

ఇబ్బందులు ఎవరికి చెప్పాలి

బెంగళూరులో వార్డులకు కార్పొరేటర్లు లేరు, పెత్తనమంతా అధికారుల చేతుల్లో ఉంది. రోడ్లు, మంచినీరు, వీధి దీపాలు, డ్రైనేజీ, కరెంటు సహా అనేక చిన్నా పెద్ద సమస్యల గురించి ఎవరికి చెప్పుకోవాలో తెలియక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు విన్నవించినప్పటికీ స్పందన లేదని విమర్శలున్నాయి. స్థానిక ఎమ్మెల్యేల దర్శనం దొరకదు. సామాన్యులు ఎమ్మెల్యేలను కలవడం చాలా కష్టం. రాజకీయ నేతల అలసత్వానికి తాము బలవుతున్నామని నగరవాసులు ఆరోపిస్తున్నారు.

వాయిదా పడేలా వ్యూహాలు

కాంగ్రెస్, బీజేపీతో సహా అన్ని పార్టీలకు, నగర ఎమ్మెల్యేలకు బీబీఎంపీ ఎన్నికల పట్ల ఆసక్తి లేనట్లుంది. దీంతో ఎవరూ ఎన్నికలు కావాలని కోరడం లేదు. ఎన్నికలు వాయిదా పడేలా బీబీఎంపీ పునర్విభజన, లండన్ తరహాలో పాలికె ఏర్పాటు, బీబీఎంపీని 5 విభాగాలుగా చేయడం గురించి చర్చిస్తున్నారు. ఎన్నికలు జరిగి కార్పొరేటర్లు వస్తే తమ అధికారం తగ్గుతుందని ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర నేతల ఆందోళనగా తెలుస్తోందని కొందరు మాజీ కార్పొరేటర్లు పేర్కొన్నారు. వీటి మధ్య వార్డుల సమస్యల ఎక్కడ వేసిన గొంగళి అక్కడే మాదిరిగా ఉన్నాయని తెలిపారు. అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు కుంటుపడ్డాయని, ఇప్పటికైనా ప్రభుత్వం పాలికె ఎన్నికలను జరపాలని సూచించారు. గతంలో హైకోర్టు, సుప్రీం కోర్టు కూడా బీబీఎంపీ ఎన్నికలకు అనుకూలంగా ఆదేశాలిచ్చాయని తెలిపారు.

ప్రకటనలతో సరి

ఈ ఏడాదిచివరిలోగా బీబీఎంపీ ఎన్నికలు నిర్వహిస్తామని డిప్యూటీ సీఎం డీకేతో పాటు కొందరు మంత్రులు చెబుతున్నారు. కానీ బీబీఎంపీలో ఎలాంటి ప్రక్రియ ప్రారంభం కాకపోవడంతో అందరికీ అనుమానంగా ఉంది. 225 వార్డులకు రిజర్వేషన్ జాబితా రూపొందించాలని ఆదేశించినట్లు డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తెలిపారు. పలు సర్వేలలో అధికార కాంగ్రెస్‌కు పాలికెలో భంగపాటు తప్పదని వచ్చింది. పైగా ఎక్కువసార్లు పాలికె పీఠాన్ని బీజేపీ దక్కించుకుంది. ఓడిపోవడం కంటే ఎన్నికలు జరపక పోవడం మంచిదని బెంగళూరు నగర కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సీఎం, డిప్యూటీ సీఎంపై ఒత్తిడి తీసుకువస్తున్నట్లు సమాచారం.



చదువు కోసం వచ్చి డ్రగ్స్ దందా



డ్రగ్స్‌ను పరిశీలిస్తున్న పోలీసు కమిషనర్



పట్టుబడిన ఆఫ్రికావాసులు

- నగరంలో ఇద్దరు ఆఫ్రికన్ల అరెస్టు
- రూ. 12 లక్షల సరుకు సీజ్

బనశంకరి: మాదక ద్రవ్యాల విక్రయాలకు పాల్పడుతున్న ఇద్దరు విదేశీయులను బెంగళూరు సీసీబీ పోలీసులు అరెస్ట్‌చేశారు. వీరి వద్ద నుంచి రూ.12 లక్షల విలువచేసే డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్ కమిషనర్ బీ.దయానంద్ తెలిపారు. మంగళవారం డ్రగ్స్‌ను పరిశీలించి విలేకరులతో ఆయన మాట్లాడారు. విద్యారణ్యపురలో డ్రగ్స్ విక్రయాలు జరుగుతున్నాయని తెలిసి ఘనా పౌరుడు సిరిల్(23), నైజీరియావాసి ఇమానుయేల్ (27) అనే ఇద్దరిని అరెస్ట్‌చేసి వీరి వద్ద నుంచి రూ.12 లక్షల విలువచేసే ఎండీఎంఏ క్రిస్టల్స్, ఎక్స్‌టసీ గుళికలు, కొకైన్, ద్విచక్రవాహనం, మొబైల్‌ఫోన్ తదితరాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వీరు విద్యార్థి వీసాతో బెంగళూరుకు వచ్చి విలాసవంతమైన జీవితం గడపడం కోసం డ్రగ్స్ వ్యాపారం చేపట్టారు. గోవా, ముంబై, ఢిల్లీలో ఉండే విదేశీయుల నుంచి తక్కువ ధరకు మాదకద్రవ్యాలను కొనుగోలు చేసి బెంగళూరుకు తీసుకువచ్చి అధిక ధరకు విక్రయించేవారు. వీరిపై విద్యారణ్యపుర పోలీస్‌స్టేషన్‌లో డ్రగ్స్ రవాణా చట్టాల కింద కేసు నమోదు చేశారు.

స్థానికుల గంజాయి అమ్మకాలు

కొందరు స్థానికులు గంజాయి అమ్ముతూ దొరికారు. కోణణకుంటెలో దొడ్డకల్లసంద్ర చెరువు వెనుక గంజాయి అమ్ముతున్న వికాస్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి ఇతడి వద్ద నుంచి రూ.1.80 లక్షల విలువచేసే 2 కిలోల గంజాయిని, 10 కిలోల మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే వీవీ.పురం పార్వతీపురంలో గంజాయి అమ్ముతున్న రసిక్‌కుమార్ అనే సెక్యూరిటీ గార్డును అరెస్ట్‌చేసి రూ.5 లక్షల విలువచేసే 4 కేజీల గంజాయిని సీజ్ చేసినట్లు కమిషనర్ తెలిపారు.



సీజ్ చేసిన డ్రగ్స్, మొబైళ్లు

19 ఏళ్లుగా పరారీ... మాజీ నక్సలైటు అరెస్టు

పావగడ: తుమకూరు జిల్లా పావగడ తాలూకాలోని తిరుమణి పోలీస్ స్టేషన్ పరిధిలో వెంకటమ్మనహళ్లిలో పోలీసుల హత్య కేసులో నిందితుడు, అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం కేశవపురం గ్రామానికి చెందిన మాజీ నక్సలైట్ చంద్రు అలియాస్ ముత్యాలును తిరుమణి పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఇతడు గత 19 సంవత్సరాలుగా పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. 2005లో కూంబింగ్ చేసి పాఠశాల ఆవరణలో రాత్రి నిద్రిస్తున్న పోలీసులపై వ్యాన్‌లో వచ్చిన నక్సలైట్లు తుపాకులతో దాడి చేశారు. ఈ మారణకాండలో 9 మంది పోలీసులు అమరులయ్యారు. ఇందులో 32 మంది నక్సలైట్లపై పోలీసులు కేసు పెట్టారు. ఇటీవల కూడా ఒకరిని పట్టుకున్నారు.

ఆశించిన వానలు లేవు: రెవెన్యూ మంత్రి


మైసూరు: రాష్ట్రంలో మొత్తం 31 జిల్లాల్లో సగటున 208 మిల్లీమీటర్ల వర్షం పడుతుందన్న ఆశలు ఉన్నాయి, కానీ అనుకున్న దానికంటే చాలా తక్కువగా వర్షాలు కురుస్తున్నాయి. కొన్ని జిల్లాల్లోనే వానలు వస్తూ, మరికొన్ని జిల్లాల్లో రావడం లేదు అని రెవెన్యూ మంత్రి కృష్ణబైరెగౌడ వాపోయారు. మంగళవారం మైసూరు నగరంలోని ప్రాదేశిక కమిషనర్ కార్యాలయంలో మైసూరు, చామరాజనగర, మండ్య, హాసన్, మంగళూరు, కొడగు, ఉడుపి, చిక్కమగళూరు జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ఇప్పటికి రాష్ట్రంలో 205 మి.మీ. వర్షం పడింది. నిబంధనల ప్రకారం కేంద్రానికి కరువు పరిహారం అడిగే స్థితి లేదని మంత్రి అన్నారు. రాష్ట్రంలో తొలకరిజల్లులు పడినా కూడా అవి అనుకున్న స్థాయిలో లేవన్నారు. కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు పడి ఆస్తి, ప్రాణ నష్టం జరిగిందని, మరికొన్ని చోట్ల వర్షాలు లేక ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

రాష్ట్రంలో కోస్తా జిల్లాలు మినహా ఇతర ప్రాంతాల్లో వర్షాలు నిలిచిపోయాయి. రాజధాని బెంగళూరులోను అప్పుడప్పుడు చిరుజల్లులు తప్ప పెద్ద వానలు తగ్గాయి. బళ్లారి, రాయచూరు తదితర జిల్లాల్లో వానల కోసం నిరీక్షణ ఏర్పడింది. జలాశయాల్లో నీటిమట్టం అంతంతే ఉంది.

స్థల వివాదంలో ముఖ్యమంత్రి!

శివాజీనగర: ముఖ్యమంత్రి సిద్దరామయ్య స్థల వివాదంలో చిక్కుకున్నారు. ఆయన సతీమణికి చెందిన భూమిని ముడా స్వాధీనం చేసుకుంది, అందుకు బదులుగా 50:50 నిష్పత్తిలో మరో చోట ఇంటి స్థలాలను బీజేపీ అధికారంలో ఉన్నపుడు ఇచ్చారని సిద్దరామయ్య వివరణ ఇచ్చారు. మంగళవారం బెంగళూరులో మాట్లాడుతూ ముడా ఇంటి స్థలం విషయమై వివరించారు. బీజేపీ సర్కారు అధికారంలో ఉన్నప్పుడు మాకు ఇంటి స్థలం ఇచ్చారు. నా భార్యకు చెందిన 3 ఎకరాల 16 గుంటల భూమి రింగ్ రోడ్డు పక్కన చిత్తడి నేలలో ఉండేది. దానిని నా బావమరిది నా భార్యకు దానంగా ఇచ్చారు. తమ భూమిని స్వాధీనం చేసుకుని ముడావారు ఇంటి స్థలాలను చేసి పంపిణీ చేశారు. పంపిణీ తరువాత మాకు చట్ట ప్రకారంగా స్థలం ఇవ్వాలి. అదే ప్రకారంగా 50:50 ఇవ్వటానికి ఆమోదించారన్నారు. 50:50 నిష్పత్తిలో ఇవ్వాలని చట్టం చేసినది బీజేపీవారు. ఆ సమయంలో వారు వేర్వేరు చోట్ల సమాన విస్తీర్ణంలో స్థలాలు ఇచ్చారు, ఇందులో తప్పేముందని ప్రశ్నించారు. కాగా, తక్కువ విలువైన నేలను సర్కారుకు ఇచ్చి, బదులుగా ఎక్కువ విలువైన చోట్ల భూములను తీసుకున్నారని ఆరోపణలు వచ్చాయి.

కాలేజీలో బాలిక ప్రసవం



- కోలారులో సంఘటన

కోలారు: చదువుకునే విద్యార్థిని ఎవరి దాష్టీకానికో గురై తల్లయింది. కాలేజ్ క్యాంపస్‌లో ఇంటర్ ఫస్టియర్ చదివే బాలిక మగ శిశువుకు జన్మనిచ్చిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. మైనర్ బాలిక కోలారు నగరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ విద్యార్థిని. గర్భం దాల్చినప్పటికీ ఆ విషయం ఎవరికీ చెప్పకుండా దాచింది. కాలేజీలో నొప్పులు రాగా టాయ్‌లెట్‌కి వెళ్లింది, అక్కడే ప్రసవించగా మగ బిడ్డ జన్మించాడు. శిశువు ఏడుపు విని ఉపాధ్యాయులు, సిబ్బంది చూసి అవాక్కయ్యారు. గుట్టుగా ఆర్ఎల్ జాలప్ప ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. జిల్లాలోని శ్రీనివాసపురం తాలూకాకు చెందిన విద్యార్థినికి ఇదే తాలూకాకు చెందిన యువకునితో ప్రేమాయణం సాగిందని, ఆ ఫలితమే గర్భమని అనుమానాలున్నాయి. అతడు పరారీలో ఉన్నాడు. స్త్రీ శిశు సంక్షేమ అధికారులు, పోలీసులు కాలేజీలో విచారణ జరిపారు.

గంధం దొంగలపై కాల్పులు



కాల్పుల్లో కాలికి గాయమైన దృశ్యం

కోలారు: శ్రీగంధం దొంగతనం చేయడానికి వచ్చిన దొంగ అటవీశాఖ సిబ్బంది జరిపిన కాల్పులలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఘటన ముళబాగిలు తాలూకా కాశీపుర అటవీ ప్రాంతంలో చోటు చేసుకుంది. ముళబాగిలు తాలూకా తాయలూరు గ్రామానికి చెందిన భత్యప్ప అనే యువకుడు గాయపడిన వ్యక్తి. మంగళవారం తెల్లవారుజామును భత్యప్ప, పొరుగునే ఏపీకి చెందిన మరో ఐదు మందితో శ్రీగంధం చెట్ల దొంగతనానికి వచ్చాడు. విషయం తెలుసుకున్న అటవీశాఖ గార్డు అనిల్ వారిని పట్టుకోవడానికి యత్నించాడు. భత్యప్ప, ఇతరులు గార్డు అనిల్‌పై దాడికి యత్నించడంతో అనిల్ వారిపై కాల్పులు జరిపాడు. భత్యప్ప కాళ్లకు గాయాలు కాగా అక్కడే పడిపోగా, మిగతావారు పారిపోయారు. అతన్ని ముళబాగిలు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు.

రోజుకు కోటి లీటర్ల పాల ఉత్పత్తి

శివాజీనగర: కేఎంఎఫ్ ద్వారా రోజుకు ఒక కోటి లీటర్ల పాల సేకరణ చేసిన నేపథ్యంలో సీఎం నివాస కార్యాలయం కృష్ణాలో సంబరాలు జరిగాయి. సీఎం సిద్దరామయ్యచే ఒక కోటి లీటర్ల పాల సేకరణ ఫలకానికి బెల్ కొట్టి, గో పూజ చేశారు. మంత్రులు చెలువరాయస్వామి, రాజణ్ణ, భైరతి సురేశ్, జమీర్ అహమ్మద్, కేఎంఎఫ్ అధ్యక్షుడు భీమా నాయక్, పాటుగా ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

గతేడాది కర్ణాటకలో పాల ఉత్పత్తి రోజుకు 90 లక్షల లీటర్లు ఉండేది. ఈ సంవత్సరంలో ఒక రోజుకు 1 కోటి లీటర్లకు చేరుకున్నాం. ఇదొక మైలురాయి అని పేర్కొన్నారు. పాడి రైతులకు ఒక రోజుకు రూ. 5 కోట్ల ప్రోత్సాహ ధనాన్ని ప్రభుత్వం ఇస్తోందన్నారు. పాలను పెంచి ధరను పెంచామని, దీనిని ధర పెంపు అంటు బీజేపీ రాద్ధాంతం చేస్తోందన్నారు.

సిటీ రహదారులకు వైట్ టాపింగ్



సమావేశంలో పాలికె చీఫ్, అధికారులు



సంపిగె నగరంలో అసంపూర్తిగా వైట్ టాపింగ్

- బీబీఎంపీ కమిషనర్



శేషాద్రి రోడ్డులో అసంపూర్తిగా వైట్ టాపింగ్ (ఫైల్)

బనశంకరి: బృహత్ బెంగళూరు మహానగర పాలికె పరిధిలో చేపట్టే రోడ్ల వైట్‌టాపింగ్ పనులకు అన్ని ఏర్పాట్లు చేయాలని బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్ అధికారులకు సూచించారు. ఈ విషయమై మంగళవారం ఉన్నతాధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలో వైట్‌టాపింగ్ పనులు 15 ప్యాకేజీల్లో జరుగుతాయని, పనులు చేయాలని కాంట్రాక్టర్లకు ఆదేశపత్రాలు అందించామని తెలిపారు. పనులకు ఇబ్బందులు లేకుండా జలమండలి, భూగర్భ డ్రైనేజీ, బెస్కాం, కేపీటీసీఎల్, గెయిల్ పైపులైన్ల మార్పులపై ఆయా శాఖలతో సమీక్ష జరపాలని తెలిపారు. వైట్ టాపింగ్ పనులు పూర్తిచేసిన తరువాత ఆ రోడ్లపై ఎలాంటి కారణానికి తవ్వకాలకు అనుమతిచ్చేది లేదన్నారు. నగరంలో ఎక్కడెక్కడ వైట్ టాపింగ్ పనులు చేస్తున్నారో ఆ వివరాలను అన్ని శాఖలకు అందించామని తెలిపారు. వైట్ టాపింగ్ పనులు జరిగే చోట ట్రాఫిక్ పోలీస్ విభాగంతో మాట్లాడి వాహనాల మళ్లింపు చేయాలని, గడువులోగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల పేరుతో వాహనాల సంచారానికి అడ్డంకులు తలెత్తరాదని అన్నారు. దశలవారీగా వైట్ టాపింగ్‌ను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్లు ప్రహ్లాద్, లోకేశ్, జలమండలి ఇంజనీర్ గంగాధర్, వెంకటేశ్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

మామూలు ఖైదీగానే దర్శన్

- జైల్లో ఎలాంటి ప్రత్యేక వసతులు కల్పించలేదు : హోంమంత్రి

శివాజీనగర: హత్య కేసులో అరెస్టయిన నటుడు దర్శన్‌కు జైలులో ఎలాంటి ప్రత్యేక సదుపాయాలు కల్పించటం లేదని, మామూలు ఖైదీలతో సమానంగా ఉన్నారని హోం మంత్రి జీ.పరమేశ్వర్ చెప్పారు. మంగళవారం సదాశివనగరలో తన ఇంటి వద్ద మాట్లాడిన ఆయన, దర్శన్‌కు జైలులో ప్రత్యేక సదుపాయాలు ఇస్తున్నారనే ఆరోపణలను తిరస్కరించారు. జైలులో బిర్యానీ వంటివి ఏవీ ఇవ్వడం లేదు. చూడాలనుకుంటే రండి, నాతో పాటు తీసుకెళ్లి చూపిస్తానన్నారు.

నూతన చట్టం కింద 66 కేసులు

కొత్త నేర చట్టాల కింద రాష్ట్రంలో 66 కేసులు నమోదయ్యాయి. బెంగళూరులో 20 కేసులు ఉన్నాయి. నూతన చట్టాల్లో కొన్ని అంశాలు బాగుంటే, మరి కొన్ని బాగాలేవు. వాటి గురించి చర్చించి కేంద్రం దృష్టికి తీసుకొస్తామని హోంమంత్రి తెలిపారు. ఈ కొత్త చట్టాలు దేశమంతటికి సంబంధించినవి. లక్షలాది కేసులు నూతన చట్టం కింద నమోదవుతాయి. ఈ చట్టాల గురించి చర్చలు జరగాల్సి ఉంది. కొన్ని అంశాలపై కేసు నమోదుకు ఆస్కారం లేదు అని తెలిపారు.

చిన్నారికి ఖైదీ డ్రెస్.. అభిమాని అతి

దొడ్డబళ్లాపురం: రేణుకాస్వామి అనే యువకుని హత్య కేసులో అరెస్టయి పరప్పన అగ్రహార జైల్లో హీరో దర్శన్ కాలం గడుపుతున్నారు. బయట ఆయన అభిమానులు మాత్రం తలోరకంగా అభిమానాన్ని చాటుకుంటున్నారు. ఓ అభిమాని తన చిన్నారి కొడుక్కి ఖైదీ డ్రెస్ వేసి, జైలులో దర్శన్‌కు ఇచ్చిన ఖైదీ నంబర్ 6106ని రాయించాడు. ఆ ఫోటోలను సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. దీనిపై అనేకమంది తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దర్శన్ అభిమానులు మాత్రం అభినందించారు.

దర్శన్ ఆందోళనగా ఉన్నారు: ధన్వీర్

దొడ్డబళ్లాపురం: నటుడు ధన్వీర్ పరప్పన అగ్రహార జైలులో ఉన్న దర్శన్‌ను మంగళవారం కలిశారు. బయటకు వచ్చి మీడియాతో మాట్లాడిన ఆయన దర్శన్ చాలా ఆందోళనగా కనిపించారని, ఆ స్థితిలో ఆయనను చూడలేకపోయానని ఆవేదన వ్యక్తం చేసారు. అంతా మంచే జరగాలని ఆశిస్తున్నానన్నారు.



దర్శన్

జైలు నుంచి నిర్మాతలకు దర్శన్ ఫోన్?

- బెయిల్ ఇప్పించాలని ఒత్తిడి

దొడ్డబళ్లాపురం: రేణుకాస్వామి హత్య కేసులో అరెస్టై పరప్పన అగ్రహార జైలులో ఖైదీగా ఉన్న హీరో దర్శన్ జైలు నుండే నిర్మాతలకు ఫోన్ చేసి బెయిల్ ఇప్పించాలని ఒత్తిడి తెస్తున్నాడని సమాచారం. జైలులో ఉన్న ఫోన్‌బూత్ నుండి నిత్యం నిర్మాతలకు కాల్ చేస్తున్న దర్శన్ పలువురు నిర్మాతలతో మాట్లాడుతూ త్వరగా బెయిల్ ఇప్పించాలని కోరుతున్నాడట. తోటి ఖైదీల ఫోన్ కాల్స్ లిమిట్ కూడా తానే వినియోగించుకుంటున్నాడట. అంతేకాకుండా అర్ధాంతరంగా నిలిచిపోయిన తన సినిమాల గురించి నిర్మాతలు, డైరెక్టర్లతో చర్చిస్తున్నాడని తెలుస్తోంది. కుటుంబ సభ్యులతో మాట్లాడని దర్శన్ రాత్రయితే ఇలా నిర్మాతలు, డైరెక్టర్లకు కాల్ చేస్తున్నాడని సమాచారం.

ఊరించి.. ఉసూరనిపించి..


ఎద్దులతో పొలం దున్నుతున్న రైతన్నలు


ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న దృశ్యం


పొలంలో పేడ ఎరువు చల్లుతున్న దృశ్యం

- ముఖం చాటేస్తున్న వరుణ దేవుడు
- వర్షం కోసం రైతుల ఎదురుచూపులు

సాక్షి,బళ్లారి: గత ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల పెట్టిన పంటలకు పెట్టుబడులు కూడా దక్కక అప్పులు ఊబిలో కూరుకుపోయిన రైతన్నలు, ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లోనైనా గత ఏడాది నష్టపోయిన పంటలను పండించుకుందామని కోటి ఆశలతో పంటలు సాగు చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి, సకాలంలో దుక్కులు దున్నేందుకు వర్షాలు బాగా కురవడంతో జిల్లా వ్యాప్తంగా రైతులు విత్తన సాగుకు భూమి తల్లిని సిద్ధం చేశారు. జిల్లా వ్యాప్తంగా వర్షాధారిత, నీటిపారుదల సౌకర్యం కలిగిన భూములు దాదాపు ఐదు లక్షల ఎకరాలకు పైగానే ఉన్నాయి. ఇందులో తుంగభద్ర ఆయకట్టు కూడా విస్తారంగా ఉంది.

కేవలం 14 శాతం మాత్రమే విత్తన సాగు

జిల్లాలో బళ్లారి గ్రామీణ, కంప్లి, సిరుగుప్ప, సండూరు నియోజకవర్గాల పరిధిలో ఇప్పటి వరకు సండూరు, బళ్లారి, సిరుగుప్ప తాలూకాల్లో వర్షాధారిత భూముల్లో కేవలం 14 శాతం మాత్రమే విత్తన సాగు జరగడంతో రైతుల్లో ఆందోళన నెలకొంటోంది. వర్షాధారిత భూముల్లో ప్రధానంగా సాగు చేసే వేరుశెనగ, జొన్న, సజ్జ, మొక్కజొన్న తదితర పంటలకు సంబంధించి విత్తనాలను కూడా సిద్ధం చేసుకున్నారు. నీటి పారుదల వసతి కలిగిన భూముల్లో సాగు చేసే ప్రధాన పంటలైన వరి, మిర్చి, చెరుకు, పత్తి తదితర పంటలకు సాగు చేసేందుకు అన్ని విధాలుగా విత్తనాలతో పాటు ఎరువులను సిద్ధం చేసుకున్నారు.

తుంగభద్రమ్మపైనే కోటి ఆశలు

తుంగభద్ర ఆయకట్టులో సాగు చేసే రైతన్నలు ముందుగా వరినారు పోసుకున్నా కాలువకు నీరు వదిలేదానిపై ఆయకట్టు రైతుల భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. గత ఏడాది ఇదే సమయానికి తుంగభద్ర డ్యాంలో కేవలం 3.5 టీఎంసీల నీరు మాత్రమే ఉండేది. ప్రస్తుతం దాదాపు 8 టీఎంసీలకు చేరినప్పటికీ ఆశించిన మేర నీరు రాకపోవడంతో ఆయకట్టు రైతులు కూడా డ్యాంలోకి ఎప్పుడెప్పుడు పూర్తిస్థాయిలో నీరు నిండి సకాలంలో కాలువలకు నీరు విడుదల చేస్తారా? అని ఎదురు చూస్తున్నారు. బోరు బావుల సదుపాయం ఉన్న రైతులు వరినారు పోసుకుని రైతులకు విక్రయించేందుకు సిద్ధం చేసుకుంటున్నారు. నీటిపారుదల వసతి కలిగిన భూములు ఉన్న రైతుల పరిస్థితి ఒకలా ఉంటే, వర్షాధారిత భూములు ఉన్న రైతులకు మరింత ఆందోళన మొదలైంది.

అదును దాటుతోందని రైతుల్లో ఆందోళన

సాధారణంగా జూలై మొదటి వారంలోపు 60 శాతం పైగా విత్తన సాగును అధికారులు లక్ష్యంగా పెట్టుకుంటారు. జూలై రెండో వారంలోపు వర్షాధారిత భూముల్లో పంటలు సాగు చేస్తే అదునులో సాగు చేసినట్లని, లేకుంటే పంటలు బాగా పండేందుకు సమస్యలు తలెత్తుతాయని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. ఈనేపథ్యంలో ఖరీఫ్ అదును దాటుతున్నా జిల్లా వ్యాప్తంగా విత్తనసాగు ఊపందుకోకపోవడంతో రైతులు వరణుడి కోసం ఎదురుచూస్తున్నారు. ప్రతి రోజు మేఘాలు ఊరించి ఉసూరుమనిపిస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మేఘాలు కమ్ముకుంటున్నాయే కాని పదునైన వర్షం కురవనందున సకాలంలో పంటల సాగుకు వీలు కావడం లేదని రైతులు వాపోతున్నారు.

క్లుప్తంగా

ఆల్మట్టికి పెరుగుతున్న వరద


ఆల్మట్టి జలాశయంలో పోటు జలాల పరవళ్లు

రాయచూరు రూరల్: గత కొన్ని రోజుల నుంచి మహారాష్ట్రలోని నదీ పరివాహక ప్రాంతాల్లో వానలు కురుస్తుండడంతో కొద్దిమేర కృష్ణా నదిలోకి వరద నీరు వస్తున్నాయి. ఉత్తర కర్ణాటకలోని బెళగావి, బాగల్‌కోటె, విజయపుర, కళ్యాణ కర్ణాటకలోని కలబుర్గి, యాదగిరి, రాయచూరు జిల్లాలకు గాను బాగల్‌కోటె జిల్లా బనహట్టి రబకవి వద్ద కృష్ణా నదిలో వరద ఊపందుకుంది. దీంతో ఆల్మట్టి జలాశయంలోకి వరద చేరుతోంది. ప్రస్తుతం జలాశయంలో 519.60 మీటర్లకు గాను 511.05 మీటర్లకు నీటిమట్టం చేరింది.

కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి


వినతిపత్రం అందిస్తున్న నాయకులు

రాయచూరు రూరల్: కార్మికుల ఐక్యత వర్ధిల్లాలని ఏఐఐఈఏ ప్రధాన కార్యదర్శి రవి అన్నారు. ఎల్‌ఐసీ డివిజన్ కార్యాలయంలో జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజలతో మమేకమయ్యే సంఘాలన్నీ ఏకతాటిపై నడిచి ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో శరణేగౌడ, శ్రీధర్‌లున్నారు.

హళకట్టి ఆదర్శాలు అనుసరణీయం


చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన అతిథులు

రాయచూరు రూరల్: నేటి ఆధునిక సమాజంలో వచన సాహిత్యానికి హళకట్టి అందించిన సేవలు, ఆయన ఆశయాలు, ఆదర్శాలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని సీనియర్ కవి వీర హనుమాన్ అన్నారు. మంగళవారం సిద్దరామ జంబలదిన్ని రంగ మందిరంలో వచన సాహితీవేత్త హళకట్టి జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి మాట్లాడారు. ఏఎస్పీ శివకుమార్, ఏసీ మెహబూబి, దానమ్మ, వెంకటేష్, ఈరేష్ నాయక్, బాబు భండారిగల్‌లున్నారు.

ఆ ఎద్దు ధర రూ.18 లక్షలు


భారీ ధర పలికిన ఎద్దు ఇదే

సాక్షి,బళ్లారి: ఉత్తర కర్ణాటకలో పేరుగాంచిన ఎద్దుల పోటీల్లో విజయం సాధించిన ఎద్దు విలువ లక్ష కాదు, రెండు లక్షలు కాదు, ఏకంగా రూ.18 లక్షలకు అమ్ముడు పోయింది. విజయపుర జిల్లా బబలేశ్వర తాలూకా బబలాది గ్రామానికి చెందిన రామనగౌడకు చెందిన ఎద్దును పలు జిల్లాల్లో ఎద్దులు పోటీలకు తీసుకెళ్లి అందరినీ ఆకట్టుకునేలా చేశారు. గత కొన్నేళ్లుగా ఆ ఎద్దును పోటీలకు మాత్రమే తీసుకెళుతూ బలవర్ధకమైన ఆహారం అందిస్తూ ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ఇప్పటి వరకు ఈ ఎద్దు పలు పోటీల్లో రూ.40 లక్షల నగదు, దాదాపు అర కేజీ బంగారం, నాలుగు ద్విచక్ర వాహనాలను కూడా గెలుచుకుని రికార్డు సృష్టించింది. దీంతో ఎద్దు విలువ భారీగా పెరిగిపోయింది. ఎద్దును అమ్మకానికి ఉంచడంతో బెళగావి జిల్లా రాయబాగ తాలూకా హిట్నాళ గ్రామానికి చెందిన రైతు సదాశివ ముందుకు వచ్చి ఏకంగా రూ.18 లక్షల నగదు ఇచ్చి కొనుగోలు చేశారు.

భూ బాధితుల ధర్నా


ఆందోళన చేస్తున్న బాధితులు

రాయచూరు రూరల్: తాలూకాలోని సింగనోడి వద్ద ప్రభుత్వం ప్రారంభించిన ఐఐఐటీ కోసం భూములు కోల్పోయిన భూ బాధితులు మంగళవారం ఆందోళన చేపట్టారు. ఐఐఐటీ కళాశాల వద్ద ఆందోళనకారులు మాట్లాడుతూ భూములు కోల్పోయిన దళిత కుటుంబాలకు ప్రత్యామ్నాయ స్థలంలో సారవంతమైన భూమి కేటాయించాలన్నారు. ధర్నాలో సుమారు 70 మంది రైతులు పాల్గొన్నారు.

బైక్ దొంగల పట్టివేత

హుబ్లీ: హావేరి జిల్లా రాణిబెన్నూరులో పెరుగుతున్న చోరీ కేసులను రాణిబెన్నూరు టౌన్ పోలీసులు ఎట్టకేలకు ఛేదించారు. హిరేకెరూరు ఎలక్ట్రిషియన్ మహమూద్ హజరత్ అలీ ముగళగేరి(28), వెల్డింగ్ పని చేసే హుబ్లీలోని తన్వీర్ అబ్దుల్ మునాఫ్ లక్ష్మేశ్వర(28), హిరేకెరూరులో గ్యారేజ్ పని చేసే ఖలందర్ సర్ఫరాజ్ ఫఠాన్(22) అరెస్ట్ అయిన నిందితులు. ఈ ముగ్గురు అంతర్ జిల్లా బైక్ దొంగలను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.23 లక్షల విలువ చేసే 29 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.

వివాహిత ఆత్మహత్య

పావగడ: పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని వీర్లగొంది గ్రామానికి చెందిన వివాహిత లక్ష్మీదేవి (25) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. ఈ మేరకు మృతురాలు లక్ష్మీదేవి సోదరుడు విజయ్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలు...ఆంధ్రప్రదేశ్ సత్యసాయి జిల్లా పరిగి మండలం గొరవనహళ్లి గ్రామం నాయిబ్రాహ్మణ వర్గానికి చెందిన చన్నరాయుడు కుమార్తె లక్ష్మీదేవిని మూడేళ్ల క్రితం తాలూకాలోని వీర్లగొంది గ్రామానికి చెందిన ప్రసన్నకుమార్‌తో వివాహం జరిపించారు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. అయితే మృతురాలు లక్ష్మీదేవితో అత్త సువర్ణమ్మ, మామ కృష్ణప్పలు తరచూ గొడవ పడి పుట్టింటికి పంపేవారు. భర్త ప్రసన్న కుమార్ ఆమెను మెట్టినింటికి పిలుచుకు వచ్చేవాడు. ఈ నేపథ్యంలో అత్తింటి ఆరళ్లు భరించలేక లక్ష్మీదేవి ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతురాలి సోదరుడు విజయ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన చెల్లెలు లక్ష్మీదేవి మరణానికి భర్త ప్రసన్నకుమార్, అత్తమామలు సువర్ణమ్మ, కృష్ణప్పలు కారణమని ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సురేశ్ తెలిపారు.

కేబుల్ నిర్వాహకులతో కలెక్టర్ సమావేశం


మాట్లాడుతున్న కలెక్టర్ పీఎన్ రవీంద్ర

చిక్కబళ్లాపురం: కేబుల్ నెట్‌వర్క్ యాక్ట్ నిబంధనల మేరకు కేబుల్ ఆపరేటర్లు వ్యవహరించాలని కలెక్టర్ పీఎన్ రవీంద్ర అన్నారు. మంగళవారం నగరంలోని కార్యాలయంలో అధికారులు, కేబుల్ ఆపరేటర్స్‌తో ఆయన మాట్లాడారు. అధికృత కేబుల్ ఆపరేటర్లు తప్పకుండా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, అదే విధంగా అదనంగా డబ్బులు తీసుకోకూడదని, పిల్లలపై చెడు ప్రభావం చూసే చిత్రాలను చూపించరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఆపరేటర్లపై జిల్లా స్థాయి కమిటీకి ఫిర్యాదు చేయాలన్నారు. సమావేశంలో కసాప అధ్యక్షుడు కోడి రంగప్ప, పోలీస్ సీఐ నరేశ్ నాయక్, లాయర్ సుధాకర్, వైద్యులు డాక్టర్ కిశోర్, వార్త అధికారి జుంజణ్ణ తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం


ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్న దృశ్యం

బాగేపల్లి: బాగేపల్లి పట్టణంలో మంగళవారం నగర సభ అధికారులు దుకాణాలపై దాడులు చేసి నిషేధిత ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. ఏకంగా ఒక్క రోజే 205 కేజీల ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్లాస్టిక్ నిషేధంపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నగరసభ అధికారులు సోదాలు ముమ్మరం చేశారు. ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్న పలు దుకాణాలకు జరిమానా విధించి హెచ్చరించారు.

సంక్షేమ హాస్టళ్లలో తనిఖీ

హొసపేటె: కర్ణాటక మానవ హక్కుల కమిషన్ సభ్యుడు ఎస్‌కే.వంగోడి మంగళవారం విజయనగర జిల్లాలో పర్యటించారు. జిల్లాలోని కూడ్లిగి తాలూకాలో పర్యటించిన ఆయన అక్కడి సాంఘీక సంక్షేమ శాఖ బాలుర, ఎస్టీ పోస్ట్ మెట్రిక్ బాలికల వసతి గృహాలను తనిఖీ చేశారు. ఆహార నిల్వ కేంద్రాలు, వంట గదులను పరిశీలించారు. విద్యార్థులు చదువుకునేందుకు కల్పించిన ప్రత్యేక గదులు, కంప్యూటర్, విద్యుత్ వ్యవస్థను చూసి అభినందించారు. ఎల్లప్పుడు హాస్టళ్లలో అందుబాటులో ఉంటూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని హాస్టల్ వార్డెన్లను ఆదేశించారు. సాంఘీక సంక్షేమ శాఖ సంయుక్త సంచాలకులు మంజునాథ్, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఉపసంచాలకులు రామచంద్రప్ప, తహసీల్దార్ రేణుక, ఇతర తాలూకా స్థాయి అధికారులు హాజరయ్యారు.

మురుగు కాలువలు నిర్మించండి

రాయచూరు రూరల్: షియాతలాబ్‌లో 80 అడుగుల రోడ్డు నిర్మాణానికి ముందుగా మురుగు కాలువలను నిర్మించాలని కరవే డిమాండ్ చేసింది. మంగళవారం కలెక్టరేట్ వద్ద చేపట్టిన ఆందోళనలో అధ్యక్షుడు ఖలీల్ మాట్లాడారు. రహదారి నిర్మాణం చేపట్టే ముందు మురుగు కాలువలను సత్వరం నిర్మించాలని కోరుతూ ఆయన కార్యకర్తలతో కలిసి జిల్లాధికారికి వినతిపత్రం సమర్పించారు.

అధిక ఫీజుల వసూలు తగదు

రాయచూరు రూరల్: జిల్లాలోని ప్రైవేట్ కళాశాలల్లో అధికంగా ఇంటిగ్రేటెడ్ ఫీజులు వసూలు చేయడం తగదని అఖిల భారత క్రాంతికారి విద్యార్థి సంఘం పేర్కొంది. మంగళవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టిన అధ్యక్షులు అజీజ్ జాగీర్‌దార్ మాట్లాడుతూ మధ్య తరగతి పిల్లలు ప్రైవేట్ కళాశాలలో చదవాలంటే రూ.లక్షల్లో డొనేషన్లు, వేలల్లో ఫీజులు వసూలు చేస్తున్నా జిల్లా, తాలుకా విద్యా శాఖాధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడాన్ని ఖండించారు.

వీడిన చోరీ మిస్టరీ

- ఉద్యోగి, ఇద్దరు కార్మికుల అరెస్ట్
- రూ.10 లక్షల చోరీ సొత్తు స్వాధీనం

హుబ్లీ: ధార్వాడ తాలూకా బేలూరు పారిశ్రామిక వాడలోని టాటా ఇటాచీ కంపెనీలో జరిగిన చోరీ కేసు మిస్టరీని 10 రోజుల్లో పోలీసులు ఛేదించారు. ఆ మేరకు చోరీకి గురైన వస్తువులను జప్తు చేశారు. సదరు కంపెనీ నుంచి సుమారు రూ.10 లక్షల విలువ చేసే కొత్త టైర్లు, బ్యాటరీలు చోరీ కావడంపై గత నెల 21న ఎఫ్ఐఆర్ నమోదైంది. కేసు దర్యాప్తు చేపట్టిన గరగ పోలీసులు అదే కంపెనీలో ఉద్యోగి ఒకరు, ఇతర ఇద్దరు కార్మికులతో కలిసి ఈ చోరీ చేసినట్లుగా దర్యాప్తులో తేల్చారు. కాగా గరగ టౌన్ సీఐ సమీర్‌ముల్లా, ఎస్ఐ సిద్దరామప్ప, సిబ్బందిని ఎస్పీ డాక్టర్ గోపాల బ్యాకోడ్ అభినందించి రివార్డును ప్రకటించారు.

ఇక ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలూ కష్టమే


మాట్లాడుతున్న వైఏ నారాయణస్వామి

కోలారు: రాబోయే రోజుల్లో రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు అందడం కూడా కష్టం అవుతుందని, రాష్ట్రంలో ఎమ్మెల్యేలు, మంత్రులు తమ పనులు చక్కబెట్టుకోవడంలో బిజీగా ఉన్నారు కానీ రాష్ట్ర శ్రేయస్సు గురించి పట్టించుకోవడం లేదని మాజీ ఎమ్మెల్సీ వైఏ నారాయణ స్వామి ఆరోపించారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ అతిథిగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి నుంచి మొదలుకుని, మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎవరికీ రాష్ట్ర అభివృద్ధి, శ్రేయస్సు పట్టలేదన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గత నెల రోజుల నుంచి పాల ధరతో పాటు నానా రకాలుగా పన్నులు విధించి, ధరలు పెంచి సామాన్య ప్రజల నడ్డి విరిచిందన్నారు. యరగోళ ప్రాజెక్టుకు బీజేపీ ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే సిద్దరామయ్య ప్రాజెక్టును ప్రారంభించి తానే సాధించినట్లు గొప్పలు పోతున్నారన్నారు. పాడి రైతులకు రూ.900 కోట్ల ప్రోత్సాహ ధనం బకాయి పడ్డారన్నారు. దీంతో రాష్ట్రంలో అత్యధిక లబ్ధిదారులు ఉన్న కోలారు, చిక్కబళ్లాపుర జిల్లాల్లో పాడి రైతులకు ఎక్కువ అన్యాయం జరిగిందన్నారు. వాల్మీకి అభివృద్ధి మండలిలో రూ.187 కోట్ల అక్రమాలకు పాల్పడి ఎస్టీ సముదాయపు నిధులను స్వాహా చేశారని ఆరోపించారు. ఈ కుంభకోణానికి నైతిక బాధ్యత వహించి ముఖ్యమంత్రి సిద్దరామయ్య రాజీనామా చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల రూ.11 వేల కోట్లను గ్యారెంటీల అమలు కోసం మళ్లించారన్నారు. అవినీతి, అక్రమాల్లో మునిగిన కాంగ్రెస్ సర్కార్‌కు రాష్ట్రాన్ని పాలించే హక్కు లేదని ఆయన అన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి

- భర్తే చంపాడని ఆరోపణలు


నేత్ర మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు


మృతురాలు నేత్ర


నేత్ర (ఫైల్)

బొమ్మనహాళ్: రాయదుర్గం నియోజకవర్గం బొమ్మనహాళ్ మండలంలోని శ్రీరంగాపురం క్యాంపు గ్రామంలో ఓ మహిళ అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన మంగళవారం జరిగింది. పోలీసులు, మృతురాలి బంధువులు తెలిపిన వివరాల మేరకు... కర్ణాటకలోని చెళ్లకెర తాలూకా భోగనహళ్లికి చెందిన లక్ష్మీదేవమ్మ, తిప్పేస్వామి దంపతుల కుమార్తె నేత్ర (30)ను 2015లో శ్రీరంగాపురం క్యాంపునకు చెందిన టి.వెంకటేశులు అనే వ్యక్తికి ఇచ్చి ఘనంగా పెళ్లి చేశారు. వీరికి ఇద్దరు కొడుకులు మౌర్య, గోకుల్ ఉన్నారు. భార్యాభర్తలు తరచూ గొడవ పడుతుండేవారని, అతడు డబ్బు తేవాలని వేధించేవాడని, ఈక్రమంలో సోమవారం రాత్రి భార్యను కొట్టి చంపి ఆత్మహత్యగా చిత్రీకరించాడని మృతురాలి బంధువులు ఆరోపించారు. భర్తతో పాటు అత్త లక్ష్మీ, ఆడపడుచు గాయత్రిలు సతాయించేవారన్నారు. భర్తే కొట్టి చంపేసి ఆత్మహత్య చేసుకున్నట్లు తమకు సమాచారం ఇచ్చాడని బంధువులు అన్నారు. మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం జరిపించారు. ఈ కేసును తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మృతురాలి బంధువులు ఆరోపించారు.

14న వధూవరుల సమావేశం

హుబ్లీ: కర్ణాటక రాష్ట్ర ఉప్పార మహాసభ, విశ్వభగీరథ ట్రస్ట్ పరివార్ ఆధ్వర్యంలో దేశ్‌పాండే నగర్‌లోని సవాయి గంధర్వ సభాభవనంలో ఈ నెల 14న జాతీయ స్థాయి ఉప్పార వధూవరుల సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు విష్ణు రాథోర్ తెలిపారు. నగరంలో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. ఆ రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సమావేశం జరుగుతుందన్నారు. రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల్లో నివసిస్తున్న ఉప్పార సమాజ బాంధవులు కార్యక్రమంలో పాల్గొనవచ్చన్నారు. ఆసక్తిగల వధూవరులు, తల్లిదండ్రులు, సమావేశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9449886150ను సంప్రదించాలని ఆయన కోరారు.

కోలారు వార్తలు...

పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తాం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటశివారెడ్డి

శ్రీనివాసపురం: పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే ప్రక్రియకు అధికారులు సహకరించాలని ఎమ్మెల్యే జీకే వెంకటశివారెడ్డి తెలిపారు. మంగళవారం తాలూకాలోని యల్దూరు నేషనల్ హైస్కూల్ ప్రాంగణంలో నిర్వహించిన జనస్పందన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ వసతి సౌకర్యాలు సమాజంలోని చిట్టచివరి వ్యక్తికి కూడా అందాలన్నారు. ఇది అధికారుల పూర్తి బాధ్యత అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల్లో ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించాలని పిలుపు నిచ్చారు. యల్దూరు ఫిర్కాలో 2 వేల ఎకరాల్లో పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం ఆమోదించిందన్నారు. మదనపల్లికి వెళ్లే రహదారిలో కూడా 3 వేల ఎకరాల్లో పరిశ్రమలను స్థాపించనున్నట్లు తెలిపారు. రైతులు, సామాన్య ప్రజల సమస్యలను అధికారులు సత్వరమే పరిష్కరించాలని సూచించారు. లబ్ధిదారులకు వివిధ సౌకర్యాలను అందించారు. తహసీల్దార్ సుదీంద్ర, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

హళకట్టి సేవలు అపారం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు : వచన సాహిత్యాన్ని భావి తరాలకు అందించాలని వచన సాహిత్య పితామహుడు డాక్టర్ హళకట్టి సమాజానికి అందించిన సేవలు అపారమని అడిషనల్ ఎస్పీ జగదీష్ తెలిపారు. మంగళవారం నగరంలోని టి.చెన్నయ్య రంగమందిరంలో నిర్వహించిన వచన సాహిత్య పితామహుడు డాక్టర్ హళకట్టి జయంతిలో పాల్గొని ఆయన మాట్లాడారు. వచన సాహిత్యాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. హళకట్టి సైకిల్‌పై గ్రామీణ ప్రాంతాల్లో తిరిగి నశించి పోతున్న అత్యమూల్యమైన తాళపత్ర వచనాలను సేకరించి వాటిని ముద్రించి సమాజానికి అందించారన్నారు. అందువల్లనే మనం వచన సాహిత్యం గురించి తెలుసుకోగలిగామన్నారు. ప్రతి ఒక్కరిలో ఉన్న ప్రతిభను గుర్తించి హళకట్టిని ప్రేరణగా తీసుకుని ఆసక్తి ఉన్న విషయాల్లో సాధన చేయడానికి విపులమైన అవకాశాలు ఉన్నాయన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని సమాజానికి వెలుగు నింపే ప్రయత్నం చేయాలని విద్యార్థులకు పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో పాత్రికేయుడు కెఎస్ గణేష్, హరికథా విద్వాంసుడు ఎస్ఆర్ జ్ఞాన మూర్తి, కన్నడ శరణ సాహిత్య పరిషత్ ప్రధాన కార్యదర్శి బి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రాఘవ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం


బళ్లారి రాఘవ(ఫైల్)

బళ్లారిటౌన్: బళ్లారి రాఘవ 144వ జయంతి సందర్భంగా రాఘవ మెమోరియల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాఘవ అవార్డులు-2024కు దరఖాస్తులను ఆహ్వానించారు. గత కొన్నేళ్లుగా కన్నడ, తెలుగు రంగస్థల కళాకారులకు రాష్ట్ర, జిల్లా స్థాయి అవార్డులను అందజేస్తున్న క్రమంలో ఈసంవత్సరం కూడా అందజేయనున్నారు. నాటక రంగంలో సుమారు 20 ఏళ్లుగా సేవలు అందించిన కళాకారులు తమ దరఖాస్తును ఈ నెల 15లోగా సంస్థ అధ్యక్షుడు లేదా కార్యదర్శికి తగిన ఆధారాలతో దరఖాస్తు సమర్పించవచ్చని అధ్యక్షుడు కే.కోటేశ్వరరావు, గౌరవ కార్యదర్శి ఎస్.ప్రకాష్ తెలిపారు. ఆగస్ట్ 2, 3 తేదీల్లో బళ్లారి రాఘవ జయంతి ఉత్సవాలు జరుగనున్నట్లు వారు తెలిపారు.

వెండి ఆభరణాల చోరీ

పావగడ: పట్టణంలోని కువెంపు నగర్‌లో 2వ వార్డులో సోమవారం రాత్రి చోరీ జరిగింది. పోలీసుల వివరాల మేరకు... వార్డుకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు హులిరాజు తన కుటుంబంతో పాటు బంధువుల వివాహానికి చెళ్లకెరెకు వెళ్లారు. అదే అదనుగా భావించిన దొంగలు రాత్రి ఇంటి తాళాలు పగుల గొట్టి కేజీ వెండి ఆభరణాలు, రూ 30 వేల నగదు ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రైల్వే మంత్రిని కలిసిన ఎంపీ

శివమొగ్గ: ఢిల్లీలో శివమొగ్గ ఎంపీ బీవై రాఘవేంద్ర మంగళవారం రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిశారు. శివమొగ్గ-యశ్వంతపుర మధ్య వందేభారత్ రైలు సేవలను కల్పించాలని కోరారు. ముఖ్యంగా తాళ్లగుప్ప- శిరసి- హుబ్బళి రైల్వే మార్గం నిర్మాణానికి రైల్వే మండలి అనుమతి ఇవ్వడం జరిగిందని, అదే విధంగా శివమొగ్గ-బీరూరు మధ్య డబ్లింగ్ పనులకు మంజూరు చేశారని, అయితే రైల్వే మండలి నిలిపివేసిందని, వెంటనే చర్యలు తీసుకునే విధంగా చూడాలని కోరారు.

కళాశాలల అభివృద్ధికి నిధులు


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సుధాకర్

చింతామణి: చింతామణి పట్టణంలోని ఫస్టుగ్రేడ్ కళాశాల, బాలికల కళాశాల అభివృద్ధికి రూ. 20 కోట్లు కేటాయిస్తామని ఉన్నత విద్యాశాఖ మంత్రి సుధాకర్ తెలిపారు. పట్టణంలోని బాలికల కళాశాల వార్షికోత్సవంలో ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు మంచి క్రమశిక్షణతో విద్యను అభ్యసించి తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంలో క్రీడాపోటీలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేష్, సంజీవరెడ్డి, రామకృష్ణప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


మాట్లాడుతున్న డీఎస్పీ మురళీధర్

చింతామణి: ప్రభుత్వం ఈనెల 1 నుంచి అమలు చేసిన ట్రాఫిక్ నియమాలను వాహనదారులు తప్పకుండా పాటించాలని లేదంటే జరిమానా విధిస్తామని డీఎస్పీ మురళీధర్ హెచ్చరించారు. మంగళవారం ఆయన పట్టణంలోని కార్యాలయంలో డ్రైవర్ల సమావేశంలో మాట్లాడుతూ... వాహనదారులు పోలీసులకు సహకరించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో సీఐ విజికుమార్, వాహన యజమానులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

రూ.4.23 లక్షల వంచన


హుబ్లీ: ఆయుర్వేద ఔషధాలను కొనుగోలు చేసిన బాపతు బకాయి పడిన డబ్బులను అడిగిన యోగేంద్ర అనే స్థానిక వ్యక్తిని ప్రాణాలు తీస్తామని బెదిరించిన ఘటన వెలుగు చూసింది. బకాయి పడిన రూ.4.23 లక్షల డబ్బులు చెల్లించకుండా వంచించినట్లు పంజాబ్‌కు చెందిన శ్రీరాజన్‌పై పాత హుబ్లీ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కార్యవర్గం ఎన్నిక


అధ్యక్షుడిని అభినందిస్తున్న దృశ్యం

మాలూరు : తాలూకా ప్రాథమిక, ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్ష స్థానానికి మంగళవారం జరిగిన ఎన్నికల్లో వ్యాయామ ఉపాధ్యాయుడు సురేంద్రగౌడ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత అధ్యక్షుడు ఎం.సుధాకర్ అధికార అవధి ముగిసిన నేపథ్యంలో పట్టణంలోని బీఆర్‌సీ సభాంగణంలో బీఈఓ చంద్రకళ అధ్యక్షతన ఈ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్ష స్థానానికి ఎస్ఎఫ్ఎస్ ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు సురేంద్ర ఒక్కరే నామినేషన్ వేయడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైంది. పదాధికారులుగా ఆర్.శివలింగప్ప(ప్రధాన కార్యదర్శి), నాగప్ప (కోశాధికారి), గోవిందేగౌడ (గౌరవ అధ్యక్షుడు) నాగమణి (ఉపాధ్యక్షురాలు)గా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, పదాధికారులను పలువురు అభినందించారు.

స్వచ్ఛత కాపాడండి


వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

కోలారు: బంగారుపేట పట్టణంలోని రైల్వే స్టేషన్ వద్ద ఉన్న అంబేడ్కర్ ప్రతిమ చుట్టూ పిచ్చి మొక్కలు మొలిచి అధ్వానంగా తయారైందని, అక్కడ స్వచ్ఛతను కాపాడాలని డిమాండ్ చేస్తూ దళిత సమాజ సేన కార్యకర్తలు పట్టణ రైల్వే స్టేషన్ ముందు ధర్నా నిర్వహించి అనంతరం స్టేషన్ మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. సేన రాష్ట్ర అధ్యక్షుడు సూలికుంటె ఆనంద్ మాట్లాడుతూ రైల్వే శాఖ సిబ్బంది వెంటనే అంబేడ్కర్ ప్రతిమ చుట్టూ స్వచ్ఛతను కాపాడి శుభ్రంగా ఉంచాలన్నారు. రైల్వే క్యాంటీన్, రైల్వే స్టేషన్‌లో కూడా శుభ్రతను కాపాడాలన్నారు. ఈ సందర్భంగా గౌతం, అయ్యప్ప, అర్జున్, కరుణ, సుబ్రమణి, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పరిశుభ్రతకు కృషి చేయండి



చెత్త సేకరణ డబ్బాలను అందజేస్తున్న ఎమ్మెల్యే

కృష్ణరాజపురం: అందరం ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని, ఈ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే మంజుల లింబావళి అన్నారు. నగరంలోని మహాదేవపుర పరిధి గరుడాచారిపాళ్యలో ఉన్న కావేరి నగరలో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేసి మాట్లాడారు. అనంతరం చెత్త సేకరణ డబ్బాలను ఆమె పంపిణీ చేశారు. ఇళ్లల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మనోహర్‌రెడ్డి, లోకి, శ్రీధరెడ్డి, అభిషేక్, అనంతరామయ్య, కావేరినగర అంబరీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్రీ బస్సుల వల్ల మెట్రోకి ప్రయాణికులు కరువు

దొడ్డబళ్లాపురం: కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిన కారణంగా మెట్రోకి ప్రయాణికులే కరువయ్యారని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అన్నారు. మంగళవారం చెన్నపట్టణ తాలూకా భైరాపట్టణలో జరిగిన కార్యక్రమంలో హాజరైన ఆయన మాట్లాడుతూ ఇటీవల ప్రధాని మోదీని కలిసినప్పుడు ఫ్రీ బస్సు కల్పించడం వల్ల మెట్రో రైల్లో ప్రయాణికులు రావడం లేదన్నారన్నారు. రామనగర జిల్లాలో ప్రస్తుతం 93 శాతం విద్యుత్ సరఫరా అవుతోందన్నారు. చెన్నపట్టణ ప్రజలకు తన ఇంటి తలుపులు ఎల్లప్పుడూ తెరిచే ఉంటాయని, ఏ కష్టం వచ్చినా తన వద్దకు రావచ్చన్నారు. తాము ఇచ్చిన మాట ప్రతి ఒక్కటీ నిలబెట్టుకుంటున్నామన్నారు.

రచయిత ఫకీరప్ప జయంతి



ఫకీరప్ప గురుబసప్ప హాళకట్టి జయంతి దృశ్యం

గౌరిబిదనూరు: వచన సాహిత్యాన్ని సేకరించి సామాన్యులకు అర్థమయ్యేలా చేసిన రచయిత డా ఫకీరప్ప గురుబసప్ప హాళకట్టి అని హీరేబిదనూరు రాజణ్ణ అన్నారు. మంగళవారం తాలూకా కార్యాలయంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో ఫకీరప్ప గురుబసప్ప హాళకట్టి జయంతి కార్యక్రమంలో మాట్లాడారు. శరణ సంస్కృతిని, శివశరణుల విచారాలను సామాన్యులకు తెలియజేశారని అన్నారు. కార్యక్రమంలో ఉప తహసీల్దారు డా ఆశా, రవికుమార్, జయణ్ణ, కన్నడ రక్షణా వేదికె బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్ డ్రైవర్ నిర్లక్ష్యం.. బైకిస్టు మృతి

దొడ్డబళ్లాపురం: నీటి ట్యాంకర్ డ్రైవర్ నిర్లక్ష్యంగా రివర్స్ చేయడంతో ఢీకొని బైకిస్టు చనిపోయాడు, కొత్తనూరు దిన్నె పరిధిలోని ఆర్‌బీఐ లేఔట్‌లో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. కిరణ్‌కుమార్ (21) అనే యువకుడు మంగళవారం ఉదయం 9 గంటల సమయంలో బైక్‌పై పనికి వెళ్తున్నాడు. ముందు వెళ్తున్న వాటర్ ట్యాంకర్ ఆకస్మికంగా వెనక్కు వచ్చింది. అది కిరణ్ బైక్ మీద నుంచి వెళ్లింది, ఈ సంఘటనలో కిరణ్ ట్యాంకర్ చక్రాల కింద పడిపోయి మృత్యువు పాలయ్యాడు. కేఎస్ లేఔట్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి



గణేశ్ (ఫైల్)

యశవంతపుర: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన దక్షిణ కన్నడ జిల్లా ఉళ్లాల పావూరు మలారు అక్షర నగరలో జరిగింది. అదే ప్రాంతానికి చెందిన విశ్వనాథ ఆచార్య కుమారుడు గణేశ్ ఆచార్య (27) మంగళవారం ఉదయం మృతి చెందారు. గతనెల 28న గణేశ్ బైక్‌పై వెళ్తుండగా టిప్పర్ ఢీకొంది. అప్పటి నుంచి ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మంగళవారం ఉదయం మృతి చెందాడు.

బస్సు నుంచి కిందపడి మహిళకు తీవ్ర గాయాలు



డోర్ లాక్ ఊడిపోయిన దృశ్యం

యశవంతపుర: నడుస్తున్న బస్సులో నుంచి ఓ మహిళ కిందపడి తీవ్రంగా గాయపడిన ఘటన చిక్కమగళూరు తాలూకా ఐదళ్లి గ్రామం వద్ద జరిగింది. బాధితురాలు శకుంతలమ్మను సమీపంలోని అల్లూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చిక్కమగళూరు నుంచి బస్సు శృంగేరికి వెళ్తుండగా బాళెహన్నూరు వెళ్లటానికి శకుంతలమ్మ బస్సు ఎక్కారు. బస్సు వెళ్తున్న సమయంలో డోర్ లాక్ తెగిపోవడంతో ఆమె ఒక్కసారిగ ఎగిరి రోడ్డుపై పడ్డారు. తీవ్రంగా గాయపడిన ఆమెను ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు.

ఎన్నెన్నో అందాలు.. కుద్రేముఖ్ పర్వత శిఖరాలు



పచ్చటి కొండల నడుమ పర్యాటకుల ట్రెక్కింగ్



అంబాతీర్థనది ప్రవాహం



పర్వత ప్రాంతంపై సేద తీరుతున్న పర్యాటకులు

- జలపాతాలు, ప్రకృతి రమణీయ దృశ్యాలు
- సాహస విహారానికి అనువైన ప్రదేశం

బనశంకరి: ఎటుచూసినా పచ్చదనంతో కూడిన పచ్చిక బయళ్లు పర్యాటకులను కనువిందు చేసే ప్రదేశం పశ్చిమ కనుమలు కుద్రేముఖ్ పర్వత ప్రాంతం. ఎక్కడ చూసినా ఆహ్లాదకరమైన వాతావరణం ఇక్కడి సొంతం. అపారమైన ఖనిజ సంపద కొలువైన కుద్రేముఖ్‌లో వర్షాకాలం వచ్చిందంటే పర్యాటకులతో కళకళలాడుతుంది.

కుద్రేముఖ్ కర్ణాటకలోని చిక్కమగళూరుకు 95 కిలోమీటర్ల దూరంలో నైరుతి దిశలో ఉంది. ఇది ట్రెక్కింగ్ ప్రియులకు స్వర్గధామంగా పేరుపొందింది. చిక్కమగళూరుకు సమీపంలో గల కుద్రేముఖ్ కొండలు ఈ సీజన్ వచ్చిందంటే చాలు జలపాతాలు, ప్రకృతి రమణీయ దృశ్యాలతో పర్యాటకులను కనువిందు చేస్తుంది. కన్నడ భాషలో కుద్రేముఖ్ అంటే గుర్రపు ముఖం అని అర్థం. ఈ పర్వతశ్రేణులు గుర్రపు ముఖం ఆకారంలో ఉండటం వల్ల కుద్రేముఖ్ అని పిలుస్తారు. కుద్రేముఖ్ పర్వతంలో కుద్రేముఖ్ నేషనల్ పార్కు కూడా ఉంది. ఇక్కడ చిరుత పులులు, ఎలుగుబంట్లు, మచ్చలు జింకలు, అడవి కుక్కలు, నక్కలు తదితర అనేక రకాల వన్యజీవులను వీక్షించవచ్చు. అందమైన పూలమొక్కలు ఇక్కడ అదనపు ఆకర్షణ. వివిధ ఆకృతుల్లో కనువిందుచేసే పచ్చదనం సందర్శకులను మంత్రముగ్ధులను చేస్తాయి. అరేబియా సముద్రం వైపు గల పర్వతశ్రేణులు పరంపర లోతైన లోయలు, ఎత్తైన శిఖరాలతో చాలా సుందరంగా ఉంటుంది. సముద్రమట్టానికి 1894 అడుగుల ఎత్తులో ఉన్న ఇక్కడ పర్వతం కుద్రేముఖ్ అపారమైన ఖనిజ సంపదకు నిలయం. ఇక్కడ ప్రభుత్వం కుద్రేముఖ్ ఐరన్ ఓర్ కంపెనీ లిమిటెడ్ నిర్వహిస్తుంది.

స్వచ్ఛమైన నీటి సవ్వడులు...

కుద్రేముఖ్‌లో ఇక్కడి పరిసరాలు వర్షాకాలంలో అత్యంత సుందరంగా కనబడతాయి. పర్వతశిఖరాలు కూడా పచ్చదనంతో సంతరించుకోగా శూల గడ్డి భూముల్లో ట్రెక్కింగ్ చేయడం ఎంతో ఆనందంగా ఉంటుంది. గడ్డిప్రదేశాలపై సూర్యకిరణాలు పడి తళతళలాడుతాయి. ఈ ప్రదేశంలో ఉదయం అందాలను తిలకించేందుకు సందర్శకులు ఎక్కువ ఆసక్తి కనబరుస్తారు. చెల్లాచెదరుగా తారసపడే మంచు తుంపరుల అందాలు చూడముచ్చటగా కనిపిస్తాయి. అడవికి ఇరువైపుల ఉన్నరోడ్డు మార్గంలో నడుస్తుంటే పచ్చటి దట్టమైన అడవులు స్వాగతం పలుకుతున్నట్లు ఉంటుంది. కుద్రముఖ్ ప్రదేశంలో అంబా తీర్థనది స్వచ్ఛంగా పారుతుంది. ఈ నదిలో స్వచ్ఛమైన నీటి సవ్వడులు మనసును ఉత్తేజపరుస్తాయనడంలో ఎలాంటి సందేహంలేదు.

సైకిల్ సఫారీ మధురానుభూతి

ఇక్కడ కొండలపై సైకిల్‌మీద వెళ్లడం ఒక మధురానుభూతి.స్థానికంగా పర్యాటకులకు అవసరమైన వనరులను అందించడంలో ప్రత్యేక శ్రద్ధచూపుతారు. చల్లని పిల్లగాలులు మధ్య సాగే సైకిల్ సఫారీ అనుభవాలను ప్రత్యేకంగా చెప్పక్కరలేదు. పర్వతాలు, వృక్షాల మధ్యలో నిర్మించిన రోడ్డు మార్గంలో నడుస్తుంటే కలిగే ఆనందాన్ని మాటల్లో వర్ణించడం కష్టమే. వర్షాకాలంలో ఇక్కడ కుద్రేముఖ్‌లోని లక్యా జలాశయం నీటితో కళకళలాడుతుంది. పొంగిపొర్లే నీటి అలలను బంధించేందుకు సందర్శకులు చేసే ప్రయత్నాలు ఆహ్లాదాన్ని కలిగిస్తాయి. ఇక్కడ బండ రాళ్లు బాగా పాచిపట్టి ఉంటాయి. కుద్రేముఖ్‌లో ఎన్నో అందమైన ప్రదేశాలు పర్యాటకులను కనువిందుచేస్తున్నాయి.





జాతీయ ఉద్యానవనంలో ఏనుగులు, అడవి దున్న



ప్రకృతి ఇక్కడే కొలువుదీరిందా అన్నట్లు.. ఎటుచూసినా పచ్చదనం

రాహుల్ క్షమాపణ చెప్పాలి

- బీ.వై.విజయేంద్ర

శివాజీనగర: హిందువులు అంటూ నిత్యం హింసా ద్వేషాలకు పాల్పడుతున్నారని వ్యాఖ్యానించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాహుల్ గాంధీ హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలని బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు, ఎమ్మెల్యే బీ.వై.విజయేంద్ర డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని మల్లేశ్వరం బీజేపీ రాష్ట్ర కార్యాలయం జగన్నాథ భవన్‌లో విలేకరులతో మాట్లాడిన ఆయన, కేంద్రంలో నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశం అభివృద్ధి పథంలో పయనిస్తోందని, మరోవైపు ఎలాగైనా అధికారంలోకి రావాలని కాంగ్రెస్ ప్రయత్నించి విపక్షనేత రాహుల్ గాంధీ పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. సోమవారం పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ ప్రతిపక్ష నాయకుడిగా చేసిన ప్రసంగం అపద్ధం, నిరాశ, ఆధారరహిత ఆరోపణలతో కూడుకున్నదని అభ్యంతరం వ్యక్తం చేశారు. తక్షణం ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

హుండీ నగదు చోరీ



హుండీ పగుల కొట్టిన దొంగలు

గౌరిబిదనూరు: తాలూకాలో ప్రసిద్ధి చెందిన పురాతన అలకాపురం చన్నసోమేశ్వర దేవాలయంలో హుండీ చోరీ జరిగింది. దొంగలు హుండీని పగులగొట్టి అందులోని నగదును తస్కరించారు. అయితే లోపల ఉన్న హుండీ భద్రంగానే ఉన్నట్లు ఆలయ కమిటీ సభ్యుడు ప్రభు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ మూర్తి ఘటన స్థలాన్ని పరిశీలించారు.

పాము ప్రత్యక్షం :

ఈ ఆలయంలో ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో పెద్ద నాగుపాము కనిపించింది. రెండు గంటల పాటు అక్కడే ఉందని భక్తులు తెలిపారు. అనంతరం పామును పట్టించి ఘాటి కొండల్లో విడిచిపెట్టారు.

మధుగిరి వాసి సాహసం



ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌లో కమలేశ్

తుమకూరు: ప్రపంచంలోనే అతి ఎత్తైన హిమాలయ పర్వతంలోని బేస్ క్యాంప్‌నకు వెళ్లి రావడం ఎంతో సాహసం. ఎన్నో అవరోధాల మధ్య దాన్ని అధిగమించాలి. అటువంటి సాహసాన్ని అధిగమించారు జిల్లా మధుగిరి పట్టణానికి చెందిన వాసవి మెడికల్స్ అధినేత కమలేశ్, అతని స్నేహితులు. వీరంతా కలిసి ఎన్నో అడ్డంకులు అధిగమించి ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌నకు చేరుకుని తిరిగి క్షేమంగా కిందకు చేరుకున్నారు. మౌంట్ ఎవరెస్ట్ శిఖరం సముద్ర మట్టానికి సుమారు 8,849 మీటర్లు ఉంటుంది. అంటే దాదాపు 29 వేల 31 అడుగుల ఎత్తు. దాని బేస్ క్యాంప్ ఎత్తు 5,364 మీటర్లు, అంటే 18 వేల అడుగులు ఉంటుంది. ఈ సాహస వీరుడు కమలేశ్ అనేక ప్రపంచ యాత్రలు చేసిన చరిత్ర కూడా ఉంది.

పేద విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయం



కార్యక్రమంలో రుక్మాంగదనాయుడు, ఎమ్మెల్యే రవిసుబ్రమణ్య తదితరులు

బనశంకరి: ఉత్తమ మార్కులు సాధించిన పేద విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించడం సంతోషకరమని బసవనగుడి ఎమ్మెల్యే రవిసుబ్రమణ్య తెలిపారు. సోమవారం బనశంకరి ఐటీఐ లేఔట్‌లోని శ్రీకృష్ణ విద్యాసంస్థ సంస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఎం.రుక్మాంగదనాయుడు 75వ పుట్టినరోజు సందర్భంగా శ్రీకృష్ణ విద్యాసంస్థలో చదువుతున్న పేద విద్యార్థులకు విద్యార్థి వేతనం వితరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. పేద విద్యార్థులను గుర్తించి ప్రతి ఏటా విద్యార్థి వేతనాలు అందించడం గర్వకారణమన్నారు. డాక్టర్ ఎం.రుక్మాంగదనాయుడు, దాతలు లోకనాథ బాబు, హరిబాబు, పీజీ విభాగ డైరెక్టర్ ప్రొఫెసర్ వేణుగోపాల్, డైరెక్టర్ మనోహర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఉషాకుమారి తదితరులు పాల్గొన్నారు.

విద్యకు ఆర్థిక భరోసా



సమావేశమైన జర్నలిస్టులు

బాగేపల్లి: విలేకరుల సంఘం సభ్యులుగా ఉన్న ప్రతి ఒక్కరికి ఆరోగ్య బీమాతో పాటు వారి పిల్లల విద్యకు ఆర్థిక సహాయం చేస్తామని సంఘం సభ్యులు తెలిపారు. మంగళవారం బాగేపల్లి పట్టణంలో విలేకరుల భవనంలో సంఘం సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కొన్ని తీర్మానాలను చేశారు. ప్రధానంగా విలేకరుల ఆరోగ్యం, వారి పిల్లల ఉన్నత చదువులకు ఆర్థిక సహాయం తదితర వాటిపై తీర్మానం చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మంజునాథరెడ్డి, కోశాధికారి హెగ్డె, మాజీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, బీఆర్ కృష్ణ, సిద్ధక్, చంద్రశేఖర్ రెడ్డి, గురుమూర్తి, చలపతి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతలు అరెస్ట్



శివమొగ్గ: శివమొగ్గ నగరంలోని రాగిగుడ్డ చానల్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు యువకులను శివమొగ్గ గ్రామీణ పోలీసులు అరెస్ట్ చేశారు. గోపాల్ ప్రాంతానికి చెందిన సంక, న్యూ మండ్లికి చెందిన అంబరీశ్, పురాలేకు చెందిన ధనుష్‌లను అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి రూ. 68 వేల విలువైన ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

వైద్యులకు సన్మానం



తుమకూరు: అంతర్జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా బెంగళూరు విధానసౌధలో నిర్వహించిన వేడుకల్లో తుమకూరు జిల్లా ఆస్పత్రిలో యూరాలజిస్టు రమేష్ కే.ఆర్, కంటి వైద్య నిపుణులు డాక్టర్.దినేష్‌కుమార్, చంద్రశేఖర్ తదితరులను వైద్యశాఖ ఆధ్వర్యంలో సన్మానించారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

శివాజీనగర: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని, సమయాన్ని వృథా చేయరాదని ఎస్ఎల్ఆర్ ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.జీ. సురేష్ తెలిపారు. మంగళవారం శివాజీనగర ప్రభుత్వ తెలుగు ఉన్నత పాఠశాల విద్యార్థులకు ట్రస్ట్ తరపున స్కూల్ బ్యాగ్‌లు, రాత పుస్తకాలను పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. ఈ ఏడాది బెంగళూరు ఉత్తర జిల్లా పరిధిలో ఉన్న 50 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఫలితాలు ప్రభుత్వ తెలుగు ఉన్నత పాఠశాల విద్యార్థులు సాధించారని అభినందించారు. ఈసారి పదో తరగతిలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రత్యేక బహుమతి అందజేస్తానని ప్రకటించారు. తెలుగు విశ్రాంత ఉపాధ్యాయుడు రంగస్వామి నాయుడు, కే.హెచ్.సిద్దయ్య, హెచ్‌ఎం వీరభద్రప్ప, ఉపాధ్యాయుడు రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మార్క్స్ మెమోకు డబ్బులు డిమాండ్

- మందలించిన ప్రిన్సిపాల్‌కు బెదిరింపులు

బొమ్మనహళ్లి: విద్యార్థుల నుంచి మార్క్స్ మెమోకు డబ్బులు వసూలు చేస్తున్న కళాశాల గుమాస్తాను మందలించిన ప్రిన్సిపాల్‌ను సదరు క్లర్క్ హత్య చేస్తానని బెదిరించిన ఘటన నగరంలో చోటుచేసుకుంది. వివరాలు... నగరంలోని కృపానిధి కళాశాలలో నాగరాజు అనే వ్యక్తి 14 ఏళ్లుగా క్లర్క్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల నాగరాజు విద్యార్థుల వద్ద నుంచి మార్క్స్ మెమోకు డబ్బులు డిమాండ్ చేయడం మొదలు పెట్టాడు. ఒక్కో విద్యార్థి నుంచి వేలల్లో వసూలు చేస్తున్నాడు. విషయం తెసుకున్న ప్రిన్సిపాల్ అతన్ని పిలిపించి మందలించాడు. దీంతో నాగరాజు ప్రిన్సిపాల్‌పై ఎదురు తిరిగి హత్య చేస్తానని బెదిరించాడు. ఆయన కళాశాల యాజమాన్యం దృష్టికి తీసుకోవడంతో వారు వైట్‌ఫీల్డ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు నాగరాజు కోసం గాలిస్తున్నారు.

ఎమ్మెల్సీ విశ్వనాథ్‌పై కేపీసీసీ నేత ధ్వజం

మైసూరు: శాసన మండలి సభ్యుడైన హెచ్ విశ్వనాథ్‌కు తల పనిచేయడం లేదని, దీంతో నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని కేపీసీసీ అధికార ప్రతినిధి లక్ష్మణ్ ధ్వజమెత్తారు. మంగళవారం మైసూరు నగరంలోని కాంగ్రెస్ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఇళ్ల స్థలాల అక్రమాల్లో ముఖ్యమంత్రి సిద్దరామయ్య సతీమణి పేరు ఉందని, బీజేపీ, జేడీఎస్ నాయకుల ఆరోపణల నేపథ్యంలో ఎమ్మెల్సీ విశ్వనాథ్ ఇష్టానుసారం మాట్లాడటం తగదని, ఆరోపణలకు తగిన ఆధారాలను ఆయన చూపాలని డిమాండ్ చేశారు.

గోల్డెన్ స్టార్ గణేష్ పుట్టిన రోజు వేడుకలు

మైసూరు నగరంలోని చాముండిపురం ఆరుణోదయ విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో నటుడు గోల్డెన్ స్టార్ గణేశ్ పుట్టిన రోజు వేడుకలను అభిమానులు నిరాడంబరంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులకు స్వీట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హరీశ్, రవిచంద్ర, సచిన్, నాయక్, రాఘవేంద్ర, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవకుడికి సన్మానం



జయరామ రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

బొమ్మనహళ్లి: పేదలు చదువు దూరం కాకూడదని, వారికి దాతలు అండగా నిలవాలని మంత్రి రామలింగా రెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని బొమ్మనహళ్లి మంగమ్మపాళ్య వార్డు బండెపాళ్యలోని ప్రభుత్వ పాఠశాలలో వందలమంది పేద విద్యార్థులకు 16 ఏళ్లగా ఉచితంగా నోటు పుస్తకాలు, బెల్ట్‌లు, పెన్నులు అందిస్తున్న జయరామ్ రెడ్డి సహకారం మరువలేనిదన్నారు. జయరామ్ రెడ్డి మాదిరిగా దాతలు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో బొమ్మనహళ్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రవీంద్రగౌడ, హెచ్ఎస్ఆర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వాసుదేవరెడ్డి, కేపీసీసీ సభ్యుడు బాలకృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నోటు పుస్తకాలను పంపిణీ చేయడంతో పాటు జయరామిరెడ్డిని సన్మానించారు.

హోసూరు వార్తలు..

హంతకులను అరెస్టు చేయాలి



ఆందోళన నిర్వహిస్తున్న కార్యకర్తలు

కెలమంగలం: అంచెట్టి పోలీస్‌స్టేషన్ పరిధిలో బాలున్ని హత్య చేసి ఆత్మహత్యగా సృష్టించారని, నిందితులపై చర్యలు చేపట్టాలని సీపీఎం పార్టీ నేతలు, కార్యకర్తలు సోమవారం సాయంత్రం ఆందోళన చేశారు. వివరాలు.. మే 8వ తేదీన మహేంద్రన్ (17) అనే బాలుడు శక్తి, పూవరసన్, దినేష్‌లతో కలిసి క్రికెట్ ఆడేందుకు వెళ్లాడు. మహేంద్రన్ వద్ద ఉన్న డబ్బులను లాక్కొనేందుకు శక్తి, పూవరసన్ మరికొంత మంది యువకులు అతనిపై బ్యాట్‌లతో బాది హత్య చేశారు. మృతదేహాన్ని సమీపంలోని ఓవర్‌ట్యాంక్ మీదకు తీసుకెళ్లి లోపల నిచ్చెనకు ఉరికి వేలాడదీశారు. మృతుని తండ్రిని బెదిరించి ఆత్మహత్య చేసుకొన్నట్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు చేయించారు. పోలీసులు బాలుని శవాన్ని స్వాధీనపరుచుకొని శవపరీక్ష కోసం ఆస్పత్రికి తరలించారు. శవపరీక్షల్లో బలమైన దెబ్బలు తగిలి మృతి చెందినట్లు రుజువైనా పోలీసులు బాధిత కుటుంబానికి న్యాయం చేకూర్చలేదని ఆరోపిస్తూ, హంతకులను అరెస్టు చేయాలని ధర్నా చేశారు.

ఇసుక లారీల సీజ్

క్రిష్ణగిరి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ లారీలను ఖనిజ సంపద శాఖాధికారులు స్వాధీనపరుచుకొన్నారు. క్రిష్ణగిరి ఖనిజసంపద శాఖ తహసీల్దార్ గోకుల్ కణ్ణన్, అధికారులు సోమవారం సాయంత్రం వేటియంబట్టి ప్రాంతంలో వాహన తనిఖీలు నిర్వహించారు. రెండు టిప్పర్ లారీలలో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా అడ్డగించారు. అధికార్లను గమనించిన డ్రైవర్‌లు లారీలను రోడ్డు పక్కన నిలిపి పరారయ్యారు. లారీలను క్రిష్ణగిరి పట్టణ పోలీసులకు అప్పగించారు.

కూలి దుర్మరణం

క్రిష్ణగిరి: నడిచి వెళుతున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొని చనిపోయిన ఘటన కురుబరపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాల మేరకు సూళగిరి సమీపంలోని కామనదొడ్డి గ్రామానికి చెందిన కూలి కార్మికుడు ఈశ్వరప్ప. సోమవారం హోసూరు– క్రిష్ణగిరి హైవేలో బయనపల్లి మురుగన్ ఆలయం వద్ద నడిచి వెళుతుండగా ఏదో వాహనం ఢీకొని వెళ్లిపోయింది. తీవ్ర గాయాలేర్పడిన ఈశ్వరప్ప ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. కురుబరపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

దొంగల ముఠా అరెస్టు

హోసూరు: హోసూరు ప్రాంతంలో దోపిడీలకు కుట్ర చేసిన దొంగలను మత్తిగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల మేరకు మత్తిగిరి పోలీసులు సోమవారం రాత్రి కర్నూరు ప్రాంతంలో గస్తీ కాస్తుండగా కొందరు ఆయుధాలతో తిరుగుతూ పోలీసుల కంటబడ్డారు. పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ జరుపగా అందివాడి ప్రాంతానికి చెందిన హేమనాథ్ (20), మధుబాల (19), మిడగరపల్లికి చెందిన వినోద్ (26), అందివాడి మనోజ్ (19), అశోక్ (29) అని తెలిసింది. వీరిని అరెస్ట్ చేసి కేసులు నమోదు చేశారు.

మహిళా రియల్టర్ కిడ్నాప్.. నిందితుల అరెస్టు

హోసూరు: మహిళా రియల్టర్‌ను కిడ్నాప్ చేసిన ఇద్దరిని పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల మేరకు హోసూరు కార్పొరేషన్ మత్తిగిరి కూడలి రోడ్డు ప్రాంతానికి చెందిన జనార్దనరెడ్డి భార్య స్వర్ణ (44) రియల్టర్‌గా పనిచేస్తున్నారు. గత కొద్ది రోజుల క్రితం బెంగళూరుకు చెందిన చంద్రకుమార్‌కు సొంతమైన 6.4 ఎకరాల భూమిని సంజయ్, పాలిత్‌సింగ్‌లకు ఆమె విక్రయించింది. విషయం తెలుసుకొన్న చంద్రకుమార్ బావమరిది తళి సమీపంలోని కురుబరపల్లికి చెందిన రౌడీషీటర్ యదుభూషణరెడ్డి కలిసి స్వర్ణకు ఫోన్‌చేసి, చంద్రకుమార్ ఆస్తిని మళ్లీ అతని పేరుమీద రాసివ్వాలని బెదిరించారు. ఈ గొడవల నేపథ్యంలో గత నెల 13వ తేదీన యదుభూషణరెడ్డి, డెంకణీకోట సమీపంలోని దాసరపల్లికి చెందిన నల్లతంబి (47), బెంగళూరు ఆనేకల్ తాలూకా కొమ్మసంద్రకు చెందిన ఉమాశంకర్ (45)లు కలిసి స్వర్ణను కిడ్నాప్ చేశారు. ఈ ఘటనపై ఫిర్యాదు మేరకు హోసూరు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని నల్లతంబి, ఉమాశంకర్‌లను అరెస్ట్ చేశారు. బాధితురాలిని విడిపించారు. పరారీలో ఉన్న యదుభూషణరెడ్డి కోసం గాలిస్తున్నారు.

ప్రభుత్వ వైద్యునికి అవార్డు

కెలమంగలం: కెలమంగలం యూనియన్ వైద్యాధికారిగా గిరిజన గ్రామాల్లో ఉత్తమ వైద్య సేవలందజేస్తున్న డాక్టర్ రాజేష్‌కుమార్‌కు ఆరోగ్యశాఖ మంత్రి సుబ్రమణి నుంచి ఉత్తమ డాక్టర్ అవార్డును అందుకున్నారు. ప్రతి సంవత్సరం రాష్ట్రంలో ఉత్తమ సేవలందజేసే డాక్టర్లను ఎంపిక చేసి అవార్డులందజేయడం ఆనవాయితీ. కెలమంగలం ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యాధికారి డాక్టర్ రాజేష్‌కుమార్ గిరిజన గ్రామాలకు చెందిన ప్రజలకు ఉత్తమ వైద్యసేవలందజేస్తున్నందుకు అవార్డుకు ఎంపిక చేశారు.

పట్టాలివ్వాలని ఆందోళన



ఆందోళన నిర్వహిస్తున్న గిరిజన సంక్షేమ సంఘం

హోసూరు: తమిళనాడులో గిరిజన ప్రజలకు ఇళ్ల పట్టాలివ్వాలని కోరుతూ మంగళవారం హోసూరు సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఈ ఆందోళన కార్యక్రమానికి సీపీఎం అనుబంధ గిరిజన సంక్షేమ సంఘ జిల్లా కార్యదర్శి కుమరవడివేల్ అధ్యక్షత వహించారు. గిరిజన ప్రజలకు ఇళ్ల పట్టాలు అందజేయాలని, ఉచిత గృహవసతులు ఏర్పాటు చేయాలని, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డ్, రేషన్ కార్డు, విద్యుత్ సౌకర్యం, తాగునీటి వసతులు, రోడ్ల వసతులు కల్పించాలని, తరతరాలుగా సాగు చేస్తున్న భూములకు పట్టాలందజేయాలని, గిరిజన పట్టభద్రులకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని, అటవీ ప్రాంతాల్లో మేకలు, గొర్రెలు, పశువులు పెంచేందుకు అనుమతివ్వాలని, స్వయం ఉపాధికి రుణవసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతిపత్రాలను సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో మునియప్ప, గౌరీష్, షణ్ముగం, ప్రకాష్, ఎం.ఎం.రాజు, దేవరాజ్, ఆనందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా ఏపీ ప్రజల హక్కు

వెంటనే ప్రత్యేక హోదా ఇవ్వాలి

- హోదా ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని టీడీపీ అడగాలి
- విభజన హామీలనూ నెరవేర్చాలి
- విశాఖ రైల్వే జోన్ ఇవ్వాలి.. పోలవరం త్వరగా పూర్తి చేయాలి
- విశాఖ స్టీల్ ప్లాంట్, గనుల ప్రైవేటీకరణ ఆపాలి
- టీడీపీ అధికారంలోకి వచ్చిననాటి నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులు
- రాష్ట్రంలో శాంతి నెలకొల్పాలి
- రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత వైవీ సుబ్బారెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్ ప్రజల హక్కు అయిన ప్రత్యేక హోదాను డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌సీపీ మరోసారి పార్లమెంటులో గళమెత్తింది. విభజన తర్వాత తీవ్రంగా నష్టపోయిన ఏపీకి ప్రత్యేక హోదా ఆవశ్యకతను కేంద్రం దృష్టికి తీసుకెళ్లింది. విభజన హామీలతోపాటు కేంద్రం అమలు చేయాల్సిన పెండింగ్ పనులు, రాష్ట్రంలో అధికారపార్టీ దాడులు, యూజీసీ, నీట్ తదితర అంశాలను ప్రస్తావించింది. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానంపై మంగళవారం రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత వైవీ సుబ్బారెడ్డి మాట్లాడారు. రాష్ట్ర ప్రజల సమ్మతి, సంప్రదింపులు లేకుండా జరిగిన ఆంధ్రప్రదేశ్ విభజన జరిగి పదేళ్లయిందని సుబ్బారెడ్డి గుర్తుచేశారు. విభజనతో తీవ్రంగా నష్టపోయిన ఏపీకి ప్రత్యేక హోదా కల్పిస్తామని అప్పటి ప్రధాని ఇదే సభలో హామీ ఇచ్చారన్నారు. రాష్ట్ర ప్రజలు, ప్రభుత్వం ఎన్నిసార్లు అభ్యర్థించినా, నిరసనలు తెలిపినా కేంద్రం ప్రత్యేక హోదా ఇవ్వలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక ప్యాకేజీ రాష్ట్రానికి ఆమోదయోగ్యం కాదని తెలిపారు. ప్రత్యేక హోదా అనేది డిమాండ్ కాదని, అన్యాయంగా జరిగిన విభజన వల్ల తీవ్రంగా నష్టపోయిన ఏపీ ప్రజల హక్కు అని స్పష్టం చేశారు. ప్రత్యేక హోదాతోనే రాష్ట్ర ప్రజల కల నెరవేరుతుందని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రధాన మంత్రి, కేంద్ర హోం శాఖ మంత్రులను పదుల సార్లు కలిసి ప్రత్యేక హోదా కోసం అభ్యర్థించిన విషయాన్ని గుర్తుచేశారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉన్న టీడీపీ ప్రత్యేక హోదాను అడగాలని చెప్పారు. విభజన హామీలను కూడా వెంటనే నెరవేర్చాలని కోరారు. విశాఖ రైల్వే జోన్ వెంటనే ఇవ్వాలని, దీని కోసం గత ప్రభుత్వం భూమిని కూడా గుర్తించిందని తెలిపారు. నడికుడి – శ్రీకాళహస్తి రైల్వే లైన్, వైజాగ్ – చెన్నై కారిడార్, వైజాగ్ పోర్టు–భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం రహదారిని త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. భోగాపురం విమానాశ్రయం నుంచి విశాఖపట్నం వరకు మెట్రోను మంజూరు చేయాలన్నారు. పోలవరం ప్రాజెక్టు త్వరితగతిన పూర్తిచేయాలని, విశాఖ స్టీల్ ప్లాంట్, గనుల ప్రైవేటీకరణను నిలిపివేయాలని కేంద్రాన్ని కోరారు.

రైతులకు చేయూతనివ్వండి

పీఎం కిసాన్ నిధి కింద రైతులకు రూ.3.20 లక్షల కోట్లు అందించడం, వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర పెంచడంపట్ల సుబ్బారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. పీఎం కిసాన్ పథకం ఆర్థిక సాయాన్ని రూ.10 వేలకు పెంచాలన్నారు. ఏపీలో రైతు భరోసా పథకం కింద 49 లక్షల రైతు కుటుంబాలకు ఏడాదికి రూ.13,500 ఆర్థిక సాయం అందించిందని తెలిపారు. వైఎస్ జగన్ ప్రభుత్వం ఈ పథకానికి మొత్తం రూ.6,534 కోట్లు కేటాయించిందన్నారు. ప్రకృతి విపత్తులతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని కేంద్రాన్ని కోరారు.

పరీక్షల విధానాన్ని సంస్కరించండి

దేశంలో పరీక్షల విధానాన్ని సంస్కరించాలని విజ్ఞప్తి చేశారు. నీట్, యూజీసీ పరీక్షల్లో 23 లక్షల మంది విద్యార్థులు పాల్గొంటున్నారని, అందులో ఏపీ నుంచి 70 వేల మంది ఉన్నారని తెలిపారు. అయితే, ప్రభుత్వ కళాశాలల్లో 55,645 సీట్లు, ఎయిమ్స్‌లో 2000 సీట్లే ఉన్నాయని, ప్రభుత్వ కళాశాలల్లో సీట్ల కొరత తీవ్రంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దామాషా ప్రకారం కళాశాలలు, సీట్లు పెరగలేదన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సీట్లను లక్షకు పెంచాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణులపై టీడీపీ దాడులు

రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులపై అధికార పార్టీ హింసాత్మక దాడులకు పాల్పడుతోందని సుబ్బారెడ్డి సభ దృష్టికి తీసుకొచ్చారు. ఎస్సీ, ఎస్టీలు, ఓబీసీల ఇళ్లను టీడీపీ ప్రభుత్వం జేసీబీలతో కూల్చివేస్తోందని తెలిపారు. తాడేపల్లిలో వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం భవనాన్ని కూల్చివేశారని, జిల్లాల్లోని పార్టీ కార్యాలయాల కూల్చివేతకు సిద్ధమవుతున్నారని చెప్పారు. నాలుగు తెలుగు చానెళ్ల ప్రసారాలను నిలిపివేశారని, ఇది పత్రికా స్వేచ్ఛ, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను హరించడమేనని అన్నారు. మీడియా సంస్థలపై ప్రస్తుత ప్రభుత్వం ఒత్తిడి తెస్తోందని చెప్పారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని కోరారు.

క్లుప్తంగా...

క్షమాపణలతో ఫిర్యాదు వెనక్కి..

ఎచ్చెర్ల క్యాంపస్: అసభ్య పదజాలంతో దూషిస్తూ ఎంపీడీఓపై దురుసుగా ప్రవర్తించిన ఇద్దరు టీడీపీ నాయకులు చివరకు ఆమెకు క్షమాపణ చెప్పారు. శ్రీకాకుళం జిల్లా, ఎచ్చెర్ల ఎంపీడీవో టి.రమాదేవిని కొత్తకోట అమ్మినాయుడు, జీరు రామారావు అనే ఇద్దరు టీడీపీ నాయకులు అసభ్య పదజాలంతో దూషిస్తూ దురుసుగా ప్రవర్తించారని ఎంపీడీవో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే తక్షణమే ఫిర్యాదు వెనుక్కు తీసుకోవాలంటూ టీడీపీ నాయకుల నుంచి ఆమెపై ఒత్తిళ్లు ఎక్కువయ్యాయి. ఈక్రమంలోనే ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు మంగళవారం దీనిపై తన క్యాంపు కార్యాలయం బంటుపల్లిలో పంచాయితీ పెట్టారు. ఎంపీడీవోను దూషించిన నాయకులతో రమాదేవికి క్షమాపణలు చెప్పించారు. దీంతో ఆమె ఫిర్యాదు వెనక్కు తీసుకున్నారు. నాయకులు, ఎంపీడీఓ కార్యాలయం పరిపాలన అధికారి పి.వి.ఎస్. రామ్మోహన్‌రావు తదితరుల సమక్షంలో ఈ రాజీ పంచాయితీ నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ దాడి


తీవ్రంగా గాయపడిన సిద్ధారెడ్డి


ఘర్షణలో గాయపడిన రాజీ

సాక్షి టాస్క్‌ఫోర్స్: వైఎస్సార్ జిల్లా పులివెందుల శ్రీరామా హాల్ బైపాస్ రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు రాజీ, సిద్ధారెడ్డి, నాగచైతన్య, నాగకార్తీక్‌లపై టీడీపీ కార్యకర్త వినయ్ తదితరులు దాడికి తెగబడ్డారు. కర్రలు, రాడ్లతో వారిని చితకబాది, ఇళ్లల్లోని టీవీలు, అద్దాలను ధ్వంసం చేశారు. దాడిలో సిద్ధారెడ్డి తలకు, చేతికి తీవ్ర గాయాలు కాగా.. మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. క్షతగాత్రులను వైఎస్సార్‌సీపీ మునిసిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్ రెడ్డి, చైర్మన్ వరప్రసాద్ పరామర్శించారు.

ట్రాక్టర్లకు టీడీపీ నిప్పు



నరసరావుపేట: టీడీపీ మూకలు వ్యక్తులపై దాడులతోపాటు ఆస్తులనూ ధ్వంసం చేస్తూ గ్రామాల్లో అరాచకం సృష్టిస్తున్నారు. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం తుమ్మల చెరువు గ్రామంలో మంగళవారం తెల్లవారు జామున వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు తిప్పిరెడ్డి శివారెడ్డి ఎన్నికల సమయంలో టీడీపీకి వ్యతిరేకంగా పనిచేశాడని బజారులో ఉన్న ట్రాక్టర్లకు టీడీపీ మూకలు నిప్పు పెట్టాయి. ఈ ఘటనలో ఒక ట్రాక్టర్ పూర్తిగా దహనం కాగా, మరో ట్రాక్టర్ పాక్షికంగా దెబ్బతింది. మరోచోట ఓ దుకాణం షట్టర్ పగులగొట్టి టీవీ, రెండు ఫ్రిజ్‌లను ధ్వంసం చేశారు. నాలుగు రోజుల క్రితం సుంకు సుబ్బారెడ్డి గేదెల కోసం 9ఎకరాల మేతను కొని నిల్వ ఉంచాడు. గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం అర్ధరాత్రి గడ్డివాముకు నిప్పంటించారు. ఇళ్లపై రాళ్లు రువ్వుతూ దాడులకు పాల్పడుతున్నారు. ట్రాక్టర్ల దహనంపై పిడుగురాళ్ల పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు.

వైఎస్సార్ జయంతికి సోనియా, రాహుల్ రాక

సాక్షి, అమరావతి: దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 75వ జయంతి వేడుకలు ఈ నెల 8న విజయవాడలో ఘనంగా నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీ సన్నాహాలు చేస్తోంది. నగరంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో జరిగే ఈ వేడుకలకు ముఖ్యఅతిథులుగా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో పాటు అగ్ర నేత సోనియా గాంధీ, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ వంటి పలువురు ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నాయకులు, ప్రముఖులు, వైఎస్ సన్నిహితులు రానున్నారు. ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మంగళవారం తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఇతర క్యాబినెట్ మంత్రులను కలిసి ఈ కార్యక్రమానికి ఆహ్వానించారు.

ఏపీఎస్పీడీసీఎల్ యాప్ ద్వారానే విద్యుత్ బిల్లులు

తిరుపతి రూరల్: ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఎస్పీడీసీఎల్) పరిధిలోని వినియోగదారులు విద్యుత్ బిల్లులను ఏపీఎస్పీడీసీఎల్ మొబైల్ యాప్ (సదరన్ పవర్) లేదా వెబ్‌సైట్ www.apspdcl.in ద్వారానే చెల్లించాలని ఆ సంస్థ చైర్మన్, ఎండీ సంతోషరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మార్గదర్శకాల మేరకు ఇకపై వినియోగదారులు ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎంలతోపాటు ఇతర యూపీఐ యాప్స్ ద్వారా నేరుగా విద్యుత్ బిల్లులను చెల్లించే అవకాశం లేదన్నారు. ఏపీఎస్పీడీసీఎల్ మొబైల్ యాప్ లేదా వెబ్‌సైట్‌లోకి వెళ్లి బిల్ డెస్క్‌కు అనుసంధానమైన ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం, ఇతర యూపీఐ యాప్స్‌తో బిల్లులను చెల్లించవచ్చని వివరించారు. వీటితోపాటు వినియోగదారులు నెట్ బ్యాంకింగ్, క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు, వాలెట్, క్యాష్ కార్డుల ద్వారా కూడా చెల్లింపులు చేయొచ్చన్నారు.

బీసీలకు రాష్ట్రపతి, ప్రధాని చేసిన మేలేమిటి?

- పదేళ్లలో ఆ వర్గాలకు వీళ్లు చేసిందేమిటో ప్రజలకు చెప్పాలి
- రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ సభ్యుడు ఆర్.కృష్ణయ్య



సాక్షి, న్యూఢిల్లీ : ఎస్టీ వర్గానికి చెందిన రాష్ట్రపతి, బీసీ వర్గానికి చెందిన ప్రధాన మంత్రి దేశానికి ఉండటం హర్షించదగ్గ విషయమని వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. అయితే ఈ ఇద్దరూ ఈ పదేళ్లలో దేశంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఏం చేశారో చెప్పాలని రాజ్యసభలో డిమాండ్ చేశారు. అట్టడుగు వర్గాల అభివృద్ధి కోసం వీళ్లు ప్రవేశపెట్టిన పథకాలు ఒక్కటైనా చెప్పగలరా అని నిలదీశారు. ఏళ్ల తరబడి అగ్రకులాలకు చెందిన వాళ్లే ముఖ్యమంత్రి, ప్రధాన మంత్రి, ఎమ్మెల్యే, ఎంపీలు అవుతారా అని ప్రశ్నించారు. మా బీసీలు కనీసం గ్రామ సర్పంచులకు కూడా పనికి రారా అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. పంచాయతీల్లో కూడా వివక్ష చూపుతూ గ్రామ సర్పంచులను కూడా కానివ్వడంలేదని ఆరోపించారు. రాష్ట్రపతికి ధన్యవాదాల తీర్మానంపై మంగళవారం రాజ్యసభలో జరిగిన చర్చలో ఆర్.కృష్ణయ్య దాదాపు 20 నిమిషాలు ప్రసంగించారు. వైఎస్సార్‌సీపీ తరఫున రాష్ట్రపతి ప్రసంగానికి మద్దతు ప్రకటిస్తున్నట్లు చెప్పారు. ఏపీ విద్యా వ్యవస్థలో మాజీ సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన అనేక సంస్కరణలను ప్రశంసించారు. వాటిని దేశవ్యాప్తంగా అమలు చేయాలని సూచించారు.

బీసీలంటే అడుక్కునే వారు కాదు

బీసీలు అంటే అడుక్కునే వారు కాదని, రాబోయే రోజుల్లో తిరగబడేవారు అవుతారని హెచ్చరించారు. రూ.47 లక్షల కోట్ల కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు కేవలం రూ.2 వేల కోట్లు కేటాయించడం దుర్మార్గమని మండిపడ్డారు. దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీల అభివృద్ధికి బడ్జెట్‌లో ఇంత తక్కువ కేటాయించడం సిగ్గుచేటన్నారు. రూ.2 వేల కోట్లతో బీసీలకు చాక్లెట్లు, బిస్కెట్లు కూడా రావని ఎద్దేవా చేశారు.

వైఎస్ జగన్‌ను చూసి నేర్చుకోవాలి

ఏపీలో ఐదేళ్ల పాటు విద్యా వ్యవస్థను అభివృద్ధి పథంలో నడిపిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు దక్కుతుందని కృష్ణయ్య రాజ్యసభలో ప్రశంసించారు. అన్ని ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియం, ఫీజు రీయింబర్స్‌మెంట్, విదేశాలకు వెళ్లే విద్యార్థుల కోసం రూ.1కోటి వరకు స్టైఫండ్ ఇవ్వడంతోపాటు వైఎస్ జగన్ అనేక సంస్కరణలు తెచ్చారని గుర్తు చేశారు. వైఎస్ జగన్‌ను చూసి కేంద్ర ప్రభుత్వం, ఇతర రాష్ట్రాలు నేర్చుకోవాలని అన్నారు. ఏపీలో విద్యా వ్యవస్థలో వైఎస్ జగన్ తెచ్చిన సంస్కరణలు, అభివృద్ధిని దేశవ్యాప్తంగా అమలు చేయాలని సూచించారు.

మాకు రక్షణ కల్పించండి

- వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, సానుభూతిపరులపై దాడులు జరుగుతున్నాయి
- రాష్ట్రానికి కేంద్ర బలగాలు పంపేలా కేంద్ర హోంమంత్రిని ఆదేశించండి
- ఏపీకి ప్రత్యేక హోదా కల్పించేందుకు జోక్యం చేసుకోండి
- అరకు కాఫీ రైతులకు ప్రత్యేక ప్యాకేజీ అందేలా చూడండి
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు వైఎస్సార్‌సీపీ ఎంపీ తనూజరాణి విజ్ఞప్తి


రాష్ట్రపతితో అరకు ఎంపీ డాక్టర్ తనూజారాణి, మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ కుటుంబ సభ్యులు

సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): ఆంధ్రప్రదేశ్‌లో శాసనసభ ఎన్నికల తర్వాత వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులపై అధికార కూటమి నాయకులు చేస్తున్న భౌతిక దాడుల నుంచి రక్షణ కల్పించాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు వైఎస్సార్‌సీపీ ఎంపీ డా.తనూజరాణి విజ్ఞప్తి చేశారు. మంగళవారం తన కుటుంబసభ్యులతో కలిసి ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఆమె రాష్ట్రపతిని కలిసి రాష్ట్రంలోని తాజా పరిస్థితులను వివరించారు. కూటమి నేతలు వైఎస్సార్‌సీపీ నేతలపై ద్వేషపూరిత ప్రసంగాలు చేయడం, హింసను ప్రేరేపించడం చేస్తున్నారని రాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్లారు. పోలీసులు టీడీపీ కూటమి ఒత్తిళ్లకు లొంగిపోయి హింసాత్మక చర్యలను అరికట్టడం లేదన్నారు. కేవలం వైఎస్సార్‌సీపీ శ్రేణులపైనే కాకుండా దివంగత సీఎం వైఎస్సార్ విగ్రహాలు, గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని కూటమి శ్రేణులు దాడులు చేస్తున్నాయని వివరించారు. ఈ ఘటనలు రాష్ట్రవ్యాప్తంగా భయాందోళనలు రేపుతున్నాయని రాష్ట్రపతికి తెలిపారు. ఈ హింసాకాండను నియంత్రించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమయ్యిందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి కేంద్ర బలగాలను పంపాలని కోరారు. ఈ మేరకు కేంద్ర హోంమంత్రిని ఆదేశించాలని విన్నవించారు. అలాగే ఏపీకి ప్రత్యేక హోదా కల్పించాల్సిందిగా కేంద్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని కోరారు. గిరిజనులకు సంబంధించి వివిధ సమస్యలపై రాష్ట్రపతికి తనూజారాణి వినతిపత్రం అందజేశారు. గిరిజన ప్రాంతాల్లో నూరుశాతం ఉద్యోగాలు ఆదివాసీలకు కల్పించే జీవో నంబరు 3ను పునరుద్ధరించాలని కోరారు. లేకుంటే ప్రత్యామ్నాయంగా మరో ప్రత్యేక చట్టం తీసుకువచ్చి ప్రభుత్వ ఉద్యోగాలన్నీ స్థానిక గిరిజనులకే కల్పించాలని విన్నవించారు. అరకు కాఫీని పండిస్తున్న రైతులు లాభాలను పొందలేకపోతున్నారని తెలిపారు. మధ్యవర్తులు మాత్రమే లాభపడుతున్నారని వివరించారు. అందువల్ల కాఫీ బోర్డు, ఇతర సంస్థలు నేరుగా గిరిజన సంఘం సభ్యులకు లాభదాయకమైన ధర, ప్రత్యేక ప్యాకేజీని అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అరకు పార్లమెంట్ నియోజకవర్గంలో పర్యాటక రంగాన్ని పెంపొందించేందుకు, గిరిజనులకు మరింత ఉపాధి అవకాశాల కల్పనకు అరకు కాఫీకి మరింత ప్రాచుర్యం అవసరమన్నారు. గిరిజన కాఫీ సొసైటీని ఏర్పాటు చేయాలని కోరారు. సంబంధిత సమస్యలను పరిశీలించి.. పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తానని రాష్ట్రపతి హామీ ఇచ్చారని ఎంపీ తనూజారాణి తెలిపారు. రాష్ట్రపతిని కలిసినవారిలో ఎంపీ తనూజారాణి భర్త, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్, మామ, మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, తదితరులు ఉన్నారు.

పలాస మునిసిపల్ చైర్మన్‌పై టీడీపీ నేతల దౌర్జన్యకాండ

- మెడ పట్టుకున్న పట్టణ టీడీపీ కార్యదర్శి
- గుండెపై చేతులు వేసి తోసేసిన వైనం
- బూతు పురాణం విప్పిన కార్యకర్త
- వీడియో తీసి సోషల్ మీడియాలో వైరల్
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు


చైర్మన్ గిరిబాబు, ఆయన సోదరుడు ఆనందరావులను చేతులతో బలంగా పట్టుకున్న సప్ప నవీన్

కాశీబుగ్గ: శ్రీకాకుళం జిల్లా పలాస–కాశీబుగ్గ మునిసిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, ఆయన సోదరుడు ఆనందరావును 24వ వార్డు కౌన్సిలర్ కుమారుడు, టీడీపీ పట్టణ కార్యదర్శి సప్ప నవీన్ అగౌరవపరుస్తూ.. ఇద్దరినీ బలవంతంగా చేతులతో అదుపు చేస్తున్న వీడియోలు మంగళవారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వివరాల్లోకి వెళితే.. పలాస మునిసిపాలిటీలో సోమవారం పింఛన్ల పంపిణీ జరిగింది. ఇందులో 24వ వార్డుకు చెందిన తిరునగరి కురత్తాల్వర్ స్వామీజీకి పింఛన్ ఇవ్వకుండా ఇబ్బంది పెట్టారు. దీంతో ఆయన మునిసిపల్ చైర్మన్ గిరిబాబును ఆశ్రయించగా.. సచివాలయ సిబ్బంది 24వ వార్డు కౌన్సిలర్ సప్ప అమ్మోజీ ఇంటి వద్ద ఉన్నారని తెలిసి గిరిబాబు తదితరులు అక్కడికి వెళ్లారు. సచివాలయ ఉద్యోగి మాధవరావును పిలిచి స్వామీజీకి పింఛన్ ఇవ్వాలని కోరగా.. అక్కడే ఉన్న టీడీపీ కార్యదర్శి సప్ప నవీన్ తన అనుమతి లేకుండా సచివాలయ ఉద్యోగి రాడని చెప్పడంతో వాగ్వాదం మొదలై తోపులాటకు దారితీసింది. అంతలో కొరికాన వైకుంఠరావు అనే టీడీపీ కార్యకర్త మునిసిపల్ చైర్మన్ గిరిబాబు పైకి దూసుకొచ్చి అసభ్య పదజాలంతో విరుచుకుపడ్డారు. ఇంతలో టీడీపీ నేత సప్ప నవీన్ వారిద్దరినీ రెండు చేతులతో మెడలు పట్టుకుని అడ్డుకున్నారు. మునిసిపల్ చైర్మన్ అనే కనీస గౌరవం కూడా లేకుండా ఆయన గుండెలపై చేతులు వేసి తోసేశారు. ఈ తతంగం అంతా టీడీపీ సానుభూతి పరుడు వీడియో తీసి మంగళవారం సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అనంతరం మునిసిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి సీఐ విజయానంద్‌కు ఫిర్యాదు చేశారు. సప్ప నవీన్, సప్ప మన్మధరావు, కొరికాన వైకుంఠరావు, పిట్ట నరసింహులుపై ఫిర్యాదు అందినట్టు పోలీసులు తెలిపారు.

ప్రభుత్వాస్పత్రిలో ఎమ్మెల్యే అమ్మగారి హంగామా

- సిబ్బందిపై చిందులు
- పనిచేసే వారినే పెట్టుకుంటామంటూ హెచ్చరిక
- రోజుకో చోట హల్‌చల్ చేస్తున్న ఎమ్మెల్యే తల్లి


శ్రీకాళహస్తి ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న బొజ్జల బృందమ్మ

శ్రీకాళహస్తి (తిరుపతి జిల్లా): శ్రీకాళహస్తి టీడీపీ ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బొజ్జల బృందమ్మ మంగళవారం రాత్రి శ్రీకాళహస్తిలో హంగామా సృష్టించారు. పట్టణంలోని ఏరియా ఆస్పత్రికి వెళ్లి అక్కడి సిబ్బందిపై చిందులు తొక్కారు. సుధీర్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందిన అనంతరం హైదరాబాద్ వెళ్లి అక్కడే మకాం వేశారు. ఆయన తల్లి బృందమ్మే ఇక్కడ అన్ని వ్యవహారాలూ చూస్తూ రోజూ పట్టణంలో ఏదో ఒక చోట హడావుడి చేస్తున్నారు. ఆమెకు టీడీపీలో ఏ హోదా లేదు. ఏ నామినేటెడ్ పోస్టు కూడా లేదు. అయినా సమావేశాలు, పింఛన్ల పంపిణీ, ఆలయాల్లో పూజలు, ఆస్పత్రుల్లో తనిఖీలు అంటూ ప్రత్యక్షమైపోతున్నారు. ఆదివారం శ్రీకాళహస్తి ఆలయానికి వెళ్లి అక్కడా తనిఖీ పేరిట హల్‌చల్ చేశారు. సోమవారం పింఛన్లు కూడా ఆమే పంపిణీ చేశారు. మంగళవారం పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో ప్రత్యక్షమయ్యారు. ఆస్పత్రి మొత్తం తిరిగి హంగామా చేశారు. పారిశుధ్యం బాగోలేదంటూ సిబ్బందిపై మండిపడ్డారు. ఇక ప్రతి రోజూ ప్రభుత్వాస్పత్రిని తనిఖీ చేస్తానంటూ అక్కడి వైద్యులు, సిబ్బందిని హెచ్చరించారు. ఆస్పత్రిలో పనిచేసే సిబ్బందినే పెట్టుకుంటామని, మిగతా వారిని తొలగిస్తామని అన్నారు.

బైకులతో ఢీకొట్టి కత్తులు, గొడ్డళ్లతో హత్యాయత్నం

- నంద్యాల జిల్లాలో టీడీపీ నేతల దుశ్చర్య
- చావుబతుకుల మధ్య ఆస్పత్రి పాలైన వైఎస్సార్‌సీపీ నేత
- మరొకరికి తీవ్రగాయాలు
- 8 మందిపై కేసు నమోదు


టీడీపీ నాయకుల దాడిలో తీవ్రంగా గాయపడిన రవీంద్రారెడ్డి

గడివేముల: నంద్యాల జిల్లా గడివేముల మండలం ఒండుట్లకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గంజర్ల రవీంద్రారెడ్డిపై టీడీపీ నాయకులు మంగళవారం ఉదయం హత్యాయత్నానికి పాల్పడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రవీంద్రారెడ్డి సొంత బస్సులో కర్నూలు నుంచి గని గ్రామానికి చేరుకున్నాడు. కర్నూలు నుంచి ఒండుట్ల గ్రామానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో తన ఊరికి వెళ్లేందుకు బైకు తీసుకురావాలని అదే గ్రామానికి చెందిన వెంకటరమణను కోరాడు. రవీంద్రారెడ్డితో పాటు సురేష్ అనే వ్యక్తి కూడా ఉన్నారు. వెంకటరమణ బైకు తీసుకురాగా.. గని గ్రామం నుంచి ముగ్గురూ దానిపై బయలుదేరారు. అప్పటికే టీడీపీ నాయకులు పథకం ప్రకారం పొలాల్లో కాపు కాశారు. రవీంద్రారెడ్డి గ్రామ సమీపంలోని సుద్దగయి వద్దకు చేరుకోగా.. మూడు బైకులతో ఎదురుగా వచ్చి ఆ ముగ్గురూ ప్రయాణిస్తున్న వెళ్తున్న బైకును ఢీకొట్టారు. ముగ్గురూ కిందపడిపోవటంతో కత్తులు, గొడ్డళ్లు, రాడ్లతో విచక్షణారహితంగా దాడి చేశారు. అడ్డుకునేందుకు వెళ్లిన వెంకటరమణను రాడ్లు, గొడ్డళ్లతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. చుట్టుపక్కల పొలాల్లో పని చేస్తున్న వారు రావడంతో దుండగులు పారిపోయారు. తీవ్రంగా గాయపడిన రవీంద్రారెడ్డి, వెంకటరమణను ఆటోలో కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పాణ్యం సీఐ నల్లప్ప, ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. రవీంద్రారెడ్డి ఫిర్యాదు మేరకు టీడీపీ నాయకులు గంజర్ల గణేష్‌రెడ్డి, రామగోవిందు, తలారి రామస్వామి, రంగనాయకులు, చిన్న రంగస్వామి, చంద్ర, మారెళ్ల శ్రీనివాసులు, మారెళ్ల లక్ష్మన్నపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్య తెలిపారు. నిందుతుల కోసం గాలిస్తున్నట్టు చెప్పారు.

అండగా ఉంటాం: కాటసాని

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులు తీవ్రతరం చేశారని నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన టీడీపీ నేతల దాడిలో గాయపడిన రవీంద్రారెడ్డిని ఆస్పత్రిలో పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కూటమి నాయకులు చేస్తున్న ఆరాచకాలను ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉండగా ఇలాంటి హింసాత్మక ఘటనలకు పాల్పడలేదన్నారు. టీడీపీ నాయకులు చేతిలో తీవ్రంగా గాయపడ్డ రవీంద్రారెడ్డికి న్యాయం జరిగేంత వరకు పోరాడతానన్నారు. నియోజకవర్గంలోని ప్రతి నాయకుడు, కార్యకర్తకు అండగా ఉంటానన్నారు.

టీడీపీకి ఓటేయలేదని పొలాల వెళ్లకుండా కంచె

- వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై టీడీపీ నేతల అక్కసు
- వైఎస్సార్ జిల్లా రావులకొలనులో దుర్మార్గం


రహదారిని చదును చేసి ఏర్పాటు చేసిన కంచె

సాక్షి టాస్క్‌ఫోర్స్:టీడీపీకి ఓటు వేయలేదనే అక్కసుతో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులైన రైతుల్ని వారి పొలాలకు వెళ్లకుండా అడ్డుకునేందుకు టీడీపీ నేతలు కంచె వేసిన ఘటన వైఎస్సార్ జిల్లా సింహాద్రిపురం మండలం రావులకొలనులో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతులు శ్రీనివాసరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, గణేష్‌కుమార్‌రెడ్డి, కంభం రాజశేఖర్‌రెడ్డి, వీరనారాయణమ్మ, రఘువర్మ వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులుగా ఉన్నారు. వీరంతా సర్వే నంబర్ 7, 9, 14, 10, 8లో గల తమ పొలాల్లో వాణిజ్య పంటలు వేసుకుని జీవనం సాగించేవారు. వీరంతా చిన్నకుంటపల్లె నుంచి రామగిరి రహదారి మీదుగా పొలాలకు వెళ్లేవారు. సమీపంలోని చెరువు నీటిని పొలాలకు ఉపయోగించుకునేవారు. ఇదే ప్రాంతంలో సర్వే నంబర్ 7లో టీడీపీకి చెందిన గోవిందరెడ్డి పొలం కూడా ఉంది. టీడీపీ అధికారంలోకి రాగానే వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులైన రైతులను ఇబ్బందుల పాలు చేయాలనే ఉద్దేశంతో రైతులు వెళ్లకుండా రహదారిపై టీడీపీ నేత గోవిందరెడ్డి కంచె ఏర్పాటు చేశాడు. ఇదేమని రైతులు ప్రశ్నిస్తే 'మీకు దిక్కున్నచోట చెప్పుకోండి' అంటూ బెదిరిస్తున్నాడని రైతులు వాపోతున్నారు.

పరిహారం పొందినా.. పంట వేస్తున్నాడు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గోవిందరెడ్డి తనకున్న వ్యవసాయ భూమిలో దాదాపు 1.50 ఎకరాలను లోమడ చెరువు కింద మునక ప్రాంతం వల్ల కోల్పోయాడు. ఆ భూమి నిమిత్తం ప్రభుత్వం గోవిందరెడ్డికి నష్టపరిహారం కింద రూ.10 లక్షలకు పైగా చెల్లించింది. కోల్పోయిన భూమికి నష్టపరిహారం పొందినా గోవిందరెడ్డి అదే పొలంలో చీనీ చెట్లు నాటుకుని వ్యవసాయం చేస్తున్నాడు. గోవిందరెడ్డి చర్యల్ని పరిశీలించి తమకు న్యాయం చేయాలని బాధిత రైతులు తహసీల్దార్ భూమేశ్వరరావుకు మంగళవారం ఫిర్యాదు చేశారు. రహదారిని చదును చేసి కంచె వేసి ఆక్రమించుకోవాలనుకోవడం అన్యాయమని ఫిర్యాదులో పేర్కొన్నారు.

రూ.40 కోట్ల విలువైన డ్రగ్స్ సీజ్

రూ. కోటిన్నర విదేశీ కరెన్సీ స్వాధీనం

సాక్షి, చెన్నై: చెన్నైలో నార్కోటిక్స్ కంట్రోల్ యూనిట్ పోలీసులు సోమవారం రాత్రి వేరు వేరు చోట్ల నిర్వహించిన దాడుల్లో రూ.40 కోట్ల విలువైన మెథాంపెటమైన్ స్వాధీనం చేసుకున్నారు. ఓ బాలుడి సహా 9 మందిని అరెస్ట్ చేశారు. చెన్నై నుంచి శ్రీలంకకు అక్రమంగా డ్రగ్స్ తరలిస్తున్నట్లు నార్కోటిక్స్ విభాగం పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీని ఆధారంగా చెన్నైలోని పలు ప్రాంతాల్లో సోమవారం రాత్రి ముమ్మరంగా నిఘా నిర్వహిస్తుండగా తొలుత రెడ్‌హిల్స్ సమీపంలో మెథాంపెటమైన్ డ్రగ్స్ స్వాధీనం చేసుకున్న అధికారులు రామనాథపురం మండపం శరణార్థి శిబిరానికి చెందిన 17 ఏళ్ల బాలుడితో సహా ఇద్దరిని అరెస్టు చేశారు. వారి నుంచి 1.47 కిలో మెథాంపెటమైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. వారిచ్చిన సమాచారం మేరకు పుళల్ జైలులో ఉన్న కాశిలింగమ్ భార్య కృష్ణకుమారికి చెందిన ఇంట్లో పోలీసులు జరిపిన సోదాల్లో రూ. కోటిన్నర విలువైన అమెరికా డాలర్లు, శ్రీలంక కరెన్సీ నోట్లు గుర్తించి సీజ్ చేశారు. అక్రమ రవాణాకు పాల్పడిన నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. జైలులో ఉంటూనే డ్రగ్స్ స్మగ్లింగ్‌కు ప్లాన్ చేసిన ఘటన పోలీసులను సైతం విస్మయానికి గురిచేసింది. అదేవిధంగా చెన్నైలోని రాయపేట ప్రాంతంలో డ్రగ్స్ స్మగ్లింగ్ జరుగుతుందన్న సమాచారం మేరకు సెంట్రల్ నార్కోటిక్స్ ట్రాఫికింగ్ యూనిట్ రాయపేట పీటర్స్ రోడ్డులో ముమ్మరంగా నిఘా పెట్టింది. అందులో 2.7 కిలోల మెథాంపెటమైన్‌ను గుర్తించారు. విచారణలో డ్రగ్స్ మణిపూర్‌లోని మోరే ప్రాంతం నుంచి అక్రమంగా రవాణా చేసినట్లు తేలింది. ఈ ఘటనలో ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు వారిని విచారణ చేస్తున్నారు. ఈ తనిఖీల్లో మొత్తం రూ.40 కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు.



హోమ్‌వర్క్ ఎవరికి కష్టం?

'పిల్లలు హోమ్‌వర్క్ చేయరు... తల్లిదండ్రులే చేస్తారు... ఇది తెలిసీ టీచర్లు హోమ్‌వర్క్ ఇవ్వడంలో అర్థం లేదు' అని ఒక భారతీయ తల్లి విడుదల చేసిన వీడియో చర్చ లేవదీసింది. ప్రపంచ దేశాలతో పోలిస్తే జపాన్ తల్లిదండ్రులు వారంలో రెండున్నర గంటలే పిల్లల హోమ్‌వర్క్‌కు కేటాయిస్తుంటే భారతీయులు వారానికి 12 గంటలు కేటాయిస్తున్నారు. కొందరు ఇది భారం అంటున్నా పిల్లలకు హోమ్‌వర్క్ లేకపోతే కలత పడే తల్లిదండ్రులే మన దగ్గర ఎక్కువ. హోమ్‌వర్క్ మంచి-చెడు...

'పిల్లలు హోమ్‌వర్క్ చేయరనీ తల్లిదండ్రులే దానిని పూర్తి చేస్తారని టీచర్లకు తెలుసు. అయినా సరే వారు హాలిడే హోమ్‌వర్క్ ఇస్తారు. పిల్లలు హాలిడే ఎంజాయ్ చేస్తుంటే తల్లిదండ్రులు మాత్రం గంపెడు హోమ్‌వర్క్‌ను ముందేసుకుని కూచోవాల్సి వస్తోంది. ఇక మీదటైనా పిల్లలు సొంతగా ఎంత హోమ్‌వర్క్ చేయగలరో అంతే ఇవ్వండి' అని ఒక తల్లి చేసిన వీడియో ఇన్‌స్టాలో జూన్ 30న విడుదలైంది. ఈ వీడియోకు చాలామంది స్పందిస్తున్నారు.

'ఎనిమిదవ తరగతి వచ్చే వరకు పిల్లలకు హోమ్‌వర్క్ ఇవ్వరాదు' అని ఒకరంటే 'అవును. టీచర్లు మరీ అన్యాయంగా ఉన్నారు. రెండో తరగతి చదువుతున్న మా అబ్బాయిని మానవ శరీరంలోని భాగాలను గీసుకు రమ్మని చెప్పారు' అని మరొకరు వ్యాఖ్యానించారు. 'నేను వేసవి సెలవుల్లో మా అమ్మాయి హోమ్‌వర్క్‌ను పూర్తి చేయడమే సరిపోయింది' అని మరొక తల్లి అంది. 'ఇది మరీ విడ్డూరం. తల్లిదండ్రులకు పిల్లలతో సమయం గడిపే వీలు ఉండటం లేదు. వారితో సమయం గడిపే వీలు హోమ్‌వర్క్ ఇస్తుంది. పిల్లలతో కూచుని సరదాగా ఎంజాయ్ చేస్తూ చదివించాలి. హోమ్‌వర్క్ చేయించాలి' అని మరొక తల్లి అంది.

మన దేశంలోనే

హోమ్‌వర్క్ ఇవ్వడం, తల్లిదండ్రులు పిల్లలతో కూచుని సాయం పట్టడం ప్రతి దేశంలో ఉంది. అయితే మనంత మాత్రం లేదు. హోమ్‌వర్క్‌కు తల్లిదండ్రులు ఎంత సమయం వెచ్చిస్తున్నారని 29 దేశాల్లో అధ్యయనం చేస్తే చిట్టచివరి స్థానంలో జపాన్ రెండున్నర గంటలతో నిలిస్తే భారత్ మొదటిస్థానంలో 12 గంటలతో నిలిచింది. అమెరికాలో ఆరు గంటలు, చైనాలో ఏడు గంటలు, ఫ్రాన్స్‌లో నాలుగు గంటలు తల్లిదండ్రులు వెచ్చిస్తున్నారు. అయితే అన్నీ దేశాల్లోని తల్లిదండ్రులు ప్రభుత్వ/ఉచిత బడులలో అందే విద్య మీద విశ్వాసం కనపరచలేదు. అంటే డబ్బు కట్టి చదివించడం, మళ్లీ స్కూల్లో చెప్పే చదువు మీద నమ్మకం లేక తామే చదివించడం, అందుకు హోమ్‌వర్క్‌ను ఒక మార్గంగా ఎంచుకోవడం అన్నీ దేశాల్లో ఉన్నా మన దేశంలో అత్యధికంగా ఉంది.

> 'మన దేశంలో చదువు ద్వారా వచ్చే ఉద్యోగాల గురించే తల్లిదండ్రుల బెంగ. అందుకే స్కూల్లో, ఇంట్లో చదువు గురించి ఒత్తిడి తెస్తారు. దీనివల్ల పిల్లల్లో సహజంగా ఉంటే కళాభిరుచి, క్రీడాప్రతిభ, ఇతర టాలెంట్లు నశించిపోతున్నాయి' అని కొందరు నిపుణులు అంటున్నారు.

బండెడు హోమ్‌వర్క్

పిల్లలకు ఎంత ఎక్కువ హోమ్‌వర్క్ ఇస్తే అది అంతమంచి స్కూల్ అనే అభిప్రాయం చాలామంది తల్లిదండ్రుల్లో ఉంది. పిల్లలు స్కూల్ నుంచి ఇంటికొచ్చాక ఆడుకుంటూ ఉంటే వారు సమయం వృథా చేస్తున్నారని, హోమ్‌వర్క్ చేస్తూ ఉంటే కనుక బుద్ధిమంతులని అనుకోవడం దాదాపు అందరు తల్లిదండ్రుల్లో ఉంది. 'మన దేశంలో చదువు ద్వారా వచ్చే ఉద్యోగాల గురించే తల్లిదండ్రుల బెంగ. అందుకే స్కూల్లో, ఇంట్లో చదువు గురించి ఒత్తిడి తెస్తారు. దీనివల్ల పిల్లల్లో సహజంగా ఉంటే కళాభిరుచి, క్రీడా ప్రతిభ, ఇతర టాలెంట్లు నశించిపోతున్నాయి' అని కొందరు నిపుణులు అంటున్నారు. 'హోమ్‌వర్క్ అనేది క్వాలిటేటివ్‌గా ఉండాలి. 'క్వాంటిటేటివ్‌గా కాదు. చదివిన పాఠాల గురించి మరింత లోతుగా అర్థం చేసుకోవడం గురించి హోమ్‌వర్క్ ఉండాలి కాని గుడ్డిగా సమయం వెచ్చించేలా ఉండకూడదు' అని నిపుణులు అంటున్నారు.

ఏది... ఎంత?

హోమ్‌వర్క్‌లు పిల్లలకు అధికమైనా దానివల్ల తల్లిదండ్రుల సమయం అవసరానికి మించి ఇవ్వాల్సి వచ్చినా ఆ తీరును నిరోధించాల్సిందే. హోమ్‌వర్క్‌లు బడిలో చదివింది మరింత బాగా అర్థం చేయించేలా ఉండాలి... అలాగే తల్లిదండ్రుల ధోరణి ఆ పాఠాలు పిల్లలకు ఏ మాత్రం అర్థమయ్యాయో చూసి అర్థం చేయించడంలో సాయం పట్టేలా ఉండాలి. ఇక ప్రాజెక్ట్ వర్క్ లాంటివి పిల్లలతో పాటు తల్లిదండ్రుకూ ఆటవిడుపుగా ఉండాలి. నిజానికి కుదురు లేని పిల్లలు తల్లిదండ్రుల పక్కన సమయం చేసుకుని కూచోడానికి ఒక మంచి సాధనం హోమ్‌వర్క్. ఆ వంకతో తల్లిదండ్రులు పిల్లలతో కూచోవాలి. వారు ఎలా చదువుతున్నారు, క్లాస్‌రూముల్లో ఏం జరుగుతోంది, ఏ విషయాలకు సంతృప్తిగా ఉన్నారు... ఏ విషయాలు ఆందోళన కలిగిస్తున్నాయి, ఏ సబ్జెక్ట్‌లు వారికి ఇష్టం, కష్టంగా ఉన్నాయి... ఇవన్నీ తెలుసుకోవడానికి హోమ్‌వర్క్ సమయం సాయం చేస్తుంది. హోమ్‌వర్క్ ఒక తప్పనిసరి భారం చేస్తే దాని నుంచి తప్పించుకోవడానికి ఇంటి నుంచి పారిపోవాలని చూసిన పిల్లలూ ఉన్నారు. అలాగే పిల్లలకు సాయం చేయడానికి సమయంలేక వారి మీద చికాకు పడి ఇంట్లో అశాంతి రేపే తల్లిదండ్రులు కూడా ఉన్నారు. ఈ విషయాలన్నీ పీటీఎంలలో టీచర్లతో చర్చిస్తూ హోమ్‌వర్క్ సమయాలను విజ్ఞాన, వినోద దాయకంగా పిల్లలతో గడిపే క్వాలిటీ సమయాలుగా మార్చుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే.





ఏఎస్ఐ శ్యామల

వేసపోగు శ్యామల... హైదరాబాద్, సైఫాబాద్ ట్రాఫిక్ ఏ.ఎస్.ఐ. ఇంటర్నేషనల్ మాస్టర్స్ గేమ్స్ అసోసియేషన్ నిర్వహిస్తున్న '2024 పాన్ అమెరికన్ మాస్టర్స్ గేమ్స్'కి ఆహ్వానం అందుకున్నారామె. ఈ నెల 12 నుంచి 21 వరకు యూఎస్‌ఏలోని ఓహియో రాష్ట్రం, క్లీవ్‌ల్యాండ్‌లో జరగనున్న పోటీల్లో షాట్ పుట్, డిస్కస్ త్రోలలో పాల్గొంటున్న సందర్భంగా ఆమె తన బాల్యం నుంచి నేటి వరకు తన ప్రస్థానాన్ని 'సాక్షి' ఫ్యామిలీతో పంచుకున్నారు.

అమెరికా ఆటల పోటీలో... మన మహిళా పోలీస్

''నేను పుట్టింది ఆంధ్రప్రదేశ్, కర్నూలు పట్టణంలోని సిమెంట్ నగర్‌లో. నాన్న మిలటరీ ఆఫీసర్ అమ్మ స్టాఫ్‌నర్స్. ఏడుగురు అక్కలు, ఇద్దరు అన్నల గారాల చెల్లిని నేను. మా పేరెంట్స్ మమ్మల్నందరినీ బాగా చదివించారు. నాన్న వారసత్వాన్ని కొనసాగిస్తూ ఒక అన్న మిలటరీలో ఉన్నారు. ఒక అక్క, నేను పోలీస్ డిపార్ట్‌మెంట్‌లోకి వచ్చాం. నా ఫస్ట్ పోస్టింగ్ హైదరాబాద్ నగరంలోని గోపాల్‌పురం. విద్యార్థి దశ నుంచి మంచి క్రీడాకారిణిని. డిస్ట్రిక్ట్ లెవెల్‌లో ఖోఖో, కబడీ, త్రో బాల్, వాలీబాల్, బ్యాడ్‌మింటన్‌లో లెక్కలేనన్ని పతకాలందుకున్నాను. షాట్‌పుట్, డిస్కస్‌త్రోలో జాతీయస్థాయి పతకాలందుకున్నాను. కరాటేలో బ్లాక్ బెల్ట్ ఉంది. నేను ఇప్పుడు మీ ముందు ఇంత అడ్వెంచరస్‌గా కనిపిస్తున్నానంటే కారణం ఈ నేపథ్యమే.

ఈ ఉద్యోగం ఆడవాళ్లకెందుకు?

స్త్రీపురుష సమానత్వ సాధన కోసం ప్రభుత్వాలు ముందడుగు వేస్తున్నాయి. మాలాంటి ఎందరో పోలీసింగ్, దేశరక్షణ వంటి క్లిష్టమైన విధులను భుజాలకెత్తుకున్నాం. కానీ సమాజం మాత్రం అంత ముందు చూపుతో లేదన్న వాస్తవాన్ని మా డిపార్ట్‌మెంట్‌లోనే చూశాను. 'ఆఫ్టరాల్ ఉమన్, జస్ట్ కానిస్టేబుల్, యూనిఫామ్ వేసుకుని డ్యూటీకి వస్తారు, వెళ్తారు. జీతం దండగ' అనే మాటలు మేము వినాలనే అనేవాళ్లు. నాలో కసి ఎంతగా పెరిగిపోయిందంటే...



వాహనం కొనేటప్పుడు చిన్నవి వద్దని 350 సీసీ బుల్లెట్ తీసుకున్నాను. 'ఏ అసైన్‌మెంట్ అయినా ఇవ్వండి' అన్నాను చాలెంజింగ్‌గా. నైట్ పెట్రోలింగ్ చేయమన్నారు. అది కూడా సింగిల్‌గా. ఒక్కరోజు కూడా విరామం తీసుకోకుండా వరుసగా 60రోజులు రాత్రి పది నుంచి రెండు గంటల వరకు బైక్ మీద హైదరాబాద్ సిటీ పెట్రోలింగ్ చేశాను. ఆ డ్యూటీతో వార్తాపత్రికలు, టీవీలు నన్ను స్టార్‌ని చేశాయి. 'ఎంటైర్ ఆల్ ఇండియా చాలెంజింగ్ ఉమన్ ఆఫీసర్' అని అప్పటి సీపీ అంజనీకుమార్ సత్కరించారు. బేగంపేట మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫైళ్లను త్వరితగతిన క్లియర్ చేసిన మహిళా కానిస్టేబుల్‌గా ఏసీపీ రంగారావు చేతుల మీదుగా సత్కారం అందుకున్నాను.

బుల్లెట్ పై వస్తా... ఆకతాయిల భరతం పడతా!

పోలీసులంటే శాంతిభద్రతలు, ట్రాఫిక్ నిర్వహణకు మాత్రమే పరిమితం కాకుండా సమాజంలో ఉన్న సమస్యలన్నింటినీ అడ్రస్ చేయాలి. ఆ ప్రయత్నంలో భాగంగా ట్రాఫిక్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్, భరోసా, షీ టీమ్స్, తెలంగాణ స్టేట్ పోలీస్ కౌన్సెలింగ్ అండ్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్, కరోనా సమయంలో అనారోగ్యంతో ప్రయాణించవద్దు– వ్యాప్తికి కారణం కావద్దనే ప్రచారం, ఓటు నమోదు, ఓటు హక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమం, ఆత్మహత్యల నివారణ కోసం అవగాహన కార్యక్రమం నిర్వహిస్తూ... 'మీ జీవితం మీ చేతుల్లోనే ఉంది. నిలబెట్టుకోవడం, కాలరాసుకోవడం రెండూ మన నిర్ణయాల మీదనే ఉంటాయ'ని చెప్పేదాన్ని. గణేశ్ ఉత్సవాల సమయంలో మహిళలను తాకుతూ విసిగించడం, మెడల్లో దండలు అపహరించే పోకిరీల మీద ప్రత్యేక దృష్టి పెట్టింది మా డిపార్ట్‌మెంట్. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న ఆకతాయిల భరతం పట్టడం చాలా సంతోషాన్నిచ్చింది.

సరదాకొద్దీ సోలో రైడ్‌లు

చిన్నప్పటి నుంచి టామ్‌బాయ్‌లా పెరిగాను. బైక్ అంటే నా దృష్టిలో డ్యూటీ చేయడానికి ఉపకరించే వాహనం కాదు. బైక్ కిక్ కొట్టానంటే ప్రపంచాన్ని చుట్టేసి రావాలన్నంత ఉత్సాహం వస్తుంది. లధాక్‌లోని లేహ్ జిల్లాలో మాగ్నెటిక్ హిల్స్‌కి రైడ్ చేశాను. ఇప్పుడు నేను వాడుతున్న బైక్ రాయల్ ఎన్‌ఫీల్డ్ ఇంటర్‌సెప్టర్ 650. ఈ వాహనం కొనుగోలు చేసిన తొలి మహిళా పోలీస్‌గా నా పేరు రికార్డయింది. 'వరల్డ్ మోటార్‌సైకిల్ డే' సందర్భంగా బైక్ రైడ్ చేశాను. బైకర్‌లీగ్ విజేతను కూడా. 'ఉమన్ సేఫ్ రైడర్ ఇన్ తెలంగాణ' పురస్కారం కూడా అందుకున్నాను. అడ్వెంచరస్ స్పోర్ట్స్ అంటే ఇష్టం. గుర్‌గావ్‌లో పారాషూట్ డైవింగ్, పారాగ్లైడింగ్ చేశాను. నా సాహసాలకు గాను సావిత్రిబాయి పూలే పురస్కారం, సోషల్ సర్వీస్‌కు గాను హోలీ స్పిరిట్ క్రిస్టియన్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ అందుకోవడం అత్యంత సంతృప్తినిచ్చిన సందర్భాలు. మొత్తం నాలుగు మెడల్స్, మూడు అవార్డులు అందుకున్నాను. పాన్ ఇండియా మాస్టర్స్ గేమ్స్ ఫెడరేషన్ ఈ ఏడాది మే నెలలో నిర్వహించిన ఆటల పోటీల్లో షాట్‌పుట్, డిస్కస్ త్రోలో పతకాలందుకున్నాను. దానికి కొనసాగింపుగానే ప్రస్తుతం యూఎస్‌లో జరిగే క్రీడలకు ఆహ్వానం అందింది. వీసా కూడా వచ్చింది. నా దగ్గరున్న డబ్బు ఖర్చయి పోయింది. యూఎస్ వెళ్లిరావడానికి స్పాన్సర్‌షిప్ కోసం ఎదురు చూస్తున్నాను. ప్రపంచంలోని 50 దేశాల క్రీడాకారులు పాల్గొనే ఈ పోటీలకు వెళ్లగలిగితే మాత్రం భారత్‌కు విజేతగా పతకాలతో తిరిగి వస్తాను'' అన్నారు శ్యామల మెండైన ఆత్మవిశ్వాసంతో.

– వాకా మంజులారెడ్డి,
ఫొటోలు : మోర్ల అనిల్ కుమార్

యూత్ పల్స్



ఆటల రాజ్యంలో గెలుపు పాట

గేమ్ ప్లేలోకి వెళితే... యాక్షన్ రోల్–ప్లేయింగ్ గేమ్ 'ఫైనల్ ఫాంటసీ'లో క్లైవ్ రాస్పెల్ అవుతారు. సాహస దారుల్లో ప్రయాణం చేస్తారు. జియోలొకేషన్–బేస్డ్ రోల్‌ప్లేయింగ్ గేమ్ 'డ్రాగన్ క్వెస్ట్ వాక్'లోకి వెళ్లి మాన్‌స్టర్‌లతో తలపడతారు. హిట్ పాయింట్స్ కొడతారు. గేమింగ్ జోన్‌లోకి అడుగు పెడితే యూత్‌కు ఉత్సాహమే ఉత్సాహం. నిన్నటి వరకు అయితే 'గేమింగ్' అనేది యూత్‌కు ప్యాషన్ మాత్రమే. ఇప్పుడు మాత్రం ఫ్యాన్సీ కెరీర్ కూడా. గేమ్ డెవలపర్ నుంచి నెరేటివ్ డిజైనర్ వరకు ఎన్నో అవకాశాలు వారి కోసం ఎదురు చూస్తున్నాయి. ఆన్‌లైన్ కోర్సులు చేయడం నుంచి పుస్తకాలు చదవడం వరకు ఎన్నో విధానాల ద్వారా గేమింగ్‌కు సంబంధించిన సాంకేతిక విషయాలపై పట్టు సాధిస్తున్నారు...

వీడియో గేమ్స్ అనేవి యూత్‌కు ఇక 'జస్ట్ ఫర్ ఫన్' ఎంత మాత్రం కాదు. తమకు నచ్చిన రంగంలోనే యువత ఉపాధి అవకాశాలు చూసుకుంటోంది. వీడియో గేమ్‌లపై అంతకంతకూ పెరుగుతున్న ఆసక్తి నేపథ్యంలో డెవలపర్‌లు, డిజైనర్‌లు, టెస్టర్స్... మొదలైన నైపుణ్యవంతులకు డిమాండ్ పెరిగింది.

'గేమింగ్ అనేది ఇప్పుడు కేవలం రీక్రియేషన్ కాదు. సీరియస్ కెరీర్ ఆప్షన్' అంటుంది భోపాల్‌కు చెందిన అనీష. ఆమె గేమింగ్ లోకంలోకి వెళితే మరో లోకం తెలియదు. అలాంటి అనీష ఇప్పుడు గేమింగ్ ఇండస్ట్రీలోనే కెరీర్‌ను వెదుక్కునే ప్రయత్నం చేస్తోంది.

'గేమింగ్' అనే మహాప్రపంచంలోకి అడుగు పెట్టే ముందు... ఇన్–డిమాండ్ రోల్స్, స్కిల్స్, కోర్సులు....మొదలైన వాటి గురించి క్షుణ్ణంగా తెలుసుకుంటుంది యువతరం.

'గేమింగ్ ఇండస్ట్రీకి సంబంధించి స్కిల్ డెవలప్‌మెంట్‌కు వ్యయప్రయాసలు అక్కర్లేదు. ఆడుతూ పాడుతూ నేర్చుకోవచ్చు' అంటుంది ముంబైకి చెందిన కైరా. స్కిల్ డెవలప్‌మెంట్‌లో భాగంగా ఆన్‌లైన్ కోర్సు చేయడంతో పాటు బుక్స్ చదువుతోంది. గేమ్ డిజైన్‌కు సంబంధించి స్పెషలైజ్‌డ్ ప్రోగ్రామ్స్ చేసింది.

గేమ్ మెకానిక్స్ క్రియేట్ చేసే గేమ్ డెవలపర్‌లు, ఓవరాల్ కాన్సెప్ట్, స్టోరీలైన్, క్యారెక్టర్లు, గేమ్‌ప్లేపై దృష్టి పెట్టే గేమ్ డిజైనర్‌లు, బగ్స్ బాధ లేకుండా చూసే అసూరెన్స్ టెస్టర్‌లు, విజువల్ ఎలిమెంట్స్‌ను క్రియేట్ చేసే గ్రాఫిక్ ఆర్టిస్‌లు, యానిమేటర్‌లు, మ్యూజిక్, సౌండ్ ఎఫెక్ట్స్, వాయిస్ వోవర్‌లాంటి ఆడియో యాస్పెక్ట్స్‌కు సంబంధించిన సౌండ్ డిజైనర్‌లు...గేమింగ్ ఇండస్ట్రీకి సంబంధించి ఎన్నో అవకాశాలు ఉన్నాయి.

'ఆసక్తి, ప్రతిభ ఉండాలేగానీ యువతరం తమను తాము నిరూపించుకోవడానికి గేమింగ్ ఇండస్ట్రీలో బోలెడు అవకాశాలు ఉన్నాయి' అంటున్నాడు వీఆర్ సొల్యూషన్స్ కంపెనీ 'ఆటోవీఆర్' సీయివో, కో–ఫౌండర్ అశ్విన్ జైశంకర్.

'ఎలాంటి అవకాశాలు ఉన్నాయి' 'ఏ కోర్సు చేస్తే మంచిది' లాంటి వాటి గురించి అశ్విన్ జైశంకర్‌లాంటి నిపుణులు చెబుతున్న విషయాలను యువతరం జాగ్రత్తగా వింటోంది.

'అన్‌రియల్ ఇంజిన్ డెవలపర్ కోర్సు, యూనిటీ సర్టిఫైడ్ డెవలప్ కోర్సు, గేమ్ డిజైన్ అండ్ క్రియేషన్ స్పెషలైజేషన్... మొదలైనవి గేమ్ క్రియేషన్‌కు సంబంధించిన సరియైన దారులు' అంటున్నాడు అశ్విన్ జైశంకర్.

గేమింగ్ కంటెంట్‌కు పెరుగుతున్న డిమాండ్, గేమింగ్ కంపెనీల విస్తరణ కారణంగా గేమింగ్ పరిశ్రమలో ఎంట్రీ లెవల్ ఉద్యోగాల కోసం క్యాంపస్ నియామకాలు గణనీయంగా పెరిగాయి. ఎన్నో కంపెనీలు తమ ప్రాజెక్ట్‌లను దృష్టిలో పెట్టుకొని యూనివర్శిటీల నుంచి ప్రతిభావంతులైన వారిని నియమించుకుంటున్నాయి.

మరోవైపు గేమింగ్ సెక్టార్‌లో 'ఫ్రీలాన్సింగ్ ట్రెండ్' పెరుగుతోంది.

గేమ్ డెవలప్‌మెంట్‌కు సంబంధించి కీలక దశలో ఫ్రీలాన్సర్‌లు కీలక పాత్ర పోషిస్తున్నారు. గేమ్ డెవలపర్‌ల నుంచి నెరేటివ్ డిజైనర్‌ల వరకు ఫ్రీలాన్సింగ్ చేయడానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయి.



మార్పు వచ్చింది

గేమింగ్ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టే విషయంలో పిల్లల ఆసక్తి సరే, తల్లిదండ్రుల స్పందన ఏమిటి? అనే విషయానికి వస్తే... కొన్ని సంవత్సరాల క్రితం వరకు 'గేమింగ్ అనేది కెరీర్ ఆప్షన్ కాదు' అనే భావన వారికి బలంగా ఉండేది. ఈ పరిస్థితిలో ఇప్పుడు చాలా వరకు మార్పు వచ్చింది.

'ఒకప్పుడు గేమింగ్ ఇండస్ట్రీకి సంబంధించి ఎన్నో సందేహాలు ఉండేవి. ఇప్పుడు మాత్రం తమ పిల్లలను గేమ్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్‌కు సంబంధించిన కోర్సులలో చేర్పించడానికి ఉత్సాహం చూపుతున్నారు. ఈ పరిణామం ఇండస్ట్రీకి ఎంతో బలాన్ని ఇస్తుంది' అంటున్నాడు గేమింగ్ కంపెనీ 'బ్యాక్‌స్టేజ్ పాస్' ఫౌండర్ సూర్య.

కిచెన్ టిప్స్

ఇక కల్తీ కథ కంచికే!

కల్తీ... కల్తీ... కల్తీ. కల్తీ లేని వస్తువు కోసం దుర్భిణీ వేసి వెతకాల్సి వస్తోంది. బతకాలంటే రోజుకు మూడుసార్లు తినాలి. హోటల్‌లో తిందామంటే పదార్థాలు ఆకర్షణీయంగా కనిపించడం కోసం వంటల్లో రంగులేస్తారు. ఇంట్లో శుభ్రంగా వండుకుని తిందామంటే... వంట దినుసులు కల్తీ. మిరప్పొడి కొందామంటే అందమైన ప్యాకింగ్ మీద నోరూరించే ఎర్రటిరంగు ఫొటో ఉంటుంది. లోపల మిరప్పొడి ఏ రంగులో ఉందో కనిపించదు. ఇంటికి తెచ్చి ప్యాకెట్ తెరిచి చూస్తే ఒక్కోసారి రంపం పొట్టులా, ఇటుక పొడిలా నిర్జీవంగా కనిపిస్తుంది. మరికొన్నిసార్లు ఎర్రటి ఎరుపుతో ఇది కారంపొడేనా లేక గోడలకేసే రంగా అన్నంత చిక్కగా ఉంటుంది. మనం దాదాపుగా వంటల్లో రోజూ వాడే ఐదు దినుసులను ఎలా పరీక్షించుకోవచ్చో చూద్దాం.



- **మిరప్పొడి:** ఒక కప్పు నీటిని తీసుకుని అందులో టీ స్పూన్ మిరప్పొడి వేయాలి. మిరప్పొడి నీటిమీద తేలుతూ ఉండి రేణువులు నీటిని పీల్చుకుంటూ మెల్లగా మిరప్పొడి మొత్తం కప్పు అడుగుకు చేరుతుంది. కల్తీ మిరప్పొడి అయితే నీటిలో వేయగానే అడుగుకు చేరుతుంది. అంతేకాదు, కప్పు అడుగుకు చేరేలోపు రంగు వదులుతూ నీటిని ఎర్రగా మారుస్తుంది.



- **ఇంగువ:** ఇంగువకు మండే గుణం ఎక్కువ. ఇంగువ కల్తీని తెలుసుకోవడానికి అదే మంచి గీటురాయి కూడా. ఇంగువను చిన్న ముక్క తీసుకుని మంట మీద పెడితే వెంటనే మంట అంటుకుని ఇంగువ ముక్క మండిపోతుంది. కల్తీ ఇంగువ అయితే వెంటనే మండదు. మంట మీద పెట్టి వెలిగించే ప్రయత్నం చేసినా సరే వెలగకుండా మాడిపోతుంది. ఇంగువ పొడి కొనేవాళ్లకు కూడా ఇదే చిట్కా. చిన్న పేపర్ మీద పావు టీ స్పూన్ ఇంగువ వేసి కాగితాన్ని వెలిగించాలి. కాగితంతోపాటే ఇంగువ కూడా మంటను ఆకర్షిస్తే అది అసలైన ఇంగువ. కాగితం మండిపోయి ఇంగువ పొడి నల్లబారి సరిగా మండకపోతే అది కల్తీ ఇంగువ అని అర్థం.



- **మిరియాలు:** మిరియాలలో కల్తీ ఎలా జరుగుతుందంటే... బొప్పాయి గింజలను కలుపుతారు. ఒక కప్పు నీటిలో టీ స్పూన్ మిరియాలు వేయాలి. మిరియాలు బరువుగా ఉంటాయి నేరుగా నీటి అడుగుకు చేరతాయి. బొప్పాయి గింజలు తేలిక. కాబట్టి అవి నీటిలో తేలుతాయి.
- **జీలకర్ర:** జీలకర్రలో ఏ గింజలు కలుపుతారనేది కచ్చితంగా చెప్పడం కష్టం. కానీ అసలు జీలకర్ర, అందులో కలిపిన గింజలు ఒకేరకంగా కనిపించడానికి కొద్దిగా నల్ల రంగు కలుపుతారు. జీలకర్రను పావు టీ స్పూన్ తీసుకుని అరచేతిలో వేసి బాగా రుద్దాలి. చేతులకు నలుపు అంటితే కల్తీ జీలకర్ర అని అర్థం.



- **పసుపు:** పసుపుకు కూడా రంగులద్దుతారు. అర టీ స్పూన్ పసుపును కప్పునీటిలో వేయాలి. మిరప్పొడి వలెనే ఇది కూడా నీటిని పీల్చుకుంటూ మెల్లగా నానుతూ అడుగుకు చేరుతుంది. రంగు కలిపిన పసుపు అయితే నీటి అడుగుకు చేరే లోపే రంగు వదులుతుంది. వేసిన వెంటనే నీరు చిక్కటి పసుపురంగులోకి మారుతాయి.





‘ఈ వేదన తీరనిది’

టి20 వరల్డ్ కప్ ఫైనల్లో భారత్ చేతిలో పరాజయాన్ని దక్షిణాఫ్రికా బ్యాటర్ డేవిడ్ మిల్లర్ ఇంకా జీర్ణించుకోలేకపోతున్నాడు. ఓటమి అనంతరం ఆవేదన ఇంకా తీరనిదని అతను వ్యాఖ్యానించాడు. ఫైనల్లో సఫారీ టీమ్ ఒక దశలో గెలిచే స్థితినుంచి ఓటమి వైపు మళ్లింది. చివరి ఓవర్లో 6 బంతుల్లో 16 పరుగులు చేయాల్సిన సమయంలో తొలి బంతికే మిల్లర్ ఇచ్చిన క్యాచ్‌ను సూర్యకుమార్ బౌండరీ వద్ద అద్భుతంగా అందుకోవడంతోనే భారత్ విజయం దాదాపు ఖాయమైంది. ‘చాలా నిరాశ చెందాను. రెండు రోజుల క్రితం జరిగిన విషయాన్ని ఇంకా జీర్ణించుకోలేకపోతున్నాను. నా బాధను వర్ణించేందుకు మాటలు రావడం లేదు. అయితే మా జట్టు పడిన శ్రమ, పోరాడిన తీరు పట్ల మాత్రం గర్వంగా ఉన్నాను. ఫైనల్‌కు ముందు వరకు ప్రయాణం బాగా సాగింది. ఈ బాధనుంచి తేరుకొని మా టీమ్ మున్ముందు పైకి లేస్తుందనే నమ్మకం ఉంది’ అని మిల్లర్ సోషల్ మీడియా ద్వారా తన బాధను ప్రదర్శించాడు. అయితే టి20 క్రికెట్‌నుంచి తాను రిటైర్ అవుతున్నానంటూ వస్తున్న వార్తలను అతను కొట్టిపడేశాడు. తాను దక్షిణాఫ్రికా తరఫున ఇంకా కొనసాగుతానని అతను స్పష్టం చేశాడు.

రోహిత్ ఫోన్ కాల్‌తో...

- మళ్లీ బాధ్యతలు తీసుకున్నానన్న ద్రవిడ్
- కెప్టెన్‌కు థ్యాంక్స్ చెప్పిన కోచ్



బ్రిడ్జ్‌టౌన్: నవంబర్ 19, 2023...వన్డే వరల్డ్ కప్‌లో ఆస్ట్రేలియా చేతిలో భారత్ ఓటమిపాలైన రోజు. ఈ నిరాశాజనక ఫలితంతోనే కోచ్‌గా రాహుల్ ద్రవిడ్ పదవీకాలం కూడా ముగిసింది. ఆ స్థితిలో భవిష్యత్తు గురించి ద్రవిడ్‌కూ ఎలాంటి ఆలోచన లేదు. అయితే కొద్ది రోజులకే అతను మళ్లీ కోచ్‌గా పని చేసేందుకు సిద్ధమయ్యాడు. అది ఇప్పుడు టి20ల్లో వరల్డ్ కప్ గెలిచే వరకు సాగింది. అందుకు కారణం రోహిత్ శర్మ. ఓటమి నైరాశ్యంలో ఉన్నప్పుడు రోహిత్ స్వయంగా ఫోన్ చేసి కోచ్‌గా కొనసాగాలని ద్రవిడ్‌ను కోరాడు. అందుకే తాను అంగీకరించినట్లు ద్రవిడ్ వెల్లడించాడు. వరల్డ్ కప్ విజయంతో కోచ్‌గా తన పదవీ కాలం ముగిసిన నేపథ్యంలో డ్రెస్సింగ్ రూమ్‌లో జట్టు సహచరులతో ద్రవిడ్ పలు అంశాలు మాట్లాడాడు. ఇన్ని రోజుల తన అనుభవాలను గుర్తు చేసుకున్నాడు. ‘థ్యాంక్యూ రోహిత్...నాకు ఫోన్ చేసి మళ్లీ కోచ్‌గా కొనసాగమని కోరినందుకు. జట్టులోని సభ్యులందరితో కలిసి పని చేయడం నాకు చాలా సంతోషాన్నిచ్చింది. అదో గౌరవంగా భావిస్తున్నా. అయితే రోహిత్‌తో నా బంధం మరింత ప్రత్యేకం. ఎన్నో అంశాలపై మనం చర్చించుకున్నాం. వాదోపవాదాలు జరిగాయి. అంగీకరించడం, తిరస్కరించడం కూడా జరిగాయి. నీతో పని చేసే అవకాశం ఇచ్చిందుకు కృతజ్ఞతలు’ అని ద్రవిడ్ వ్యాఖ్యానించాడు. ఈ గెలుపు చిరస్మరణీయంగా ఉండిపోతుందని అతను అన్నాడు. ‘ఏం చెప్పాలో మాటలు రావడం లేదు కానీ నాకూ మరచిపోలేని జ్ఞాపకాన్ని అందించిన మీకందరికీ థ్యాంక్స్. కెరీర్‌లో మీరు సాధించిన పరుగులు, తీసిన వికెట్లు గుర్తుండకపోవచ్చు. కానీ ఇలాంటి క్షణాలు మాత్రం ఎప్పటికీ గుర్తుండిపోతాయి. గతంలో ఎంతో చేరువగా వచ్చి కూడా నిరాశపడాల్సి వచ్చింది. అలాంటి వాటినుంచి కోలుకొని మీరు పోరాడిన తీరుతో గర్వంగా ఉన్నాం. మీ కష్టానికి తగిన ఫలితమిది’ అని ద్రవిడ్ ప్రశంసించాడు. ఆటగాళ్ల ప్రదర్శన వెనుక వారి కుటుంబ సభ్యుల త్యాగాలు కూడా ఉంటాయని... తల్లిదండ్రులు, భార్యాపిల్లలకు కూడా ఈ విజయంలో భాగం ఉంటుందని ద్రవిడ్ చెప్పాడు.

‘ఈ నిజమంతా నిజమేనా’

వరల్డ్ కప్ గెలిచిన తర్వాత భారత ఆటగాళ్ల సంబరాలు కొనసాగుతూనే ఉన్నాయి. వాతావరణం అనుకూలంగా లేక రెండు రోజులు అదనంగా బ్రిడ్జ్‌టౌన్‌లో ఉండాల్సి రావడంతో ఆ సమయాన్ని వారు పూర్తిగా ఎంజాయ్ చేస్తున్నారు. కెప్టెన్ రోహిత్ శర్మ కూడా ఇంకా ఆ ఆనందం నుంచి బయటకు రావడం లేదు. ‘ఇప్పటికీ అంతా ఒక కలలా ఉంది. కప్ గెలవడం నిజమే అయినా అసలు అది జరిగిందా లేదా అన్నట్లుగా కూడా అనిపిస్తోంది. రాత్రి నుంచి ఉదయం వరకు కూడా మేమందరం బాగా సంబరాలు చేసుకున్నాం. సరిగా నిద్రపోవడం లేదు కానీ అది సమస్య కాదు. తిరిగి వెళ్లాక దాని కోసం చాలా సమయం ఉంది. ఇక్కడ ప్రతీ సెకన్‌ను, ప్రతీ నిమిషాన్ని ఆస్వాదించేందుకు ప్రయత్నిస్తున్నా. ఫైనల్ గెలిచిన క్షణం నుంచి ఇప్పటి వరకు ప్రతీది మాకు భావోద్వేగభరితమే. ఇలాంటి విజయం కోసం చాలా కాలంగా ఎంతో శ్రమించాం. ఎంతో కష్టపడిన తర్వాత వచ్చే ఫలితం మరింత ఆనందాన్నిస్తుంది. కెన్సింగ్టన్ ఓవల్ పిచ్‌పై గడ్డిని చప్పరించడం ముందే అనుకున్నది కాదు. అక్కడికి వెళ్లాక నేను అప్పటికప్పుడు తీసుకున్న నిర్ణయమది. మా కలలు నెరవేర్చిన చోటు ఎప్పటికీ మర్చిపోకుండా అలా చేయాలని అనిపించింది’ అని రోహిత్ పేర్కొన్నాడు.

నేడు స్వదేశానికి...

వరల్డ్ కప్ విజేతగా నిలిచిన భారత జట్టు నేటి సాయంత్రం సొంత గడ్డపై అడుగు పెట్టే అవకాశం ఉంది. బార్బడోస్ దేశంలో తుఫాన్ కారణంగా జట్టు టీమిండియా సభ్యులు రెండు రోజుల పాటు అక్కడే ఆగిపోవాల్సి వచ్చింది. అయితే మంగళవారం నుంచి ఎయిర్‌పోర్ట్ రాకపోకలకు సిద్ధమైంది. క్రికెటర్లు, వారి కుటుంబ సభ్యులు, సహాయక సిబ్బంది కోసం బీసీసీఐ ప్రత్యేక విమానాన్ని ఏర్పాటు చేసింది. ఈ చార్టర్డ్ ఫ్లయిట్‌లో వీరంతా నేరుగా ఢిల్లీకి చేరుకుంటారు. అనంతరం ప్రధానమంత్రి చేతుల మీదుగా సన్మాన కార్యక్రమం ఉంటుంది.

హర్షిత్ రాణాకు తొలి అవకాశం

- సుదర్శన్, జితేశ్‌లకూ చోటు
- జింబాబ్వేతో సిరీస్‌కు కోచ్‌గా లక్ష్మణ్



ముంబై: జింబాబ్వేతో జరిగే ఐదు టి20 మ్యాచ్‌ల సిరీస్ కోసం భారత జట్టు బయల్దేరింది. 15 మంది సభ్యుల ఈ టీమ్‌లో తొలి రెండు టి20ల కోసం మూడు మార్పులు జరిగాయి. వరల్డ్ కప్ విన్నింగ్ టీమ్‌లో భాగంగా ఉన్న దూబే, జైస్వాల్, సామ్సన్ జింబాబ్వే సిరీస్ కోసం ముందుగా ప్రకటించిన జట్టులో ఉన్నారు. అయితే వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో భారత జట్టు అక్కడినుంచి బయల్దేరడం ఆలస్యం అయింది. దాంతో ఈ ముగ్గురి స్థానాల్లో సాయి సుదర్శన్, జితేశ్ శర్మ, హర్షిత్ రాణాలను ఎంపిక చేసినట్లు బీసీసీఐ సెలక్టర్లు ప్రకటించారు. దూబే, జైస్వాల్, సామ్సన్ ఇతర సభ్యులతో పాటు ప్రత్యేక విమానంలో నేరుగా భారత్‌కే చేరుకుంటారు. ఇక్కడ జరిగే అధికారిక సన్మాన కార్యక్రమంలో పాల్గొని చివరి 3 టి20ల కోసం జింబాబ్వేకు వెళతారు. భారత్ తరఫున ఇప్పటికే 3 వన్డేలు ఆడిన సుదర్శన్ ప్రస్తుతం ఇంగ్లండ్ కౌంటీల్లో ఆడుతుండగా...ఈ సీజన్ ఐపీఎల్‌లో ఘోరంగా విఫలమైనా జితేశ్ శర్మకు అదృష్టవశాత్తూ మరో అవకాశం దక్కింది. జితేశ్ 9 టి20ల్లో టీమిండియాకు ప్రాతినిధ్యం వహించాడు. మరో వైపు ఐపీఎల్‌లో 19 వికెట్లతో కోల్‌కతా నైట్‌రైడర్స్ విజయంలో కీలక పాత్ర పోషించిన పేసర్ హర్షిత్ రాణా టీమిండియాకు ఎంపిక కావడం ఇదే మొదటిసారి. జింబాబ్వేతో తలపడే ఈ యువ జట్టుకు జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) హెడ్ వీవీఎస్ లక్ష్మణ్ కోచ్‌గా వ్యవహరిస్తాడు. వరల్డ్ కప్‌లో రిజర్వ్‌లుగా ఉన్న రింకూ సింగ్, ఖలీల్ అహ్మద్ అక్కడినుంచే జింబాబ్వేకు వెళ్లనుండగా...ప్రస్తుతం అమెరికాలో సెలవులు గడుపుతున్న కెప్టెన్ గిల్ నేరుగా వెళ్లి జట్టుతో కలుస్తాడు. ఈ టూర్‌లో భాగంగా జూలై 6, 7, 10, 13, 14 తేదీల్లో భారత్, జింబాబ్వే టి20ల్లో తలపడతాయి.



జింబాబ్వేకు బయల్దేరిన అభిషేక్, లక్ష్మణ్

తొలి రెండు టి20లకు జట్టు వివరాలు: శుబ్‌మన్ గిల్ (కెప్టెన్), రుతురాజ్, అభిషేక్, రింకూ సింగ్, జురేల్, పరాగ్, సుందర్, బిష్ణోయ్, అవేశ్, ఖలీల్, ముకేశ్, తుషార్, సుదర్శన్, జితేశ్, హర్షిత్ రాణా.

క్వార్టర్ ఫైనల్లో పోర్చుగల్

- షూటౌట్‌లో స్లొవేనియాపై విజయం
- యూరో కప్ ఫుట్‌బాల్



రొనాల్డో గోల్

ఫ్రాంక్‌ఫర్ట్ (జర్మనీ): యూరో కప్ ఫుట్‌బాల్ టోర్నీలో మాజీ చాంపియన్ పోర్చుగల్ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. అయితే టాప్ టీమ్‌లలో ఒకటైన పోర్చుగల్‌కు విజయం అంత సులువుగా దక్కలేదు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 57వ స్థానంలో ఉన్న స్లొవేనియా గట్టి పోటీనిచ్చింది. ఒక దశలో స్లొవేనియా దూకుడు చూస్తే విజయం సాధించేలా అనిపించింది. కానీ చివరకు పెనాల్టీ షూటౌట్‌లో విజయం పోర్చుగల్ సొంతమైంది. నిర్ణీత సమయంలో ఇరు జట్లు గోల్ లేకుండా 0–0తో సమంగా నిలవగా...షూటౌట్‌లో పోర్చుగల్ 3–0తో గెలుపొందింది. దిగ్గజ ఆటగాడు క్రిస్టియానో రొనాల్డోకు నిర్ణీత సమయంలో మ్యాచ్ గెలిపించే అవకాశం వచ్చినా అది సాధ్యం కాలేదు. ఈ మ్యాచ్‌లో అతను పలు అవకాశాలు వృథా చేశాడు. ఎట్టకేలకు 105వ నిమిషంలో పోర్చుగల్‌కు పెనాల్టీ కిక్ లభించింది. అయితే రొనాల్డో కొట్టిన ఈ కిక్‌ను స్లొవేనియా గోల్ కీపర్ జాన్ ఆబ్లక్ సమర్థంగా అడ్డుకున్నాడు. దాంతో రొనాల్డో కన్నీళ్లపర్యంతం కావడంతో సహచరులు సముదాయించాల్సి వచ్చింది. అయితే ఎట్టకేలకు షూటౌట్‌లో గెలిచి పోర్చుగల్ ఊపిరి పీల్చుకుంది. పోర్చుగల్ తరఫున రొనాల్డో, బ్రూనో ఫెర్నాండెజ్, బెర్నార్డో సిల్వ గోల్స్ సాధించగా... స్లొవేనియా ఆటగాళ్లు ఎల్‌సిక్, బల్కోవెక్, వెర్బిక్ కొట్టిన షాట్‌లను పోర్చుగల్ కీపర్ డియాగో కోస్టా నిలువరించగలిగాడు. క్వార్టర్ ఫైనల్లో ఫ్రాన్స్‌తో పోర్చుగల్ తలపడుతుంది. 2016లో ఈ రెండు జట్ల మధ్య జరిగిన ఫైనల్లో పోర్చుగల్ గెలిచి చాంపియన్‌గా నిలిచింది. మరో ప్రిక్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో నెదర్లాండ్స్ 3–0తో రొమేనియాను ఓడించి క్వార్టర్స్ చేరింది.

వొండ్రుసోవాకు షాక్

- తొలి రౌండ్‌లోనే బౌజస్ సంచలనం
- వింబుల్డన్ టోర్నీ



బౌజస్

లండన్: జెస్సికా బౌజస్ మనెరో వింబుల్డన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో పెను సంచలనం సృష్టించింది. ఆల్ ఇంగ్లండ్ క్లబ్‌లో బౌజస్ పేరు మార్మోగుతోంది. డిఫెండింగ్ చాంపియన్, ప్రపంచ ఆరో ర్యాంకర్ మర్కెటా వొండ్రుసోవా (చెక్ రిపబ్లిక్)కు తొలి రౌండ్లోనే షాకిచ్చి సంచలన విజయంతో వింబుల్డన్‌ను ఆరంభించింది. మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లో జెస్సికా బౌజస్ (స్పెయిన్) 6–4, 6–2తో ఆరో సీడ్ వొండ్రుసోవాను వరుస సెట్లలోనే ఇంటిదారి పట్టించింది. ఇటీవల ఫ్రెంచ్ ఓపెన్‌లో క్వార్టర్ ఫైనలిస్టుగా నిలిచిన ఈ చెక్ రిపబ్లిక్ స్టార్... ఈ పరాభవంతో మూడు దశాబ్దాల తర్వాత వింబుల్డన్ గడ్డపై ఓ డిఫెండింగ్ చాంపియన్ తొలి రౌండ్లోనే ఓడిన చెత్త రికార్డును మూటగట్టుకుంది. మహిళల్లో ఆల్‌టైమ్ గ్రేట్‌లలో ఒకరైన స్టెఫీగ్రాఫ్ (జర్మనీ) 1994లో డిఫెండింగ్ చాంపియన్ హోదాతో వింబుల్డన్ బరిలోకి దిగి అనామక ప్లేయర్ లోరీ మెక్‌నీల్ (అమెరికా) చేతిలో ఓడింది.



వొండ్రుసోవా

జొకోవిచ్ సులువుగా...

పురుషుల సింగిల్స్‌లో సెర్బియన్ సూపర్ స్టార్, రెండో సీడ్ నొవాక్ జొకోవిచ్ సులువుగా ముందంజ వేశాడు. జొకో 6–1, 6–2, 6–2తో విట్ కొప్రివా (చెక్ రిపబ్లిక్)పై అలవోక విజయం సాధించాడు. నాలుగో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ) 6–2, 6–4, 6–2తో కార్బలెస్ బేన (స్పెయిన్)పై గెలుపొందగా, రష్యన్ స్టార్, ఆరో సీడ్ రుబ్లెవ్ ఆట తొలి రౌండ్లోనే ముగిసింది. కామెసన (అర్జెంటీనా) 6–4, 5–7, 6–2, 7–6 (7/5)తో రుబ్లెవ్‌ను కంగుతినిపించాడు. ప్రపంచ నంబర్‌వన్, జానిక్ సినెర్ (ఇటలీ) 6–3, 6–4, 3–6, 6–3తో యానిక్ హాఫ్‌మన్ (జర్మనీ)పై, ఏడో సీడ్ హుర్కాజ్ (పోలాండ్) 5–7, 6–4, 6–3, 6–4తో అల్బాట్ (మాల్డొవా)పై గెలుపొందారు. తొమ్మిదో సీడ్ డి మినార్ (ఆస్ట్రేలియా) 7–6 (7/1), 7–6 (7/3), 7–6 (7/4)తో జేమ్స్ డక్‌వర్త్ (ఆస్ట్రేలియా)పై ప్రతి సెట్ కోసం ఓ యుద్ధమే చేసి గెలిచాడు.

సూపర్ స్వియాటెక్

మహిళల సింగిల్స్‌లో ఫ్రెంచ్ ఓపెన్ చాంపియన్, టాప్ సీడ్ స్వియాటెక్ (పోలాండ్) 6–3, 6–4తో అమెరికా చెందిన సోఫియా కెనిన్‌పై వరుస సెట్లలో గెలిచి రెండో రౌండ్లోకి ప్రవేశించింది. ఇతర మ్యాచ్‌ల్లో నాలుగో సీడ్ ఎలీనా రిబాకినా (కజకిస్తాన్) 6–3 6–1తో గాబ్రియెలా రూస్ (రుమేనియా)పై, ఐదో సీడ్ పెగులా (అమెరికా) 6–2, 6–0తో అష్లిన్ క్రూగెర్ (అమెరికా)పై, 15వ సీడ్ సామ్సోనొవా (రష్యా) 6–3, 4–6, 6–2తో రెబెకా మసరొవా (స్పెయిన్)పై విజయం సాధించారు. మాజీ ఫ్రెంచ్ ఓపెన్ చాంపియన్ జెలీనా ఒస్టాపెంకో (లాత్వియా) 6–1, 6–2తో టామ్‌జనోవిక్ (ఆస్ట్రేలియా)పై సులువైన విజయంతో శుభారంభం చేసింది.

నగాల్ అవుట్

భారత నంబర్‌వన్ సింగిల్స్ ప్లేయర్ సుమిత్ నగాల్ ఆట వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో తొలి రౌండ్లో ముగిసింది. 72వ ర్యాంక్ భారత ప్లేయర్ 2–6 6–3, 3–6, 4–6తో ప్రపంచ 53వ ర్యాంకర్ కెక్మనొవిచ్ (సెర్బియా) చేతిలో పరాజయం చవిచూశాడు. 26 ఏళ్ల నగాల్ వరుస తప్పిదాలతో మూల్యం చెల్లించుకున్నాడు. ఏకంగా 44 అనవసర తప్పిదాలు చేశాడు. ప్రత్యర్థి ఆరు ఏస్‌లు సంధించి కేవలం రెండుసార్లు మాత్రమే డబుల్ ఫాల్ట్‌లు చేశాడు.

సినిమా

కాంబినేషన్ కుదిరేనా?



● నాని



● శేఖర్ కమ్ముల

హీరో నాని, దర్శకుడు శేఖర్ కమ్ముల కాంబినేషన్‌లో ఓ సినిమా రూపొందనుందా? అంటే అవుననే అంటున్నాయి ఫిల్మ్‌నగర్ వర్గాలు. దర్శకుడు శేఖర్ కమ్ముల ఓ కొత్త కథను సిద్ధం చేశారట. ఈ కథలోని హీరో పాత్రకు నాని అయితే సరిపోతారని ఆయన భావిస్తున్నారట. దీంతో ఈ దిశగా సంప్రదింపులు జరుగుతున్నాయని, అన్నీ కుదిరితే వీరి కాంబినేషన్‌లో ఓ సినిమా ప్రకటన అధికారికంగా రావొచ్చనే టాక్ వినిపిస్తోంది. కాగా ప్రస్తుతం ‘సరిపోదా శనివారం’ సినిమాతో బిజీగా ఉన్నారు నాని. ఈ చిత్రం ఆగస్టు 29న విడుదల కానుంది. మరో వైపు నాగార్జున, ధనుష్ హీరోలుగా నటిస్తున్న ‘కుబేర’ సినిమాతో శేఖర్ కమ్ముల బిజీగా ఉన్నారు. ఈ సినిమాను ఈ ఏడాదే విడుదల చేయాలనుకుంటున్నారు. ఇలా నాని, శేఖర్‌ల ప్రస్తుత కమిట్‌మెంట్స్ ఓ కొలిక్కి వచ్చిన తర్వాత వీరి కాంబినేషన్‌లోని సినిమా గురించి స్పష్టత వచ్చే అవకాశం కనిపిస్తోంది. మరి.. ఈ కాంబి నేషన్ కుదురుతుందా? అంటే వేచి చూడాల్సిందే.



● అల్లు అర్జున్

డిష్యుం... డిష్యుం...

డిష్యుం... డిష్యుం అంటూ ఫైట్ చేయనున్నారు పుష్పరాజ్. హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా ‘పుష్ప’. ఈ చిత్రంలో పుష్పరాజ్ పాత్రలో అల్లు అర్జున్, శ్రీవల్లి పాత్రలో రష్మికా మందన్నా నటిస్తున్నారు. ‘పుష్ప’ నుంచి ఇప్పటికే ‘పుష్ప: ది రైజ్’ విడుదలై, ఘనవిజయం సాధించింది. ప్రస్తుతం ‘పుష్ప’ మలి భాగం ‘పుష్ప: ది రూల్’తో బిజీగా ఉన్నారు అల్లు అర్జున్ అండ్ సుకుమార్. ఈ సినిమా కొత్త షెడ్యూల్ ఈ వారంలో హైదరాబాద్ శివార్లలోని ఓ ప్రముఖ స్టూడియోలో ప్రారంభం కానుందని తెలిసింది. అల్లు అర్జున్ పాల్గొనగా ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్‌ను ప్లాన్ చేశారని, ఈ యాక్షన్ సీక్వెన్స్ క్లైమాక్స్‌లో రానుందని సమాచారం. మరి క్లైమాక్స్‌లో డిష్యుం... డిష్యుం అంటూ విలన్స్‌ను పుష్పరాజ్ ఏ విధంగా రఫ్ఫాడించాడో చూడాలంటే డిసెంబరు 6న థియేటర్స్‌కు వెళ్లాలి. ఆ రోజునే ‘పుష్ప: ది రూల్’ విడుదల కానుంది. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్, నిర్మిస్తున్న ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. సునీల్, అనసూయ, జగపతిబాబు, ఫాహద్ ఫాజిల్ ఈ సినిమాలోని ఇతర లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు.

కమల్-సల్మాన్-ఓ సినిమా



● సల్మాన్ ఖాన్, కమల్‌హాసన్

హిందీలో షారుక్ ఖాన్‌తో ‘జవాన్’ తీసి, బ్లాక్‌బస్టర్ హిట్ అందుకున్నారు తమిళ దర్శకుడు అట్లీ. ‘జవాన్’ సినిమా బాక్సాఫీస్ వసూళ్లు రూ. వెయ్యి కోట్లకు పైగా దాటాయి. ఈ క్రమంలో అట్లీ దర్శకత్వంలో తెరకెక్కనున్న తదుపరి చిత్రం ఏంటి? అనే చర్చల్లో భాగంగా అల్లు అర్జున్‌తో సినిమా చేయనున్నారనే ప్రచారం జరిగింది. కానీ ఈ సినిమా గురించి అధికారిక సమాచారం ఏదీ రాలేదు. కాగా అట్లీ ఓ మల్టీస్టారర్ మూవీ కథను రెడీ చేశారని, ఇందులో రజనీకాంత్, సల్మాన్ ఖాన్ హీరోలుగా నటిస్తారనే టాక్ తెరపైకి వచ్చింది. తాజాగా ఈ సినిమాలో రజనీకాంత్ ప్లేస్‌లో కమల్‌హాసన్ నటించనున్నారని మరో వార్త ప్రచారంలోకి వచ్చింది. సల్మాన్–కమల్ కాంబినేషన్‌లో అట్లీ దర్శకత్వంలోని సినిమా దాదాపు ఖరారైనట్లే అనే టాక్ బాలీవుడ్‌లో వినిపిస్తోంది. ఈ సినిమాను దక్షిణాదిలోని అగ్ర నిర్మాణ సంస్థల్లో ఒకటైన సన్ పిక్చర్స్ నిర్మించనుందని, త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని టాక్.

ఫుల్ వినోదం సామీ



● మాల్వీ మల్హోత్రా, రాజ్ తరుణ్

‘‘తిరగబడర సామీ’ సినిమాలో భావోద్వేగాలు, యాక్షన్‌తో పాటు వినోదం చాలా కొత్తగా ఉంటుంది. ఈ సినిమాకి అందరం ప్రాణం పెట్టి పని చేశాం. మా అందరి కంటే ఎక్కువ కష్టపడింది కెమెరామేన్ జవహర్ రెడ్డి గారు. ఆయన లేకపోతే సినిమా ఇంత అద్భుతంగా వచ్చేది కాదు. ఈ సినిమా తప్పకుండా ప్రేక్షకులకు నచ్చుతుంది’’ అని హీరో రాజ్ తరుణ్ అన్నారు. ఏఎస్ రవి కుమార్ చౌదరి దర్శకత్వంలో రాజ్ తరుణ్, మాల్వీ మల్హోత్రా జంటగా నటించిన చిత్రం ‘తిరగబడర సామీ’. సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్‌పై మల్కాపురం శివకుమార్ నిర్మించారు. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో రాజ్ తరుణ్ మాట్లాడుతూ– ‘‘తిరగబడర సామీ’లో ఎక్కువ యాక్షన్ సీన్స్ చేశాను. ఇంత యాక్షన్ పార్ట్ చేయడం నాకు కొత్త. డైరెక్టర్ గారి ప్రోత్సాహంతో సులభంగా చేశాను’’ అన్నారు. ఏఎస్ రవికుమార్ చౌదరి మాట్లాడుతూ– ‘‘2004 జూలై 2న ‘యజ్ఞం’ విడుదలై నా జీవితాన్ని మలుపు తిప్పింది. సరిగ్గా ఇరవై ఏళ్ల తర్వాత జూలై 2న ‘తిరగబడర సామీ’ ట్రైలర్ రిలీజ్ కావడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమా అందరికీ వినోదం పంచుతుంది’’ అన్నారు. ‘‘ఈ నెలలోనే మా సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం. మంచి చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలి’’ అన్నారు మల్కాపురం శివకుమార్. ‘‘ఈ సినిమాతో తెలుగులో పరిచయం కావడం హ్యాపీగా ఉంది’’ అన్నారు మాల్వీ మల్హోత్రా.

ఫస్ట్ లుక్ చూసి ఆశ్చర్యపోతారు

- వరుణ్ సందేశ్



‘‘నా 17 ఏళ్ల కెరీర్‌లో చేయని ఒక డిఫరెంట్ మూవీ ‘విరాజి’. ఈ చిత్రంలో ఓ క్రేజీ పాత్ర చేస్తున్నాను. ఈ నెల 10న విడుదల చేయనున్న ‘విరాజి’ ఫస్ట్ లుక్ చూడగానే అందరూ ఆశ్చర్యపోతారు. మీ అందరికీ తప్పకుండా నచ్చే సినిమా అవుతుంది. ఈ మూవీ రిలీజ్ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను’’ అని హీరో వరుణ్ సందేశ్ అన్నారు. ఆయన హీరోగా నటించిన చిత్రం ‘విరాజి’. ఈ చిత్రంతో ఆద్యంత్ హర్ష దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మహా మూవీస్‌తో కలిసి ఎమ్ 3 మీడియా బ్యానర్‌పై మహేంద్రనాథ్ కూండ్ల నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 2న రిలీజ్ కానుంది. మంగళవారం జరిగిన ‘విరాజి’ టైటిల్ ప్రకటన కార్యక్రమంలో ఆద్యంత్ హర్ష మాట్లాడుతూ– ‘‘విరాజి’కి చాన్స్ ఇచ్చిన మా మూవీ ప్రాజెక్ట్ హెడ్ సుకుమార్ కిన్నెర, నిర్మాత మహేంద్రగారు, వరుణ్ సందేశ్‌లకు కృతజ్ఞతలు’’ అన్నారు. ‘‘వరుణ్ సందేశ్‌ని కొత్త అవతారంలో చూపించే చిత్రమిది. మాలాంటి కొత్తవాళ్లు ఇండస్ట్రీలో నిలదొక్కుకోవాలంటే ప్రేక్షకుల సపోర్ట్ కావాలి’’ అన్నారు మహేంద్రనాథ్ కూండ్ల. సంగీతదర్శకుడు ఏబీ నెజర్ పాల్ (ఏబీ), నటీనటులు ప్రమోదిని, రఘు కారుమంచి, ఫణి తదితరులు పాల్గొన్నారు.

చలో స్కాట్లాండ్



● అజయ్ దేవగన్



● సంజయ్ దత్



● మృణాల్ ఠాకూర్

సన్నాఫ్ సర్దార్‌గా అజయ్ దేవగన్ అతి త్వరలో స్కాట్లాండ్ వెళ్లనున్నారని బాలీవుడ్ సమాచారం. అజయ్ దేవగన్, సోనాక్షీ సిన్హా, సంజయ్ దత్ లీడ్ రోల్స్‌లో అశ్వినీ ధీర్ దర్శకత్వంలో రూపొందిన హిందీ చిత్రం ‘సన్నాఫ్ సర్దార్’ (2012). రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన ‘మర్యాద రామన్న’కు హిందీ రీమేక్‌గా ఈ చిత్రం రూపొందింది. ఇప్పుడు పన్నెండేళ్ల తర్వాత ‘సన్నాఫ్ సర్దార్’కు సీక్వెల్‌గా ‘సన్నాఫ్ సర్దార్ 2’ చిత్రం రానుందని సమాచారం. తొలి భాగంలో లీడ్ రోల్స్‌లో నటించిన అజయ్ దేవగన్, సంజయ్ దత్ సీక్వెల్‌లోనూ నటించనున్నారని, హీరోయిన్‌గా మాత్రం సోనాక్షీ సిన్హా ప్లేస్‌లో మృణాల్ ఠాకూర్ కనిపించనున్నారని భోగట్టా. ఈ చిత్రానికి సంబంధించిన ఎక్కువ శాతం షూటింగ్‌ని స్కాట్లాండ్‌లో జరిపేలా ప్లాన్ చేశారట. ఈ షెడ్యూల్ దాదాపు యాభై రోజులకు పైగా ఉంటుందని, అజయ్ దేవగన్–మృణాల్ ఠాకూర్‌ల కాంబినేషన్ ట్రాక్ అంతా విదేశాల్లోనే చిత్రీకరిస్తారని టాక్. ఈ సినిమాకు అజయ్ దేవగనే దర్శకత్వం వహిస్తారనే వార్త కూడా ప్రచారంలో ఉంది. వచ్చే ఏడాది ఈ చిత్రాన్ని రిలీజ్ చేయాలనుకుంటున్నారు.

జనక అయితే...



● సుహాస్

‘కలర్ ఫోటో’ ఫేమ్ సుహాస్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం ‘జనక అయితే గనక’. ‘బలగం, లవ్ మీ’ వంటి చిత్రాల తర్వాత శిరీష్ సమర్పణలో ‘దిల్’ రాజు ప్రొడక్షన్స్‌పై హర్షిత్ రెడ్డి, హన్షిత ఈ సినిమా నిర్మిస్తున్నారు. మంగళవారం ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ‘‘కోర్టు డ్రామాతో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రం ఇది. హీరోగా వరుస విజయాలను అందుకుంటున్న సుహాస్ ‘జనక అయితే గనక’ వంటి మరో వైవిధ్యమైన సినిమాతో ప్రేక్షకులను అలరిస్తారు’’ అని యూనిట్ పేర్కొంది.

రాహి రే డార్లింగ్



● నభా నటేశ్

ప్రియదర్శి, నభా నటేశ్ జంటగా నటించిన చిత్రం ‘డార్లింగ్’. ‘వై దిస్ కొలవెరి’ అన్నది ట్యాగ్‌లైన్. అశ్విన్ రామ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో బ్రహ్మానందం, అనన్య నాగళ్ల కీలక పాత్రలు పోషించారు. ‘హను–మాన్’ వంటి బ్లాక్ బస్టర్ మూవీ తీసిన కె. నిరంజన్ రెడ్డి, చైతన్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 19న విడుదల కానుంది. వివేక్ సాగర్ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి ‘రాహి రే...’ అంటూ సాగే పాటని రిలీజ్ చేశారు మేకర్స్. కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించిన ఈ పాటను కపిల్ కపిలన్ ఆలపించారు. ‘‘యునిక్ రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం ‘డార్లింగ్’. ‘రాహి రే...’ పాట మెలోడియస్‌గా సాగుతుంది. నభా నటేశ్ పై సాగే ఈ పాటను సినిమాటోగ్రాఫర్ నరేష్ రామదురై అందంగా చిత్రీకరించారు’’ అన్నారు మేకర్స్.

సాక్షి బిజినెస్
బుధవారం
3-7-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	38	79,441
నిఫ్టీ ▽	18	24,123

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	17,976	△	97
డోజోన్స్	39,170	△	2
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,121	▽	46
డాక్స్	18,164	▽	127
షాంఘై	2,995	△	2
నికాయ్	40,075	△	444

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత) 71,692	▽	92
బంగారం (99.5 స్వచ్ఛత) 71,405	▽	181
వెండి (కిలో) 88,015	△	213

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటికి	83.11	84.13
£	బ్రిటన్ పౌండ్	ఒకటికి	104.42	106.97
€	యూరో	ఒకటికి	88.97	90.92
¥	జపాన్ ఎన్ (100)	ఒకటికి	51.29	52.41
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటికి	54.55	56.48
S$	సింగపూర్ డాలర్	ఛాయిస్‌కర్	59.25	63.94
SAR	సౌదీ రియాల్	ఛాయిస్‌కర్	21.34	22.91
UAE D	యూఏఈ దిర్హామ్	ఛాయిస్‌కర్	21.83	23.61
¥	చైనా యువాన్	ఛాయిస్‌కర్	10.37	12.44

ప్రమోటర్లు వాటాలు అమ్మేస్తున్నారు!



- షేర్ల ధరల్లో వృద్ధి ప్రభావం
- ఇటీవల భారీగా బ్లాక్ డీల్స్
- 2023 రికార్డుకు 2024లో చెక్

ఇటీవల సెకండరీ మార్కెట్లు బుల్ వేవ్‌లో పరిగెడుతున్నాయి. తాజాగా సెన్సెక్స్ 79,000, నిఫ్టీ 24,000 పాయింట్ల మైలురాళ్లను అధిగమించాయి. తద్వారా ప్రామాణిక ఇండెక్సులు సరికొత్త గరిష్టాలను సాధించాయి. ఈ నేపథ్యంలో పలు లిస్టెడ్ కంపెనీల ప్రమోటర్లు కొంతమేర సొంత వాటాలను విక్రయించేందుకు ఆసక్తిని ప్రదర్శిస్తున్నారు. ఇందుకు పలు అంశాలు ప్రభావం చూపుతున్నాయి. వివరాలు చూద్దాం..

ముంబై: రోజుకో చరిత్రాత్మక గరిష్టాన్ని తాకుతూ దౌడు తీస్తున్న దేశీ స్టాక్ మార్కెట్లో పలు లిస్టెడ్ కంపెనీల షేర్లు సైతం కొత్త గరిష్టాలను తాకుతున్నాయి. దీంతో కొన్ని కంపెనీల ప్రమోటర్లు ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా తమ వాటాలో కొంతమేర విక్రయిస్తున్నారు. తద్వారా నిధులను సమకూర్చుకుంటున్నారు. వీటిని రుణ చెల్లింపులు, విస్తరణ ప్రణాళికలు, పబ్లిక్‌కు కనీస వాటా తదితరాలకు వినియోగిస్తున్నట్లు మార్కెట్ విశ్లేషకులు పేర్కొన్నారు. కోటక్ ఇన్‌స్టిట్యూషనల్ ఈక్విటీస్ వివరాల ప్రకారం 2024 తొలి ఆరు నెలల్లోనే ఎన్ఎస్ఈ-500లోని కొన్ని కంపెనీల ప్రమోటర్లు 10.5 బిలియన్ డాలర్ల(రూ. 87,000 కోట్లకుపైగా) విలువైన ఈక్విటీలను విక్రయించారు. మరొక విశ్లేషణ ప్రకారం గత రెండు నెలల్లోనే సుమారు 200 లిస్టెడ్ కంపెనీల ప్రమోటర్లు రూ. 33,000 కోట్లకుపైగా విలువైన షేర్లను విక్రయించడం తాజా ట్రెండ్‌కు అద్దం పడుతోంది. వెరసి దేశీ ఈక్విటీల విలువలు అత్యంత ప్రీమియంస్థాయికి చేరాయన్న సంకేతాలు వెలువడుతున్నట్లు స్టాక్ నిపుణులు అభిప్రాయపడ్డారు. ఇందువల్లనే కొన్ని లిస్టెడ్ కంపెనీల ప్రమోటర్లు తమతమ బిజినెస్‌లలో లాభాల స్వీకరణకు ప్రాధాన్యత ఇస్తున్నారని విశ్లేషించారు.

విక్రయ తీరు(రూ. కోట్లలో)	
కంపెనీ పేరు	షేర్ల విలువ
ఇండస్ టవర్స్	15,300
ఎంఫసిస్	6,680
వేదాంతా	4,184
ఇంటర్‌గ్లోబ్	3,300
జెడ్ఎఫ్ సీవీ	2,194
గ్లాండ్ ఫార్మా	1,754

కరోనా ఎఫెక్ట్...

ప్రస్తుత మార్కెట్లలో పలు కంపెనీల షేర్లు గరిష్ట విలువలకు చేరడంతో బ్లాక్ డీల్స్ లేదా బల్క్ డీల్స్ ద్వారా ప్రమోటర్లు కొంతమేర వాటాలను అమ్మివేస్తున్నారు. వీరికితోడు ఇటీవల పీఈ దిగ్గజాలు, ఇతర సంస్థాగత ఇన్వెస్టర్లు సైతం తమ పెట్టుబడులను విక్రయించి సొమ్ము చేసుకుంటున్న సంగతి తెలిసిందే. కాగా.. ప్రస్తుత ట్రెండ్ కారణంగా 2023 జనవరి–డిసెంబర్‌లో నమోదైన 12.5 బిలియన్ డాలర్ల(సుమారు రూ. 1,04,000 కోట్లు) విక్రయ రికార్డ్ 2024 కేలండర్ ఏడాదిలో తుడిచిపెట్టుకుపోయే వీలున్నట్లు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. 2023లో అదానీ గ్రూప్ ప్రమోటర్లు వాటాలు విక్రయించిన విషయం విదితమే. 2024లో ఇప్పటివరకూ దేశ, విదేశీ ప్రమోటర్లు మొత్తంగా రూ. 87,000 కోట్ల విలువైన ఈక్విటీలను విక్రయించారు. కోవిడ్-19 నేపథ్యంలో 2020 జనవరి–డిసెంబర్‌లోనూ రికార్డు నెలకొల్పుతూ రూ. 78,500 కోట్ల విలువైన షేర్లను వివిధ కంపెనీల ప్రమోటర్లు అమ్మివేశారు.

రుణ చెల్లింపులకు...

జూన్‌లో పలువురు ప్రమోటర్లు బ్లాక్ డీల్స్ ద్వారా భారీగా వాటాలను విక్రయించారు. రుణ భారాన్ని తగ్గించుకునే ప్రణాళికలతో ఇండస్ టవర్స్‌లో యూకే దిగ్గజం వొడాఫోన్ గ్రూప్ 18 % వాటాను విక్రయించింది. ఇక ఎంఫసిస్‌లో 15% వాటాను పీఈ దిగ్గజం బ్లాక్‌స్టోన్ 80 కోట్ల డాలర్లకు అమ్మింది. దేశీ మైనింగ్ దిగ్గజం వేదాంతా లిమిటెడ్‌లో ప్రమోటర్ వేదాంతా రిసోర్సెస్ 2.63% వాటా విక్రయం ద్వారా రూ. 4,184 కోట్లు సమీకరించింది. ఇక జెడ్ఎఫ్ కమర్షియల్ వెహికల్‌లో వాబ్కో ఏషియా 30 కోట్ల డాలర్ల విలువైన వాటాను విక్రయించింది.

హిండెన్‌బర్గ్‌కు సెబీ షోకాజ్!



అర్థం లేని చర్యగా కొట్టిపారేసిన హిండెన్‌బర్గ్

అవినీతిని బైట పెట్టేవారిని భయపెట్టే యత్నమని వ్యాఖ్య

న్యూఢిల్లీ: అకౌంటింగ్‌లో అవకతవకల ఆరోపణలతో అదానీ గ్రూప్‌ను కుదిపేసిన అమెరికా షార్ట్ సెల్లర్ హిండెన్‌బర్గ్ రీసెర్చ్‌కి మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. అదానీ సంస్థల స్టాక్స్ విషయంలో అనుచిత వ్యాపార విధానాలను అమలు చేశారనే ఆరోపణల మీద జూన్ 27న తమకు 46 పేజీల నోటీసు వచ్చినట్లు హిండెన్‌బర్గ్ తమ వెబ్‌సైట్లో వెల్లడించింది. ఇది అర్థరహితమైన చర్యగా కొట్టిపారేసింది. కార్పొరేట్ అవినీతిని, మోసాలను బహిర్గతం చేసేవారిని భయపెట్టేందుకు భారత్‌లో అత్యంత శక్తిమంతులైన వారు చేస్తున్న ప్రయత్నమని వ్యాఖ్యానించింది. అదానీ గ్రూప్ స్టాక్స్‌లో తమకు షార్ట్ పొజిషన్లు ఉన్నాయనే విషయాన్ని అధ్యయన నివేదికను ప్రకటించినప్పుడే తాము వెల్లడించామని హిండెన్‌బర్గ్ పేర్కొంది. ఒక ఇన్వెస్టర్ తరఫున తీసుకున్న పొజిషన్లకు సంబంధించి 4.1 మిలియన్ డాలర్లు లభించాయని, సొంతంగా అదానీ అమెరికా బాండ్లను షార్ట్ చేయడం ద్వారా 31,000 డాలర్లు వచ్చాయని తెలిపింది. లీగల్ ఖర్చులు, అధ్యయనంపై చేసిన వ్యయాలకు అవి బొటాబొటీగా సరిపోయాయని వివరించింది. ఆర్థికంగా గానీ వ్యక్తిగత భద్రతపరంగా గానీ అదానీ గ్రూప్‌పై అధ్యయనం తమకు ఏమాత్రం ప్రయోజనకరమైనది కాకపోయినా ఇప్పటివరకు తాము చేసిన వాటిల్లో అత్యంత గర్వకారణమైనదిగా ఇది నిలిచిపోతుందని హిండెన్‌బర్గ్ తెలిపింది.

కోటక్ గ్రూప్ పాత్ర ..

అదానీ స్టాక్స్‌ను షార్ట్ చేసేందుకు తమ భాగస్వామ్య ఇన్వెస్టరు ఒకరు .. కోటక్ మహీంద్రా గ్రూప్‌నకు చెందిన ఆఫ్‌షోర్ ఫండ్‌ను ఉపయోగించినట్లు హిండెన్‌బర్గ్ తెలిపింది. ఆ బ్యాంకు వ్యవస్థాపకుడు ఉదయ్ కోటక్ పేరు బైటికి రాకుండా చూసేందుకే సెబీ తన నోటీసులో కోటక్‌ను ప్రస్తావించకుండా కే-ఇండియా ఆపర్చునిటీస్ ఫండ్ (కేఐఓఎఫ్) అని మాత్రమే పేర్కొందని ఆరోపించింది. సెబీ నోటీసుల ప్రకారం హిండెన్‌బర్గ్ క్లయింట్ అయిన కింగ్‌డన్ క్యాపిటల్.. అధ్యయన నివేదిక విడుదలకు ముందు కోటక్ మహీంద్రా ఇన్వెస్ట్‌మెంట్స్‌కి (కేఎంఐఎల్) చెందిన కేఐఓఎఫ్‌లో ఇన్వెస్ట్ చేసింది. అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేర్లను షార్ట్ చేసిన కేఐఓఎఫ్ .. నివేదిక విడుదల తర్వాత పరిణామాలతో మొత్తం రూ. 183.24 కోట్ల లాభాలు ఆర్జించింది. మరోవైపు, కేఐఓఎఫ్, కేఎంఐఎల్‌కు హిండెన్‌బర్గ్ ఎన్నడూ క్లయింటుగా లేదని కోటక్ మహీంద్రా గ్రూప్ స్పష్టం చేసింది. తమ ఇతర ఇన్వెస్టర్లకు, హిండెన్‌బర్గ్‌కు మధ్య ఉన్న సంబంధాల గురించి తమకు తెలియదని పేర్కొంది.

అదానీ గ్రూప్‌లో షేర్లు, అకౌంట్లలో అవకతవకలు జరుగుతున్నాయంటూ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ 2023 జనవరిలో విడుదల చేసిన నివేదికతో అదానీ గ్రూప్‌లోని 10 లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ 150 బిలియన్ డాలర్ల మేర తుడిచిపెట్టుకుపోయిన సంగతి తెలిసిందే.



గ్రూప్‌ఎమ్ దక్షిణాసియా సీఓఓగా అశ్విన్ పద్మనాభన్



హైదరాబాద్: డబ్ల్యూపీపీకి చెందిన మీడియా ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ గ్రూప్‌ఎమ్ దక్షిణాసియా చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా (సీఓఓ) అశ్విన్ పద్మనాభన్ నియమితులయ్యారు. ఇన్‌ఫ్లూయెన్సర్ మార్కెటింగ్, కంటెంట్‌తో పాటు పెట్టుబడులు, వ్యాపారం, భాగస్వామ్య ఒప్పందాలు, ఎంటర్‌టైన్‌మెంట్ విభాగాలకు ఆయన బాధ్యతలు వహించనున్నారు. క్లయింట్ అవసరాలు, పరిశ్రమ పని తీరు అర్థం చేసుకోవడంతో అశ్విన్‌కు మంచి అనుభవం ఉందని గ్రూప్ ఎం దక్షిణాసియా సీఈఓ ప్రశాంత్ కుమార్ అన్నారు.

కొత్త రికార్డులు.. చివరికి స్వల్ప నష్టాలు

బ్యాంక్ షేర్లలో లాభాల స్వీకరణ

ముంబై: బ్యాంకులు, ఫైనాన్స్, టెలికం షేర్లలో ఇన్వెస్టర్లు లాభాలు స్వీకరించడంతో స్టాక్ సూచీలు మంగళవారం ఆరంభ లాభాలను కోల్పోయి స్వల్ప నష్టాలతో ముగిశాయి. సెన్సెక్స్ 38 పాయింట్లు నష్టపోయి 79,441 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 18 పాయింట్లు కోల్పోయి 24,123 వద్ద నిలిచింది. ఉదయం సూచీలు లాభాలతో ప్రారంభమయ్యాయి. ఐటీ, రియల్టీ, క్యాపిటల్ గూడ్స్ షేర్లు రాణించడంతో ట్రేడింగ్ ప్రారంభంలోనే సెన్సెక్స్ 380 పాయింట్లు పెరిగి 79,856 వద్ద, నిఫ్టీ 94 పాయింట్లు బలపడి 24,236 వద్ద జీవితకాల గరిష్టాలు నమోదు చేశాయి. రికార్డు స్థాయిల వద్ద ముఖ్యంగా చిన్న, మధ్య తరహా షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో సూచీలు వెనక్కి వచ్చాయి. బీఎస్ఈ మిడ్, స్మాల్ సూచీలు వరుసగా 0.57%, 0.10% చొప్పున నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవుతున్నాయి.



- ఆఫీసర్స్ ఛాయిస్ విస్కీ తయారీ సంస్థ అలైడ్ బ్లెండర్స్ అండ్ డిస్టిలర్స్ సంస్థ లిస్టింగ్ విజయవంతమైంది. ఇష్యూ ధర (రూ.281)తో పోలిస్తే బీఎస్ఈలో 13% ప్రీమియంతో రూ.318 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో 15.44% పెరిగి రూ.324.40 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 13% లాభంతో రూ.318 వద్ద ముగిసింది.
- అదానీ–హిండెన్‌బర్గ్ వివాదంలో తాజాగా కోటక్ గ్రూప్ పేరు ప్రస్తావన రావడంతో కోటక్ మహీంద్రా బ్యాంకు షేరు షేరు 2% నష్టపోయి రూ.1770 వద్ద స్థిరపడింది.
- క్లియరింగ్ కార్పొరేషన్లు, డిపాజిటరీలు తమ సభ్యుల లావాదేవీల పరిమాణంతో సంబంధం లేకుండా అందరికీ చార్జీలు ఒకరకంగా ఉండాలంటూ సెబీ ఆదేశాలతో స్టాక్ బ్రోకింగ్ సంస్థల షేర్లు డీలా పడ్డాయి. ఏంజెల్ వన్ 9%, జియోజిత్ ఫైనాన్షియల్ 7%, మోతీలాల్ ఓస్వాల్ 4%, ఎస్ఎంసీ గ్లోబల్ సెక్యూరిటీస్ 3%, డెలాయిట్ ఆల్గోటెక్ 2% చొప్పున నష్టపోయాయి.

విదేశాలకెళ్లే విద్యార్థుల కోసం ఐసీఐసీఐ బ్యాంక్ సఫిరో కార్డు

న్యూఢిల్లీ: ఉన్నత విద్యాభ్యాసానికి విదేశాలకు వెళ్లే విద్యార్థుల కోసం ఐసీఐసీఐ బ్యాంకు కొత్తగా సఫిరో ఫారెక్స్ కార్డును ఆవిష్కరించింది. కోర్సు సంబంధ ఫీజులతో పాటు రోజువారీ ఖర్చులను కూడా నిర్వహించుకునేందుకు ఇది ఉపయోగపడగలదని బ్యాంకు తెలిపింది. క్రాస్ కరెన్సీ మార్కప్ చార్జీల భారం లేకుండా 15 కరెన్సీలను ఇందులో లోడ్ చేసుకోవచ్చని, లావాదేవీలూ జరపవచ్చని వివరించింది. వెల్కమ్ కిట్‌లో ప్రైమరీ, రిప్లేస్‌మెంట్ కార్డులని రెండు ఉంటాయి. ప్రైమరీ కార్డు దెబ్బతిన్నా లేదా పోయినా రిప్లేస్‌మెంట్ కార్డును డిజిటల్‌గా యాక్టివేట్ చేసుకోవచ్చు. విద్యార్థులు లేదా వారి తల్లిదండ్రులు ఎక్కడనుంచైనా ఎప్పుడైనా తక్షణమే ఇందులోకి కరెన్సీని లోడ్ చేయొచ్చు.

కంకార్‌లో 7% వాటా విక్రయం!



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం కంటెయినర్ కార్పొరేషన్(కంకార్)ను ప్రైవేటైజ్ చేసే ప్రయత్నాలు ఫలించకపోవడంతో కేంద్ర ప్రభుత్వం తాజాగా కొత్త వ్యూహాలకు తెరతీస్తోంది. దీనిలో భాగంగా తొలుత 5–7% వాటాను విక్రయించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. కంపెనీలో ప్రభుత్వానికి గల 54.8% వాటాలో 30.8% వాటా అమ్మకానికి చేపట్టిన ప్రయత్నాలకు ఆశించిన స్పందన లభించకపోవడంతో ప్రైవేటైజ్ ఆలోచనను తాత్కాలికంగా పక్కన పెట్టినట్లు అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. అయితే ప్రభుత్వం ఇతర అవకాశాలవైపు దృష్టి పెట్టింది. అర్హతగల సంస్థాగత ఇన్వెస్టర్లకు ప్లేస్‌మెంట్ (క్విప్) ద్వారా వ్యూహాత్మకంగా 5–7% వాటాను కేటాయించాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

పిల్ల చేష్టలు!

▶ మొదటి పేజీ తరువాయి

ఆయనలో తరచూ పిల్ల చేష్టలు శ్రుతి మించుతుంటాయి. అలాంటప్పుడు నిండు సభలో ఎవరిని పడితే వారిని కౌగిలించుకుంటారు. సభలో కూర్చుని కన్ను కొడతారు'' అంటూ తూర్పారబట్టారు. ''ఓబీసీలను దొంగలన్నందుకు దోషిగా తేలి శిక్షకు గురైన వ్యక్తి రాహుల్. స్వాతంత్య్ర యోధుడు వీర్ సావర్కర్‌ను అవమానించినందుకు, దేశంలోనే అతి పెద్ద పార్టీ అధ్యక్షున్ని హంతకుడన్నందుకు, మరెందరో నేతలు, అధికారులు, సంస్థలపై అబద్ధాలు చెప్పినందుకు పరువు నష్టం దావాలు ఎదుర్కొంటున్న వ్యక్తి. ఏకంగా సర్వోన్నత న్యాయస్థానానికే బాధ్యతారహితమైన వాంగ్మూలమిచ్చి, అందుకు క్షమాపణలు చెప్పిన చరిత్ర రాహుల్‌ది. వేలాది కోట్ల అవినీతి కేసులో బెయిల్‌పై ఉన్నారు'' అంటూ దుమ్మెత్తిపోశారు. పిల్ల చేష్టలను పోగొట్టి రాహుల్‌కు సద్బుద్ధి ప్రసాదించాలని దేవుణ్ని కోరుతున్నట్టు చెప్పారు. అయితే, ''రాహుల్ తీరును బాల్య చేష్టలుగా భావించి ఎట్టి పరిస్థితుల్లోనూ తేలిగ్గా తీసుకోరాదు. సభలో ఆయన ప్రవర్తన వెనక తీవ్ర దురుద్దేశాలున్నాయి. సాటిలేని మన దేశ పరంపరకు అవి చెరగని మచ్చ'' అంటూ విమర్శలు గుప్పించారు. వీటిపై దేశ ప్రజలు కూడా జాగ్రత్తగా ఉండాలన్నారు. రాహుల్ వ్యాఖ్యలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను కోరారు. ''మీరు సహృదయులు. అవమానాలను కూడా నవ్వుతూ సహిస్తారు. కానీ సభలో నిన్నటి దారుణాలను సీరియస్‌గా తీసుకుని వాటికి అడ్డుకట్ట వేయాల్సిందే. అప్పుడే పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని కాపాడగలం. సభ గొప్పదనాన్ని కాపాడాల్సిన బాధ్యత మీపై ఉంది. సభలో రాహుల్, కాంగ్రెస్ నేతల అబద్ధాల పరంపరపై కఠిన చర్యలు తీసుకోవాలని దేశమంతా కోరుతోంది'' అన్నారు. మోదీ ప్రసంగం పొడవునా విపక్ష నేతలు నిరసనలతో హోరెత్తించారు. ఆయన మాట్లాడేందుకు నిలబడుతూనే 'మణిపూర్', 'మణిపూర్' అంటూ నినాదాలు చేశారు. స్పీకర్ పదేపదే నిలువరించినా వారు వెనక్కు తగ్గలేదు.

కాంగ్రెస్ బతుకంతా అబద్ధాలే

దేశంలో ఆర్థిక అరాచకం సృష్టించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని మోదీ ఆరోపించారు. ''ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో దేశ ప్రజలు మరోసారి సుస్థిరతకు పట్టం కట్టారు. మా పదేళ్ల పాలన చూసిన మరోసారి ఆశీర్వదించారు. కాంగ్రెస్‌కు వరుసగా మూడో లోక్‌సభ ఎన్నికల్లో కనీసం 100 సీట్లు కూడా దాటలేదు. ఇంత దారుణమైన ఓటమి మూటగట్టుకున్నా ఇంకా అహంకారమే ప్రదర్శిస్తోంది. బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏను ఓడించామన్న భావనను వ్యాప్తి చేసేందుకు ప్రయత్నిస్తోంది'' అన్నారు. అబద్ధాలన్నే కాంగ్రెస్ తన రాజకీయ ఆయుధంగా మార్చుకుందంటూ ఆక్షేపించారు. రాజ్యాంగంపై, రిజర్వేషన్లపై కూడా కాంగ్రెస్ నిత్యం అబద్ధాలు చెబుతూ వస్తోందన్నారు. ''నిజాలను దేశ ప్రజల ముందు ఉంచుతున్నా. ఎమర్జెన్సీ సందర్భంగా దేశంపై కాంగ్రెస్ రాచరికాన్ని రుద్దింది. వ్యవస్థలన్నింటినీ క్రూరంగా అపహాస్యం చేసింది. ప్రభుత్వాలను కూలదోసింది. మీడియాను అణిచేసింది. రాజ్యాంగానికీ తూట్లు పొడిచింది. మనిషి రక్తం రుచి చూసిన పులి మాదిరిగా కాంగ్రెస్ నోటికి అబద్ధాల రక్తం నిండుగా అంటింది. ఈవీఎంలపై అబద్ధాలు. రాజ్యాంగంపై అబద్ధాలు. రిజర్వేషన్లపైనా అబద్ధాలు. గతంలో రాఫెల్ ఒప్పందంపైనా అబద్ధాలు. ఎల్ఐసీపైనా అబద్ధాలు. బ్యాంకులపైనా అబద్ధాలు. ఉద్యోగులను కూడా ప్రభుత్వంపై రెచ్చగొట్టే ప్రయత్నాలు. చివరికి అగ్నివీర్ పథకంపైనా నిన్న నిండుసభలో రాహుల్ పచ్చి అబద్ధాలు చెప్పారు. రైతులకు కేంద్రం కనీస మద్దతు ధర ఇవ్వడం లేదన్నారు. ఇలాంటి బాధ్యతారహిత చేష్టలతో కాంగ్రెస్ నేతలు రాజ్యాంగంతో చెలగాటమాడుతున్నారు. ఇది దారుణం. 60 ఏళ్ల పాటు అధికారంలో కొనసాగిన పార్టీ, అనుభవజ్ఞులైన నేతలెందరో ఉన్న పార్టీ ఇలా అబద్ధాలకు తెగబడుతుండటం, ఇంతటి తప్పుదారిలో వెళ్తుండటం దేశానికి చాలా ప్రమాదకరం'' మోదీ అన్నారు.



సభలో మోదీ ప్రసంగాన్ని వింటున్న రాహుల్

సైన్యాన్ని బలహీనపరిచే కుట్రలు

యువత సైన్యంలో చేరకుండా చూసేందుకు, సైనిక దళాలను బలహీనపరిచేందుకు రాహుల్ కుట్ర పన్నుతున్నారని మోదీ ఆరోపించారు. అందుకే అగ్నిపథ్ పథకంపై పచ్చి అబద్ధాలు మాట్లాడారన్నారు. ఎవరి ప్రయోజనాల కోసం ఆయన ఇదంతా చేస్తున్నారని ప్రశ్నించారు. ''మన సైన్యం బలోపేతం కావడాన్ని కాంగ్రెస్ ఎన్నడూ భరించలేదు. ఆ పార్టీ హయాంలో కాలానుగుణంగా సంస్కరణలకు నోచుకోలేక సైన్యం ఇక్కట్లు పడింది'' అని ఆరోపించారు. ''భద్రతాపరంగా సున్నితమైన ఈ విషయంపై బహిరంగంగా ఇంతకంటే చెప్పలేం. అందుకే నా నోటికి తాళం పడింది'' అని మోదీ అన్నారు.

మోదీ మాటల తూటాలు

రాహుల్‌పై...

- ➤ అనగనగా ఒక బాలుడు. తనకు 99 మార్కులు వచ్చాయంటూ అందరికీ మిఠాయిలు పంచుతున్నాడు. టీచర్ వచ్చి నీకు 99 వచ్చింది 100కు కాదు, 543కు అని చెప్పినా ఆగడం లేదు! ఫెయిలవడంలో కూడా ప్రపంచ రికార్డు సృష్టించాడని ఆ పిల్లాడికి అర్థమయ్యేలా ఎవరు చెప్పాలి!?
- ➤ ''తుమ్ సే నా హో పాయెగా (కాంగ్రెస్‌ను గెలిపించడం ఇక నీ తరం కాదు)'' అని ఎన్నికల తీర్పు ద్వారా దేశమంతా రాహుల్‌కు స్పష్టంగా చెప్పింది.

కాంగ్రెస్‌పై...

- ➤ కాంగ్రెస్ ఓ పరాన్నజీవి! ఈ ఎన్నికల్లో అది గెలిచిన 99 లోక్‌సభ సీట్లలో అత్యధికం భాగస్వామ్య పార్టీల ఓట్ల పుణ్యమే! గణాంకాల ఆధారంగా ఈ మాట చెబుతున్నా. ఒంటరిగా పోటీ చేసిన 16 రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఓటు శాతం దారుణంగా తగ్గిపోయింది. గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో 66 సీట్లలో పోటీ చేస్తే నెగ్గింది కేవలం రెండు! బీజేపీతో నేరుగా తలపడ్డ చోట్ల కాంగ్రెస్ విజయ శాతం కేవలం 26! కానీ బలమైన ప్రాంతీయ పార్టీలతో జట్టు కట్టిన రాష్ట్రాల్లో మాత్రం పోటీ చేసిన సీట్లలో ఏకంగా సగం గెలిచింది! కనుక ఇకపై కాంగ్రెస్‌కు 'పరాన్నజీవి పార్టీ' అనే పేరు స్థిరపడటం ఖాయం. దీనిపై కాంగ్రెస్ భాగస్వాములు ఇప్పటికైనా విశ్లేషణ చేసుకున్నారో లేదో! ఈ ఎన్నికల ఫలితాలు వాటికి కూడా ఓ సందేశం.
- ➤ వాస్తవాలిలా ఉన్నా కాంగ్రెస్ నేతల స్టేట్‌మెంట్లు మాత్రం షోలే సినిమాలో కామెడీ సీన్‌ను మించిపోతున్నాయి. వరుసగా మూడుసార్లు ఓడినా నైతిక విజయం తమదేనంటూ ఆత్మవంచన చేసుకుంటున్నారు. 13 రాష్ట్రాల్లో జీరో సీట్లొచ్చినా హీరోలమని చెప్పుకు తిరుగుతున్నారు. మొత్తంగా పార్టీని నిండా ముంచి కూడా, ఇంకా ఊపిరితోనే ఉంది లెమ్మంటూ సంబరపడుతున్నారు!
- ➤ మహిళలకు ప్రతి నెలా రూ.8,500 ఇస్తామంటూ కాంగ్రెస్ పచ్చి అబద్ధాలు చెప్పింది. ఆ డబ్బులొచ్చాయా అని వాళ్లు జూలై 1న తమ బ్యాంకు ఖాతాలు చెక్ చేసుకున్నారు. ఆ మహిళల శాపనార్థాలు కాంగ్రెస్‌ను సర్వనాశనం చేయనున్నాయి. జూలై 1ని దేశమంతా ఖటాఖట్ దినంగా జరుపుకుంది.

హిందువులపై భారీ కుట్రలు

రాహుల్ వ్యాఖ్యలపై మోదీ ధ్వజం

- వాటిని దేశం ఎప్పటికీ మరవబోదు
- హిందూ మతాన్నే కించపరిచే ప్రయత్నం... హిందువులంటే కాంగ్రెస్‌కు నిలువెల్లా విద్వేషం
- హిందువులను హేళన చేయడం ఫ్యాషనైంది: ప్రధాని

రాహుల్ 'హిందూ' వ్యాఖ్యలపై మోదీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. హిందువులంటే కాంగ్రెస్‌కు చెప్పలేనంత విద్వేషమని ఆరోపించారు. అందుకే వారిపై ఆ పార్టీ భారీ కుట్రలకు పాల్పడుతోందన్నారు. ఈ విషయాన్ని దేశ ప్రజలందరికీ స్పష్టంగా చెప్పదలచానన్నారు. ''హిందువులు సహనానికి మారుపేరు. అలాంటి వారిని హింసావాదులంటారా? ఇదా మీ సంస్కారం? ఇదేనా మీ చరిత్ర? ఇదేనా మీ భావజాలం? హిందువుల పట్ల మీకింతటి విద్వేషమా?! హిందువులపై రాహుల్ విద్వేషపు వ్యాఖ్యలను దేశం వందల ఏళ్లు గడిచానా మర్చిపోదు. వారిని ఎన్నటికీ క్షమించబోదు'' అంటూ మండిపడ్డారు. ''విపక్షాలు కొత్తగా హిందూ ఉగ్రవాదం అనే మాటలను తెరపైకి తెచ్చాయి. హిందూ ధర్మాన్ని డెంగీ, మలేరియాతో పోల్చాయి. పైగా అందుకు చప్పట్లు చరుచుకున్నాయి'' అంటూ దుయ్యబట్టారు. హిందూ పరంపరను, హిందూ సమాజాన్ని, హిందూ వారసత్వాన్ని, సంస్కృతిని కించపరిచేందుకు, తక్కువ చేసి చూపించేందుకు పక్కా ప్రణాళిక ప్రకారం ప్రయత్నాలు జరుగుతున్నాయని మోదీ ఆరోపించారు. ''ఆ క్రమంలోనే హిందువులపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. కేవలం రాజకీయ స్వార్థం కోసమే ఇదంతా చేస్తున్నారు. హిందువులను కించపరచడం, హేళన చేయడం వీళ్లకు ఫ్యాషన్‌గా మారింది'' అంటూ మండిపడ్డారు. ''హిందువులపై విపక్ష నేత చేసిన అవమానకర వ్యాఖ్యలు యాదృచ్ఛికమేనా, లేక ఏదైనా భారీ కుట్రలో భాగమా? దీనిపై హిందూ సమాజం కూడా ఆలోచించాల్సిన సమయం వచ్చేసింది'' అని అభిప్రాయపడ్డారు. రాహుల్ సోమవారం సభలో శివుని చిత్రపటాన్ని ప్రదర్శించడాన్ని మోదీ తీవ్రంగా తప్పుబట్టారు. ''హిందూ సంస్కృతిలో ఈశ్వరారాధన కేవలం దర్శనం కోసం మాత్రమే తప్ప స్వార్థం కోసమో, ఇలా ప్రదర్శన కోసమో కాదు. కానీ కాంగ్రెస్ వాళ్లేమో మన దేవీ దేవతలను ఇలా అవమానిస్తున్నారు. స్త్రీ శక్తిని దేశంలో అనాది నుంచి పూజిస్తూ వస్తున్నాం. అలాంటి శక్తిని వినాశనం చేస్తామన్నారు. ఇలాంటి వ్యాఖ్యలతో మొత్తం దేశ ప్రజల మనసులనే గాయపరిచారు. వీరిని దేశం ఎన్నటికీ క్షమించబోదు!'' అన్నారు.

అంబేడ్కర్‌పై నెహ్రూ కుట్రలు...

రిజర్వేషన్లకు కాంగ్రెస్ బద్ధ విరోధి

దేశంలోని దళిత, వెనకబడ్డ వర్గాలకు కాంగ్రెస్ తీరని అన్యాయం చేసిందని మోదీ విమర్శించారు. దీన్ని సహించలేకే రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్ అప్పట్లో నెహ్రూ కేబినెట్‌కు రాజీనామా చేశారన్నారు. ''దళితులకు నెహ్రూ చేసిన అన్యాయాలను అంబేడ్కర్ ఏకిపారేశారు. వెనకబడ్డ వర్గాలపై నెహ్రూ ప్రభుత్వ ఉపేక్షను భరించలేకే రాజీనామా చేస్తున్నట్టు స్పష్టంగా ప్రకటించారు. దాంతో అంబేడ్కర్‌పై నెహ్రూ కక్షగట్టారు. ఆయన రాజకీయ జీవితాన్నే సర్వనాశనం చేసేందుకు శాయశక్తులా ప్రయత్నించారు. కుట్రపూరితంగా అంబేడ్కర్‌ను ఎన్నికల్లో ఓడించారు. ఆయన ఓటమికి నెహ్రూ పండుగ చేసుకున్నారు. ఆ ఆనందాన్ని ఒక లేఖలో స్పష్టంగా రాసుకొచ్చారు. మరో దళిత నేత బాబూ జగ్జీవన్‌రామ్‌కు కూడా కాంగ్రెస్ తీరని అన్యాయమే చేసింది. ఎమర్జెన్సీ తర్వాత జగ్జీవన్‌రామ్‌కు ప్రధాని అయ్యే అవకాశం వస్తే ఇందిరాగాంధీ మోకాలడ్డారు. 'ఏదేమైనా ఆయన ప్రధాని కావడానికి వీల్లేదు. లేదంటే ప్రధాని పదవిని జీవితాంతం వదలబో'రన్నారు. ఇది ఒక పుస్తకంలో స్పష్టంగా ఉంది. చౌదరీ చరణ్‌సింగ్‌తోనూ ఇందిర ఇలాగే వ్యవహరించారు. వెనకబడ్డ వర్గాలకు చెందిన సీతారాం కేసరిని తీవ్రంగా అవమానించిన చరిత్ర కాంగ్రెస్‌ది'' అంటూ సోదాహరణంగా చెప్పుకొచ్చారు. రిజర్వేషన్లకు కాంగ్రెస్ ఆది నుంచీ బద్ధ విరోధేనని మోదీ ఆరోపించారు. ''రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ నెహ్రూ అప్పట్లో సీఎంలకు లేఖలు రాశారు. మండల్ కమిషన్ నివేదికను ఇందిర ఏళ్లపాటు తొక్కిపెట్టారు. రాజీవ్‌గాంధీ కూడా విపక్ష నేతగా రిజర్వేషన్లను నిండు సభలోనే బాహాటంగా వ్యతిరేకించారు'' అన్నారు.

నీట్ లీకేజీపై...

నీట్ తరహా లీకేజీలు పునరావృతం కాకుండా కేంద్రం యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటోందని మోదీ చెప్పారు.'' లీకేజీ బాధ్యులను వదిలేది లేదు. విద్యార్థుల భవితతో చెలగాటమాడే వారిని ఉపేక్షించబోం. దేశమంతటా అరెస్టులు కొనసాగుతున్నాయి. దోషులపై ఇప్పటికే కఠినమైన కొత్త చట్టం కింద అభియోగాలు మోపాం. అవినీతిని ఉపేక్షించేది లేదని 2014లో తొలిసారి గెలిచినప్పుడే స్పష్టంగా చెప్పాం. అందుకు కట్టుబడి ఉన్నాం'' అన్నారు.

డయాఫ్రమ్‌వాల్‌పై తర్జన భర్జనలు

అంతర్జాతీయ నిపుణుల్లో భిన్నాభిప్రాయాలు

అమరావతి/పోలవరం రూరల్: పోలవరం ఈసీఆర్ఎఫ్(ఎర్త్ కమ్ రాక్ ఫిల్) డ్యామ్ గ్యాప్–2లో గోదావరి వరదల ఉద్ధృతికి దెబ్బతిన్న డయాఫ్రమ్‌వాల్‌పై అంతర్జాతీయ నిపుణులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. ప్రాజెక్టు భద్రత దృష్ట్యా దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్‌కు సమాంతరంగా కొత్త డయాఫ్రమ్‌వాల్ నిర్మించాలని అంతర్జాతీయ నిపుణుడు ఒకరు ప్రతిపాదించగా.. పాత డయాఫ్రమ్‌వాల్‌లో దెబ్బతిన్న నాలుగు ప్రాంతాల్లో 'యూ' ఆకారంలో డయాఫ్రమ్‌వాల్ నిర్మించి అనుసంధానం చేస్తే సరిపోతుందని మరొక నిపుణుడు సూచించారు. డయాఫ్రమ్ వాల్‌పై నిపుణుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడంతో దీనిపై సమగ్రంగా అధ్యయనం చేసి ఏకాభిప్రాయంతో ముందుకెళ్లాలని నిర్ణయించారు. పోలవరం ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్, ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణ ప్రాంతం, డయాఫ్రమ్‌వాల్, గైడ్ బండ్‌లను ఆది, సోమవారాల్లో అంతర్జాతీయ నిపుణుల బృందం సభ్యులు డేవిడ్ వి.పాల్, గియాస్ ఫ్రాంకో డి.సిస్కో, రిచర్డ్ డొన్నెల్లి, సీస్ హించ్ బెర్గర్ పరిశీలించారు. డయాఫ్రమ్‌వాల్ పనులు చేసిన బావర్, జెట్ గ్రౌటింగ్ పనులు చేసిన కెల్లర్, ప్రధాన కాంట్రాక్టు సంస్థ మేఘా, ఆ సంస్థ నియమించుకున్న యాఫ్రి సంస్థ ప్రతినిధులు, సీఎస్ఎంఆర్ఎస్, వ్యాప్కోస్ అధికారులు, సీడబ్ల్యూసీ డిప్యూటీ డైరెక్టర్ అశ్వనీకుమార్, జలవనరుల శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నారాయణరెడ్డి, సీఈ నరసింహమూర్తి తదితరులతో మంగళవారం ప్రాజెక్టు క్యాంపు కార్యాలయంలో నిపుణుల బృందం సభ్యులు సుదీర్ఘంగా సమీక్షించారు.

విలీన గ్రామాలపై చొరవ చూపండి

● తెలంగాణ

సీఎం రేవంత్‌కు మంత్రి తుమ్మల లేఖ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో కలిసిన ఐదు గ్రామాలను మళ్లీ తెలంగాణలో కలిపేలా చూడాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు సీఎం రేవంత్‌కు మంగళవారం ఆయన లేఖ రాశారు. 'ఈనెల 6న ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ ఉన్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో కలిసిన ఎటపాక, గుండాల, పురుషోత్తమపట్నం, కన్నాయిగూడెం, పిచుకులపాడు గ్రామపంచాయతీలను భద్రాచలంలో కలిపే అంశంపై చర్చించాలి. భద్రాచలం పట్టణ శివారు నుంచి ఏపీలో విలీనం చేయడంతో అక్కడ డంపింగ్‌యార్డుకు కూడా స్థలం లేకుండా పోయింది' అని ఆ లేఖలో తుమ్మల పేర్కొన్నారు.

క్లుప్తంగా...

ట్రిపుల్ ఐటీలో రెండోరోజూ సర్టిఫికెట్ల పరిశీలన



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

నూజివీడు: ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటీలో ప్రత్యేక కేటగిరీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన రెండోరోజైన మంగళవారం కూడా కొనసాగింది. ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో ప్రస్తుత విద్యా సంవత్సరానికి నిర్వహిస్తున్న అడ్మిషన్ల ప్రక్రియలో భాగంగా ప్రత్యేక కేటగిరీకి చెందిన సైనిక సంతతి, భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ కోటాలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యారు. సైనిక సంతతి కోటాకు సంబంధించి 62 మంది, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కోటాకు సంబంధించి 113 మంది అభ్యర్థులు హాజరైనట్టు అడ్మిషన్ల కన్వీనర్ ఆచార్య సంద్ర అమరేంద్ర కుమార్ తెలిపారు. బుధవారం సైనిక సంతతి, వికలాంగులు, క్రీడా, ఎన్‌సీసీ, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కోటా అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తామని అధికారులు చెప్పారు.

ఏపీ టెట్ సిలబస్‌పై అపోహ వద్దు

- ఫిబ్రవరి–2024 టెట్ సిలబస్ ఆధారంగానే పరీక్షలు
- పాఠశాల విద్యా శాఖ కమిషనర్ సురేష్ కుమార్

సాక్షి, అమరావతి: ఏపీ టెట్ (జూలై)–2024 సిలబస్‌లో మార్పులు చేసినట్లు సోషల్ మీడియాలో వస్తోన్న వదంతులను నమ్మవద్దని, ఫిబ్రవరి సిలబస్సే ఇప్పుడూ ఉందని ఉపాధ్యాయ అభ్యర్థులకు పాఠశాల విద్యా శాఖ కమిషనర్ సురేష్ కుమార్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ నియామకాల కోసం మెగా డీఎస్సీ కంటే ముందుగా సోమవారం ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నోటిఫికేషన్‌ను విడుదల చేసిన సంగతి తెలిసిందే. నోటిఫికేషన్, ఇన్ఫర్మేషన్ బులిటెన్, పరీక్షల షెడ్యూల్, సిలబస్ తదితర వివరాలను ఇప్పటికే కమిషనరేట్ వెబ్‌సైట్‌లో ఉంచామని పేర్కొన్నారు. అయితే పాత సిలబస్ ఉంచినట్లుగా సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోందని, ఇది వాస్తవం కాదన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించిన ఉపాధ్యాయ అర్హత పరీక్షకు నిర్ణయించిన సిలబస్‌నే ప్రస్తుత టెట్‌కు కూడా నిర్ధారించినట్టు వివరించారు. దానినే వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశామని, ఈ సిలబస్ ఆధారంగానే అభ్యర్థులు పరీక్షకు సన్నద్ధం కావాలని తెలిపారు.

ఎన్‌ఆర్‌ఐ కోటాలో కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి వ్యవసాయ, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్, ఫుడ్ టెక్నాలజీ, కమ్యూనిటీ సైన్స్ కోర్సుల్లో ప్రవేశాలకు ఎన్‌ఆర్‌ఐ కోటాలో ఆసక్తిగల విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ ఏఎన్‌జీఆర్ఏయూ.ఏసీ.ఇన్‌లో ఈనెల 4వ తేదీ నుంచి వివరాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

కాంట్రాక్టు అధ్యాపకుల సర్వీసు పొడిగింపు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో కాంట్రాక్టు పద్ధతిపై పని చేస్తున్న 703 మంది అధ్యాపకుల సర్వీసును పొడిగిస్తూ ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2024–25 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లోని 691 మంది, ప్రైవేటు ఎయిడెడ్ ఓరియంటెడ్ కళాశాలల్లోని 12 మంది సర్వీసును పొడిగిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.


మాస్టర్స్ ఇన్ డిజైన్ కోర్సుకు విశేష స్పందన

ఎస్‌పీఏవీ డైరెక్టర్ రమేష్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఈ విద్యాసంవత్సరం నుంచి తమ విద్యాసంస్థలో ప్రారంభించిన మాస్టర్స్ ఇన్ డిజైన్ కోర్సుకు విద్యార్థుల నుంచి మంచి స్పందన ఉందని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ విజయవాడ (ఎస్‌పీఏవీ) డైరెక్టర్ ఏ.సిరికొండ రమేష్ చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ఎస్‌పీఏవీ కళాశాల ఆవరణలో మంగళవారం విలేకరులతో రమేష్ మాట్లాడారు. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ద్వారా భారత పార్లమెంట్‌లో చట్టం చేయడం ద్వారా తమ విద్యాసంస్థ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆర్కిటెక్చర్, ప్లానింగ్ అనే రెండు అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్స్‌తో పాటుగా 9 మాస్టర్ డిగ్రీ ప్రోగ్రామ్‌లు తమ విద్యాసంస్థలో ఉన్నాయని చెప్పారు. కేంద్రం ప్రకటించిన అమృత్ పథకంలో భాగంగా ఏపీలోని 2 గ్రామాలను ఎంపిక చేసుకుని మౌలిక సదుపాయాల కల్పనపై తమ కళాశాల దృష్టి పెడతుందని చెప్పారు. భీమవరం, ఏలూరు ప్రాంతాలను పరిశీలించి మాస్టర్ ప్లాన్‌ను రూపొందించి ప్రభుత్వానికి నివేదిక అందజేశామన్నారు.

ఒక్క రోజే రూ 5,000 కోట్ల అప్పు

చంద్రబాబు చెబుతున్న సంపద సృష్టి ఇలాగేనా?



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఒక్క రోజే రూ.5,000 కోట్లు అప్పు చేసింది. అంతే కాదు.. ఈ నెలలోనే మరో రూ.4,000 కోట్లు అప్పులు చేయడం ద్వారా ఒక్క జూలైలోనే మొత్తం రూ.9,000 కోట్లు రుణ భారం మోపనుంది. తొమ్మిదేళ్ల కాల వ్యవధితో రూ.1,000 కోట్లు, 12 ఏళ్ల కాల వ్యవధితో రూ.1,000 కోట్లు, 17 ఏళ్ల కాల వ్యవధితో రూ.1,000 కోట్లు, 21 ఏళ్ల కాల వ్యవధితో రూ.1,000 కోట్లు 24 సంవత్సరాల కాల వ్యవధితో రూ.1000 కోట్ల మేర తాజాగా కూటమి సర్కారు అప్పులు చేసింది. 7.36 శాతం నుంచి 7.37 శాతం వరకు వడ్డీతో ఈ అప్పులు తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీలను వేలం వేయడం ద్వారా ఆర్బీఐ ఈ అప్పులను సమీకరించింది. ఈ ఆర్థిక ఏడాదిలో జూలై నుంచి సెప్టెంబర్ వరకు మూడు నెలల్లో మొత్తం రూ.17 వేల కోట్లు అప్పులు చేయనున్నట్టు చంద్రబాబు సర్కారు ఆర్బీఐకి తెలిపింది. ఇందులో జూలైలో రూ.9,000 కోట్లు అప్పు చేయనుండగా ఆగస్టు, సెప్టెంబర్‌లో రూ.8,000 కోట్లు అప్పు చేయనున్నట్లు సమాచారం అందచేసింది. ఈ మేరకు ఏ మంగళవారం ఎంత అప్పులు తీసుకుంటారో వెల్లడించింది. కాగా ఇప్పటికే గత నెలలో కూటమి సర్కారు రూ.2,000 కోట్లు అప్పు చేయడం తెలిసిందే.

నాడు గగ్గోలు..

ప్రతి మంగళవారం అప్పు చేయనిదే పూట గడవదంటూ వైఎస్ జగన్ సర్కారుపై పదేపదే విషం కక్కిన ఎల్లోమీడియా ఇప్పుడు రూ.వేల కోట్ల అప్పులు రాష్ట్రాన్ని ముంచెత్తుతున్నా కిక్కురుమనకపోవడంపై విస్మయం వ్యక్తమవుతోంది. గత సర్కారు ఆచితూచి అప్పులు చేస్తే అదేదో మహాపరాధం అన్నట్లుగా నిత్యం గగ్గోలు పెట్టిన ఓ వర్గం మీడియాకు తాజా పరిణామాలు కంటికి కనిపించడం లేదా? అని ఆర్థిక నిపుణులు ప్రశ్నిస్తున్నారు. చంద్రబాబు చేస్తున్న అప్పులు సంపద సృష్టిస్తున్నట్లుగా కనిపిస్తున్నాయా? అని ఎద్దేవా చేస్తున్నారు. గత సర్కారు పరిమితికి లోబడే అప్పులు చేసినా రాష్ట్రం శ్రీలంక మాదిరిగా అయిపోతోందంటూ ఎల్లో మీడియా పదేపదే విషం చిమ్మిన వైనాన్ని ప్రస్తావిస్తున్నారు.

కదిలిన కృష్ణమ్మ

ప్రధాన పాయతోపాటు ఉప నదుల్లో ప్రారంభమైన ప్రవాహం

సాక్షి, అమరావతి: నైరుతి రుతుపవనాల ప్రభావం వల్ల కృష్ణా నదీ పరివాహక ప్రాంతం(బేసిన్)లో రెండ్రోజుల నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. దీంతో కృష్ణా ప్రధాన పాయతోపాటు ఉప నదుల్లోనూ వరద ప్రవాహం మొదలైంది. కృష్ణా ప్రధాన పాయ నుంచి ఆల్మట్టి డ్యామ్‌లోకి మంగళవారం 24,761 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి నిల్వ 39.08 టీఎంసీలకు చేరుకుంది. ఆల్మట్టి నిండాలంటే ఇంకా 90 టీఎంసీలు అవసరం. కృష్ణా ప్రధాన ఉప నది అయిన తుంగభద్రలోనూ వరద ప్రవాహం మొదలైంది. తుంగభద్ర డ్యామ్‌లోకి 13,410 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి నిల్వ 7.91 టీఎంసీలకు చేరుకుంది. తుంగభద్ర డ్యామ్ నిండాలంటే ఇంకా 98 టీఎంసీలు అవసరం. ఉమ్మడి కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో చెదురుమదురు వర్షాల ప్రభావం వల్ల శ్రీశైలం ప్రాజెక్టులోకి 1,033 క్యూసెక్కులు చేరుతున్నాయి. కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా తెలంగాణ సర్కార్ శ్రీశైలం నుంచి 1600 క్యూసెక్కులు తరలిస్తోంది. ప్రస్తుతం శ్రీశైలం ప్రాజెక్టులో 37.3 టీఎంసీలు నిల్వ ఉన్నాయి.

సమయం ఇవ్వండి.. నిర్ణయం తీసుకుంటాం

- 5 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లపై హైకోర్టుకు ప్రభుత్వం నివేదన
- తదుపరి విచారణ 2 వారాలకు వాయిదా

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఐదు ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 50 శాత సీట్లను సెల్ఫ్ ఫైనాన్స్ కోటా (బీ కేటగిరీ 35 శాతం, సీ కేటగిరీ 15 శాతం) కింద భర్తీ చేసేందుకు గత ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులపై విధాన నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. ఇందుకు కొంత సమయం పడుతుందని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) సింగమనేని ప్రణతి హైకోర్టుకు వివరించారు. దీంతో హైకోర్టు ఈ వ్యవహారంలో తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

జీవో 107, 108పై పిటిషన్

రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు వైద్య కళాశాలలతో దీటుగా నిర్వహించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన విజయనగరం, మచిలీపట్నం, ఏలూరు, రాజమహేంద్రవరం, నంద్యాల జిల్లాల్లో ఏర్పాటు చేసిన కళాశాలల్లో సీట్లను జనరల్, బీ కేటగిరీ, సీ కేటగిరీ (ఎన్‌ఆర్‌ఐ)గా విభజిస్తూ 107, 108 జీవోలు జారీ చేసింది. ఈ జీవోలను సవాలు చేస్తూ కోయ శిరీష (గుంటూరు), జతిన్ రాయ్ (ఏలూరు), వీణా జ్యోతిక (ఆత్మకూరు) హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై అప్పట్లో విచారణ జరిపిన సీజే ధర్మాసనం.. సీట్ల భర్తీ యథాతథంగా కొనసాగించుకోవచ్చునంది. అయితే సీట్ల భర్తీ మాత్రం తాము వెలువరించే తుది తీర్పునకు లోబడి ఉంటుందని తేల్చి చెప్పింది. తాజాగా మంగళవారం మరోసారి ఈ వ్యాజ్యంపై సీజే జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ధర్మాసనం విచారణ జరిపింది. ఈ సందర్భంగా పిటిషనర్ల తరఫు న్యాయవాది ఠాకూర్ యాదవ్ వాదనలు వినిపిస్తూ.. అధికారంలోకి వస్తే సెల్ఫ్ ఫైనాన్స్ కోటాపై విధానపరమైన నిర్ణయం తీసుకుంటామని ఎన్నికల సందర్భంగా టీడీపీ కూటమి హామీ ఇచ్చిందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఏం చేస్తుందో తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది ప్రణతి జోక్యం చేసుకుంటూ.. ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకోవడానికి సమయం పడుతుందని, విచారణను సుదీర్ఘ కాలానికి వాయిదా వేయాలని కోరారు. పిటిషనర్ల న్యాయవాది జోక్యం చేసుకుంటూ.. ఈ నెల 15 నుంచి కౌన్సెలింగ్ మొదలయ్యే అవకాశం ఉందని, వీలైనంత త్వరగా విచారణ చేపట్టాలని ధర్మాసనాన్ని కోరారు. ఆయన అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. ప్రణతి చెప్పిన వివరాలను నమోదు చేసి తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

భారీగా కలెక్టర్ల బదిలీ

- 13 జిల్లాలకు కొత్త కలెక్టర్లు
- విశాఖ కలెక్టర్‌గా అదనపు ప్రధాన ఎన్నికల అధికారి హరేంధిరప్రసాద్
- సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పలు జిల్లాల కలెక్టర్లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) నీరబ్‌కుమార్ ప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. నంద్యాల జిల్లా కలెక్టర్ కె.శ్రీనివాసులను, వైఎస్సార్ జిల్లా కలెక్టర్ విజయ రామరాజును, అన్నమయ్య జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్, నెల్లూరు కలెక్టర్ హరినారాయణన్, పల్నాడు కలెక్టర్ బాలాజీరావు, అంబేడ్కర్ కోనసీమ కలెక్టర్ హిమాన్షు శుక్లా, అనకాపల్లి కలెక్టర్ రవి సుభాష్, పార్వతీపురం మన్యం కలెక్టర్ నిశాంత్ కుమార్, శ్రీకాకుళం కలెక్టర్ మనజీర్ జిలానీలను ప్రభుత్వం బదిలీ చేసింది. 13 జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియమించింది. అదనపు ప్రధాన ఎన్నికల అధికారి ఎం.ఎన్.హరేంధిరప్రసాద్‌ను విశాఖపట్నం కలెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ బాధ్యతలను మరో అదనపు ప్రధాన ఎన్నికల అధికారి పి.కోటేశ్వరరావుకు అప్పగించాలని హరేంధిరప్రసాద్‌కు సూచించింది.

అధికారి	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
హరేంధిరప్రసాద్	అదనపు ప్రధాన ఎన్నికల అధికారి	విశాఖపట్నం జిల్లా కలెక్టర్
స్వప్నిల్ దినకర్	విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్	శ్రీకాకుళం జిల్లా కలెక్టర్
ఎ.శ్యామ్ ప్రసాద్	పల్నాడు జాయింట్ కలెక్టర్	పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్
కె.విజయ	సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్	అనకాపల్లి జిల్లా కలెక్టర్
రావిరాల మహేష్ కుమార్	సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి	అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్
పి.అరుణ్‌బాబు	శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్	పల్నాడు జిల్లా కలెక్టర్
ఒ.ఆనంద్	వాణిజ్య శాఖ జాయింట్ కమిషనర్	నెల్లూరు జిల్లా కలెక్టర్
ఎస్.వెంకటేశ్వర్	సెకండరీ హెల్త్ డైరెక్టర్	తిరుపతి జిల్లా కలెక్టర్
చామకూరి శ్రీధర్	బాపట్ల జాయింట్ కలెక్టర్	అన్నమయ్య జిల్లా కలెక్టర్
శివశంకర్ లతోటి	పోస్టింగ్ కోసం వెయిటింగ్	వైఎస్సార్ జిల్లా కలెక్టర్
టి.ఎస్.చేతన్	బేవరేజెస్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్	సత్యసాయి జిల్లా కలెక్టర్
రాజకుమారి	గుంటూరు జాయింట్ కలెక్టర్	నంద్యాల జిల్లా కలెక్టర్
జె.వెంకట మురళి	గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్	బాపట్ల జిల్లా కలెక్టర్

హోదా ఇస్తామన్నా.. 'ఇండియా'కు బాబు మద్దతివ్వలేదు


- వైఎస్సార్ విగ్రహాలను కూల్చడం సరికాదు: ఎన్.రఘువీరారెడ్డి



మడకశిర: 'ఏపీకి ప్రత్యేక హోదా కోసం కేంద్రంలో ఇండియా కూటమికి మద్దతివ్వాలని చంద్రబాబును కోరాం. కానీ ఆయన ఎన్డీఏకి మద్దతిచ్చారు' అని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) చెప్పారు. ఆయన మంగళవారం శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో మీడియాతో మాట్లాడారు. 'రాష్ట్రంలో వైఎస్సార్ విగ్రహాలను కూల్చడం సరికాదు. ఏకపక్షంగా ఒక పార్టీకి అధికారం కట్టబెట్టడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. ఏపీలో ఇదే పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి తీర్పులతో ప్రతిపక్ష సభ్యులు అసెంబ్లీకి వెళ్లే పరిస్థితి కూడా ఉండదు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు త్వరలో భేటీ అవుతున్నారని తెలిసింది. ఆ సమావేశంలోనైనా విభజన చట్టం మేరకు ఏపీకి రావాల్సిన హక్కులను సీఎం చంద్రబాబు సాధించాలి. అలాగే రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం కూడా చంద్రబాబు కృషి చేయాలి. టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చడం అంత సులువు కాదు' అని రఘువీరారెడ్డి చెప్పారు. కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌తో వైఎస్ జగన్ భేటీ అయినట్లు జరిగిన ప్రచారాన్ని ఆయన ఖండించారు. డీకేతో వైఎస్ జగన్ భేటీ కాలేదని స్పష్టం చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రెండు ఊత కర్రల సాయంతో నడుస్తోందని, అవి ఎప్పుడు ఊడిపోతాయో తెలియదన్నారు. అందుకు ఆరు నెలలు కావచ్చు లేదా సంవత్సరమైనా పట్టవచ్చన్నారు. కేంద్రం ఇటీవల తెచ్చిన చట్టాల్లో కొత్తదనం ఏముందని రఘువీరా ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వానికి ప్రజాస్వామ్యం, చట్టాలు, రాజ్యాంగంపై గౌరవం లేదన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

'విశాఖ ఉక్కు' ఆస్తుల విక్రయంపై అభ్యంతరం ఉందా?

- ఉంటే కౌంటర్లు దాఖలు చేయాలని పిటిషనర్లకు ధర్మాసనం ఆదేశం
- తదుపరి విచారణ సోమవారానికి వాయిదా
- స్టేటస్ కో ఉత్తర్వులవల్ల రూ.243 కోట్లు నిలిచిపోయాయి
- అందువల్ల వాటిని సవరించాలని కోరిన యాజమాన్యం
- ధర్మాసనాన్ని అభ్యర్థించిన విశాఖ ఉక్కు యాజమాన్యం
- ఈ ప్రభుత్వం వచ్చాక పోలీసులు వేధిస్తున్నారని ధర్మాసనానికి పాల్ ఫిర్యాదు
- రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేయాలన్న హైకోర్టు



సాక్షి, అమరావతి: కర్మాగార ఆర్థిక అవసరాల నిమిత్తం తమ సొంత ఆస్తులను విక్రయించుకునే హక్కు తమకుందని, గతంలో ఇచ్చిన స్టేటస్‌కో ఉత్తర్వులవల్ల తమ ఆస్తుల విక్రయ ప్రక్రియ నిలిచిపోయిందని, అందువల్ల ఆ ఉత్తర్వులను సవరించాలంటూ విశాఖ ఉక్కు యాజమాన్యం దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌పై అభ్యంతరం ఉన్న పిటిషనర్లు కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. ఈ కౌంటర్లు శుక్రవారం కల్లా దాఖలు చేయాలని స్పష్టంచేసింది. తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ జగడం సుమతి ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది.

ప్రైవేటీకరణపై వ్యాజ్యాలు..

విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ నిమిత్తం కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ మాజీ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఇదే అంశంపై ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్‌తో పాటు సువర్ణరాజు అనే వ్యక్తి కూడా వేర్వేరుగా పిల్‌లు దాఖలు చేశారు. అలాగే, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ, రేషన్ కార్డుదారులకు ఉద్యోగాలిస్తామన్న గత హామీ మేరకు ఉద్యోగాలిచ్చేలా ఆదేశాలివ్వాలంటూ కూడా పలువురు వ్యక్తులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలన్నింటిపై జస్టిస్ దుర్గాప్రసాదరావు నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరుపుతూ వస్తోంది. గతవారం ఈ వ్యాజ్యాలు విచారణకు రాగా, విశాఖ యాజమాన్యం తరఫు సీనియర్ న్యాయవాది డబ్ల్యూబీ శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. విశాఖ ఉక్కు కర్మాగారం కోసం తాము సొంతగా ఏపీఐఐసీ, హౌసింగ్ బోర్డు నుంచి భూములు కొన్నామని, ఇలా తాము కొనుగోలు చేసిన 24.99 ఎకరాల భూమినే అమ్ముకుంటున్నామని తెలిపారు. అయితే, హైకోర్టు ఇచ్చిన స్టేటస్‌కో ఉత్తర్వులవల్ల భూముల విక్రయం ఆగిపోయిందన్నారు. అందువల్ల ఈ ఉత్తర్వులను సవరించాలని కోరారు. దీనిపై స్పందించిన ధర్మాసనం.. యాజమాన్యం స్వీయ ఆస్తుల విక్రయంపై అభ్యంతరం ఉన్న పిటిషనర్లను కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించిన విషయం తెలిసిందే.

ఆ ఉత్తర్వులతో రూ.243 కోట్లు నిలిచిపోయాయి..

తాజాగా.. ఈ వ్యాజ్యాలు మంగళవారం మరోసారి విచారణకు వచ్చాయి. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది డబ్ల్యూబీ శ్రీనివాస్ తమ అనుబంధ పిటిషన్ గురించి ప్రస్తావించారు. అత్యవసర విచారణ జరపాల్సిన అవసరం ఉందన్నారు. ఆస్తుల విక్రయాల ద్వారా రూ.243 కోట్లు రావాల్సి ఉందని.. స్టేటస్‌కో ఉత్తర్వులవల్ల ఆ డబ్బు నిలిచిపోయిందన్నారు. దీంతో ధర్మాసనం స్పందిస్తూ.. కౌంటర్లు వేయని వాళ్లు శుక్రవారంకల్లా దాఖలు చేయాలని మరోసారి ఆదేశించి తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది.

పోలీసులు ఇబ్బంది పెడుతున్నారు : కేఏ పాల్

తనను కోర్టులోకి, కోర్టు హాలులోకి రాకుండా పోలీసులు అడ్డుకుంటున్నారని.. కొత్త ప్రభుత్వం వచ్చాకే ఇలా చేస్తున్నారని కేఏ పాల్ ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తే తనను అడ్డుకుంటున్న విషయం తెలుస్తుందన్నారు. దీంతో ధర్మాసనం ఒకింత తీవ్రంగా స్పందిస్తూ, ఎవరా పోలీసులు అంటూ ఆరా తీసి, అలా అయితే పోలీసులపై హైకోర్టు రిజిస్ట్రార్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలని పాల్‌కు సన్యాయస్థానం సూచించింది. తాము కూడా చర్యలకు ఆదేశాలిస్తామని చెప్పింది. ఒకవేళ మీరు చెబుతున్నది అబద్ధమని తేలితే చర్యలకు సిద్ధంగా ఉండాలని పాల్‌కు ధర్మాసనం తేల్చిచెప్పింది.

హిందువులందరికీ రాహుల్ క్షమాపణ చెప్పాలి

కేంద్ర మంత్రి శ్రీనివాస్ వర్మ, బీజేపీ ఏపీ అధ్యక్షురాలు పురందేశ్వరి

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలోని హిందువులందరికీ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ బహిరంగ క్షమాపణ చెప్పాలని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ, ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి డిమాండ్ చేశారు. లోక్‌సభలో రాహుల్‌గాంధీ హిందూ సమాజం పట్ల చేసిన వ్యాఖ్యలు దేశంలోని హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా ఉన్నాయని మండిపడ్డారు. ఈ మేరకు మంగళవారం వీరు వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. ప్రతిపక్ష నేతగా లోక్‌సభలో ఇలాంటి వ్యాఖ్యలు చేయటం సరికాదన్నారు. 1975లో దేశవ్యాప్తంగా ఎమర్జెన్సీ విధించి రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసి, వేలాది మంది సిక్కులను ఊచ కోత కోసిన వారు పార్లమెంట్‌లో నీతులు పలకడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ హిందువులపై చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ఉపసంహరించుకుంటున్నా

- సెషన్స్ కోర్టుకు వెళ్లి తేల్చుకుంటా
- హైకోర్టుకు నివేదించిన వాసుదేవరెడ్డి
- అనుమతి ఇచ్చిన న్యాయమూర్తి

సాక్షి, అమరావతి: ఏపీ రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎస్‌బీసీఎల్)కు చెందిన ఫైళ్లు, కంప్యూటర్ పరికరాలు, ఇతర డాక్యుమెంట్లను తరలించారంటూ సీఐడీ నమోదు చేసిన కేసులో తనకు ముందుస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ ఆ సంస్థ మాజీ ఎండీ డి.వాసుదేవరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. ముందస్తు బెయిల్ కోసం దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను ఉపసంహరించుకుని, సెషన్స్ కోర్టును ఆశ్రయించేందుకు అనుమతించాలని వాసుదేవరెడ్డి న్యాయవాది మంగళవారం హైకోర్టును కోరారు. పిటిషనర్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేసిన తరువాత బెయిల్ రాకుండా ఉండేందుకు వీలుగా మరిన్ని సెక్షన్లు జతచేశారని తెలిపారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు.. ముందస్తు బెయిల్ పిటిషన్ ఉపసంహరణకు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బొప్పన వరాహ లక్ష్మీనరసింహ చక్రవర్తి ఉత్తర్వులు జారీచేశారు. ఏపీఎస్‌బీసీఎల్ కార్యాలయం నుంచి ఆ సంస్థకు చెందిన ఫైళ్లు, కంప్యూటర్ పరికరాలు, ఇతర కీలకపత్రాలను వాసుదేవరెడ్డి తీసుకెళ్లారని, ఇవన్నీ ఆయన తన కారులో తరలిస్తుండగా చూశానంటూ కంచికచర్లకు చెందిన గద్దె శివకృష్ణ సీఐడీకి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా సీఐడీ అధికారులు ఈ నెల 6న వాసుదేవరెడ్డిపై కేసు నమోదు చేశారు. ఆధారాల ధ్వంసం, చోరీ, నేరపూరిత కుట్ర తదితర సెక్షన్ల కింద కేసు పెట్టారు. అనంతరం హైదరాబాద్‌లోని ఆయన ఇంట్లో సోదాలు చేశారు. ఈ నేపథ్యంలో సీఐడీ తనపై నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ వాసుదేవరెడ్డి గత నెల 11న హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.

రమణదీక్షితులుకు హైకోర్టులో ఊరట

- వాయిస్ శాంపిల్ ఇవ్వాలన్న తిరుపతి కోర్టు ఉత్తర్వుల అమలును నిలిపేసిన హైకోర్టు
- విచారణ 15కి వాయిదా

సాక్షి, అమరావతి: తిరుమల, తిరుపతి దేవస్థానాల (టీటీడీ) పూర్వ ప్రధాన అర్చకులు ఎ.వి.రమణదీక్షితులుకు హైకోర్టులో ఊరట లభించింది. సోషల్ మీడియాలో శ్రీవారి ఆలయ ప్రతిష్టను, టీటీడీ అధికారుల ప్రతిష్టను దెబ్బతీశారంటూ నమోదైన కేసులో వాయిస్ శాంపిల్ ఇవ్వాలని రమణదీక్షితులును ఆదేశిస్తూ తిరుపతి కోర్టు ఇటీవల ఇచ్చిన ఉత్తర్వుల అమలును హైకోర్టు నిలిపేసింది. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించింది. విచారణను ఈ నెల 15కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్ ఉత్తర్వులు జారీచేశారు. రమణదీక్షితులు సోషల్ మీడియాలో శ్రీవారి ఆలయంతో పాటు టీటీడీ అధికారుల ప్రతిష్టను దెబ్బతీశారంటూ టీటీడీ ఐటీ శాఖ జీఎం సందీప్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తిరుపతి పోలీసులు కేసు నమోదు చేశారు. సోషల్ మీడియాలో ఉన్న రమణదీక్షితులు గొంతును గుర్తించేందుకు వీలుగా ఆయన వాయిస్ శాంపిల్‌ను పరీక్షకు పంపేలా ఆదేశాలివ్వాలంటూ పోలీసులు తిరుపతి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తిరుపతి కోర్టు ఈ పిటిషన్‌ను అనుమతిస్తూ మంగళగిరి ఫోరెన్సిక్ ల్యాబ్‌లో వాయిస్ శాంపిల్ ఇవ్వాలని రమణదీక్షితులను ఆదేశించింది. దీన్ని సవాలు చేస్తూ రమణదీక్షితులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆయన న్యాయవాది శీతిరాజు శ్యాంసుందర్‌రావు వాదనలు వినిపిస్తూ.. తిరుపతి కోర్టు పరిధిదాటి ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. తనకు వ్యతిరేకంగా తానే సాక్ష్యం ఇచ్చేలా తిరుపతి కోర్టు ఉత్తర్వులున్నాయని చెప్పారు. ఇందుకు నిబంధనలు అంగీకరించవన్నారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ కృపాసాగర్ తిరుపతి కోర్టు ఉత్తర్వుల అమలును నిలిపేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

మోదీ నైతికంగా ఓడి.. 'సాంకేతికం'గా గెలిచారు

సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ

మురళీనగర్(విశాఖ ఉత్తర): సార్వత్రిక ఎన్నికల్లో 400కి పైగా స్థానాల్లో విజయం సాధిస్తామని గొప్పలకు పోయిన ప్రధాని నరేంద్ర మోదీ నైతికంగా ఓడిపోయి సాంకేతికంగా గెలిచారని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. మురళీనగర్‌లోని ఒక ఫంక్షన్ హాల్‌లో సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో బీజేపీ పట్ల ప్రజల్లో అసంతృప్తి వెల్లడైందని.. రామ మందిరాన్ని నిర్మించిన అయోధ్యలో బీజేపీ ఓడిపోయిందని చెప్పారు. బీజేపీకి ఎన్నికల్లో ఓట్లు, సీట్లు తగ్గాయని.. తెలుగుదేశం, జేడీయూలతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని చెప్పారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమాన్ని, అభివృద్ధిని సమన్వయం చేస్తూ ముందుకు వెళ్లాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జె.వి.సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

ఆల్మట్టికి పెరుగుతున్న వరద



జలాశయంలో పోటు జలాల పరవళ్లు

రాయచూరు రూరల్: గత కొన్ని రోజుల నుంచి మహారాష్ట్రలోని నదీ పరివాహక ప్రాంతాల్లో వానలు కురుస్తుండడంతో కొద్దిమేర కృష్ణా నదిలోకి వరద నీరు వస్తున్నాయి. ఉత్తర కర్ణాటకలోని బెళగావి, బాగల్‌కోటె, విజయపుర, కళ్యాణ కర్ణాటకలోని కలబుర్గి, యాదగిరి, రాయచూరు జిల్లాలకు గాను బాగల్‌కోటె జిల్లా బనహట్టి రబకవి వద్ద కృష్ణా నదిలో వరద ఊపందుకుంది. దీంతో ఆల్మట్టి జలాశయంలోకి వరద చేరుతోంది. ప్రస్తుతం జలాశయంలో 519.60 మీటర్లకు గాను 511.05 మీటర్లకు నీటిమట్టం చేరింది.

కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

రాయచూరు రూరల్: కార్మికుల ఐక్యత వర్ధిల్లాలని ఏఐఐఈఏ ప్రధాన కార్యదర్శి రవి అన్నారు. ఎల్‌ఐసీ డివిజన్ కార్యాలయంలో జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజా సంఘాలన్నీ ఏకతాటిపై నడిచి ముందుకు రావాలన్నారు. శరణేగౌడ, శ్రీధర్‌లున్నారు.

హళకట్టి ఆదర్శాలు అనుసరణీయం



చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన అతిథులు

రాయచూరు రూరల్: నేటి ఆధునిక సమాజంలో వచన సాహిత్యానికి హళకట్టి అందించిన సేవలు, ఆయన ఆశయాలు, ఆదర్శాలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని సీనియర్ కవి వీర హనుమాన్ అన్నారు. మంగళవారం సిద్ధరామ జంబలదిన్ని రంగ మందిరంలో వచన సాహితీవేత్త హళకట్టి జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి మాట్లాడారు. ఏఎస్పీ శివకుమార్, ఏసీ మెహబూబి, దానమ్మ, వెంకటేష్, ఈరేష్ నాయక్, బాబు భండారిగల్‌లున్నారు.

ఆ ఎద్దు ధర రూ.18 లక్షలు



భారీ ధర పలికిన ఎద్దు ఇదే

సాక్షి,బళ్లారి: ఉత్తర కర్ణాటకలో పేరుగాంచిన ఎద్దుల పోటీల్లో విజయం సాధించిన ఎద్దు విలువ లక్ష కాదు, రెండు లక్షలు కాదు, ఏకంగా రూ.18 లక్షలకు అమ్ముడు పోయింది. విజయపుర జిల్లా బబలేశ్వర తాలూకా బబలాది గ్రామానికి చెందిన రామనగౌడకు చెందిన ఎద్దును పలు జిల్లాల్లో ఎద్దులు పోటీలకు తీసుకెళ్లి అందరినీ ఆకట్టుకునేలా చేశారు. గత కొన్నేళ్లుగా ఆ ఎద్దును పోటీలకు మాత్రమే తీసుకెళుతూ బల వర్ధకమైన ఆహారం అందిస్తూ ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ఇప్పటి వరకు ఈ ఎద్దు పలు పోటీల్లో రూ.40 లక్షల నగదు, దాదాపు అర కేజీ బంగారం, నాలుగు ద్విచక్ర వాహనాలను కూడా గెలుచుకుని రికార్డు సృష్టించింది. దీంతో ఎద్దు విలువ భారీగా పెరిగిపోయింది. ఎద్దును అమ్మకానికి ఉంచడంతో బెళగావి జిల్లా రాయబాగ తాలూకా హిట్నాళ గ్రామానికి చెందిన రైతు సదాశివ ముందుకు వచ్చి ఏకంగా రూ.18 లక్షల నగదు ఇచ్చి కొనుగోలు చేశారు.

భూ బాధితుల ధర్నా



ఆందోళన చేస్తున్న బాధితులు

రాయచూరు రూరల్: తాలూకాలోని సింగనోడి వద్ద ప్రభుత్వం ప్రారంభించిన ఐఐఐటీ కోసం భూములు కోల్పోయిన భూ బాధితులు మంగళవారం కళాశాల వద్ద ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ భూములు కోల్పోయిన దళిత కుటుంబాలకు ప్రత్యామ్నాయ స్థలంలో సారవంతమైన భూమి కేటాయించాలన్నారు. ధర్నాలో సుమారు 70 మంది రైతులు పాల్గొన్నారు.

నన్ను సీఎం చేస్తే రాష్ట్రాభివృద్ధి

- ఓ యువకుడి వీడియో వైరల్

సాక్షి,బళ్లారి: అతను మంత్రి కాదు, ఎమ్మెల్యే కూడా కాదు, రాజకీయంలో ఆరితేరిన వ్యక్తి అంతకన్నా కాదు. తనను సీఎం చేస్తే రాష్ట్రం బాగుపడుతుందని ఓ వీడియో చేసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో వైరలైంది. రాష్ట్రంలో ఇటీవల సీఎం మార్పుపై చర్చ జరుగుతున్నందున డీకేశిని సీఎం చేయడం కన్నా తనను సీఎం చేయాలని విజయపుర జిల్లా బసవనబాగేవాడిలోని మూల నందీశ్వర ఆలయ గర్భగుడిలో శివలింగం ఎదురుగా నిలబడి సతీష్ అనే యువకుడు శివలింగం సాక్షిగా చెబుతున్నా తనను సీఎం చేయకపోతే కష్టమన్నాడు. గతంలో బసవరాజ్ బొమ్మై సీఎంగా ఉన్నప్పుడు కూడా తాను ఇలానే చెప్పానని, తనను సీఎం చేయనందున బీజేపీ ప్రభుత్వం పతనమైందని, ప్రస్తుతం ఉన్న ప్రభుత్వానికి కూడా అదే జరుగుతుందని అన్నాడు.

ఊరించి.. ఉసూరనిపించి..



ఎద్దులతో పొలం దున్నుతున్న రైతన్నలు



ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న దృశ్యం



పొలంలో పేడ ఎరువు చల్లుతున్న దృశ్యం

- ముఖం చాటేస్తున్న వరుణ దేవుడు
- వర్షం కోసం రైతుల ఎదురుచూపులు

సాక్షి,బళ్లారి: గత ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల పెట్టిన పంటలకు పెట్టుబడులు కూడా దక్కక అప్పులు ఊబిలో కూరుకుపోయిన రైతన్నలు, ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లోనైనా గత ఏడాది నష్టపోయిన పంటలను పండించుకుందామని కోటి ఆశలతో పంటలు సాగు చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి, సకాలంలో దుక్కులు దున్నేందుకు వర్షాలు బాగా కురవడంతో జిల్లా వ్యాప్తంగా రైతులు విత్తన సాగుకు భూమి తల్లిని సిద్ధం చేశారు. జిల్లా వ్యాప్తంగా వర్షాధారిత, నీటిపారుదల సౌకర్యం కలిగిన భూములు దాదాపు ఐదు లక్షల ఎకరాలకు పైగానే ఉన్నాయి. ఇందులో తుంగభద్ర ఆయకట్టు కూడా విస్తారంగా ఉంది.

కేవలం 14 శాతం మాత్రమే విత్తన సాగు

జిల్లాలో బళ్లారి గ్రామీణ, కంప్లి, సిరుగుప్ప, సండూరు నియోజకవర్గాల పరిధిలో ఇప్పటి వరకు సండూరు, బళ్లారి, సిరుగుప్ప తాలూకాల్లో వర్షాధారిత భూముల్లో కేవలం 14 శాతం మాత్రమే విత్తన సాగు జరగడంతో రైతుల్లో ఆందోళన నెలకొంటోంది. వర్షాధారిత భూముల్లో ప్రధానంగా సాగు చేసే వేరుశెనగ, జొన్న, సజ్జ, మొక్కజొన్న తదితర పంటలకు సంబంధించి విత్తనాలను కూడా సిద్ధం చేసుకున్నారు. నీటి పారుదల వసతి కలిగిన భూముల్లో సాగు చేసే ప్రధాన పంటలైన వరి, మిర్చి, చెరుకు, పత్తి తదితర పంటలకు సాగు చేసేందుకు అన్ని విధాలుగా విత్తనాలతో పాటు ఎరువులను సిద్ధం చేసుకున్నారు.

తుంగభద్రమ్మపైనే కోటి ఆశలు

తుంగభద్ర ఆయకట్టులో సాగు చేసే రైతన్నలు ముందుగా వరినారు పోసుకున్నా కాలువకు నీరు వదిలే దానిపై ఆయకట్టు రైతుల భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. గత ఏడాది ఇదే సమయానికి తుంగభద్ర డ్యాంలో కేవలం 3.5 టీఎంసీల నీరు మాత్రమే ఉండేది. ప్రస్తుతం దాదాపు 8 టీఎంసీలకు చేరినప్పటికీ ఆశించిన మేర నీరు రాకపోవడంతో ఆయకట్టు రైతులు కూడా డ్యాంలోకి ఎప్పుడెప్పుడు పూర్తిస్థాయిలో నీరు నిండి సకాలంలో కాలువలకు నీరు విడుదల చేస్తారా? అని ఎదురు చూస్తున్నారు. బోరు బావుల సదుపాయం ఉన్న రైతులు వరినారు పోసుకుని రైతులకు విక్రయించేందుకు సిద్ధం చేసుకుంటున్నారు. నీటిపారుదల వసతి కలిగిన భూములు ఉన్న రైతుల పరిస్థితి ఒకలా ఉంటే, వర్షాధారిత భూములు ఉన్న రైతులకు మరింత ఆందోళన మొదలైంది.

అదును దాటుతోందని రైతుల్లో ఆందోళన

సాధారణంగా జూలై మొదటి వారంలోపు 60 శాతం పైగా విత్తన సాగును అధికారులు లక్ష్యంగా పెట్టుకుంటారు. జూలై రెండో వారంలోపు వర్షాధారిత భూముల్లో పంటలు సాగు చేస్తే అదునులో సాగు చేసినట్లని, లేకుంటే పంటలు బాగా పండేందుకు సమస్యలు తలెత్తుతాయని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. ఈనేపథ్యంలో ఖరీఫ్ అదును దాటుతున్నా జిల్లా వ్యాప్తంగా విత్తనసాగు ఊపందుకోకపోవడంతో రైతులు వరుణుడి కోసం ఎదురుచూస్తున్నారు. ప్రతి రోజు మేఘాలు ఊరించి ఉసూరుమనిపిస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మేఘాలు కమ్ముకుంటున్నాయే కాని పదునైన వర్షం కురవనందున సకాలంలో పంటల సాగుకు వీలు కావడం లేదని రైతులు వాపోతున్నారు.

మిరప రైతులకు పరామర్శ

- అండంగా ఉంటాం, ధైర్యంగా ఉండాలని బీజేపీ రైతు మోర్చా నేతల హితవు



విమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రైతులను పరామర్శిస్తున్న బీజేపీ రైతు మోర్చా ప్రముఖులు

బళ్లారి రూరల్: తమ మిరప పంటను కొన్న కంపెనీ నుంచి సొమ్ము రాకపోవడంతో ఆదివారం సోమసముద్రకు చెందిన నలుగురు రైతులు పురుగుల మందు తాగి అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఈ విషయాన్ని తెలుసుకొన్న బీజేపీ రైతు మోర్చా జిల్లా అధ్యక్షుడు గణపాల ఐనాథరెడ్డి, వ్యాపార ప్రకోష్ట సంచాలకుడు శ్రీనివాసరెడ్డి, కంప్లి బీజేపీ ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, బసవనగౌడ, శ్యాంసుందర్, కొర్లగుంది శ్రీనివాసరెడ్డి ఆసుపత్రికి వెళ్లి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన సోమసముద్ర రైతులను పరామర్శించారు. బాధిత రైతుల కష్టనష్టాలను అడిగి తెలుసుకొన్నారు. మిర్చి కొన్న కంపెనీ నుంచి రుద్రేష్‌కు రూ.90 లక్షలు, ఎణ్ణే శేఖరప్పకు రూ.52 లక్షలు, హనుమంతకు రూ.3.60 లక్షలతో కలిపి మొత్తం రైతులందరికీ సుమారు రూ.కోటిన్నర రావాల్సి ఉందని తెలిపారు. 16 నెలలుగా ఇవ్వాల్సిన డబ్బు వాయిదా వేస్తుండటంతో విసిగి వేసారి ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలిపారు. రైతుల కష్టాలు విన్న బీజేపీ రైతు మోర్చా ప్రముఖులు మీకు అండగా మేముంటాం, కంపెనీ నుంచి మీకు రావాల్సిన డబ్బు వచ్చేలా గట్టి ప్రయత్నం చేస్తామని భరోసా ఇచ్చారు. ఆత్మహత్య వల్ల మీ కుటుంబ సభ్యులు వీధి పాలవుతారని, ధైర్యంగా ఉండాలని నచ్చజెప్పారు.

ప్రజా సమస్యలు సత్వరం తీర్చండి

హుబ్లీ: సామాన్య ప్రజలను వేధించకుండా వారి సమస్యలపై తగు రీతిలో స్పందించి సకాలంలో పనులు పూర్తి చేయాలని హుబ్లీ ధార్వాడ పాలికె మేయర్ రామప్ప బడిగేర అధికారులకు సూచించారు. కమిషనర్ సభాంగణంలో అన్ని విభాగాల ముఖ్యస్తులు, జోనల్ కమిషనర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేకించి ఇ–సొత్తు గురించి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీని పరిష్కారానికి వేగంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సిబ్బంది కొరత కారణంగా పనులను పూర్తి చేయడంలో జాప్యం జరుగుతోందని అధికారులు సంజాయిషీ ఇవ్వగా కాంట్రాక్ట్ పద్ధతిలో సిబ్బందిని నియమించుకోవాలని మేయర్ సూచించారు. అంతటా వ్యాపించిన డెంగీ కేసుల నియంత్రణకు యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలన్నారు. వ్యాధిపై ప్రజలను జాగృతం చేయడానికి అన్ని మార్గాలను అనుసరించాలన్నారు. ప్రతి విభాగం అధికారి ఒక వారంలో పూర్తి నివేదిక తయారు చేసి అందించాలన్నారు. వచ్చే సమావేశంలో ప్రగతి సమీక్ష చేసి తగిన నిర్ణయం తీసుకుందామన్నారు. కాగా సామాన్యులు చేసే ఫిర్యాదుల నేపథ్యంలో ఆయా కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసేందుకు మేయర్‌తో పాటు పాలికె విపక్ష నేత వీరన్న సవడి తీర్మానం తీసుకున్నారు. సమవేశంలో పాలికె కమిషనర్ డాక్టర్ ఈశ్వర్ ఉళ్లాగడ్డి, అభివృద్ధి కమిషనర్ ఈ.తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

14న ఉప్పార వధూవరుల సమావేశం

హుబ్లీ: కర్ణాటక రాష్ట్ర ఉప్పార మహాసభ, విశ్వభగీరథ ట్రస్ట్ పరివార్ ఆధ్వర్యంలో దేశ్‌పాండే నగర్‌లోని సవాయి గంధర్వ సభాభవనంలో ఈ నెల 14న జాతీయ స్థాయి ఉప్పార వధూవరుల సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు విష్ణు రాథోర్ తెలిపారు. నగరంలో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. ఆ రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సమావేశం జరుగుతుందన్నారు. రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల్లో నివసిస్తున్న ఉప్పార సమాజ బాంధవులు కార్యక్రమంలో పాల్గొనవచ్చన్నారు. గత 5 ఏళ్ల నుంచి నిరంతరంగా ఈ సమావేశాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమాన్ని జాతీయ ఉప్పార సంఘం అధ్యక్షులు శ్రీరాములు సాగర ప్రారంభిస్తారన్నారు. ఆసక్తిగల వధూవరులు, తల్లిదండ్రులు, సమావేశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9449886150ను సంప్రదించాలని ఆయన కోరారు. ట్రస్ట్ చైర్మన్ ఈశ్వర శిరకోళ, మారుతీ, సుధీర్, డాక్టర్ ప్రశాంత్‌కుమార్, నాగరాజ్ పూజార్ పాల్గొన్నారు.

గర్భకోశ చికిత్సలతో మహిళలకు అనారోగ్యం

- వైద్యుల నిర్లక్ష్యంతో మహిళ మృతి
- జిల్లాధికారి కార్యాలయం ముట్టడి

సాక్షి,బళ్లారి: ఇటీవల గర్భకోశ ఆపరేషన్లతో పలువురు మహిళలకు అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, వైద్యుల నిర్లక్ష్యంతో ఇలాంటి సమస్యలు ఏర్పడుతున్నాయని, ఒక మహిళ కూడా గర్భకోశ ఆపరేషన్ విఫలం కావడంతో మృతి చెందిందని నిరసిస్తూ మహిళలు ఆందోళన చేపట్టారు. మంగళవారం హావేరి జిల్లా రాణిబెన్నూరు తాలూకాకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో చేరి జిల్లాధికారి కార్యాలయాన్ని ముట్టడించారు. అక్కడ జరిగే అధికారుల సమావేశానికి వైద్య ఆరోగ్య శాఖా మంత్రి విచ్చేస్తున్నారని తెలిసి మహిళలు నిరసన వ్యక్తం చేశారు. మహిళలు జిల్లాధికారి కార్యాలయానికి చేరుకుని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. హావేరి జిల్లాలో వందలాది మంది మహిళలు గర్భకోశ ఆపరేషన్లు చేయించుకుని అనారోగ్య సమస్యల బారిన పడ్డారన్నారు. పనులు చేసేందుకు కూడా చేత కావడం లేదని, చేతులు, కాళ్లు పట్టుకుని పోతున్నాయని, వైద్య పరీక్షలు చేయించుకుంటే గర్భకోశ ఆపరేషన్లు సరిగా చేయక పోవడంతోనే అనారోగ్య సమస్యలు వస్తున్నాయని వైద్యులు తెలియజేస్తున్నారని, తమకు న్యాయం చేయకపోతే పోరాటం చేస్తామని, పనులు చేయడం చేతకాకపోవడంతో జీవనం సాగించేందుకు కష్టతరంగా ఉందన్నారు. రెండు రోజుల క్రితం ఒక మహిళ కూడా మృతి చెందిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేసే వైద్యులు నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం వల్ల ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని, న్యాయం చేయకపోతే, పరిహారం ఇవ్వకపోతే తాము అర్ధనగ్న ప్రదర్శన కూడా చేస్తామని, అప్పుడైనా పాలకులు, అధికారులకు బుద్ధి వస్తుందంటూ మహిళలు ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు.

మౌలిక సదుపాయాల కల్పనలో రాజీ లేదు

సాక్షి,బళ్లారి: నగరంలో మౌలిక సదుపాయాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించబోనని మేయర్ ముల్లంగి నందీష్ పేర్కొన్నారు. మేయర్‌గా బాధ్యతలు తీసుకున్న తర్వాత ఆయన మంగళవారం నగరంలోని మహానగర పాలికె సభాంగణంలో ఏర్పాటు చేసిన తొలి ప్రగతి పరిశీలన సమావేశంలో అధికారులు, కార్పొరేటర్లనుద్దేశించి మాట్లాడారు. నగరంలోని పలు కాలనీల్లో డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉందని, మంచినీరు సక్రమంగా సరఫరా చేయడం లేదని, నిత్యం ఏదో ఒక కాలనీలో జనం పడుతున్న ఇబ్బందులు తన దృష్టికి వస్తున్నాయన్నారు. సంబంధిత అధికారులు, సిబ్బంది ఎందుకు సక్రమంగా పని చేయడం లేదని ప్రశ్నించారు. సమస్యలు ఉన్నప్పుడు ఎందుకు తమ దృష్టికి తేవడం లేదని మండిపడ్డారు. తూతూమంత్రంగా పనిచేస్తే సరిపోదని, బాధ్యతాయుతంగా పని చేయాలని సూచించారు. వీధి దీపాలు పని చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలు కుప్పలు, తెప్పలుగా ఉన్నాయని, అధికారులు మాత్రం వాటిని ఎలా పరిష్కరించాలో ఆలోచించడం లేదన్నారు. ప్రజలకు న్యాయం చేయాలంటే అందరం కలిసికట్టుగా పని చేస్తేనే సాధ్యం అవుతుందన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ఉపమేయర్ డీ.సుకుం, స్థాయి సమితి అధ్యక్షులు, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

కొనుగోళ్ల నిలిపివేతపై రాస్తారోకో

రాయచూరు రూరల్: జిల్లాలోని సింధనూరులో వర్తకులు ఆకస్మికంగా తమ వ్యాపారాలు బంద్ చేసి కొనుగోళ్లను స్తంభింప చేయడాన్ని నిరసిస్తూ రైతులు రాస్తారోకో చేపట్టిన ఘటన సోమవారం జరిగింది. సింధనూరు ఏపీఎంసీలో వరి ధాన్యం బస్తాలు చోరీకి గురవుతున్న అంశంపై బళ్లారి జిల్లా సిరుగుప్ప తాలూకా తెక్కలకోటె పోలీసులు విచారణకు వచ్చారు. ఏడాది క్రితం తెక్కలకోటె వ్యక్తి సింధనూరు ఏపీఎంసీలో ధాన్యం విక్రయించాడు. ఈ విషయంలో రైతులు, వ్యాపారుల మధ్య గందరగోళం నెలకొంది. పోలీసులు జోక్యం చేసుకొని శుక్రవారం లోపు సమస్యను పరిష్కరించుకోవాలని నచ్చచెప్పారు.

రక్తదానంపై జాగృతి అవసరం

రాయచూరు రూరల్: రక్తదానంపై జన జాగృతి అవసరమని సోమవారపేట మఠాధిపతి అభినవ రాచోటి శివాచార్యులు పేర్కొన్నారు. మంగళవారం వీరశైవ కళ్యాణ మంటపంలో భారతీయ రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాన దినోత్సవంలో భాగంగా రక్తనిధి కేంద్రాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. రక్తదానం చేయడం వల్ల కలిగే మేలు గురించి వివరించారు. అత్యవసర సమయంలో యువత రక్తం దానం చేయడం వల్ల మరింత ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. ఎలాంటి ఫలాపేక్ష లేకుండా రక్తదానం చేయాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ బసనగౌడ, శరణ భూపాల్ నాడగౌడ, దరూరు బసవరాజ్, వీరనగౌడ, కేశవరెడ్డిలున్నారు.

క–క అభివృద్ధికి నిధుల కేటాయింపు

- రూ.5 వేల కోట్లతో కార్యాచరణకు ప్రతిపాదనలు

రాయచూరు రూరల్: కళ్యాణ కర్ణాటక(క–క) ఉత్తమ అభివృద్ధికి రూ.5 వేల కోట్ల నిధులు కేటాయించామని, వారం రోజుల్లో కార్యాచరణ పథకానికి శాసన సభ్యులు ప్రతిపాదనలు సమర్పించాలని కళ్యాణ కర్ణాటక అభివృద్ధి మండలి అధ్యక్షుడు అజయ్ సింగ్ పేర్కొన్నారు. సోమవారం కళ్యాణ కర్ణాటక అభివృద్ధి మండలి కార్యాలయంలో జరిగిన సమావేశంలో బీదర్, కలబుర్గి, యాదగిరి, రాయచూరు, కొప్పళ, బళ్లారి, విజయ నగర జిల్లాల ప్రజా ప్రతినిధులు మాట్లాడారు. 2024–25వ ఆర్థిక సంవత్సరంలో శాసన సభ్యులు విద్య, ఆరోగ్యం, ఉపాధి కల్పన, గ్రామీణ రహదార్లు, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించి త్వరితగతిన ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. సమావేశంలో మంత్రులు శరణ ప్రకాష్ పాటిల్, శరణ బసప్ప దర్శనాపూర్, ప్రియాంక్ ఖర్గే, శివరాజ్ తంగడిగి, ముఖ్యమంత్రి ఆర్థిక సలహాదారుడు బసవరాజ రాయరెడ్డి, శాసన సభ్యులు హంపనగౌడ, రాఘవేంద్ర హిట్నాళ్, గవియప్ప, తిప్పణ్ణ, బీ.ఆర్.పాటిల్, అధికారులు మనోజ్ జైన్, సుందరేష్, ఆకాష్, చంద్రశేఖరయ్య, ప్రమీల, ప్రవీణ ప్రియా, విజయ్ కుమార్, సుజాత, దయానంద్‌లున్నారు.

రాఘవ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం



బళ్లారి రాఘవ(ఫైల్)

బళ్లారిటౌన్: బళ్లారి రాఘవ 144వ జయంతి సందర్భంగా రాఘవ మెమోరియల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాఘవ అవార్డులు–2024కు దరఖాస్తులను ఆహ్వానించారు. గత కొన్నేళ్లుగా కన్నడ, తెలుగు రంగస్థల కళాకారులకు రాష్ట్ర, జిల్లా స్థాయి అవార్డులను అందజేస్తున్న క్రమంలో ఈసారి కూడా అందజేయనున్నారు. నాటక రంగంలో సుమారు 20 ఏళ్లుగా సేవలు అందించిన కళాకారులు తమ దరఖాస్తును ఈ నెల 15లోగా సంస్థ అధ్యక్షుడు లేదా కార్యదర్శికి తగిన ఆధారాలతో దరఖాస్తు సమర్పించవచ్చని అధ్యక్షుడు కే.కోటేశ్వరరావు, గౌరవ కార్యదర్శి ఎన్.ప్రకాష్ తెలిపారు. కాగా ఆగస్ట్ 2, 3 తేదీల్లో బళ్లారి రాఘవ జయంతి ఉత్సవాలు జరుగనున్నట్లు వారు ఓ ప్రకటనలో తెలిపారు.

బైక్ దొంగల పట్టివేత

హుబ్లీ: హావేరి జిల్లా రాణిబెన్నూరులో పెరుగుతున్న చోరీ కేసులను రాణిబెన్నూరు టౌన్ పోలీసులు ఎట్టకేలకు ఛేదించారు. హిరేకెరూరు ఎలక్ట్రిషియన్ మహమూద్ హజరత్ అలీ ముగళగేరి(28), వెల్డింగ్ పని చేసే హుబ్లీలోని తన్వీర్ అబ్దుల్ మునాఫ్ లక్ష్మేశ్వర(28), హిరేకెరూరులో గ్యారేజ్ పని చేసే ఖలందర్ సర్ఫరాజ్ పఠాన్(22) అరెస్ట్ అయిన నిందితులు. ఈ ముగ్గురు అంతర్ జిల్లా బైక్ దొంగలను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.23 లక్షల విలువ చేసే 29 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.

వీడిన చోరీ మిస్టరీ

- ఉద్యోగి, ఇద్దరు కార్మికుల అరెస్ట్
- రూ.10 లక్షల చోరీ సొత్తు స్వాధీనం

హుబ్లీ: ధార్వాడ తాలూకా బేలూరు పారిశ్రామిక వాడలోని టాటా ఇటాచీ కంపెనీలో జరిగిన చోరీ కేసు మిస్టరీని 10 రోజుల్లో పోలీసులు ఛేదించారు. ఆ మేరకు చోరీకి గురైన వస్తువులను జప్తు చేశారు. సదరు కంపెనీ నుంచి సుమారు రూ.10 లక్షల విలువ చేసే కొత్త టైర్లు, బ్యాటరీలు చోరీ కావడంపై గత నెల 21న ఎఫ్ఐఆర్ నమోదైంది. కేసు దర్యాప్తు చేపట్టిన గరగ పోలీసులు అదే కంపెనీలో ఉద్యోగి ఒకరు, ఇతర ఇద్దరు కార్మికులతో కలిసి ఈ చోరీ చేసినట్లుగా దర్యాప్తులో తేల్చారు. కాగా గరగ టౌన్ సీఐ సమీర్‌ముల్లా, ఎస్ఐ సిద్దరామప్ప, సిబ్బందిని ఎస్పీ డాక్టర్ గోపాల బ్యాకోడ్ అభినందించి రివార్డును ప్రకటించారు.

మురుగు కాలువలు నిర్మించండి

రాయచూరు రూరల్: షియాతలాబ్‌లో 80 అడుగుల రోడ్డు నిర్మాణానికి ముందుగా మురుగు కాలువలను నిర్మించాలని కరవే డిమాండ్ చేసింది. మంగళవారం కలెక్టరేట్ వద్ద చేపట్టిన ఆందోళనలో అధ్యక్షుడు ఖలీల్ మాట్లాడారు. రహదారి నిర్మాణం చేపట్టే ముందు మురుగు కాలువలను సత్వరం నిర్మించాలని కోరుతూ ఆయన కార్యకర్తలతో కలిసి జిల్లాధికారికి వినతిపత్రం సమర్పించారు.

రూ.4.23 లక్షల వంచన

హుబ్లీ: ఆయుర్వేద ఔషధాలను కొనుగోలు చేసిన బాపతు బకాయి పడిన డబ్బులను అడిగిన యోగేంద్ర అనే స్థానిక వ్యక్తిని ప్రాణాలు తీస్తామని బెదిరించిన ఘటన వెలుగు చూసింది. బకాయి పడిన రూ.4.23 లక్షల డబ్బులు చెల్లించకుండా వంచించినట్లు పంజాబ్‌కు చెందిన శ్రీరాజన్‌పై పాత హుబ్లీ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వివాహిత అనుమానాస్పద మృతి

- భర్తే చంపాడని ఆరోపణలు



నేత్ర మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు



మృతురాలు నేత్ర



నేత్ర (ఫైల్)

బొమ్మనహాళ్: రాయదుర్గం నియోజకవర్గం బొమ్మనహాళ్ మండలంలోని శ్రీరంగాపురం క్యాంపు గ్రామంలో ఓ మహిళ అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన మంగళవారం జరిగింది. పోలీసులు, మృతురాలి బంధువులు తెలిపిన వివరాల మేరకు... కర్ణాటకలోని చెళ్లకెర తాలూకా భోగనహళ్లికి చెందిన లక్ష్మీదేవమ్మ, తిప్పేస్వామి దంపతుల కుమార్తె నేత్ర (30)ను 2015లో శ్రీరంగాపురం క్యాంపునకు చెందిన టి.వెంకటేశులు అనే వ్యక్తికి ఇచ్చి ఘనంగా పెళ్లి చేశారు. వీరికి ఇద్దరు కొడుకులు మౌర్య, గోకుల్ ఉన్నారు. భార్యాభర్తలు తరచూ గొడవ పడుతుండేవారని, అతడు డబ్బు తేవాలని వేధించేవాడని, ఈక్రమంలో సోమవారం రాత్రి భార్యను కొట్టి చంపి ఆత్మహత్యగా చిత్రీకరించాడని మృతురాలి బంధువులు ఆరోపించారు. భర్తతో పాటు అత్త లక్ష్మీ, ఆడపడుచు గాయత్రిలు సతాయించేవారన్నారు. భర్తే కొట్టి చంపేసి ఆత్మహత్య చేసుకున్నట్లు తమకు సమాచారం ఇచ్చాడని బంధువులు అన్నారు. మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం జరిపించారు. ఈ కేసును తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మృతురాలి బంధువులు ఆరోపించారు.

విద్యార్థిని ఆత్మహత్య

సాక్షి,బళ్లారి: చిత్రదుర్గ జిల్లాలో మంగళవారం 8వ తరగతి విద్యార్థిని ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. చిత్రదుర్గ జిల్లా హలవుదర లంబాణిహట్టికి చెందిన ఉమేష్ నాయక్, బేబీబాయిల కుమార్తె సంజన(14) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకోవడం కలకలం రేపింది. ఈ ఘటనతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. విషయం తెలిసిన వెంటనే భరమసాగర పోలీసులు గ్రామానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు దర్యాప్తు చేపట్టారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న అతిథులు

బళ్లారి రూరల్: ఎస్‌బీఐ 69వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మంగళవారం నగరంలోని ప్రధాన శాఖలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. డివిజనల్ మేనేజర్ పంకజ్‌కుమార్ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. అత్యవసర సమయంలో రోగులకు పునర్జన్మను ఇస్తుందన్నారు. కాగా శిబిరంలో 40 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ రామమూర్తి, డీజీఎస్(ఎస్ఈడబ్ల్యూఏ) రామకృష్ణ దేవర, ఏజీఎస్ ధర్మేంద్ర, నిర్వాహకుడు బ్లడ్ దేవణ్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

జనతా దర్శన్‌కు వినతుల వెల్లువ



ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న జిల్లాధికారి తదితరులు

హొసపేటె: నగరంలోని పునీత్‌రాజ్ ఇండోర్ స్టేడియంలో మంగళవారం నిర్వహించిన జనతాదర్శన్‌లో జిల్లాధికారి ఎంఎస్ దివాకర్ తాలూకా ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ సదాశివ ప్రభు, డిప్యూటీ డివిజనల్ ఆఫీసర్ మహమ్మద్ అలీ అక్రమ్ షా దరఖాస్తులను పరిశీలించారు. సాంఘీక సంక్షేమ శాఖ సంయుక్త సంచాలకుడు మంజునాథ్, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు రామచంద్రప్ప, ఆహార పౌర సరఫరాల శాఖ ఉపసంచాలకులు మల్లికార్జున, మహిళా శిశు అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు శ్వేత, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ సోమేసింగ్, గుడ్డప్ప, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి, జిల్లా కార్మిక అధికారి సూరప్ప, ఇతర శాఖల అధికారులు హాజరై దరఖాస్తులను అక్కడికక్కడే పరిశీలించి జిల్లాధికారికి నివేదించారు.

సంక్షేమ హాస్టళ్లలో తనిఖీ



హాస్టల్‌ను పరిశీలిస్తున్న కమిషన్ సభ్యుడు వంగోడి తదితర అధికారులు

హొసపేటె: కర్ణాటక మానవ హక్కుల కమిషన్ సభ్యుడు ఎస్‌కే.వంగోడి మంగళవారం విజయనగర జిల్లాలో పర్యటించారు. జిల్లాలోని కూడ్లిగి తాలూకాలో పర్యటించిన ఆయన అక్కడి సాంఘీక సంక్షేమ శాఖ బాలుర, ఎస్టీ పోస్ట్ మెట్రిక్ బాలికల వసతి గృహాలను తనిఖీ చేశారు. ఆహార నిల్వ కేంద్రాలు, వంట గదులను పరిశీలించారు. విద్యార్థులు చదువుకునేందుకు కల్పించిన ప్రత్యేక గదులు, కంప్యూటర్, విద్యుత్ వ్యవస్థను చూసి అభినందించారు. ఎల్లప్పుడు హాస్టళ్లలో అందుబాటులో ఉంటూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని హాస్టల్ వార్డెన్లను ఆదేశించారు. సాంఘీక సంక్షేమ శాఖ సంయుక్త సంచాలకులు మంజునాథ్, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఉపసంచాలకులు రామచంద్రప్ప, తహసీల్దార్ రేణుక, ఇతర తాలూకా స్థాయి అధికారులు హాజరయ్యారు.

అధిక ఫీజుల వసూలు తగదు



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: జిల్లాలోని ప్రైవేట్ కళాశాలల్లో అధికంగా ఇంటిగ్రేటెడ్ ఫీజులు వసూలు చేయడం తగదని అఖిల భారత క్రాంతికారి విద్యార్థి సంఘం పేర్కొంది. మంగళవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనసుద్దేశించి సంఘం అధ్యక్షులు అజీజ్ జాగీర్‌దార్ మాట్లాడుతూ మధ్య తరగతి పిల్లలు ప్రైవేట్ కళాశాలల్లో చదవాలంటే రూ.లక్షల్లో డొనేషన్లు, వేలల్లో యాజమాన్యాలు ఫీజులు వసూలు చేస్తున్నా జిల్లా, తాలుకా విద్యా శాఖాధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడాన్ని ఖండించారు. నీట్, సీఈటీలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపి తప్పులు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.